

'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసి గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 293

శుక్రవారం 7-7-2023

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




ప్రీక్వార్టర్స్‌లో సింధు

కెనడా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ శుభారంభం - 13లో



మార్కెట్‌లో కొత్త రికార్డులు

19,500 స్థాయికి చేరువలో నిఫ్టీ.. సెన్సెక్స్ లాభం 340 పాయింట్లు - 13లో



ఎన్సీపీ అధ్యక్షుడిని నేనే

ఢిల్లీలో ఎన్సీపీ వర్కింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎన్సీపీ అధ్యక్షుడిని తానేనని శరద్‌పవార్ తేల్చిచెప్పారు.

వివరాలు 6లో ▸



ట్విట్టర్‌కు కొత్త సవాల్

ట్విట్టర్ లాంటి ఫీచర్లతోనే ప్రత్యర్థి మెటా సంస్థ థ్రెడ్స్ యాప్ తీసుకువచ్చింది. 7 గంటల్లోనే సుమారు కోటి మంది థ్రెడ్స్‌లో చేరారు.

వివరాలు 6లో ▸



కాళ్లు కడిగిన మధ్యప్రదేశ్ సీఎం

రాజకీయ నేత మూత్ర విసర్జన చేసిన ఘటనలో బాధిత గిరిజన యువకుడి కాళ్లను మధ్యప్రదేశ్ సీఎం శివరాజ్‌సింగ్ కడిగారు.

వివరాలు 6లో ▸



కలసికట్టుగా పోరాటం

రాజస్థాన్ సీఎం గెహ్లోత్, సచిన్ పైలెట్ మధ్య సయోధ్యకు కాంగ్రెస్ అధిష్టానం చేసిన ప్రయత్నాలు ఫలించినట్టే కనిపిస్తున్నాయి.

వివరాలు 6లో ▸

సంకల్పం సడలొద్దు

ఇళ్ల నిర్మాణ యజ్ఞం విజయవంతం కావాలి

గృహ నిర్మాణ శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్

- పేదలకు ఇళ్లు రాకూడదన్నదే ప్రతిపక్షాల లక్ష్యం
- పేదల కడుపు కొట్టడానికి ఏకం అవుతున్నారు
- అయినా గట్టి సంకల్పంతో ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలి
- న్యాయపరమైన చర్యలన్నీ తీసుకోవాలి.. డిసెంబర్‌లోగా విశాఖలో ఇళ్లు పూర్తి కావాలి
- ఏం కావాలన్నా వెంటనే ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధం
- ఇళ్ల స్థలాల పంపిణీ ఆగిన చోట ప్రత్యామ్నాయ భూములు సేకరించండి
- టిడ్కో గృహ సముదాయాలను స్వయం సమృద్ధి దిశగా నడిపించాలి
- వాణిజ్య సముదాయాలు, సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయాలి



"మనిషి కనీస అవసరాల్లో ఒకటైన గూడును నిరుపేదలకు సమకూర్చడానికి మనం ఆరాట పడుతుంటే, ఈ గృహ యజ్ఞానికి ఆటంకాలు ఏర్పరుస్తూ పేదల కడుపు కొట్టడానికి ప్రతిపక్షాలన్నీ ఏకం అవుతున్నాయి. పేదలకు ఇళ్లు రాకూడదన్నదే వారి ఆలోచన. ఈ క్రమంలో మన సంకల్పం సడలడానికి వీల్లేదు. న్యాయ పరమైన, ఇతర అడ్డంకులన్నీ అధిగమించడానికి అన్ని చర్యలూ తీసుకోండి. ఏం కావాలన్నా వెనువెంటనే ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాం.
- ముఖ్యమంత్రి వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో స్థిర నివాసం లేకుండా ఒక్క పేద కుటుంబం కూడా ఉండటానికి వీల్లేదనే సంకల్పంతో మన ప్రభుత్వం ముందుకు వెళుతోంటే, ప్రతిపక్షాలు అడుగడుగునా అడ్డు తగులుతున్నాయని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. పేదలకు ఇళ్లు రానివ్వకుండా నిరంతరం అడ్డంకులు సృష్టిస్తున్నాయని అన్నారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా, వాటన్నింటినీ అధిగమించి ఇళ్ల నిర్మాణ వేగాన్ని ఇదే రీతిలో కొనసాగించాలని ఆదేశించారు. గురువారం తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన గృహ నిర్మాణ శాఖపై ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు' పథకం పురోగతి గురించి మాట్లాడుతూ.. వైఎస్సార్– జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు పూర్తవుతున్న కొద్దీ అన్ని రకాల మౌలిక సదుపాయాలు ఏర్పాటు కావాలని చెప్పారు. నిర్మాణం పూర్తయిన ఇళ్లకు వెనువెంటనే కరెంటు, నీటి సరఫరా కనెక్షన్లు ఇవ్వాలన్నారు. ఒక్క విశాఖపట్నంలోనే 1.24 లక్షల ఇళ్లు నిర్మిస్తున్నామని, డిసెంబర్‌లోగా ఈ ఇళ్ల నిర్మాణం పూర్తి చేయడానికి తగిన కార్యాచరణ రూపొందించాలని చెప్పారు. ఇందుకు ఏం కావాలన్నా వెంటనే ఇవ్వడానికి

మిగతా 2వ పేజీలో ▸

ఏపీ హైకోర్టు సీజేగా జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్

కేంద్రానికి సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు

- 1989లో ఢిల్లీ బార్ కౌన్సిల్ నుంచి న్యాయవాద వృత్తిలోకి..
- 2011లో సీనియర్ న్యాయవాదిగా గుర్తింపు
- 2013లో జమ్మూకశ్మీర్, లద్దాఖ్ హైకోర్టు జడ్జిగా నియామకం
- గత ఏడాది బొంబాయి హైకోర్టు న్యాయమూర్తిగా..
- తెలంగాణ హైకోర్టు సీజేగా జస్టిస్ అలోక్ అరధే


జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్


జస్టిస్ అలోక్ అరధే

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్‌ను నియమించాలని కేంద్రానికి సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసింది. మే 19, 2023న జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందడంతో ఏపీ హైకోర్టు సీజే పదవి భర్తీచేయాల్సి వచ్చిందని కొలీజియం పేర్కొంది. అన్ని అంశాలు పరిగణించి ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ఠాకూర్‌ను సిఫార్సు చేస్తున్నట్లు తెలిపింది. దీంతో.. జస్టిస్ ఠాకూర్‌ను మణిపూర్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమించాలన్న ఫిబ్రవరి 9, 2023 నాటి సిఫార్సును రద్దుచేస్తూ తాజా సిఫార్సు చేస్తున్నట్లు కొలీజియం పేర్కొంది.

ఠాకూర్ స్వస్థలం జమ్మూకశ్మీర్..

ఇక జస్టిస్ ఠాకూర్ ప్రస్తుతం బొంబాయి హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేస్తున్నారు. జమ్మూకశ్మీర్‌కు చెందిన ఆయన ఏప్రిల్ 25, 1964న జన్మించారు. జమ్మూ యూనివర్సిటీ నుంచి ఎల్‌ఎల్‌బీ డిగ్రీ పొందిన ఆయన.. 1989 అక్టోబరు 18న ఢిల్లీ బార్ కౌన్సిల్‌లో చేరి న్యాయవాద వృత్తి చేపట్టారు. 2011లో సీనియర్ న్యాయవాదిగా గుర్తింపు పొందారు. అనంతరం.. నవంబరు 2020లో జమ్మూకశ్మీర్ బార్ కౌన్సిల్‌కు తన ఎన్‌రోల్‌మెంట్ బదిలీ చేసుకున్నారు. మార్చి 8, 2013న జమ్మూకశ్మీర్, లద్దాఖ్ హైకోర్టు న్యాయమూర్తి అయ్యారు. ఆ తర్వాత జూన్ 10, 2022న బొంబాయి హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. ఇక సుప్రీంకోర్టు తాజా సిఫార్సుతో

మిగతా 2వ పేజీలో ▸

ఫ్యాక్ట్ చెక్



రామోజీ.. మొసలి కన్నీళ్లొద్దు

- చంద్రబాబు కోసం ఎస్సీ, ఎస్టీలపై అబద్ధాల రాతలు
- టీడీపీ ప్రభుత్వంలోనే వారిపై ఎక్కువగా దాడులు
- కేసుల దర్యాప్తు, శిక్షల గురించి పట్టించుకోని నాటి ప్రభుత్వం
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే వారి భద్రతకు పూర్తి భరోసా
- తగ్గిన కేసులు.. సత్వర దర్యాప్తు.. దోషులకు సకాలంలో శిక్ష
- ఎస్సీ, ఎస్టీల సంక్షేమంపై కూడా అప్పట్లో తీవ్ర నిర్లక్ష్యం
- నేడు భారీగా నిధుల కేటాయింపు.. ప్రభుత్వ పథకాల్లో సింహభాగం


- వివరాలు 4లో

ఓట్ల ప్రక్షాళనతో దొంగ వేషాలు!

దొంగ ఓట్లని రామోజీ చెబుతున్నవి 2019లో ఉన్నవే కదా?

ఈసీ నిశిత పరిశీలన, ఆధార్ సీడింగ్‌తో పచ్చ ముఠా బెంబేలు

ఎల్లో మీడియా కథనాలు.. మర్నాడు టీడీపీ నేతల ప్రెస్‌మీట్లు



నాడు–నేడు అవే ఓట్లు.. 3లో

విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో 77-149-20 ఇంటి నంబర్‌తో 48 ఓట్లు ఉన్నట్లు జూలై 2న ఎల్లో మీడియా ఓ కథనాన్ని ప్రచురించింది. 2019లో కూడా అదే ఇంటి నంబర్‌తో ఈ ఓట్లన్నీ ఉన్నట్లు పరిశీలనలో తేలింది. మరి అలాంటప్పుడు గత సర్కారే దొంగ ఓట్లను చేర్చినట్లు రామోజీ ఒప్పుకోవాలి కదా!

వరదలా విదేశీ డబ్బు

గతేడాది రూ.8 లక్షల కోట్లు పంపిన వైనం

ఆర్థిక వ్యవస్థకు దన్నుగా డాలర్లు

పేదరికం తగ్గేందుకు, ప్రజల ఆరోగ్యం మెరుగయ్యేందుకు దోహదం

ప్రపంచంలోనే మొదటి స్థానంలో ప్రవాస భారతీయులు

(కంచర్ల యాదగిరిరెడ్డి)

వంద బిలియన్ డాలర్లు...
మన రూపాయల్లో సుమారు 8 లక్షల కోట్లు!
గతేడాది విదేశాల్లోని భారతీయులు స్వదేశానికి పంపిన మొత్తమిది!
ఇలాంటి చెల్లింపుల్లో ప్రవాస భారతీయులు ప్రపంచంలోనే టాప్!
అయితే ఏంటి? చాలా ఉంది!
ఈ మొత్తం అనేక మందికి అన్నం పెడుతోంది! పేదరికం తగ్గేందుకు, ప్రజల ఆరోగ్యం మెరుగయ్యేందుకు, నవజాత శిశువులు పుష్టిగా ఉండేందుకూ కారణమవుతోంది.. ఎలా?

ప్రపంచ బ్యాంకు తాజా లెక్కల ప్రకారం 2022–23లో ప్రపంచం మొత్తమ్మీద అభివృద్ధి చెందిన దేశాల నుంచి అభివృద్ధి చెందుతున్న లేదా పేద దేశాలకు పంపిన మొత్తం 80,000 కోట్ల డాలర్లు. ఈ విషయంలో అన్ని దేశాల కంటే తొలి స్థానంలో ఉన్న భారత్‌కు విదేశాల్లోని భారతీయులు వంద బిలియన్ డాలర్లు పంపితే, అరవై బిలియన్ డాలర్లతో మెక్సికో రెండో స్థానంలో ఉంది. విదేశాల్లో ఉన్న మన బంధువులు లేదా మిత్రులు ఇంటికి పంపే డబ్బుల్ని ఇక్కడ రకరకాలుగా పెట్టుబడి పెడుతుంటారు. దీని వల్ల ఆర్థిక వ్యవస్థ చక్రాలు కదులుతూ ఉంటాయి. పన్నుల రూపంలో ప్రభుత్వానికి ఆదాయమూ లభిస్తుంటుంది. పైగా మధ్యవర్తి లేకుండా నేరుగా డాలర్లు భారత్‌కు వస్తుంటాయి. ఈ డాలర్లను ప్రభుత్వం ముడిచమురు, తదితర కొనుగోళ్లకు ఉపయోగించుకోవచ్చు.



ఎగువన ఉన్న వారికీ...

దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారినే కాకుండా ఎగువన ఉన్న వారికీ ఈ చెల్లింపులు ఉపయోగపడతాయి. ఆర్థిక వ్యవస్థల్లో ఒడిదుడుకులు ఎదురైనప్పుడు, లేదా ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు దారిద్ర్యరేఖకు కొంచెం ఎగువన ఉన్న వారు కూడా కిందకు పడిపోతారు. ఈ పరిస్థితుల్లో విదేశాల్లోని బంధుమిత్రులు పంపే అదనపు మొత్తాలు బాధితులు పుంజుకునేందుకు ఉపయోగపడతాయన్నది కొత్తగా చెప్పాల్సిన అవసరమే లేదు. 2018 ఆగస్టు నాటి భారీ వరదల సమయంలో భారత్‌కు చెల్లింపులు దాదాపు 14 శాతం వరకూ పెరిగాయి. అంతెందుకు 2008లో ప్రపంచం మొత్తం ఆర్థిక మాంద్యంలో కూరుకుపోయినా, విదేశీ పెట్టుబడులు తగ్గిపోయినా ఈ రకమైన చెల్లింపులు పెరగడం గమనార్హం. అంటే ప్రభుత్వాలకు నమ్మకంగా వచ్చిపడే విదేశీ మారక ద్రవ్యం ఇది.

80 శాతం పేద, మధ్యాదాయ దేశాలే..

గత ఏడాది చెల్లింపుల్లో దాదాపు 80 శాతం పేద, మధ్యాదాయ దేశాలే అందుకున్నాయి. కొన్ని దేశాల్లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల కంటే ఎక్కువగా ఈ చెల్లింపులు ఉండటం గమనార్హం. కాగా ఈ డబ్బులు పేదరిక నిర్మూలనకు ఎలా ఉపయోగపడతాయన్న అంశంపై మూడేళ్ల క్రితం మారియా ఫాషోలిన్సే అనే శాస్త్రవేత్త ఒక అధ్యయనం నిర్వహించారు. కార్మికులను ఇతర దేశాలకు పంపే 25 ఆసియా దేశాలను ఎంచుకుని ఈ అధ్యయనం చేశారు. వలసలు, చెల్లింపులపై ప్రపంచబ్యాంకు వద్ద ఉన్న సమాచారం ఆధారంగా ఆయా దేశాల్లోని పేదల సంఖ్య, వారిలో ఉండే అంతరం (కటిక పేదలు.. ఓ మోస్తరు పేదలు) వంటి వివరాలు సేకరించారు. వీటిద్వారా ఆయా దేశాల్లో పేదరికం ఎంతమేరకు ఉందన్నది నిర్ధారించుకున్నారు. రోజుకు రెండు డాలర్లు లేదా అంతకంటే తక్కువ ఆదాయం ఉన్న వారిని ప్రపంచబ్యాంకు పేదల కింద లెక్కవేస్తుంది. ఈ వివరాలను పొందుపరిచి గణితశాస్త్ర సూత్రాల ప్రకారం లెక్క వేస్తే విదేశాల నుంచి వీరికి అందే చెల్లింపుల ప్రభావం ఎక్కువగానే ఉన్నట్లు స్పష్టమైంది. ఒకొక్కరికి అందే డబ్బులు పది శాతం పెరిగినా ఆ దేశంలో పేదరికంలో ఉన్న వారి శాతం (వంద మందిలో పేదల సంఖ్య) 0.4 శాతం తగ్గుతుందని తేలింది. చెల్లింపుల డబ్బులతో పేదలు మంచి ఆహారం తీసుకోవడం మాత్రమే కాకుండా.. పిల్లలను చదివించుకునేందుకూ వీలేర్పడుతోంది. ఆపత్కాలాన్ని కూడా తట్టుకుని వీరు బతకగలుగుతున్నారు.

వ్యయం తడిసిమోపెడు!

అంతాబాగానే ఉంది కానీ.. ఇటీవలి కాలంలో చెల్లింపుల కోసం అయ్యే వ్యయం తడిసిమోపెడు అవుతోందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. భారత్ అధ్యక్షతన ప్రస్తుతం జరుగుతున్న జీ20 సమావేశాల్లోనూ ఈ అంశంపై విస్తృత చర్చ జరగడం గమనార్హం. డాలర్ మారకం విలువల్లోని తేడాలు, పంపేందుకు, అందుకునేందుకు చెల్లించాల్సిన కమీషన్లు ఎక్కువగా ఉండటం వల్ల చెల్లింపుల వల్ల కలిగే ప్రయోజనాలు పూర్తిస్థాయిలో పొందలేకపోతున్నాం. ప్రస్తుతం ఈ కమీషన్లు, మారక విలువల్లోని తేడాలనీ కలిపి ప్రతి చెల్లింపునకూ 6.24 శాతం మొత్తాన్ని కోల్పోవాల్సి వస్తోంది. అయితే మూడేళ్ల క్రితం ఇది ఏడు శాతంగా ఉంది. సమీప భవిష్యత్తులో దీనిని మూడు శాతానికి తగ్గించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. డబ్బులు మార్పిడి చేసే కంపెనీలు మరిన్ని అందుబాటులో ఉండేలా చేసి వాటి మధ్య పోటీ పెంచాలన్నది ఈ దిశలో జరుగుతున్న ప్రయత్నాల్లో ఒకటి. ఆయా దేశాలు ఈ చెల్లింపులపై విధిస్తున్న పన్నులను తగ్గించేందుకు, వీలైతే పూర్తిగా మాఫీ చేసేలా కూడా ప్రయత్నిస్తున్నారు. ఈ వ్యయం తగ్గించుకునేందుకు వలస కార్మికులు లేదా ఉద్యోగులు మధ్యవర్తులను ఆశ్రయించడం వల్ల కొన్నిసార్లు తీవ్ర నష్టం జరిగే ప్రమాదం ఉంది. ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకుని ఈ వ్యయాన్ని వీలైనంతగా తగ్గిస్తే వినియోగదారులకు లాభం చేకూరడమే కాకుండా.. దేశ ఆర్థిక వ్యవస్థ కూడా బలోపేతం అవుతుంది.

చెల్లింపులు అందుకుంటున్న టాప్ - 10 దేశాలు (బిలియన్ డాలర్లలో)

1	100	భారత్
2	61	మెక్సికో
3	51	చైనా
4	38	ఫిలిప్పీన్స్
5	32	ఈజిప్టు
6	29	పాకిస్తాన్
7	28	ఫ్రాన్స్
8	21	బంగ్లాదేశ్
9	20	నైజీరియా
10	19	వియత్నాం

న్యూస్‌రీల్

ఏయూలో టెక్నాలజీ పార్క్



విద్యార్థులు, యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు.. స్టార్టప్‌లను, విభిన్న ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు ఆంధ్ర యూనివర్సిటీలో 'టెక్నాలజీ పార్క్' ఏర్పాటు కాబోతోంది. ఇందుకోసం సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియాతో ఏయూ ఒప్పందం చేసుకుంది.

వివరాలు 2లో ▸

స్టార్టప్‌ల కల్పతరువు విశాఖపట్నం



అంకుర సంస్థలకు విశాఖపట్నం కల్పతరువుగా మారుతోంది. స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు ప్రతిష్టాత్మకమైన 'సెంటర్ ఫర్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఆన్ ఇండస్ట్రీ 4.0'ను స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్‌భట్ ప్రారంభించారు.

వివరాలు 2లో ▸

ఇదండీ సంగతి



అతడొక 'దుష్ట గురువు'



'వాస్తవాలు చెబుతున్నాననే నాపై విషపు రాతలు రాస్తున్నారు. ఊరు, పేరు లేకుండా దొంగరాతలెందుకు? ఈనాడు టీమ్ లేదా మీ కుల టీమ్‌ను పంపించి నాపై ఆరోపణలను నిరూపించు' అని రామోజీకి కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి సవాల్ విసిరారు. 10లో

పీఎం కిసాన్‌కు ఈ-కేవైసీ తప్పనిసరి



14వ విడత పీఎం కిసాన్ పథకం కోసం రైతుల బ్యాంకు ఖాతాలకు ఈ-కేవైసీ తప్పనిసరని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ఈ నెలాఖరులోగా రైతుల బ్యాంకు ఖాతాలకు ఈ-కేవైసీ పూర్తి చేయాలని కలెక్టర్లను సీఎస్ జవహర్‌రెడ్డి ఆదేశించారు. 5లో



ఏపీయే స్ఫూర్తి

- విద్యుత్ కొనుగోలు ఒప్పందాలపై కేంద్రం మార్గదర్శకాలు
- నిరంతర విద్యుత్ సరఫరాకు అనుగుణంగా ముందస్తు ప్రణాళిక వేసుకోవాలి.. తొమ్మిదేళ్ల ముందే కొనుగోలు ఒప్పందాలు చేసుకోవాలి
- 2030 నాటికి 50 శాతం పునరుత్పాదక విద్యుత్ వాడాలి
- ఈ పనిని ముందే చేసి చూపించిన ఏపీ
- వ్యవసాయ విద్యుత్‌కు ఢోకా లేకుండా 'సెకీ'తో ఒప్పందం
- పునరుత్పాదక విద్యుత్ వినియోగంలో భాగంగా 7 వేల మెగావాట్లు కొనుగోలు
- వ్యవసాయేతర అవసరాల కోసం పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులకు ప్రాధాన్యం

10లో

క్లుప్తంగా...

నేడు 109 స్పెషలిస్ట్ వైద్య పోస్టులకు ఇంటర్వ్యూ



సాక్షి, అమరావతి: ఏపీ వైద్య విధాన పరిషత్(ఏపీవీవీపీ) ఆస్పత్రుల్లో సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్(సీఏఎస్ఎస్) పోస్టుల భర్తీలో భాగంగా శుక్రవారం 4 స్పెషాలిటీల్లో 109 పోస్టుల భర్తీకి వాక్ ఇంటర్వ్యూ నిర్వహించనున్నారు. వీటిలో గైనికాలజీ 39, ఈఎన్‌టీ 23, అనస్తీషియా 38, పాథాలజీ 9 పోస్టులు ఉన్నాయి. 14 స్పెషాలిటీల్లో 331 పోస్టుల భర్తీకి బుధవారం నుంచి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు.

ఇన్‌లాండ్ వాటర్ వేస్ అథారిటీ బోర్డు ఏర్పాటు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో జల రవాణాను మరింతగా ప్రోత్సహించడానికి రూపొందించిన 'ఇన్‌లాండ్ వాటర్‌వేస్ అథారిటీ యాక్ట్–2023' ను అనుసరిస్తూ ఇన్‌లాండ్ వాటర్‌వేస్ అథారిటీ బోర్డును ప్రభుత్వం గురువారం ఏర్పాటు చేసింది. ప్రభుత్వం ఎంపిక చేసిన వ్యక్తి ఈ బోర్డుకు చైర్మన్‌గా వ్యవహరిస్తారని రాష్ట్ర పెట్టుబడులు, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికల్ వలవన్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రాష్ట్ర పెట్టుబడులు, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి/ముఖ్యకార్యదర్శి/కార్యదర్శి వైస్ చైర్మన్‌గా ఉండే ఈ బోర్డులో ఏపీఐడబ్ల్యూ సీఈవో కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. కేంద్రానికి చెందిన ఐడబ్ల్యూఏఐ వైస్ చైర్మన్, ఏపీ మారిటైమ్ బోర్డు సీఈవో, జలవనరుల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్, ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ, ప్రభుత్వం ఎంపిక చేసిన పరిశ్రమలకు చెందిన వ్యక్తులు సభ్యులుగా ఉంటారు.

'సుప్రీం' న్యాయమూర్తిగా జస్టిస్ భట్టి నియామకం హర్షణీయం

- ఏపీ హైకోర్టు న్యాయవాదులు

సాక్షి అమరావతి: కేరళ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సరసి వెంకటనారాయణ భట్టిని సుప్రీంకోర్టు న్యాయమూర్తి పదవికి సిఫారసు చేయడంపై ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు జానకిరామిరెడ్డి నేతృత్వంలో న్యాయవాదులు గురువారం హైకోర్టులో మిఠాయిలు పంచిపెట్టారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి పదవికి అన్ని రకాలుగా అర్హుడైన జస్టిస్ భట్టిని సిఫారసు చేయడం తెలుగువారికి గర్వకారణమని జానకిరామిరెడ్డి అన్నారు. కాగా, ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు చెందిన జస్టిస్ భట్టి బదిలీపై కేరళ హైకోర్టుకు వెళ్లి అక్కడ ప్రధాన న్యాయమూర్తిగా విధులు నిర్వర్తిస్తున్నారు. తాజాగా సుప్రీంకోర్టు కొలీజియం ఆయన పేరును సుప్రీంకోర్టు న్యాయమూర్తి పోస్టుకు సిఫారసు చేసిన విషయం తెలిసిందే.

విశాఖలో నోట్ల మార్పిడి కలకలం

డొండపర్తి: విశాఖ నగరంలో పెద్ద నోట్ల మార్పిడి వ్యవహారం కలకలం రేపుతోంది. రూ.90 లక్షలకు సరిపడా రూ.500 నోట్లు ఇస్తే.. రూ.కోటికి సరిపడా రూ.2 వేల నోట్లు ఇస్తామని మోసం చేసిన వ్యవహారం వెలుగు చూసింది. విశ్వసనీయ సమాచారం మేరకు.. కొంతమంది వ్యక్తులు నగరంలో నోట్ల మార్పిడికి ప్రయత్నిస్తుండగా పోలీసులు పట్టుకున్నట్టు తెలిసింది. దీనిపై వారిని విచారించగా రూ.500 నోట్లు రూ.90 లక్షలు ఇస్తే రూ.2 వేల నోట్లు రూ.కోటి ఇస్తామని చెప్పి రూ.15 లక్షలు కాజేశారని పట్టుబడిన వ్యక్తులు పోలీసులకు చెప్పినట్టు సమాచారం. ఇందులో ఒక సీఐ స్థాయి అధికారి తమను మోసం చేశారని ఫిర్యాదు చేసినట్టు తెలిసింది.

స్టార్టప్‌ల కల్పతరువు విశాఖ

స్టీల్‌ప్లాంట్‌లో 'సెంటర్ ఫర్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఆన్ ఇండస్ట్రీ 4.0' కేంద్రం

ప్రారంభించిన స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్‌భట్

5 స్టార్టప్‌లతో ఎంవోయూలు





కేంద్రాన్ని ప్రారంభిస్తున్న స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్‌భట్

డొండపర్తి (విశాఖ దక్షిణ): అంకుర సంస్థలకు విశాఖపట్నం కల్పతరువుగా మారుతోంది. స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు ప్రతిష్టాత్మకమైన 'సెంటర్ ఫర్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఆన్ ఇండస్ట్రీ 4.0' కేంద్రాన్ని ఉక్కు నగరం టౌన్‌షిప్‌లో ఏర్పాటైంది. దీనిని స్టీల్ ప్లాంట్ సీఎండీ అతుల్‌భట్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధానంగా ఇండస్ట్రీ 4.0 ప్రాజెక్టుతో విశాఖ స్టార్టప్ హబ్‌గా అభివృద్ధి చెందుతుందన్నారు. తద్వారా అనేక మందికి ప్రత్యక్ష, పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలతో పాటు జిల్లా ఆర్థికాభివృద్ధికి బాటలు పడతాయన్నారు. ఎంఈఐటీవై, ఎస్టీపీఐ, ఎస్టీపీఐ నెక్స్ట్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భాగస్వామ్య ఉమ్మడి నిధులతో స్టీల్‌ప్లాంట్‌లో ఇంకుబేషన్ సెంటర్ ఏర్పాటు చేసేందుకు ఈ ప్రాజెక్ట్ చేపట్టినట్టు చెప్పారు. ఈ సెంటర్‌లో పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా రోబోటిక్స్, డ్రోన్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్, వర్చువల్ రియాలిటీ, అగ్‌మెంటెడ్ రియాలిటీ వంటి అంశాలపై ప్రయోగాలు, నూతన ఆవిష్కరణలు చేపడుతున్నట్టు వివరించారు. ఇది భారతీయ ఆటోమేషన్ పరిశ్రమకు పెద్ద ప్రోత్సాహాన్ని ఇస్తుందన్నారు. ఎగుమతుల పెరుగుదలకు దోహదం చేస్తూనే, ఆటోమేషన్ పరికరాల దిగుమతుల తగ్గుదలకు ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ఆర్ఐఎన్ఎల్‌తో పాటు దేశంలో ఉన్న ఇతర పరిశ్రమల సమస్యల పరిష్కారానికి దేశవ్యాప్తంగా 175 స్టార్టప్‌లను ప్రోత్సహిస్తున్నట్టు తెలిపారు.

5 స్టార్టప్‌లతో ఎంవోయూలు

ఈ ప్రాజెక్టులో భాగంగా గురువారం 5 స్టార్టప్ సంస్థలతో అవగాహన ఒప్పందాలు (ఎంవోయూలు) జరిగాయి. ఏపీ ఇన్నోవేషన్ సొసైటీ సీఈవో అనిల్‌కుమార్, ఆంధ్రా యూనివర్సిటీ రిజిస్ట్రార్ వి.కృష్ణమోహన్, ఎస్టీపీఐ డైరెక్టర్ సీవీడీ రామ్‌ప్రసాద్, ఆర్ఐఎన్ఎల్ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) ఏకే బాగ్చి సమక్షంలో ఈ ఒప్పందాలు జరిగాయి. స్టార్టప్‌లకు మార్గదర్శక సేవలు అందించే ఎలక్ట్రో ఆప్టికల్ సిస్టమ్, ఐఐఎం వైజాగ్, లోటస్ వైర్‌లెస్ వంటి కల్పతరు భాగస్వాములతో కూడా ఒప్పందాలు జరిగాయి. ఆర్ఐఎన్ఎల్ జీఎం పి.చంద్రశేఖర్, ఎస్టీపీఐ అడిషనల్ డైరెక్టర్ సురేష్ భాతా, వివిధ కేంద్ర ప్రభుత్వ సంస్థల అధికారులు పాల్గొన్నారు.

ఏయూలో టెక్నాలజీ పార్క్

- విద్యార్థులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ఏయూ అడుగులు
- స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు ఎస్టీపీఐతో ఒప్పందం
- రూ.60 కోట్లతో మూడు దశల్లో పనులు



ఎంవోయూ పత్రాలు మార్చుకుంటున్న ఏయూ వీసీ ప్రసాదరెడ్డి, ఎస్టీపీఐ ఏపీ, తెలంగాణ డైరెక్టర్ రామ్‌ప్రసాద్ తదితరులు

సాక్షి, విశాఖపట్నం: విద్యార్థులు, యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు.. స్టార్టప్‌లను, విభిన్న ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు ఆంధ్ర యూనివర్సిటీ(ఏయూ) లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో 'టెక్నాలజీ పార్క్' ఏర్పాటు చేస్తోంది. ఇందుకోసం సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా(ఎస్టీపీఐ)తో ఏయూ ఒప్పందం చేసుకుంది. వీసీ పీవీజీడీ ప్రసాదరెడ్డి సమక్షంలో గురువారం ఏయూ రిజిస్ట్రార్ కృష్ణమోహన్, ఎస్టీపీఐ ఏపీ, తెలంగాణ డైరెక్టర్ రామ్‌ప్రసాద్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు రూ.60 కోట్లతో ఈ పార్క్‌ను ఏర్పాటు చేస్తున్నారు. స్టార్టప్‌లు విజయవంతంగా మొదలైనా.. సహకారం, ప్రోత్సాహం లేకపోవడం వల్ల.. నిలదొక్కుకున్న వాటి సంఖ్య చాలా తక్కువగా ఉంటోంది. దీనిని అధిగమించేందుకు.. స్టార్టప్‌లతో ముందుకొస్తున్న యువతను ప్రోత్సహించాలని ఏయూ నిర్ణయించింది. ఎస్టీపీఐ అధికారులతో సంప్రదింపులు జరిపిన అనంతరం ప్రతిపాదనలను సీఎం వైఎస్ జగన్‌కు పంపించగా.. ఆయన ఆమోదముద్ర వేశారు. ఉత్తరాంధ్ర యువతకు వరం లాంటి ఈ టెక్నాలజీ పార్క్‌ను మూడు దశల్లో రూ.60 కోట్లతో ఏర్పాటు చేయనున్నారు. మొదటిదశ పనులను రూ.19.5 కోట్లతో పూర్తి చేయనున్నారు.

రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో అడుగులు

మూడు, నాలుగు వారాల్లో టెక్నాలజీ పార్క్‌కు సంబంధించిన పనులకు శంకుస్థాపన చేయనున్నాం. కొత్త స్టార్టప్‌లతో పాటు.. అభివృద్ధి చెందిన వాటిని కూడా ఒకే గొడుగు కిందకు తీసుకొస్తాం. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ముందుకు అడుగులు వేస్తున్నాం. ఏయూలో ఇప్పటికే 102 స్టార్టప్ కంపెనీలు నడుస్తున్నాయి. ఫెయిల్ అయిన స్టార్టప్‌లకు ఏ హబ్ కూడా స్థానాన్ని కల్పించదు. కానీ.. మేము వారిని కూడా ప్రోత్సహిస్తూ.. సరికొత్త మార్గంలోకి ప్రయాణించేలా చర్యలు తీసుకుంటున్నాం.

– పీవీజీడీ ప్రసాదరెడ్డి, ఏయూ వైస్ చాన్స్‌లర్

ఏపీలో విజయవంతంగా విస్తరణ

ఏయూతో ఒప్పందం వల్ల ఏపీలో విజయవంతంగా విస్తరించే అవకాశం లభించింది. విద్యార్థులు, యువత ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా జీవితాన్ని ప్రారంభించేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలు, వనరులను ఏయూ సహకారంతో టెక్నాలజీ పార్క్‌లో ఏర్పాటు చేస్తాం. స్టార్టప్‌లు విజయవంతమైన పారిశ్రామిక సంస్థలుగా ఎదిగే క్రమంలో అనేక దశలు దాటాల్సి ఉంటుంది. ప్రతి దశలో అనేక అవరోధాలు అధిగమించాల్సి ఉంటుంది. ప్రతి దశలోనూ తోడ్పాటునందిస్తాం.

– సీవీడీ రామ్‌ప్రసాద్, ఎస్టీపీఐ ఏపీ, తెలంగాణ డైరెక్టర్

సంకల్పం సడలొద్దు



గృహ నిర్మాణ శాఖపై నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

▶ మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వం సిద్ధంగా ఉందని, వీలైనంత త్వరగా అక్కడ పేదలకు నివాసం కల్పించాలని ఆదేశించారు. పలు చోట్ల కోర్టు కేసుల కారణంగా పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీ నిలిచిపోయిందని, అక్కడ ప్రత్యామ్నాయ భూముల సేకరణపై దృష్టి పెట్టి.. ఈ ప్రక్రియను వేగవంతంగా చేపట్టాలని చెప్పారు. కొత్తగా ఇళ్ల పట్టాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి పట్టాలు ఇచ్చేందుకు భూములను సేకరించడంపై నిర్దేశిత కార్యాచరణ సిద్ధం చేసుకుని ముందుకు వెళ్లాలని ఆదేశించారు. వీటన్నింటికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

వచ్చే నెలలో 5 లక్షల ఇళ్లు పూర్తి

వచ్చే నెలలో రాష్ట్ర వ్యాప్తంగా 5 లక్షల పేదల ఇళ్ల నిర్మాణం పూర్తవుతుందని అధికారులు సీఎం జగన్‌కు వివరించారు. ఇప్పటి వరకు 4,24,220 ఇళ్లు పూర్తయ్యాయని చెప్పారు. రూఫ్ లెవల్, ఆపై స్థాయి నిర్మాణంలో 5,68,517, వివిధ స్థాయిల్లో 9,56,369 ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికి పేదల గృహ నిర్మాణాల కోసం రూ.2,201 కోట్లు ఖర్చు చేశామన్నారు. సీఆర్‌డీఏలో పేదల ఇళ్ల నిర్మాణ పనులకు సంబంధించిన అంశాలను కూడా సీఎంకు వివరించారు. 45,101 మంది లబ్ధిదారులు ఆప్షన్–3 ఎంపిక చేసుకున్నారని తెలిపారు. ఆ ఇళ్ల నిర్మాణానికి ఇప్పటికే కాంట్రాక్టర్లను ఎంపిక చేశామన్నారు. లే అవుట్‌లలో ఇంటి నిర్మాణాలు చేపట్టడానికి నీటి సరఫరా, అప్రోచ్ రోడ్లు, విద్యుత్ సరఫరా తదితర పనులపై దృష్టి పెట్టామన్నారు. ఇప్పటి వరకు 71,452 టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించామని అధికారులు వెల్లడించారు. ఈ నెలలో మరో 29,496, వచ్చే నెలలో 49,604 ఇళ్లను అప్పగించనున్నామని చెప్పారు. 300 చదరపు అడుగుల ఇళ్లను ఉచితంగా ప్రభుత్వం ఇస్తున్నందున మిగిలిన కేటగిరీల్లోని (365, 430 చ.అ) లబ్ధిదారులకు బ్యాంకుల ద్వారా దాదాపు రూ.2 వేల కోట్లు రుణాలుగా ఇప్పించామన్నారు. సీఆర్‌డీఏ ప్రాంతంలో పేదలకు ఇళ్ల నిర్మాణంపై కోర్టులో పిటిషన్‌లు, వాటిపై విచారణ అంశాన్ని ప్రస్తావించారు.

వాణిజ్య సముదాయాల ఏర్పాటు

వందలు, వేల సంఖ్యలో ఇళ్లు ఉన్న టిడ్కో కాలనీల్లో వాణిజ్య సముదాయాల ఏర్పాటుకు సీఎం వైఎస్ జగన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. తొలి దశలో 15 టిడ్కో కాలనీల్లో ఏర్పాటు చేయాలన్నారు. మహిళల ఆధ్వర్యంలో వ్యాపార, వాణిజ్య సముదాయాలు ఏర్పాటయ్యేలా చూడాలని సూచించారు. దీంతో అందుబాటు ధరలలో సరుకులు అక్కడి పేదలకు అందుతాయని, మహిళలకూ ఉపయోగం ఉంటుందన్నారు. గృహాలపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటుకు ఆమోదం తెలిపారు. టిడ్కో గృహ సముదాయాలను స్వయం సమృద్ధి దిశగా నడిపించాలని అధికారులను ఆదేశించారు. దీనికి సంబంధించిన వివిధ ప్రతిపాదనలను పరిశీలించాలన్నారు. ఈ సమీక్షలో గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, ఏపీ గృహ నిర్మాణ సంస్థ చైర్మన్ దవులూరి దొరబాబు, టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి, గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్, ప్రత్యేక కార్యదర్శి మహమ్మద్ దీవాన్, టిడ్కో ఎండీ శ్రీధర్, గృహ నిర్మాణ సంస్థ ఎండీ ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎండీ డాక్టర్ జి.లక్ష్మీశా, ఏపీ జెన్‌కో ఎండీ చక్రధర్ బాబు, మైన్స్, జియాలజీ డైరెక్టర్ వెంకటరెడ్డి పాల్గొన్నారు.

దుర్మార్గానికి పరాకాష్ట కాదా?

విచిత్రమేంటంటే అన్ని దశలనూ దాటుకుని ఇళ్ల నిర్మాణం దిశగా అడుగులేస్తుంటే... కొత్త కొత్త పిటిషన్లతో మళ్లీ కోర్టుల ద్వారా అడ్డుకోవాలని ఎల్లో ముఠాలు ప్రయత్నిస్తుండటం. నిరుపేదలకు ఇళ్లు ఇస్తామంటే ఎందుకంత కడుపుమంట? మొన్నటికి మొన్నఅమరావతి ప్రాంతంలో 51 వేల మందికి రాష్ట్ర ప్రభుత్వం స్థలాలివ్వగా ఇళ్ల నిర్మాణానికి కేంద్రం నిధులిస్తానని చెప్పటంతో రామోజీరావు గుక్కపట్టి ఏడ్చారు. అడిగిన వెంటనే అంత త్వరగా ఎలా అనుమతిచ్చేస్తారంటూ 'ఈనాడు'లో పనికిమాలిన రాతలు రాశారు. అప్పట్లో కేంద్రం రాసిన లేఖనే పట్టుకుని మళ్లీ ఇపుడు కేంద్ర నిధులు ఆలస్యమవుతాయంటూ సంతోషంగా మరో కథనాన్ని వండేశారు. పైపెచ్చు తెలుగుదేశం కోర్టు పోరాటాన్ని మళ్లీ మొదలెట్టింది. ఏమనుకోవాలి వీళ్లని? పేదలకు సొంతిళ్లు లేకుండా చేస్తూ వీళ్లెందుకు ఇంత సంతోషపడుతున్నారో తమకు అర్థం కావటం లేదని ప్రతి ఒక్కరూ వాపోతున్నారంటే పరిస్థితిని తేలిగ్గానే అర్థం చేసుకోవచ్చు.



పురపాలక, పట్టణాభివృద్ధి శాఖకు సీఎం అభినందన

సాక్షి, అమరావతి: పట్టణ పేదరిక నిర్మూలన కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా ఆంధ్రప్రదేశ్ పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ స్పార్క్–2022 అవార్డును సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. అవార్డు కింద రూ.20 కోట్ల నగదు బహుమతిని కేంద్రం అందజేసింది. పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ స్పెషల్ సీఎస్ వై.శ్రీలక్ష్మి, మెప్మా ఎండీ విజయలక్ష్మి, మెప్మా స్టేట్ మిషన్ మేనేజర్ ఆదినారాయణ, టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ గురువారం సీఎం క్యాంపు కార్యాలయంలో సీఎం జగన్‌ని కలిసి అవార్డును చూపించారు. వీరిని సీఎం వైఎస్ జగన్ అభినందించారు.

ఏపీ హైకోర్టు సీజేగా జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్

▶ మొదటి పేజీ తరువాయి

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆరో ప్రధాన న్యాయమూర్తి కానున్నారు.

తెలంగాణ హైకోర్టు సీజేగా జస్టిస్ అలోక్ అరధే

ఇదిలా ఉంటే.. తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ అలోక్ అరధేను నియమించాలంటూ కూడా కేంద్రానికి సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసింది. ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌ను సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా సిఫార్సు చేసిన నేపథ్యంలో ఈ నియామకం చేపట్టాల్సి వచ్చినట్లు కొలీజియం పేర్కొంది. ఇక జస్టిస్ అలోక్ అరధే ఏప్రిల్ 13, 1964న రాయ్‌పూర్‌లో జన్మించారు. బీఎస్సీ, ఎల్ఎల్‌బీ పూర్తిచేసిన ఆయన 1988లో మధ్యప్రదేశ్ బార్ కౌన్సిల్‌లో ఎన్‌రోల్‌మెంట్ చేసుకున్నారు. డిసెంబరు 29, 2009లో మధ్యప్రదేశ్ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. ఫిబ్రవరి 15, 2011న శాశ్వత న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. సెప్టెంబరు 20, 2016న జమ్ముకశ్మీర్ హైకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. మే 11, 2018న జమ్ముకశ్మీర్ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా నియమితులయ్యారు. అనంతరం.. జస్టిస్ అరధే నవంబరు 17, 2018న న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. జులై 3, 2022 నుంచి అక్టోబరు 14 వరకూ కర్ణాటక హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశారు. సివిల్ కాన్‌స్టిట్యూషనల్ అంశాల్లో నిష్ణాతుడిగా ఆయన పేరుపొందారు.

'ప్రత్యేక అవసరాల' పిల్లలకు ప్రవేశాలు ఇవ్వాల్సిందే..

- వారికి అడ్మిషన్లు నిరాకరిస్తే చర్యలు
- రాష్ట్ర వ్యాప్తంగా వచ్చిన ఫిర్యాదులపై సమగ్ర శిక్ష ఆదేశాలు
- దివ్యాంగుల కోసం ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక ఉపాధ్యాయులు
- రాష్ట్ర వ్యాప్తంగా 93 వేల మంది దివ్యాంగ విద్యార్థులు



సాక్షి, అమరావతి: ప్రత్యేక అవసరాల(దివ్యాంగ) విద్యార్థులకు పాఠశాలల్లో ప్రవేశాలు కల్పించని పాఠశాలలు, ప్రధానోపాధ్యాయులపై చర్యలు తీసుకునేందుకు విద్యాశాఖ సిద్ధమైంది. వైకల్యాన్ని సాకుగా చూపి తమ పిల్లలకు పాఠశాలల్లో ప్రవేశాలు కల్పించడం లేదని రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన తల్లిదండ్రుల నుంచి సమగ్ర శిక్ష, విద్యా శాఖ ఉన్నతాధికారులకు అందిన ఫిర్యాదుల మేరకు సమగ్ర శిక్ష ఈ నిర్ణయం తీసుకుంది. కొన్నిచోట్ల ప్రభుత్వ పాఠశాలలు, అత్యధికంగా ప్రైవేటు పాఠశాలలపై ఈ తరహా ఫిర్యాదులు అందుతున్నాయి. దివ్యాంగ విద్యార్థులనూ సాధారణ విద్యార్థులతో సమానంగా పరిగణించాలని, సమాన హక్కులు కల్పించాలని సమగ్ర శిక్ష ఉత్తర్వుల్లో ఉంది. సమగ్ర శిక్ష రాష్ట్ర విభాగం లెక్కల ప్రకారం రాష్ట్రంలో 93 వేల మంది దివ్యాంగ విద్యార్థులు ఒకటి నుంచి 10వ తరగతి చదివే వయసుగలవారున్నారు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభంలో కొన్ని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు ప్రవేశాలిచ్చేందుకు నిరాకరించడంతో సమగ్ర శిక్ష రాష్ట్రాధికారులు వెంటనే చర్యలు చేపట్టారు. అయితే ఇటీవల ప్రయివేటు పాఠశాలలపై కూడా ఇదే తరహా ఫిర్యాదులు అందడంతో విచారణ చేసి చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖను సమగ్ర శిక్ష ఆదేశించింది.

వారి ప్రవేశాలను అడ్డుకుంటే చర్యలు

కొన్ని పాఠశాలల్లో దివ్యాంగ విద్యార్థులకు ప్రవేశాలు ఇవ్వడం లేదని ఫిర్యాదులందాయి. ఇలాంటి ప్రయివేటు పాఠశాలలపైన, ప్రభుత్వ పాఠశాలల్లో అయితే ప్రధానోపాధ్యాయులపైనా విచారణ నిర్వహించి చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారులకు ఆదేశాలిచ్చాం. రాష్ట్రంలో ఉన్న 93 వేల మంది దివ్యాంగ పిల్లల్లో పాఠశాల వయసువారే అధికం. ప్రభుత్వ స్థాయిలో 672 భవిత సెంటర్లలో సుమారు 900 మంది ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్స్‌ను నియమించి పిల్లలకు ప్రాథమిక స్థాయిలో సౌకర్యాలు కల్పించి ఎలిమెంటరీ విద్యనందిస్తున్నాం. ఉన్నత పాఠశాలల్లోనూ 652 మంది స్పెషల్ ఎడ్యుకేటర్స్ దివ్యాంగుల కోసం పనిచేస్తున్నారు.

– బి.శ్రీనివాసరావు, సమగ్ర శిక్ష రాష్ట్ర ఎస్పీడీ

దివ్యాంగ విద్యార్థుల ప్రవేశాలకు మార్గదర్శకాలు

- ఆరు నుంచి 18 ఏళ్ల వయసు గల ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలపై వివక్ష చూపకుండా తప్పనిసరిగా వయసు ప్రకారం ఆయా తరగతుల్లో ప్రవేశం కల్పించాలి.
- వైకల్యాన్ని సాకుగా చూపి ప్రవేశాన్ని నిరాకరించకూడదు.
- విద్యా సంవత్సరంలో ఎప్పుడైనా వీరికి ప్రవేశాలు కల్పించొచ్చు.
- నూరు శాతం వైకల్యం గల పిల్లలకు హాజరు నుంచి మినహాయింపునివ్వాలి.

'ముందస్తు' మాటే లేదు

- ప్రజలు ఐదేళ్లు అధికారం ఇచ్చారు.. చివరిదాకా సేవ చేస్తాం: సజ్జల
- చంద్రబాబుకు కావాల్సినంత సమయం ఇస్తాం
- సీఎం జగన్ ఢిల్లీ పర్యటన ఫలితాలు కళ్లెదుటే కనిపిస్తున్నాయి
- పట్టుబట్టి రూ.10,421 కోట్ల రెవెన్యూలోటు నిధులను సాధించారు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ముందస్తు ఎన్నికలకు వెళ్లే ప్రసక్తే లేదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి పునరుద్ఘాటించారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీకి ప్రజలు ఐదేళ్లు అధికారం ఇచ్చారని, ప్రజాతీర్పును గౌరవిస్తామన్నారు. 'ప్రజలకు చివరి రోజు వరకూ సేవ చేస్తాం.. అర్థం చేసుకునేలా మేం చేసిన పనులు వివరిస్తాం.. అప్పుడే ఎన్నికలకు వెళ్తాం' అని స్పష్టం చేశారు. షెడ్యూలు ప్రకారమే ఎన్నికలు జరుగుతాయి కాబట్టి చంద్రబాబుకు కావాల్సినంత సమయం దొరుకుతుందని వ్యాఖ్యానించారు.

సీఎం పర్యటన ఫలితాలు కళ్లెదుటే..

విభజన అంశాలు, ప్రత్యేక హోదా, పోలవరానికి, రాష్ట్రానికి రావాల్సిన నిధులపై చర్చించేందుకే సీఎం జగన్ ఢిల్లీ పర్యటనలు చేపట్టి ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులతో సమావేశమవుతున్నారు. సీఎం భగీరథ యత్నం వల్లే 2014–15లో రెవెన్యూ లోటు కింద రావాల్సిన రూ.10,421 కోట్లను ఇటీవల కేంద్రం విడుదల చేసింది. పోలవరానికి నిధుల సమస్యపై కూడా సానుకూలంగా స్పందిస్తోంది. తెలంగాణ నుంచి రావాల్సిన విద్యుత్ బకాయిలను ఇప్పించాలని కేంద్రాన్ని సీఎం జగన్ గట్టిగా కోరుతున్నారు. సీఎం జగన్ పర్యటన ఫలితాలు కళ్లెదుటే కనిపిస్తున్నా ఓ వర్గం మీడియా ఏదో ఊహించుకుని కథనాలు ప్రచురిస్తోంది. ప్రధానితో సీఎం జగన్ ఏకాంతంగా ముఖాముఖి మాట్లాడితే వారి సీట్ల కింద నక్కి విన్నట్లుగా రామోజీరావు, రాధాకృష్ణ ఏవేవో రాస్తున్నారు.

సానుకూల ఓటుతోనే గెలుస్తాం

నిబద్ధతతో ఏ సంస్థ సర్వే చేసినా అది ప్రజాభిప్రాయాన్ని, వాస్తవాలను ప్రతిబింబిస్తుంది. ఇటీవల టైమ్స్ నౌ–నవభారత్ నిర్వహించిన సర్వే ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే వైఎస్సార్‌సీపీ క్లీన్‌స్వీప్ చేస్తుందని తేల్చింది. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజాభ్యుదయమే పరమావధిగా సీఎం జగన్ పనిచేస్తున్నారు. 2019 ఎన్నికల తర్వాత జరిగిన స్థానిక సంస్థలు, తిరుపతి లోక్‌సభ, ఆత్మకూరు, బద్వేలు ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి రికార్డు విజయాలను ప్రజలు కట్టబెట్టారు. గడప గడపకూ మన ప్రభుత్వం, స్పందన, జగనన్నకు చెబుతాం, సురక్ష వంటి కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు సేవ చేస్తున్నాం. ఈ కార్యక్రమాలన్నీ విజయవంతం కావడం ప్రభుత్వంపై ప్రజలకు ఉన్న విశ్వాసానికి ప్రతీక. సానుకూల ఓటునే సీఎం జగన్ కోరుకుంటున్నారు.

ఇళ్ల నిర్మాణాన్ని కేంద్రం వద్దనలేదు..

అమరావతిలో పేదల ఇళ్లకు కేంద్రం నిధులపై షరతు కొత్తదేమీ కాదు. అది గతంలోనూ ఉంది. అందుకే మా వాటా నిధులు ఖర్చు చేస్తాం. ఇందులో టీడీపీ, ఓ వర్గం మీడియాకొచ్చిన అభ్యంతరమేంటో అర్థం కావడం లేదు. పేదలకు ఇళ్లు రాకూడదని కోరుకుంటున్న ఒక చిన్న మైనారిటీ, సంపన్న, ఫ్యూడల్ వర్గాలే దానికి వ్యతిరేకంగా ఉన్నారు. రామోజీరావు, రాధాకృష్ణ ఎవరి ప్రయోజనం కోసం పని చేస్తున్నారో స్పష్టం అవుతోంది. కోర్టు వివాదాలు ముగిశాకే తమ వాటా ఇస్తామని కేంద్రం చెప్పిందేగానీ ఇళ్ల నిర్మాణాన్ని వ్యతిరేకించడం లేదు. సీఎం జగన్‌కు, ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందన్న అక్కసుతో విపక్షం ఇలా కుట్రలు చేస్తోంది.

షర్మిలమ్మ నిర్ణయం తన ఇష్టం..

షర్మిలమ్మ తెలంగాణాలో పార్టీని ఏర్పాటు చేశారు కాబట్టి తనే నిర్ణయం తీసుకుంటారు.

శ్రేణులను కాపాడుకునేందుకే..

ప్రతి ఎన్నికలోనూ ఘోర పరాజయాలతో స్థైర్యం కోల్పోయిన టీడీపీ శ్రేణులను కాపాడుకునేందుకు, పవన్‌కళ్యాణ్‌ను తన జట్టులో చేర్చుకునేందుకు చంద్రబాబు, ఓ వర్గం మీడియా ముందస్తు ఎన్నికలంటూ హడావుడి చేస్తున్నాయి. పొత్తులు, ఐదో పదో సీట్లు ఇచ్చి పవన్‌ను తన జట్టులో చేర్చుకునేందుకు చంద్రబాబు ప్రయత్నాలు చేసుకోవచ్చు.

అంగన్‌వాడీ బుజ్జాయిలకు ప్రత్యేక కిట్లు

సాక్షి, అమరావతి: అంగన్‌వాడీల్లోని చిన్నారులు ఆడుతూ పాడుతూ అభ్యాసం చేయడం ద్వారా వారి చదువులకు బలమైన పునాదులు వేసేలా రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట కార్యాచరణ చేపట్టింది. 3 నుంచి ఆరేళ్లలోపు వయసు గల చిన్నారులకు ప్రీ ప్రైమరీ (పీపీ–1, 2) విద్యాభ్యాసానికి దోహదం చేసే సామగ్రిని అందిస్తోంది. రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న 8.50 లక్షల మంది పిల్లలకు ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ (పీఎస్ఈ) కిట్ల పంపిణీ చేపట్టింది. వీటిలో ఒక పలక, 12 రంగుల స్కెచ్ పెన్సిళ్లు, రెండు పెన్సిళ్లు, ఒక రబ్బరు (ఎరేజర్), షార్ప్‌నర్‌తో కూడిన కిట్‌ను ప్రతి విద్యార్థికి అందజేస్తున్నారు. ఈ నెలాఖరులోగా వీటి పంపిణీ పూర్తి చేసేలా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది.

ప్రతి అంగన్‌వాడీ కేంద్రానికి ఒక్కో స్పెషల్ కిట్

రాష్ట్రంలో 55,607 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా.. ప్రతి కేంద్రానికీ 19 రకాల ఆట వస్తువులతోపాటు మేధస్సుకు పదును పెట్టి విద్యాభ్యాసానికి దోహదం చేసే ప్రత్యేక కిట్‌లను ప్రతి అంగన్‌వాడీ కేంద్రానికి ఒక్కొక్కటి చొప్పున రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అందజేసింది. ఆ కిట్‌లో చిన్నారులకు ఉపయోగపడే మ్యాట్, సాఫ్ట్ బాల్, చెక్కతో చేసిన సంఖ్యల పజిల్, పెగ్ బోర్డు, అబాకస్, చెక్క బూట్లు, బిల్డింగ్ బ్లాక్‌లు, గమ్ స్టిక్స్, 25 ముక్కల రంగుల పేపర్లు, 5 సెట్ల వాటర్ కలర్స్, 5 సెట్ల స్కెచ్ పెన్నులు, 5 ప్యాకెట్ల పెన్సిల్స్, 5 రబ్బర్లు, 5 షార్ప్‌నర్లు, నమూనాల ట్రేసింగ్ బోర్డు, డాఫ్లి, బ్లోయింగ్ సంగీత వాయిద్యాలు, 20 పలకలు, బొమ్మలు తయారు చేసేలా 5 సెట్ల మౌల్డింగ్ క్లే, మూడు ప్యాకెట్ల డస్ట్ ఫ్రీ సుద్దలు, బంతితో బాస్కెట్ బాల్ హోప్, కథల పుస్తకాలు 20 అందించారు. వీటిని ఆయా అంగన్‌వాడీలకు వచ్చే చిన్నారులు అక్కడే వినియోగించుకుని ఆడుతూ పాడుతూ ఆసక్తిగా అభ్యాసం చేసేలా ఏర్పాట్లు చేశారు.

ఓట్ల ప్రక్షాళనతో దొంగ వేషాలు!

దొంగ ఓట్లని ఎల్లో మీడియా చెబుతున్నవి 2019లో ఉన్నవే..

- ఆధార్ సీడింగ్, ఈసీ నిశిత పరిశీలనతో వెలుగులోకి గత సర్కారు నిర్వాకాలు
- అయినా ఈ ప్రభుత్వ హయాంలో జరిగినట్లు తప్పుడు ప్రచారం

సాక్షి, అమరావతి: ఓటర్ల జాబితాకు సంబంధించి 2019 ఎన్నికలకు ముందు చంద్రబాబు హయాంలో జరిగిన తప్పులు వెలుగులోకి వస్తుండటంతో టీడీపీ, అనుబంధ మీడియా రోజుకో రకంగా రాష్ట్ర ప్రభుత్వంపై బురద చల్లుతోంది. ప్రత్యేక ఓటర్ల సవరణ కార్యక్రమం ద్వారా ఓటర్ల జాబితాను కేంద్ర ఎన్నికల సంఘం నిశితంగా పరిశీలించడంతోపాటు ఆధార్‌కార్డును అనుసంధానిస్తుండటంతో ఎల్లో గ్యాంగ్ బెంబేలెత్తుతోంది. దొంగే.. దొంగ దొంగ అన్నట్లుగా వ్యవహరిస్తోంది. ఈనాడు, తోక పత్రిక 2019లో జరిగిన తప్పులను కప్పిపుచ్చేందుకు తంటాలు పడుతుండగా మర్నాడు అవే వార్తలను చదువుతూ టీడీపీ నేతలు విలేకరుల సమావేశాలను నిర్వహిస్తున్నారు. కొన్ని పత్రికల్లో వెలువడ్డ కథనాల ప్రకారం ఓటర్ల జాబితాను పరిశీలించగా అవన్నీ 2019కి ముందునుంచే ఉన్నట్లు తేలిందని, ప్రత్యేక ఓటర్ల సవరణ ద్వారా తప్పులను సరి చేస్తామని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి మీనా ఇప్పటికే ప్రకటించినా ఎల్లో మీడియా విష ప్రచారం యథాప్రకారం కొనసాగుతోంది.



పార్వతీపురం నియోజకవర్గం లక్ష్మీనారాయణపురంలో డోర్ నెంబరు '0' పేరుతో 30 దొంగ ఓట్లు ఉన్నాయని ఈనాడులో వచ్చిన కథనం ఇది. ఈ ఓట్లన్నీ 2019 ఎన్నికలకు ముందే ఉన్నాయని రాష్ట్ర ఎన్నికల అధికారి ప్రకటించారు

ఇంటి నెంబరు లేకపోతే నేరమా?

దేశంలో 18 ఏళ్ల వయసు నిండిన వారందరికీ ఓటు హక్కు కల్పించే లక్ష్యంతో ఇంటి నెంబరు లేకపోయినా ఓటరుగా నమోదుకు కేంద్ర ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. పూరి గుడిసెల్లో నివసించే వారికి ఇంటి నెంబరు ఉండదు కాబట్టి ఇంటి నెంబరు అనే చోట సున్నా అని పేర్కొంటూ ఓటరుగా నమోదు చేసుకోవచ్చు. అదే ప్రకారం పార్వతీపురం మన్యం జిల్లాలో ఇంటి నెంబరు లేకుండా కొన్ని ఓట్లు ఎప్పటి నుంచో నమోదవుతున్నాయి. అవన్నీ హఠాత్తుగా ఇప్పుడే జరిగినట్లు 'సున్నా నెంబర్ ఇంట్లో 30 మంది ఓటర్లు' అంటూ జూలై 1న ఈనాడు ఉద్దేశపూర్వకంగా తప్పుడు కథనాన్ని ప్రచురించింది. ఆధార్ కార్డులో ఇంటి నెంబరు లేనందున సమాచారాన్ని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసినప్పుడు 'సున్నా' అని పొందుపరిచినట్లు అధికారులు వివరణ ఇచ్చినా రామోజీ పాతపాటే పాడారు. ఈ ఓటర్లకు సంబంధించి 2019 జాబితాను పరిశీలించగా అప్పుడు కూడా ఇంటి నెంబర్ అనే చోట సున్నాగానే ఉండటం గమనార్హం. అధికారులు వివరణ ఇచ్చినా పట్టించుకోకపోవడం, ఓ కథనాన్ని ప్రచురించే ముందు కనీసం నిర్ధారించుకోకుండా విషం చిమ్మడం ద్వారా తన దుర్బుద్ధిని రామోజీ మరోసారి చాటుకున్నారు.

రేపల్లెలో ఎడాపెడా అంటూ..

రేపల్లెలో ఎడాపెడా దొంగఓట్లు అంటూ జూలై 1న ప్రచురించిన కథనాన్ని పరిశీలించగా అవన్నీ 2019లో కూడా ఉన్నట్లు వెల్లడైంది. అయితే అవన్నీ దొంగ ఓట్లు అని చెప్పలేమని, ఓటర్ల నమోదు సమయంలో చాలా మంది ఇంటి నెంబరు చెప్పలేనప్పుడు వీధి పేరు లేదా అపార్టుమెంట్ నెంబర్‌తో నమోదు చేయడం వల్ల ఒకే ఇంటిపై అధిక ఓట్లు ఉన్నట్లుగా కనిపిస్తోంది. వీటిని ప్రస్తుత ఓటర్ల సవరణ జాబితాలో పరిశీలించి దొంగ ఓట్లు ఉంటే కచ్చితంగా తొలగిస్తామని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా స్పష్టం చేశారు.

ఆ కేసుల ఉపసంహరణపై సీఎం సానుకూలత

2017లో మాదిగల కురుక్షేత్ర సభలో పాల్గొన్న విద్యార్థులపై కేసులు



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న మేరుగు నాగార్జున, నందిగం సురేష్, కొమ్మూరి కనకారావు

సాక్షి, అమరావతి: 2017లో మాదిగలు తలపెట్టిన కురుక్షేత్ర మహాసభల్లో పాల్గొన్న పలువురు విద్యార్థులు, పోరాట సంఘాల కార్యకర్తలపై అప్పటి ప్రభుత్వం నమోదు చేసిన కేసులను ఉపసంహరించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. సీఎం క్యాంపు కార్యాలయంలో గురువారం సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున, ఎంపీ నందిగం సురేష్, మాదిగ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావులు ముఖ్యమంత్రిని కలిసి పరిస్థితి వివరించారు. విద్యార్థులు, పోరాట సంఘాల కార్యకర్తలపై అప్పటి ప్రభుత్వం నమోదు చేసిన కేసులను ఎత్తివేయాలని కొంత కాలంగా వివిధ దళిత సంఘాలు విజ్ఞప్తి చేస్తున్నాయని చెప్పారు. వారిపై నమోదైన కేసులను ఉపసంహరించుకోవాలని కోరారు.

ఓటమి భయంతో బాబు చిల్లర వేషాలు

ఎన్నాళ్లీ గుంట నక్క రాజకీయాలు?: ఎమ్మెల్యే కాసు మహేశ్



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే వైఎస్సార్‌సీపీ క్లీన్ స్వీప్ చేయడం ఖాయమని ఇండియా టుడే, టైమ్స్ నౌ–నవభారత్ సర్వేల్లో తేలడంతో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు భయంతో బెంబేలెత్తుతున్నారని గురజాల వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే కాసు మహేశ్‌రెడ్డి పేర్కొన్నారు. దీంతో యరపతినేని శ్రీనివాసరావు లాంటి చెంచాలను ఉసిగొల్పి సీఎం జగన్‌పై చిల్లర విమర్శలు చేయిస్తున్నారని మండిపడ్డారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికల హామీలన్నీ సీఎం జగన్ అమలు చేయడంతో ప్రశ్నించేందుకు ఎలాంటి అంశం లేనందున చంద్రబాబు తన చెంచాలతో చిల్లర మాటలు మాట్లాడిస్తున్నారని మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, విదేశాల్లో ఉంటున్న మహిళలతో సీఎం కుటుంబ సభ్యులపై అసభ్య పోస్టులు పెట్టిస్తూ ఎన్నాళ్లు గుంట నక్క రాజకీయాలు చేస్తారని చంద్రబాబును నిలదీశారు. మద్యపాన నిషేధాన్ని ఎత్తివేసి ఇంటింటికీ లిక్కర్ పథకాన్ని పెట్టింది చంద్రబాబు కాదా? అని ప్రశ్నించారు. చంద్రబాబు హయాంలో అనుమతించిన డిస్టిలరీల్లో తయారైన బ్రాండ్ల మద్యాన్నే రాష్ట్రంలో విక్రయిస్తున్నట్లు చెప్పారు. అంతర్జాతీయంగా బొగ్గు ధరలు పెరగడంతో దేశవ్యాప్తంగా సిమెంట్, స్టీలు ధరలు పెరిగాయని, రాష్ట్రంలో ప్రత్యేకంగా పెరగలేదని తెలిపారు. చదువు రాని లోకేశ్‌కు సత్యం రామలింగరాజు వద్ద లంచంగా తీసుకున్న సొమ్ము ఫీజుగా కట్టి స్టాన్‌ఫర్డ్‌లో సీటు ఇప్పించడం వాస్తవం కాదా? అని చంద్రబాబును నిలదీశారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు రిటైర్ కావడం ఖాయమన్నారు. కనీసం గౌరవంగా రిటైర్ కావాలని సూచించారు.

సీఏ ఫలితాల్లో మాస్టర్‌మైండ్స్‌కు ఆలిండియా ర్యాంక్‌లు

గుంటూరు ఎడ్యుకేషన్: ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా ఈ నెల 5న ప్రకటించిన సీఏ ఇంటర్, సీఏ ఫైనల్ ఫలితాల్లో మాస్టర్‌మైండ్స్ విద్యార్థులు అఖిల భారతస్థాయిలో ర్యాంక్‌లు సాధించినట్లు సంస్థ అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్ తెలిపారు. గురువారం గుంటూరులోని సంస్థ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఏ ఫైనల్‌లో జి.భార్గవి ఆలిండియా 11వ ర్యాంక్, పి.కుమార్ 32వ ర్యాంక్, పి.రాజేష్ 34వ ర్యాంక్ కైవసం చేసుకున్నట్లు తెలిపారు. సీఏ ఇంటర్ ఫలితాల్లో వి.హేమంత్ 19వ ర్యాంక్, జి.పవన్ నాగసాయి 29వ ర్యాంక్, పి. చరణ్ ధనుష్ 37వ ర్యాంక్ సాధించినట్లు చెప్పారు.

క్లుప్తంగా...

నేటి నుంచి బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ విచారణ

సాక్షి, అమరావతి: రెండు రాష్ట్రాలకు కృష్ణా జలాలను పంపిణీ చేయడమే అజెండాగా శుక్రవారం నుంచి బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ విచారణ చేపట్టనుంది. ఢిల్లీలో ట్రిబ్యునల్ కార్యాలయంలో రెండు రోజులపాటు విచారించనుంది. ఈ దఫా విచారణలో తెలంగాణ సర్కార్ పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతలకు నీటి కేటాయింపులు చేసిన ఉత్తర్వులపై విచారణను కొనసాగించనుంది.

దురుద్దేశంతోనే సీఐడీపై పచ్చ మీడియా కథనం

న్యాయపరమైన చర్యలు తీసుకుంటాం: సీఐడీ

సాక్షి, అమరావతి: అవాస్తవాలు, అభూతకల్పనలతో ప్రజలను తప్పుదారి పట్టించడమే కాకుండా అధికారుల ప్రతిష్టను భంగపరుస్తూ పచ్చ మీడియా ప్రచురించిన కథనాన్ని సీఐడీ విభాగం ఖండించింది. 'సీఐడీ సంజయ్‌కు జగన్ ఝలక్' అంటూ పచ్చ మీడియా ప్రచురించిన కథనం పూర్తిగా అవాస్తవం, దురుద్దేశపూరితమని సీఐడీ గురువారం ఓ ప్రకటనలో పేర్కొంది. ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిర్దేశించిన మార్గదర్శకాలు, పాత్రికేయ విలువలను ఏమాత్రం పాటించకుండా ఏకపక్షంగా దుష్ప్రచారం చేసేందుకే ఆ కథనాన్ని ప్రచురించారని విమర్శించింది. అసత్య కథనాలతో ప్రజలను తప్పుదారి పట్టించేందుకు ప్రయత్నించిన మీడియా సంస్థపై న్యాయపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపింది.

35,000 మంది సబ్జెక్ట్ టీచర్లకు ఐఐటీ ప్రొఫెసర్లతో శిక్షణ



సత్యనారాయణను సత్కరిస్తున్న ప్రవీణ్ ప్రకాశ్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని 6,000 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో గణితం, భౌతిక, జీవ, రసాయన శాస్త్రాలతో పాటు ఇంగ్లిష్ బోధించే ఉపాధ్యాయులకు అక్టోబర్ 2 నుంచి ఐఐటీ, ఐఐఎస్ఈఆర్ ప్రొఫెసర్లతో శిక్షణ ఇవ్వనున్నట్టు పాఠశాల విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ తెలిపారు. గురువారం తిరుపతి ఐఐటీలో ఆ సంస్థ డైరెక్టర్ సత్యనారాయణ, ఐఐఎస్ఈఆర్ తిరుపతి డైరెక్టర్ శంతన్ భట్టాచార్య, మద్రాస్ ఐఐటీ ప్రొఫెసర్ మంగళ్‌తో ప్రవీణ్ ప్రకాశ్, ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి సమావేశమయ్యారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్, ఐఐటీ ప్రొఫెసర్లతో 35,000 మంది సబ్జెక్టు టీచర్లకు ఆన్‌లైన్‌లో శిక్షణ ఇస్తామని ప్రవీణ్ ప్రకాశ్ చెప్పారు.

జర్మనీలో నర్స్ ఉద్యోగాలకు 150 మంది ఎంపిక

సాక్షి, అమరావతి: జర్మనీలో ఉద్యోగం చేసేందుకు రాష్ట్రం నుంచి 150 మంది బీఎస్సీ నర్సింగ్ అభ్యర్థులు ఎంపికయ్యారని నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేశ్‌కుమార్ తెలిపారు. గురువారం కేఎల్ యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. జర్మనీలో ఉద్యోగాలకు ఎంపికైన 150 మందికి శిక్షణ ఖర్చును రాష్ట్ర ప్రభుత్వం భరిస్తోందని తెలిపారు. అభ్యర్థులు కేవలం వీసా ప్రాసెసింగ్ ఫీజు మాత్రమే చెల్లించాల్సి ఉంటుందన్నారు. జర్మనీలో ఉద్యోగంలో చేరిన తర్వాత ప్రారంభ వేతనం కింద నెలకు 1,000 యూరోలు(సుమారు రూ.89,000) లభిస్తాయని చెప్పారు. ఈనెల 10 నుంచి టక్ట్ ఇంటర్నేషనల్, ఆక్సిలా అకాడమీ బృందం సంయుక్తంగా జర్మన్ భాషపై 2 నెలల పాటు శిక్షణ ఇస్తుందని తెలిపారు. ఉపాధి మరియు శిక్షణ శాఖ డైరెక్టర్, ఐఏఎస్ అధికారిణి నవ్య మాట్లాడుతూ విదేశీ భాషల్లో ప్రావీణ్యం సాధించడం ద్వారా మరిన్ని ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవచ్చన్నారు. టక్ట్ ఇంటర్నేషనల్ సీఈవో రాజ్‌సింగ్ మాట్లాడుతూ ఈ నెల 10 నుంచి 150 మంది నర్సులకు జర్మన్ భాషలో శిక్షణ ఇస్తామన్నారు. తమకు ఈ అవకాశం కల్పించిన రాష్ట్ర ప్రభుత్వానికి వల్లి అనే యువతి కృతజ్ఞతలు తెలిపింది.

'పాన్ ఇండియా' కావాలనేదే లక్ష్యం

- 'సాక్షి'తో ప్రముఖ వస్త్ర వ్యాపారి 'కాసం' ఓం నమశ్శివాయ



సాక్షి ప్రతినిధి, వరంగల్: కాసం ఓం నమశ్శివాయ.. వస్త్ర వ్యాపార రంగంలో పరిచయం అవసరం లేని పేరు. వరంగల్ పరిసర ప్రాంతాల్లో ఈ పేరే ఒక బ్రాండ్. అయితే.. ఒకప్పుడు వరంగల్‌కే పరిమితమైన వ్యాపారం నేడు 13 రాష్ట్రాలకు విస్తరించింది. రూ.10 లక్షలున్న టర్నోవర్ ఇప్పుడు రూ.850 కోట్లు దాటింది. వస్త్ర వ్యాపార రంగంలో దూసుకెళ్లి 'పాన్ ఇండియా' కావాలనేది తన లక్ష్యం అని గురువారం ఆయన 'సాక్షి'తో అన్నారు. 'మా నాన్న కాసం పుల్లయ్య 1951 నుంచి 1986 వరకు వరంగల్‌లో షాపు నడిపారు. నాన్న మరణించాక అన్న మల్లికార్జున్, తమ్ముళ్లు కేదారినాథ్, శివప్రసాద్‌లతో కలిసి బట్టల షాపు నడిపాం. 1996 నుంచి 2008 వరకు 'కాసం సెలెక్షన్స్', 'సెనెట్', 'సావనీర్', 'కాసం బ్రదర్స్', 2011లో 'కాసం హోం వరల్డ్ (ఫర్నిచర్)'లను నెలకొల్పాం. 2012 ఫిబ్రవరి 17న మా బావ పీఎస్ మూర్తి, వారి కుమారుడు పుల్లూరు అరుణ్‌తో కలిసి మొదలెట్టిన 'మాంగళ్య' విజయవంతంగా కొనసాగుతోంది. 'ది స్వయంవర్' ఫ్రాంచైజీల ద్వారా 13 రాష్ట్రాలకు విస్తరించాం. ఈ నెల 12న సూర్యాపేటలో ప్రారంభించనున్నాం.' అని వివరించారు.

'ఆఫా'కు అండగా ఉంటాం



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

- ఆఫా కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో మంత్రులు బొత్స, జోగి
- ఆఫా అధ్యక్షుడిగా ఆర్.వి.స్వామి

సాక్షి, అమరావతి/మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): ఆంధ్రప్రదేశ్ హోటల్స్ అసోసియేషన్ (ఆఫా)కు రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడు అండగా ఉంటుందని రాష్ట్ర మంత్రులు బొత్స సత్యనారాయణ, జోగి రమేశ్ హామీ ఇచ్చారు. ఆఫా నూతన కార్యవర్గం బాధ్యతల స్వీకరణ మహోత్సవం గురువారం విజయవాడలో జరిగింది. అసోషియేషన్ అధ్యక్షుడిగా ఆర్.వి. స్వామి, కార్యదర్శిగా ఎం.నాగరాజు, కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎస్.హనుమంతరావు, కోశాధికారిగా పి.వి.పూర్ణచంద్రరావు బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిలుగా పాల్గొన్న మంత్రులు మాట్లాడుతూ హోటళ్లు నాణ్యమైన సేవలను, రుచికరమైన ఆహారాన్ని అందించడం ద్వారా బ్రాండ్ ఇమేజ్ పెంచుకోవాలని సూచించారు. అసోసియేషన్ విజ్ఞప్తులను సీఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకువెళ్లి అన్నిటినీ నెరవేర్చే విధంగా కృషిచేస్తామని వారు భరోసా ఇచ్చారు. ఆఫా అధ్యక్షుడు స్వామి మాట్లాడుతూ అన్ని జిల్లాలకు ప్రాతినిధ్యం ఉండేలా పూర్తి కమిటీని త్వరలోనే ఏర్పాటు చేస్తామని చెప్పారు. కోవిడ్ వల్ల దెబ్బతిన్న హోటల్‌రంగం కోలుకోవడానికి సీఎం జగన్ నాయకత్వంలో ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సాహకాలందిస్తోందని తెలిపారు. హోటళ్లు తెరిచి ఉంచే సమయాన్ని రాత్రి 12 గంటల వరకు పెంచిన సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నేత దేవినేని అవినాశ్, హోటళ్ల నిర్వాహకులు పాల్గొన్నారు.

పారదర్శకంగా వైద్యవిద్య అడ్మిషన్లు

- విద్యార్థులకు ఇబ్బందుల్లేకుండా పాత పద్ధతిలోనే పీజీ, అండర్ గ్రాడ్యుయేషన్ అడ్మిషన్ల ప్రక్రియ
- డాక్టర్ వైఎస్సార్ హెల్త్ వర్సిటీ వీసీ డాక్టర్ కోరుకొండ బాబ్జి



లబ్బీపేట(విజయవాడతూర్పు): డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వ విద్యాలయం పరిధిలో 2023–24 సంవత్సరానికి సంబంధించి పోస్టు గ్రాడ్యుయేషన్, అండర్ గ్రాడ్యుయేషన్ అడ్మిషన్లు పారదర్శకంగా, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు వీసీ డాక్టర్ కోరుకొండ బాబ్జి తెలిపారు. అందుకు సంబంధించి అడ్మిషన్స్ విభాగం వారితో కలిసి మూడు సార్లు మాక్ ట్రయల్ నిర్వహించామన్నారు. యూనివర్సిటీ పరిధిలోని సీట్లు, అడ్మిషన్ల ప్రక్రియ వంటి అంశాలను గురువారం ఆయన 'సాక్షి'కి వివరించారు.

తెలంగాణ జీవోపై నిర్ణయం..

2014 జూన్ రెండు తర్వాత తెలంగాణలో కొత్తగా వచ్చిన వైద్య కళాశాలల్లోని యూజీ సీట్లలో 15 శాతం అన్ రిజర్వుడ్ కోటాలో ఆంధ్రప్రదేశ్ విద్యార్థులకు ఇచ్చేది లేదని అక్కడి ప్రభుత్వం జీవో ఇచ్చింది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లోని వైద్య కళాశాలల్లో మంజూరైన ఎంబీబీఎస్ సీట్లతో పాటు, పీజీ సీట్లు కూడా అన్ రిజర్వుడ్ కోటాలో తెలంగాణ విద్యార్థులకు నిలిపివేసే విషయంలో ప్రభుత్వం నిర్ణయం ప్రకటించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఈ ఏడాది నుంచి విజయనగరం, రాజమండ్రి, మచిలీపట్నం, ఏలూరు, నంద్యాల వైద్య కళాశాలల్లో 750 సీట్లు పెరిగాయి. దీంతో రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 3,109 సీట్లు ఉన్నట్లు తెలిపారు. వాటిలో 15 శాతం ఆలిండియా కోటాలో పోగా, మిగిలిన సీట్లకు ఇక్కడ అడ్మిషన్లు జరుపుతామన్నారు. 18 ప్రైవేటు వైద్య కళాశాలల్లో 3,000 ఎంబీబీఎస్ సీట్లున్నాయని, వాటిలో 50 శాతం.. 1,500 సీట్లను ఏ కేటగిరిలో భర్తీ చేస్తామని వీసీ తెలిపారు. దేశవ్యాప్తంగా ఒకేసారి డైనమిక్ కౌన్సెలింగ్ నిర్వహించాలనే ప్రతిపాదన వచ్చిందని వీసీ తెలిపారు. ఏపీ, తెలంగాణలకు విభజన ఇబ్బందులు ఉన్న దృష్ట్యా ఈ ఏడాదికి పాత పద్ధతిలోనే కౌన్సెలింగ్ నిర్వహిస్తామని, వచ్చే ఏడాది నుంచి నూతన విధానాన్ని అనుసరిస్తామని కేంద్రానికి చెప్పినట్టు తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పీజీ, యూజీ అడ్మిషన్లు నిర్వహిస్తామని వివరించారు.

భారత్, జపాన్ రక్షణ బంధం బలోపేతం

భారత్, జపాన్ నేవీ ఉన్నతాధికారుల ప్రకటన



మాట్లాడుతున్న నిషియామా తకహీరో, పక్కన గురుచరణ్‌సింగ్

సాక్షి, విశాఖపట్నం: ఇండో పసిఫిక్ సముద్ర జలాల్లో శాంతి, ద్వైపాక్షిక భద్రత, రక్షణ సహకారంపై మరింత దృష్టి సారించామని జపాన్ కమాండర్ ఎస్కార్ట్ ఫ్లోటిల్లా వన్ (సీసీఎఫ్1) రియర్ అడ్మిరల్ నిషియామా తకహీరో, ఇండియన్ ఈస్టర్న్ ఫ్లీట్ ఫ్లాగ్ ఆఫీసర్ కమాండ్ రియర్ అడ్మిరల్ గురుచరణ్‌సింగ్ తెలిపారు. విశాఖలోని తూర్పు నౌకాదళం వేదికగా బుధవారం నుంచి జపాన్, ఇండియా మారిటైమ్ ఎక్సర్‌సైజ్ (జిమెక్స్–2023) ప్రారంభమైంది. ఈ క్రమంలో హార్బర్ ఫేజ్ విన్యాసాల్లో భాగంగా ఐఎన్‌ఎస్ కమోర్తా యుద్ధ నౌక ఆన్ బోర్డుపై గురువారం ఇరు దేశాల ప్రతినిధులు మీడియా సమావేశాన్ని నిర్వహించారు. గురుచరణ్ సింగ్ మాట్లాడుతూ 12 ఏళ్ల క్రితం ప్రారంభమైన జిమెక్స్ విన్యాసాలు ఏడో విడత నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ నెల 7వ తేదీ వరకు హార్బర్ ఫేజ్ విన్యాసాలు, 8 నుంచి 10 వరకు సీ ఫేజ్ విన్యాసాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. భారత్, జపాన్ మధ్య రక్షణ బంధం మరింత బలోపేతమయ్యేందుకు 'జిమెక్స్' దోహదపడుతుందని చెప్పారు. నిషియామా తకహీరో మాట్లాడుతూ భారత్‌తో మలబార్‌తోపాటు జిమెక్స్‌లో పాల్గొనడం వల్ల ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక ప్రయోజనాలు పంచుకుంటున్నామని చెప్పారు. జపాన్ ప్రతినిధులు జో షిరాయిషీ, కొసుగా హిరోయుకి పాల్గొన్నారు.

డిసెంబర్‌లో ఆప్షన్–3 ఇళ్లు పూర్తి చేయాలి

కాంట్రాక్టర్ల సమావేశంలో గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేశ్



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకం కింద నిర్మిస్తున్న ఆప్షన్–3 ఇళ్లను ఈ ఏడాది డిసెంబర్‌లోగా పూర్తి చేయాలని గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేశ్ కాంట్రాక్టర్లను ఆదేశించారు. విజయవాడలోని గృహ నిర్మాణ సంస్థ ప్రధాన కార్యాలయంలో గురువారం ఆప్షన్–3 ఇళ్లు నిర్మిస్తున్న కాంట్రాక్టర్‌లతో మంత్రి సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలని, క్షేత్ర స్థాయిలో ఎదురయ్యే సమస్యలను తనతోపాటు అధికారుల దృష్టికి తీసుకుని రావాలని సూచించారు. వెంటనే సమస్యలను పరిష్కరించటానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇళ్ల నిర్మాణ పనుల్లో ఎటువంటి అలసత్వం వహించవద్దని చెప్పారు. ఇళ్ల నిర్మాణం పూర్తి చేయని కాంట్రాక్టర్లు, అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉత్తమ పనితీరు కనబరిచిన వారికి సీఎం వైఎస్ జగన్ చేతుల మీదుగా సన్మానాలు చేయిస్తామన్నారు. వచ్చే నెలలో సుమారు ఐదు నుంచి ఆరు లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి, సామూహిక గృహ ప్రవేశాలు చేయాలనే పట్టుదలతో సీఎం ఉన్నారని తెలిపారు. సంబంధిత జిల్లాల అధికారుల సమక్షంలో ప్రతి కాంట్రాక్టర్‌తో మాట్లాడిన మంత్రి.. క్షేత్ర స్థాయిలో పరిస్థితులను తెలుసుకున్నారు. జిల్లా స్థాయిలో పరిష్కరించే సమస్యలపై తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆప్షన్–3 ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయడానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తామని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ తెలిపారు.

రూ.కోటి, వడ్డీ చెల్లించాల్సిందే

ఎక్సైడ్ లైఫ్‌కు వినియోగదారుల కమిషన్ ఆదేశం

కర్నూలు (లీగల్): అసంబద్ధమైన కారణాలను సాకుగా చూపించి పరిహారం చెల్లించేందుకు నిరాకరించిన ఎక్సైడ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ తీరును కర్నూలు జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ తప్పుబట్టింది. బాధిత కుటుంబానికి రూ.కోటి బీమా మొత్తాన్ని 9% వడ్డీతో చెల్లించాలని ఆదేశించింది. కోర్టు ఖర్చులకు మరో రూ.35,000 చెల్లించాలని పేర్కొంటూ కమిషన్ అధ్యక్షులు కె.కిషోర్‌కుమార్, సభ్యులు ఎస్.నారాయణరెడ్డి, నజీమా కౌసర్ గురువారం తీర్పునిచ్చారు. కర్నూలుకి చెందిన ఎం.వెంకటరామ్‌ప్రసాద్ 2018లో ఎక్సైడ్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో రూ.కోటి జీవిత బీమా పాలసీ తీసుకున్నారు. ఆయన 2021 ఏప్రిల్ 16న మరణించారు. ఆయనకు షుగర్ ఉందని బీమా సొమ్ము ఇచ్చేందుకు ఎక్సైడ్ లైఫ్ నిరాకరించడాన్ని కమిషన్ తప్పు పట్టింది.

పాలిటెక్నిక్ సిలబస్‌ను ఏటా అప్‌గ్రేడ్ చేయాలి

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్

సాక్షి, అమరావతి: జాతీయ, అంతర్జాతీయ పోటీలకనుగుణంగా ఏటా పాలిటెక్నిక్ విద్యార్థుల సిలబస్‌ను అప్‌గ్రేడ్ చేయాలని రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్ అన్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఉన్నత స్థాయి నిపుణుల కమిటీని ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. సాంకేతిక విద్యా శాఖ కేంద్ర కార్యాలయంలో గురువారం పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థపై సురేష్‌కుమార్ సమీక్ష నిర్వహించారు. సిలబస్ అప్‌గ్రేడ్‌కు నియమించిన కమిటీలో జాతీయ స్థాయి నిపుణులకు చోటు కల్పించాలన్నారు. మైదుకూరు, బేతంచర్ల, గుంతకల్లులో కొత్తగా మంజూరు చేసిన ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో వసతుల కల్పన, భవన నిర్మాణానికి ప్రభుత్వ ఆమోదం కోసం క్యాబినెట్ నోట్‌ను సిద్ధం చేయాలని సూచించారు. సాంకేతిక విద్య శాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి, జేడీ పద్మారావు, సాంకేతిక విద్యా శిక్షణ మండలి కార్యదర్శి రమణబాబు పాల్గొన్నారు.

బాధితుడు గుర్తింపును హైకోర్టులోనే తేల్చుకోవాలి

- సంతృప్తి చెందకుంటే మళ్లీ రావొచ్చు
- వివేకా పీఏ కృష్ణారెడ్డి పిటిషన్‌పై విచారణ ముగింపు
- పది పేజీల ఆర్డర్ ఇచ్చిన సుప్రీంకోర్టు

సాక్షి, న్యూఢిల్లీ: వివేకానందరెడ్డి హత్య కేసులో పర్సన్ కాంపిటెంట్ (బాధితుడు) గుర్తింపునకు అప్రాప్రియేట్ ఫోరం (హైకోర్టు)లోనే తేల్చుకోవాలని సుప్రీంకోర్టు తెలిపింది. ఆ విషయంలో అన్ని పక్షాల వాదనలు విన్న తర్వాత తమ ముందు రెండు ప్రశ్నలు తలెత్తాయని.. వీటికి తగిన ఫోరం సమాధానం ఇవ్వడమే సముచితం అని ధర్మాసనం అభిప్రాయపడింది. వివేకానంద పీఏ కృష్ణారెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన జస్టిస్ కృష్ణమురారి, జస్టిస్ సంజయ్‌కుమార్‌ల ధర్మాసనం ఇరుపక్షాలను హైకోర్టుకు వెళ్లాలని సూచించిన విషయం తెలిసిందే. అయితే, గురువారం ఈ కేసుకు సంబంధించి పది పేజీల ఉత్తర్వులను ధర్మాసనం వెలువరించింది. హైకోర్టు ఆదేశాలతో సంతృప్తి చెందకపోతే సుప్రీంకోర్టుకు రావొచ్చని స్పష్టంచేసింది. న్యాయమూర్తులు అందులో ఏం పేర్కొన్నారంటే.. 'వివేకానందరెడ్డి హత్య సమాచారాన్ని తొలుత ఇచ్చిన ఎంవీ కృష్ణారెడ్డి ఈ అప్లికేషన్‌ను దాఖలు చేశారు. ఈ హత్యపై సీబీఐ దర్యాప్తు కోరుతూ మృతుడు కుమార్తె, భార్య దాఖలు చేసిన రిట్ పిటిషన్లు ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నాయి. హత్యపై దర్యాప్తు చేయాలని హైకోర్టు సీబీఐని 2020 మార్చి 11న ఆదేశాలివ్వగా సీబీఐ దర్యాప్తు ప్రారంభించింది. తుమ్మలపల్లి గంగిరెడ్డి, యాదాటి సునీల్ యాదవ్, గజ్జల ఉమాశంకర్‌రెడ్డి, షేక్ దస్తగిరిలు నేరంలో భాగస్వాములయ్యారని సీబీఐ దర్యాప్తులో ఓ సాక్షి వెల్లడించారు. వీరిని సీబీఐ అరెస్టుచేసింది. దస్తగిరి తన అంగీకార ప్రకటనలో డి.శివశంకర్‌రెడ్డి (ప్రస్తుత ఎస్సెల్పీ దాఖలు చేసిన వ్యక్తి) కూడా నేరంలో భాగస్వామ్యం అయ్యాడని పేర్కొన్నాడు. హత్యకు నలుగురం కలిసి కుట్ర పన్నామని బెంగళూరులోని వివాదాస్పద ఆస్తిపై గంగిరెడ్డి ఆసక్తే కారణమని తెలిపారు. సునీల్ యాదవ్ సూచన మేరకు హత్యాయుధం కొనుగోలు చేశానని, మృతుడు ఎలా హత్యకు గురయ్యారో కూడా వివరించారు. అనంతరం దస్తగిరి ముందస్తు బెయిలు కోరుతూ కోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. ఇది పెండింగ్‌లో ఉండగానే హత్యకు గల అన్ని కారణాలు వివరించినందుకు తనకు క్షమాభిక్ష పెట్టాలని దస్తగిరి సీబీఐకు విజ్ఞప్తి చేసుకున్నాడు. దర్యాప్తునకు దస్తగిరి పూర్తిస్థాయిలో సహకరిస్తున్నాడని సీబీఐ చెప్పడంతో కోర్టు 2021 అక్టోబరు 22న దస్తగిరికి ముందస్తు బెయిలు మంజూరు చేసింది. దర్యాప్తు పూర్తయ్యాక సీబీఐ నలుగురి మీద చార్జిషీటు దాఖలు చేసింది. దస్తగిరికి క్షమాభిక్ష కోరుతూ అప్లికేషన్ దాఖలు చేసింది. దీంతో దస్తగిరికి చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ క్షమాభిక్ష ఇవ్వగా దాన్ని గంగిరెడ్డి, ఉమాశంకర్‌రెడ్డిలు ఏపీ హైకోర్టులో సవాల్ చేశారు. హైకోర్టు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆదేశాలను సమర్థించింది. అనంతరం.. శివశంకర్‌రెడ్డి సుప్రీంకోర్టులో ఎస్సెల్పీ దాఖలు చేశారు. తగిన ప్రొసీడింగ్స్ చేసే వరకూ దాని జోలికి వెళ్లడంలేదంటూ ఎస్సెల్పీని డిస్మిస్ చేశాం. ఆ తర్వాత పీఏ కృష్ణారెడ్డి ప్రస్తుత అప్లికేషన్‌ను దాఖలుచేశారు. ఇదిలా ఉంటే.. సుప్రీంకోర్టు ఆదేశాల్లో తగిన ప్రొసీడింగ్స్, పర్సన్ కాంపిటెంట్ (బాధితుడు) అనే వాటిపై స్పష్టత ఇవ్వాలంటూ మృతుడు కుమార్తె సునీత నర్రెడ్డి ఇంప్లీడ్‌మెంట్ అప్లికేషన్ దాఖలు చేశారు. అన్ని పక్షాల వాదనలు విన్న తర్వాత మా ముందు రెండు ప్రశ్నలు తలెత్తాయి. హత్యకు సంబంధించి తొలుత సమాచారం ఇచ్చిన వ్యక్తిని బాధితుడుగా పరిగణించాలా? దస్తగిరి ముందస్తు బెయిలు, క్షమాభిక్ష కోరడాన్ని ఛాలెంజ్ చేయొచ్చా? అనే రెండు ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ తరహా వాదనల వివరణ కోరుతూ దాఖలు చేసే అప్లికేషన్ ద్వారా నిర్ణయించడం సాధ్యంకాదు. అటువంటి ప్రశ్నలకు తగిన ఫోరం (హైకోర్టు) సమాధానం ఇవ్వడమే సముచితం' అని ధర్మాసనం ఉత్తర్వుల్లో పేర్కొంది.

నారాయణ ఆధ్వర్యంలో ఎన్‌ఎస్‌ఏటీ-2023

సాక్షి, హైదరాబాద్: దేశవ్యాప్తంగా విద్యార్థులను ప్రోత్సహించేందుకు స్కాలస్టిక్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (ఎన్‌ఎస్‌ఏటీ–2023) 18వ ఎడిషన్‌ను నారాయణ విద్యాసంస్థ ప్రకటించింది. దేశవ్యాప్తంగా 7 నుంచి 11వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ఎన్‌ఎస్‌ఏటీ పరీక్షలో పాల్గొనే అవకాశం కల్పిస్తోంది. పేద, మధ్యతరగతి విద్యార్థులను ప్రోత్సహించడం, వారికి విలువైన బహుమతులు అందించడం ఎన్‌ఎస్‌ఏటీ ముఖ్యోద్దేశం. పోటీ పరీక్షల్లో మార్పులు, విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా ఎన్‌ఎస్‌ఏటీ–2023 పరీక్షను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతుల్లో నిర్వహించనున్నట్టు నారాయణ గ్రూప్ డైరెక్టర్లు డాక్టర్ పి.సింధూర నారాయణ, పి.శరణి నారాయణ తెలిపారు.

తెలంగాణ

రేపు వరంగల్‌కు ప్రధాని మోదీ

- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్న పీఎం

సాక్షి, హైదరాబాద్/ సాక్షి ప్రతినిధి, వరంగల్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ శనివారం తెలంగాణలో పర్యటించనున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడంతోపాటు, హనుమకొండ ఆర్ట్స్ కాలేజీ ప్రాంగణంలో జరిగే బహిరంగ సభలో ప్రధాని పాల్గొననున్నారు. శనివారం ఉదయం వారణాసి ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యేక విమానంలో బయల్దేరి హైదరాబాద్‌లోని హకీంపేట్ ఎయిర్‌పోర్టుకు మోదీ చేరుకుంటారు. అనంతరం అక్కడి నుంచి ఎంఐ–17 హెలికాప్టర్‌లో వరంగల్‌కు వెళతారు. అక్కడ మామునూర్‌లోని హెలిపాడ్‌కు చేరుకుని, రోడ్డుమార్గాన భద్రకాళి ఆలయానికి బయలుదేరతారు. పూజల అనంతరం హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ గ్రౌండ్‌కు చేరుకుంటారు. వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. ఆ తరువాత అక్కడ జరిగే బహిరంగ సభలో ప్రసంగిస్తారు. అనంతరం హెలికాప్టర్‌లో బయలుదేరి మధ్యాహ్నం హకీంపేట్ ఎయిర్‌పోర్టుకు చేరుకుని.. ప్రత్యేక విమానంలో రాజస్థాన్‌లోని బికనీర్‌కు వెళతారు.

కరీంనగర్ జిల్లాలో 68.6 శాతం సిజేరియన్లు

- జూన్‌లో ఈ జిల్లాలోని ప్రభుత్వాస్పత్రుల్లో అత్యధికం
- కుమురంభీం జిల్లాలో అత్యంత తక్కువగా 22% సిజేరియన్లు
- తల్లుల ఆరోగ్య పరిరక్షణలో గద్వాల ఫస్ట్.. సూర్యాపేట లాస్ట్
- వైద్య, ఆరోగ్య శాఖ నివేదిక వెల్లడి

సాక్షి, హైదరాబాద్: కరీంనగర్ జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో సిజేరియన్ ఆపరేషన్లు పెరిగినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. జూన్‌లో ఈ జిల్లాలోని ప్రభుత్వాస్పత్రుల్లో 68.6 శాతం ప్రసవాలు సిజేరియన్ ఆపరేషన్ల ద్వారానే జరిగాయని వైద్య, ఆరోగ్య శాఖ వెల్లడించింది. ఈ జిల్లాలో మే నెలలో 64.1 శాతం సిజేరియన్లు జరగ్గా, నెలలోనే ఇంకా పెరగడం గమనార్హం. ఈ ఏడాది మే, జూన్ నెలల్లో రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో సిజేరియన్లు, ప్రసవాలు, తల్లుల ఆరోగ్యం విషయంలో చేపట్టిన చర్యలపై గురువారం వైద్య, ఆరోగ్య శాఖ సమీక్ష నిర్వహించింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో కలిపి ప్రభుత్వ ఆస్పత్రుల్లో జరిగిన ప్రసవాల్లో మే నెలలో 46 శాతం సిజేరియన్లు జరగ్గా, జూన్ నెలలో 45.4 శాతం జరిగినట్లు ఆరోగ్య శాఖ నివేదిక వెల్లడించింది. జూన్‌లో రాజన్న సిరిసిల్ల జిల్లాలో 67.6 శాతం, పెద్దపల్లి జిల్లాలో 65.7 శాతం, జగిత్యాల జిల్లాలో 64.1 శాతం, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 63.8 శాతం, నిర్మల్ జిల్లాలో 62.2 శాతం సిజేరియన్లు జరిగాయి. కాగా, 14 జిల్లాల్లోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో 50 శాతం పైగా ప్రసవాలు సిజేరియన్ల ద్వారానే జరిగాయి. కాగా, అత్యంత తక్కువగా జూన్ నెలలో కుమురంభీం జిల్లాలో 22 శాతం మాత్రమే సిజేరియన్లు జరిగాయి. ఇక మే నెలలో రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో 26,414 ప్రసవాలు జరగ్గా, అందులో 12,159 ప్రసవాలు సిజేరియన్ ద్వారానే జరిగాయని ఆరోగ్య శాఖ నివేదిక వివరించింది. కాగా, జూన్ నెలలో రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో 23,784 ప్రసవాలు జరగ్గా, అందులో 10,795 ప్రసవాలు సిజేరియన్ ద్వారానే జరిగాయి. మొత్తంగా చూస్తే మే నెల కంటే జూన్‌లో 21 జిల్లాల ప్రభుత్వ ఆస్పత్రులు సిజేరియన్ ఆపరేషన్లు తగ్గించడంలో శ్రద్ధ తీసుకున్నాయి. ఇక తల్లుల ఆరోగ్యాన్ని పరిరక్షించడంలో జోగులాంబ గద్వాల జిల్లా అగ్రస్థానాన్ని సాధించింది. ఇదే విషయంలో వికారాబాద్ రెండు, కుమురంభీం ఆసిఫాబాద్ మూడు, మెదక్ నాలుగు, సంగారెడ్డి జిల్లా ఐదో ర్యాంకు సాధించాయి. సూర్యాపేట జిల్లా లాస్ట్ ర్యాంకు అంటే 33వ ర్యాంకు సాధించింది. నిర్మల్ 32, మహబూబాబాద్ 31, మంచిర్యాల 30, వనపర్తి 29 ర్యాంకులు సాధించాయి. హైదరాబాద్ 11వ ర్యాంకు సాధించింది.

అనంత కరుణామయుడు (అల్లాహ్)!
నక్షత్రాలు మరియు వృక్షాలు అన్నీ ఆయనకు
సాష్టాంగం (సజ్దా) చేస్తూ ఉంటాయి.
– ఇస్లాం ధర్మం

సాక్షి
శుక్రవారం, 7 జూలై 2023

వైరుద్ధ్యాలతోనే... ఒకే గూటిలో...

పరస్పర వైరుద్ధ్యాలను బయటపెట్టుకుంటూనే సహకారం కోసం సాగిన ప్రయత్నం ఇది. మంగళవారం నాటి 'షాంఘై సహకార సంఘం' (ఎస్సీఓ) శిఖరాగ్ర సదస్సును ఒక్కమాటలో అభివర్ణించాలంటే అంతే! భారత ఆతిథ్యంలో వర్చ్యువల్‌గా సాగిన ఈ 8 సభ్యదేశాల సంఘం 23వ సదస్సు విజయవంతంగానే ముగిసింది కానీ, చైనా, పాకిస్తాన్‌లతో మన సంబంధాల్లో అంతర్లీనంగా ఉన్న అసంతృప్తి మాత్రం స్పష్టంగా కనపడింది. ఢిల్లీ ఎప్పటిలానే తీవ్రవాద వ్యతిరేక మంత్రం, బీజింగ్ షరా మామూలు ఆర్థిక సహకార తంత్రాలనే సదస్సులో ప్రవచించాయి. అమెరికా, పాశ్చాత్య ప్రపంచాలతో సంబంధం లేకుండా చైనా–రష్యా కేంద్రకంగా యురేషియా బృందానికి, ప్రపంచ జనాభాలో 40 శాతానికి ప్రాతినిధ్యం వహిస్తున్న సంఘం గనకే ఎస్సీఓపై ప్రపంచానికి అమితాసక్తి. భారత ప్రధాని వర్చ్యువల్‌గా ఆతిథ్యమిచ్చిన ఈ సదస్సుకు హాజరైనవారిలో చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు పుతిన్, పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌లతో పాటు కొత్తగా సభ్యత్వం పొందిన అమెరికా వ్యతిరేక ఇరాన్ అధ్యక్షుడు ఉన్నారు. వ్యక్తిగతంగా హాజరయ్యేలా ఈ సదస్సును జరపాలనుకున్నా, మోదీ అమెరికా పర్యటనతో వాయిదా వేసి, ఆన్‌లైన్‌లో సరిపెట్టాల్సి వచ్చింది.

ఈ సమావేశంతో ఏడాది కాలపు భారత అధ్యక్ష హోదా ముగిసింది. నిన్న గాక మొన్ననే అమెరికాలో పర్యటించి, స్నేహం పెంచుకున్నప్పటికీ విదేశాంగ విధానంలో తాము స్వతంత్రులమే అని భారత్ ప్రకటించుకోవడానికి ఈ సదస్సు ఉపకరించింది. అమెరికా వ్యతిరేక ఇరాన్‌ను సభ్యదేశంగా ఆహ్వానించడం, ఉక్రెయిన్‌పై దాడిలో రష్యాకు మిత్ర పక్షమైన బెలారుస్‌కు వచ్చే ఏటికల్లా పూర్తి సభ్యత్వమిస్తామని ప్రతిపాదించడమే అందుకు సూచన. అదే సమయంలో చైనా చేపట్టిన వందల కోట్ల డాలర్ల ప్రాజెక్ట్ 'బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్' (బ్రి)కు మిగతా దేశాలన్నీ మద్దతుగా నిలిచినా, సదస్సు అనంతర ప్రకటనలో ఆ భాగానికి భారత్ దూరం జరిగింది. పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే) మీదుగా సాగే 'చైనా – పాకిస్తాన్ ఆర్థిక కారిడార్' (సీపీఈసీ) నిర్మాణం సైతం 'బ్రి'లో భాగం గనక దాన్ని భారత్ వ్యతిరేకిస్తోంది. ఆ ప్రాంతంలో సీపీఈసీ పురోగతి దేశ సార్వభౌమత్వానికీ, ప్రాదేశిక సమగ్రతకూ తీవ్ర ఉల్లంఘన అనేది మన స్పష్టమైన వైఖరి.

ఆది నుంచి ఎస్సీఓ కొంత చైనా లక్షణాలను పుణికిపుచ్చుకున్నదే. అలా చూస్తే 2017 నుంచి పాకిస్తాన్‌తో పాటు ఈ సంఘంలో పూర్తిస్థాయి సభ్యత్వం పొందిన భారత్ ఇందులో విజాతీయ సభ్యదేశం. అదే ఏడాది ఇటు అమెరికా, జపాన్, ఆస్ట్రేలియాలతో కూడిన పునరుద్ధరించిన 'క్వాడ్'లోనూ భారత్ సభ్యత్వం పొందింది. వర్తమాన భౌగోళిక రాజకీయాల రీత్యా వివిధ అంతర్జాతీయ వేదికలను సమర్థంగా వినియోగించుకోవాలని భారత్ సంకల్పం. తాజా ఎస్సీఓ భేటీలోనూ సహకార, భాగస్వామ్యాలు వీలున్న అంశాల్లో మాటామంతీ ముందుకు తీసుకెళ్ళాలని ప్రయత్నించింది. ఇది ప్రశంసనీయమే. సీమాంతర తీవ్రవాదం, ప్రాంతీయ సుస్థిరత, సభ్యదేశాల మధ్య మెరుగైన సహకారం తదితర కీలక అంశాలపై ఈ సదస్సు దృష్టి పెట్టింది. చైనా, పాకిస్తాన్‌లతో కలసి భారత్ వేదిక పంచుకోవడమనేది అరుదైన ఘటన గనక అందరి చూపూ ఇటు పడింది.

భారత, పాకిస్తాన్‌లు మాటామంతీ సాగించడానికీ, పరస్పర సహకారానికి గల మార్గాలను పరిశీలించడానికీ ఈ సదస్సు సదవకాశం. కానీ, ఇరుదేశాల మధ్య పాతుకుపోయిన అవిశ్వాసమే ఈ శిఖరాగ్ర సదస్సులో మళ్ళీ బయటపడింది. తీవ్రవాదానికి అండగా నిలిచినంత కాలం పాక్‌తో చర్చలు పునరుద్ధరించేది లేదన్నదే భారత వైఖరి. అలాగే, వాస్తవాధీన రేఖ (ఎల్ఏసీ) వెంట యథాపూర్వ స్థితి రావాలని కోరుతున్న భారత్, చైనాతో సాధారణ సంబంధాలను పునరుద్ధరించడానికి ఆ మాట మీదే పట్టుబడుతోంది. ఇలాంటి పరిస్థితుల్లోనూ సభ్యదేశాల మధ్య సహకరానికి ఢిల్లీ అయిదు అంశాల్ని గుర్తించింది. అవి... అంకుర సంస్థలు–నవకల్పన, సాంప్రదాయిక వైద్యం, యువతరం సాధికారికత, అందరికీ డిజిటల్ అవకాశాలు, ఉమ్మడి బౌద్ధ వారసత్వం. ఇవి అస్పష్టమే అయినప్పటికీ, వైరుద్ధ్యాల మధ్యా తమకు సామ్యాలున్నట్టు చెప్పడానికి ఉపకరిస్తాయి.

నిజానికి, సెప్టెంబర్‌లో భారత్‌లో జరిగే జీ–20 భేటీలో ఏకాభిప్రాయ ఉమ్మడి ప్రకటనకు చైనా, రష్యాల నుంచి చిక్కులు లేకుండా చూసుకొనేందుకు తాజా ఎస్సీఓను ముందస్తు ట్రయల్‌గా భారత్ వాడుకొని ఉండవచ్చు. కానీ, ఐరాస భద్రతామండలిలో భారత ప్రయత్నాలకు చైనా అడ్డుపడుతున్న వేళ తీవ్రవాదంపై బలంగా స్వరం వినిపిస్తూ చైనా, పాక్‌లపై పరోక్షంగా బాణం గురిపెట్టింది. అయితే, అదే సమయంలో తీవ్రవాద, వేర్పాటువాద సంస్థల 'ఉమ్మడి జాబితా' రూపకల్పనను చైనా ఆధిపత్య ఎస్సీఓ లక్ష్యంగా పెట్టుకొనేలా చేయగలిగింది. భద్రతామండలి ఇప్పటికే ఈ పని చేస్తున్నందున ఈ రెండో జాబితా ఎందుకు, దాని వల్ల ఉపయోగమేమిటన్నది చెప్పలేం.

ఇంగ్లీషును లాంఛనప్రాయంగా ఎస్సీఓ భాషగా చేయడంపై ఎస్సీఓ దేశాల మధ్య ఒప్పందం కుదరలేదు. ఇక, త్రివిక్రమావతారం దాల్చి చైనా మొత్తం ఆక్రమిస్తుందనే శంకతో ఆర్థిక సహకారంపై నిర్ణీత ప్రణాళికకు భారత్ సై అనలేదు. వెరసి, మిశ్రమ ఫలితాలతోనే ఎస్సీఓ భారత అధ్యక్ష హయాం ముగిసిపోయింది. మునుపటి లాభాలు తగ్గిపోతున్నా, పరస్పర భిన్నాభిప్రాయాలు ఎన్ని ఉన్నా సరే... మధ్య ఆసియా ప్రాంతంతో మాటామంతీకీ, అలాగే తాలిబన్ల హయాంలోని అఫ్ఘనిస్తాన్ నుంచి భద్రత కారణాల రీత్యా ఎస్సీఓలో క్రియాశీలంగా కాలు కదపడమే భారత్ ముందున్న మార్గం. ముగిసిన ఎస్సీఓ శిఖరాగ్ర సదస్సు అందులో ఓ భాగమని సంతృప్తిపడాలి.

రామోజీ..మొసలి కన్నీళ్లొద్దు

చంద్రబాబు కోసం ఎస్సీ, ఎస్టీలపై అబద్ధాల రాతలు
టీడీపీ ప్రభుత్వంలోనే వారిపై ఎక్కువగా దాడులు

చంద్రబాబుకు మేలు చేయడానికి రామోజీరావు ఏ అవతారం ఎత్తడానికైనా వెనుకాడరు. తాజాగా మొసలి అవతారం ఎత్తారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీల భద్రత, హక్కుల గురించి 'ఇదేనా భరోసా' అంటూ కన్నీరు కారుస్తున్నారు. మంచి చేస్తున్న ఈ ప్రభుత్వంపై వ్యతిరేకత పెంచి, చంద్రబాబును మరోసారి అధికార పీఠంపై కూర్చోబెట్టేందుకు దళితులు, గిరిజనులను మాయ చేద్దామని తన రాతల ద్వారా మొసలి కన్నీరు ప్రవహింపజేస్తున్నారు. మీ అబద్ధాల కట్టు కథలు నమ్మడానికి ఇవి వైస్రాయ్ హోటల్ కుట్ర నాటి రోజులు కావు రామోజీ! వాస్తవాలు ప్రజల కళ్ల ముందు కనిపిస్తున్నాయి. చంద్రబాబు ప్రభుత్వంలో తమపై యథేచ్ఛగా జరిగిన దాడులు, వేధింపులను ఇంకా ఎస్సీ, ఎస్టీలు మరచిపోలేదు. పోలీసు స్టేషన్లకు వెళ్లినా న్యాయం దక్కక వెనుదిరిగిన చీకటి రోజులు వారికి గుర్తున్నాయి. అందుకు పూర్తి విరుద్ధంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సంపూర్ణంగా లభిస్తున్న భద్రత, భరోసా వారికి గుండె ధైర్యాన్నిస్తున్నాయి. ప్రభుత్వ పథకాల్లో, ఉపాధి అవకాశాల్లో లభిస్తున్న సింహభాగం వాటా వారి అభ్యున్నతికి రాచబాట వేస్తోంది.

సాక్షి, అమరావతి : వేధింపులకు గురైన ఎస్సీ, ఎస్టీలకు సత్వర న్యాయం అందించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తోంది. బాధితులు, ఆ కేసుల్లో సాక్షులు న్యాయస్థానాల్లో కేసుల విచారణ కోసం హాజరయ్యేందుకు వారికి చట్టప్రకారం చెల్లించాల్సిన టీఏ, డీఏలను సంబంధిత జిల్లా కలెక్టర్ల ద్వారా ఎప్పటికప్పుడు చెల్లిస్తోంది. ఆ నిధులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చెరిసగం చెల్లిస్తాయి. 2021–22 కుగాను కేంద్ర ప్రభుత్వం అడ్‌హాక్‌గా రూ.9.2 కోట్లు చెల్లిస్తే.. రాష్ట్ర ప్రభుత్వం మానిటరీ రిలీఫ్ కింద రూ.54.72 కోట్లు ఖర్చు చేసింది. తద్వారా ఎస్సీ, ఎస్టీల పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధిని తెలియజేస్తోంది. ఆయా కేసులకు సంబంధించి బాధితులు, సాక్షుల జాబితాలను కలెక్టర్లు రూపొందిస్తారు. కేసుల ఆధారంగా ఈ జాబితాల్లో మార్పులు చేర్పులు చోటుచేసుకుంటాయి. బాధితులు, వారిపై ఆధారపడ్డవారు, సాక్షులకు ప్రభుత్వం పారదర్శకంగా టీఏ, డీఏలను చెల్లిస్తోంది. ఈ కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్లు న్యాయస్థానాల్లో హాజరవుతున్నారు. కేసుల తీవ్రత, అవసరాలు, బాధితుల కోరిక మేరకు తగిన రీతిలో న్యాయ సహాయం అందిస్తున్నారు. బాధితులకు న్యాయం జరిగేలా కేసుల విచారణలో అత్యంత సమర్థవంతంగా తమ పాత్ర పోషిస్తున్నారు. బాధితులు, సాక్షులకు తగిన భద్రత కల్పిస్తుండంతోపాటు ఎవరి ప్రలోభాలకు గురికాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వారి హక్కుల పరిరక్షణకు కంటింజెన్సీ ప్రణాళికను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోంది. ఎస్సీ, ఎస్టీలు వేధింపుల కేసు నమోదైన 60 రోజుల్లోనే చార్జిషీట్లు దాఖలు చేస్తున్నారు. తద్వారా దోషులకు సత్వరం కఠిన శిక్షలు పడేలా ప్రభుత్వం సమర్థంగా పర్యవేక్షిస్తోంది.


భరోసా ఇంతేనా?

వేధింపులు అప్పుడే ఎక్కువ

- టీడీపీ ప్రభుత్వ హయాంలో కంటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో ఎస్సీ,ఎస్టీలపై వేధింపుల కేసులు తగ్గాయి. 2016 నుంచి 2018 వరకు 7,216 ఎస్సీ, ఎస్టీ వేధింపుల కేసులు నమోదయ్యాయి. కాగా 2019 నుంచి 2021 వరకు ఆ కేసులు 7,046కు తగ్గడం గమనార్హం.
- ఎస్సీ, ఎస్టీలపై వేధింపులకు పాల్పడే వారికి సత్వర శిక్షలు పడేలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. టీడీపీ ప్రభుత్వంలో కంటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఎస్సీ, ఎస్టీ కేసుల్లో శిక్షల రేటు ఎక్కువగా ఉండటమే అందుకు నిదర్శనం. చంద్రబాబు ప్రభుత్వంలో 2016 నుంచి 2018 వరకు శిక్షల రేటు 4.71 గా ఉంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 2019 నుంచి 2021 వరకు శిక్షల రేటు 7.28కు పెరిగింది.
- చంద్రబాబు ప్రభుత్వ హయాంలో సకాలంలో చార్జిషీట్లు దాఖలు చేసేవారు కాదు. దాంతో దోషులు కేసుల నుంచి సులువుగా తప్పించుకునేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సత్వరం చార్జిషీట్లు దాఖలు చేయడంపై దృష్టి సారించి సత్ఫలితాలను సాధిస్తోంది. టీడీపీ ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ వేధింపుల కేసుల్లో చార్జిషీట్ దాఖలు చేయడానికి 2016లో 287 రోజులు, 2017లో 275 రోజులు, 2018లో 228 రోజులు పట్టాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో చార్జిషీట్లను సత్వరం దాఖలు చేస్తున్నారు. 2021లో కేవలం 64 రోజుల్లోనే చార్జిషీట్లు దాఖలు చేయడం విశేషం.
- 2014 నుంచి ఇప్పటి వరకు మొత్తం 23,569 కేసులు నమోదయ్యాయి. వాటిలో ప్రస్తుతం కేవలం 1,428 కేసులు మాత్రమే దర్యాప్తు దశలో ఉన్నాయి. అంటే కేవలం 4శాతం లోపు కేసులు మాత్రమే దర్యాప్తు దశలో ఉండటం.. 96 శాతం కేసుల్లో దర్యాప్తు ముగిసింది.

భారీగా పెరిగిన ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు

రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో అంటే 2014 నుంచి 2019 వరకు ఎస్సీల సంక్షేమం కోసం రూ.33,625.49 కోట్లు, ఎస్టీల సంక్షేమం కోసం ఖర్చు చేసింది రూ.12,487.48 కోట్లు మాత్రమే. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎస్సీ, ఎస్టీల సంక్షేమం కోసం నిధులను వెచ్చించడం భారీగా పెరిగింది. 2019 నుంచి 2023 ఫిబ్రవరి 28 వరకు కేవలం 40 నెలల్లోనే ఎస్సీల సంక్షేమం కోసం రూ.51,217.91 కోట్లు ఖర్చు చేసింది. ఎస్టీల కోసం రూ.15,995.82 కోట్లు వెచ్చించింది. ఇంకా మరో 20 నెలల్లో చేసిన వ్యయాన్ని పరిగణలోకి తీసుకోవాల్సి ఉంది. దీన్నిబట్టి ఎస్సీ, ఎస్టీల పట్ల ఎవరి చిత్తశుద్ధి ఏమిటన్నది స్పష్టమవుతోంది.

టీడీపీ ప్రభుత్వ హయాంలో...

	2016	2017	2018
కేసుల నమోదు	2,740	2,583	2,500
దర్యాప్తు పూర్తయిన కేసులు	2,036	2,542	2,440
దర్యాప్తునకు సగటు రోజులు	287	275	228

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో...

	2019	2020	2021
కేసుల నమోదు	2,751	2,375	2,710
దర్యాప్తు పూర్తయిన కేసులు	2,604	2,133	2,430
దర్యాప్తునకు సగటు రోజులు	232	137	64

సంక్షేమ పథకాల్లోనూ పెద్దపీట

ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ఇళ్ల పట్టాలు, ఉపాధి పథకాల వారీగా చూసినా సరే టీడీపీ ప్రభుత్వంలో కంటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీల కోసం భారీగా నిధులు వెచ్చించింది.

పింఛన్లు	టీడీపీ ప్రభుత్వంలో	వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో
ఎస్సీ లబ్ధిదారులు	8,66,835	11,79,020
ఎస్సీలకు పింఛన్ల పంపిణీ	రూ.4,415.04 కోట్లు	రూ.12,430.01 కోట్లు
ఎస్టీ లబ్ధిదారులు	3,01,242	3,82,062
ఎస్టీలకు పింఛన్ల పంపిణీ	రూ.1,373.9కోట్లు	రూ.3,820.62 కోట్లు

డీబీటీ పథకాలు	టీడీపీ ప్రభుత్వంలో	వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో
ఎస్సీ లబ్ధిదారులు	21,43,853	1,24,83,889
పొందిన ప్రయోజనం	రూ.8,844 కోట్లు	రూ.35,703.92 కోట్లు
ఎస్టీ లబ్ధిదారులు	9,17,488	37,69,363
పొందిన ప్రయోజనం	రూ.2,611.3 కోట్లు	రూ.10,764.38 కోట్లు

స్వయం ఉపాధి పథకాలు	టీడీపీ ప్రభుత్వంలో	వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో
ఎస్సీ లబ్ధిదారులు	2,02,414	23,17,558
పొందిన ప్రయోజనం	రూ.2,726 కోట్లు	రూ.7,075.29 కోట్లు
ఎస్టీ లబ్ధిదారులు	39,906	4,72,018
పొందిన ప్రయోజనం	రూ.284.8 కోట్లు	రూ.1,391.82 కోట్లు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇళ్ల స్థలాల పంపిణీ

కేటగిరీ	ఎస్సీలు	ఎస్టీలు
ఇళ్ల స్థలాలు పొందిన లబ్ధిదారులు	6,36,732	1,41,496
పంపిణీ చేసిన ఇళ్ల స్థలాల విలువ	రూ.15,918 కోట్లు	రూ.3,537.4 కోట్లు
ఇళ్లు మంజూరు అయిన లబ్ధిదారులు	4,18,646	79,359
మంజూరైన ఇళ్ల విలువ	రూ.10,949 కోట్లు	రూ.1,989.26కోట్లు
ఆర్ఓఎఫ్ఆర్ పట్టాల లబ్ధిదారులు	-	1,27,245
ఆర్ఓఎఫ్ఆర్ పట్టాల పంపిణీ విస్తీర్ణం	-	2,82,832 ఎకరాలు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఉద్యోగ అవకాశాలు

కేటగిరీ	ఎస్సీలు	ఎస్టీలు
గ్రామ, వార్డు సచివాలయాల్లో	28,267	10,651
మొత్తం ఉద్యోగుల్లో శాతం	23 శాతం	9 శాతం
వలంటీర్లు	69,528	16,847
మొత్తం ఉద్యోగుల్లో శాతం	27 శాతం	8 శాతం
బ్యాక్ లాగ్ పోస్టులు	301	302

నిర్మాణం బాగుంటేనే సరా?

అభిప్రాయం


అవిజిత్ పాఠక్

ఒక విస్మయం గొలిపే దాన్ని చూసినప్పుడు దాని ప్రభావానికి లోనవ్వడం ఎప్పుడూ సులువే. అందుకే సామాజిక – ఆర్థిక అంతరాలు పెచ్చు మీరినా మన దేశంలో నూతన పార్లమెంట్ భవనం ఆవిష్కరణను చాలామంది ఆసక్తిగా వీక్షించారు. అత్యంత నాటకీయంగా మత సంబంధ ప్రతీకలతో ఈ భవన ఆవిష్కరణ నాటకం సాగింది. ఈ ఘట్టాన్ని నరేంద్ర మోదీ పట్టాభిషేకం అన్నా తప్పులేదు. అయితే ఈ భ్రమాత్మక రాజకీయాలను దాటుకుని చూడగలిగే వాళ్లు కీలకమైన ప్రశ్నలు సంధించాల్సి ఉంది. వీరు ఈ వ్యక్తిపూజ వైఖరి ప్రజాస్వామ్య స్ఫూర్తిని ఏమాత్రం ఇనుమడింపజేసేది కాదన్న అత్యంత విస్పష్టమైన సత్యాన్ని ప్రజలకు వివరించాలి. అంతేకాదు ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నుకున్న ప్రధానిని దేశానికి 'ఆపద్బాంధవుడు' అన్న రీతిలో చూపడం ప్రమాదకరం కూడా. ఆ మాటకొస్తే పార్లమెంట్ భవనం ఓ ఆర్కిటెక్చర్ అద్భుతం కావచ్చు. అలాగని 'ప్రభుత్వాధినేత' తాలూకూ గర్వానికి అది కారణం కారాదు.

పార్లమెంటున్నది చర్చలు, వాదోపవాదాల కోసమే. ఇతరుల మాటలు వినడం, వినమ్రంగా వ్యవహరించడం, పూర్తి సమాచారంతో తమ అభిప్రాయాలను వ్యక్తం చేయడం, నిర్ణయాలు బాధ్యతాయుతంగా తీసుకోవడం, నైతిక బాధ్యతలను నిర్వహించడం, ప్రజలకు నిబద్ధులై ఉండటం... ఇవీ ప్రజాస్వామ్య లక్షణాలు. కాబట్టి మనకు ఒక కొత్త పార్లమెంట్ భవనం ఉన్నంతమాత్రాన ప్రజాస్వామ్య విలువలన్నీ పునరుద్ధరింపబడినట్లు కాదు.

కులం, మతం వంటి వాటిని రాజకీయాల కోసం వాడుకునే సంకుచితత్వం, నేరచరితులు నేతలుగా ఎన్నికవడం, ఘర్షణలు, సరిహద్దుల్లో ఉద్రిక్తతలు, సర్జికల్ స్ట్రైక్స్‌ను ధీరోదాత్తతతో కూడిన మాస్టర్ స్ట్రోక్స్‌గా అభివర్ణిస్తూండటం... అది కూడా ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా సాగుతూండటం ఈ సందర్భంగా గమనార్హం.

ఎన్నికల కమిషన్, సీబీఐ వంటి సంస్థల విశ్వసనీయత రోజులతో పాటే కరిగిపోతోంది. రాజకీయ ప్రమేయాలతో నియామకాలు జరుగుతూండడంతో ఈ వ్యవస్థల స్వాతంత్ర్యమూ కుంచించుకుపోతోంది. ప్రభుత్వాలను అస్థిర పరిచేందుకు పార్టీ ఫిరాయింపులే ఆచరణీయమైన వ్యూహాలుగా మారిపోతున్నాయి. అంతరాత్మ లేని, అంగట్లో వస్తువుల చందంగా అమ్ముడు పోయేందుకు సిద్ధంగా ఉన్న ఎమ్మెల్యేలు, ఎంపీలు అన్నిచోట్ల కనిపిస్తున్నారిప్పుడు. ఈ ధోరణులన్నీ సర్వసాధారణమైపోతున్న ఈ తరుణంలో మనం ఎన్నికలతో కూడిన ఏకవ్యక్తి పాలనవైపు



అడుగులేస్తున్నామంటే కాదనడం సాధ్యమేనా?

కొత్తగా కట్టిన పార్లమెంట్ భవనం భవ్యమైందే. కానీ సమస్య దాని భవ్యత్వంలో లేదు. ఆ భవనం భౌతిక గోడలను దాటుకుని అసలైన ప్రజాస్వామ్య సంస్కృతిని అలవర్చుకోవడం సాధ్యమేనా అన్నది ప్రశ్నించుకోవాలి. అర్థవంతమైన విద్య, సోషలిజం, అన్నివర్గాల వారికీ చోటు కల్పించే రాజకీయాలు, ప్రజా ప్రతినిధులు బాధ్యతగా వ్యవహరించడం వీలవుతుందా? దేశంలో రాజకీయపరమైన ప్రజాస్వామ్యం పరిఢ విల్లడానికి ప్రజాస్వామ్యయుతమైన విద్య అవసరం. కొంచెం సింపుల్‌గా చెప్పుకోవాలంటే... నిర్దిష్ట నైపుణ్యాలను నిత్యం పెంపొందిస్తూండటం. ఈ నైపుణ్యా లేమిటంటారా? ఆధిపత్యం, తిరోగమన సిద్ధాంతాలను నిశితంగా విశ్లేషించగల, విచారించగల సామర్థ్యం! సత్యమనే ప్రకాశాన్ని అధికారమనే కృత్రిమ ధగధగల నుంచి వేరుగా చూడగల మేధోపరమైన స్పష్టత! స్పష్టమైన అవగాహనతో చర్చ చేయడం, సంవాదంతో ఘర్షణలకు పరిష్కారాలు కనుక్కోవడం. పూర్తి అవగాహన కలిగి ఉన్న పౌరులుగా ఉండేందుకు నిత్యం ప్రయత్నం చేయడం. ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. ఇలా కాకుండా ఇప్పుడున్న తీరుగానే నియో లిబరలిజమ్ ప్రవచనాలు కొనసాగితే... అవి మనల్ని స్వార్థపరమైన వినియోగదారులుగా మార్చేస్తాయి. మతోన్మాదం, ఛాందసవాదం/మితిమీరిన జాతీయవాదం మన ఆలోచనలను ఆక్రమించేస్తే ప్రజాస్వామ్యయుతమైన విద్యను పెంపొందించడం దాదాపు అసాధ్యం.

ఈ నేపథ్యంలో చూస్తే ఉదారవాదం, రాజకీయ చైతన్యం ప్రస్ఫుటంగా ఉన్న విశ్వవిద్యాలయాలపై దాడులు పెరిగిపోవడం ఆశ్చర్యమేమీ కలిగించదు. విద్యా సంస్థలు, విద్యా కేంద్రాల మార్కెటీకరణ జరుగుతున్న నేపథ్యంలో విమర్శనాత్మకమైన విద్యాబోధన కూడా తక్కువవుతోంది. ఇప్పుడున్న వ్యూహకర్తల ఏకైక లక్ష్యం... యువ విద్యార్థులకు 'మంచి ప్లేస్‌మెంట్', 'మంచి ప్యాకేజీ' ఆశ చూపడం మాత్రమే అనిపిస్తుంది. ఫలితంగా ఏర్పడ్డ మేధో శూన్యత పెత్తందారీ పద్ధతులు పెరిగిపోయేందుకు కారణమవుతోంది.

మీరు, నేను అన్ని రకాల టెక్నికల్ నైపుణ్యాలనూ అందిపుచ్చుకోవచ్చు. అన్ని రకాల పరీక్షలూ పాసై పోవచ్చు. మన సీవీలను డిగ్రీ, డిప్లొమాలతో అలంకరించుకోవచ్చు. అయితే స్వాతిశయ లక్షణాలున్న వాక్చాతురులను ఆరాధిస్తూనే... ఆదివాసీలు, దళితులు, మైనార్టీల హక్కుల కోసం పోరాడుతున్న వారిపట్ల కొంత గౌరవమూ చూపవచ్చు. అలాగే ఓ భారీ విగ్రహం, లేదా ఓ భవ్యమైన దేవాలయం, దూసుకెళ్లే రైలు, స్మార్ట్ సిటీలే అభివృద్ధని చంకలు గుద్దుకోనూ వచ్చు. బహుశా కొత్త పార్లమెంట్ భవనం కూడా ఈ కోవలోకే చేరుతుందేమో. పెత్తందారులకు ఇంతకంటే కావాల్సిన విషయం ఇంకోటి ఉండదు కూడా!

వ్యాసకర్త సోషియాలజిస్ట్

తన అభిమానులనైనా గెలిపించాలి

అభిప్రాయం


పురిఘళ్ల రఘురామ్

పవన్ కల్యాణ్ రాజకీయాల్లోకి వచ్చి 15 ఏళ్లు, రాజకీయ పార్టీ పెట్టి 10 ఏళ్లవుతోంది. ప్రజాస్వామ్యంలో పార్టీలు ఎంత ముఖ్యమో... ఆయా పార్టీలు ఒక సిద్ధాంతం ప్రకారం పనిచేయడం, ఒక లక్ష్యం కోసం పని చేయడం కూడా అంతే ముఖ్యం. పదేళ్ల పాటు రాజకీయ పార్టీని నడపడం అంటే మాటలు కాదు. ఈ విషయంలో ఆయన్ని మెచ్చుకోవచ్చు. అయితే, తన పార్టీకి ఇంత వరకూ క్షేత్రస్థాయిలో యంత్రాంగాన్ని నిర్మించుకోలేక పోవడం వైఫల్యం అనే చెప్పాలి. సరైన సిద్ధాంతం, లక్ష్యాలు, ఆచరణాత్మక విధానాలు లేకపోవడం వల్లనే జనసేన పార్టీ ఇప్పటికీ ఎన్నికలపరంగా సరైన గుర్తింపు దక్కించుకోలేక పోయింది. అలాగని రాజకీయ పార్టీలకు ఎన్నికల్లో గెలుపు మాత్రమే గీటురాయి కాదు. బీజేపీ సైతం ఒకప్పుడు రెండు ఎంపీ స్థానాల్లో మాత్రమే గెలుపొందింది. కానీ, సిద్ధాంతం, లక్ష్యాలు, విధానాల విషయంలో మాత్రం చాలా స్పష్టమైన నిర్ణయాలు తీసుకోగలిగింది. అలా నిర్ణయాలు తీసుకోగలిగే నాయకత్వాన్ని పార్టీ పెంచుకుంది.

పవన్ కల్యాణ్ అతిపెద్ద అభిమానగణం ఉన్న నటుడు. ఆ అభిమానుల వల్లనే చాలా సంవత్సరాల పాటు ఒక్క హిట్ సినిమా లేక పోయినా ఆయన సినీ కెరీర్ ఏమాత్రం ఇబ్బందులు లేకుండా కొనసాగింది. రాజకీయాల్లో సైతం ఆయన గెలవలేకపోయినా, ఆయన పార్టీ గణనీయమైన విజయాలు సాధించకపోయినా కూడా తన ప్రస్థానాన్ని కొనసాగించగలుగుతున్నారు. దీనివల్ల ఆయన ఒక్కడు మాత్రమే ఇబ్బంది పడటం లేదు. రాజకీయాల్లో ఆయన్ను గత పది, పదిహేనేళ్లుగా ఫాలో అవుతున్న అభిమానులు కూడా ఇబ్బందులు పడుతున్నారన్న సంగతిని ఆయన గ్రహించాలి. పోనీ ఇన్నేళ్ల తర్వాత అయినా వారు కోరుకున్నది జరుగుతోందా? జనసేన పార్టీ అధికారంలోకి వచ్చే అవకాశం కనుచూపుమేరలో అయినా ఉందా?

జనసేన పార్టీని స్థాపించిన కొత్తల్లో పవన్ చేసిన ప్రసంగాలకూ, ఇప్పుడు చేస్తున్న వ్యాఖ్యలకూ పొంతనలేదు. కులాలను కలిపేస్తామని ఆయన తన పార్టీ సిద్ధాంతంగా ప్రకటించారు. కానీ, కమ్మ, రెడ్డి కులాలకు మాత్రమే అధికారం కట్టబెట్టొద్దని, తనకూ ఒక చాన్స్ ఇవ్వాలని అడుగుతూ అదే కుల రాజకీయాన్ని చేస్తున్నారు. 'కాపులు నాకు ఓట్లేయలేదు' అంటూ గోదావరి జిల్లాల్లో ఆయన చేస్తున్న ప్రసంగాలకు అర్థం



ఏంటి? ఈసారి ఎన్నికల్లో పోటీ చేయడానికి పవన్ కల్యాణ్ ఏ ప్రాతిపదికన నియోజకవర్గాన్ని ఎంచుకుంటారు? కాపు ఓట్లు తక్కువగా ఉన్న నియోజకవర్గం నుంచి ఆయన పోటీ చేయగలరా?

ఐదేళ్లపాటు చంద్రబాబు నాయుడిని మోసిన పవన్ కల్యాణ్ 2019లో సడెన్‌గా రూటు మార్చారు. చంద్రబాబును విశ్వసించలేమనీ, ఆయన దారుణంగా మోసం చేస్తారనీ ప్రకటించారు. కనీసం పంచాయితీ ఎన్నికల్లో కూడా పోటీ చేయని లోకేష్ పంచాయితీరాజ్ శాఖ మంత్రి అయ్యారని ఎద్దేవా చేశారు. లోకేష్ అవినీతి చిట్టా మొత్తం ప్రధాని నరేంద్ర మోదీ దగ్గర ఉందనీ, అందుకే మోదీ అంటే చంద్రబాబుకు భయమనీ ఆరోపించారు. అయినా చంద్రబాబుతో పొత్తు కోసం చర్చలు జరుపుతున్నారు. కలసి పోటీ చేస్తామనీ, అవసరమైతే తాను త్యాగాలు చేస్తాననీ చెప్పారు. మళ్లీ ఇప్పుడు ఒంటరిగా అయినా పోటీ చేస్తామని సంకేతాలు ఇస్తున్నారు.

బీజేపీ విషయంలో సైతం పవన్ మాట మార్చారు. 2014లో నరేంద్ర మోదీకి, బీజేపీకి మద్దతు పలికిన ఆయన 2019 నాటికి బీజేపీపై యుద్ధం ప్రకటించారు. 'పాచిపోయిన లడ్డూలు ఇచ్చారు' అంటూ అపహాస్యం చేశారు. ఉత్తరాది పెత్తనం అంటూ రెచ్చగొట్టారు. అయినా మళ్లీ బీజేపీతో చెలిమి చేశారు. రోడ్ మ్యాప్ ఇవ్వాలంటూ ఒత్తిడి చేశారు. అయితే, ఏ సందర్భంలోనూ బీజేపీ అధిష్ఠానం ఆయనను నిందించలేదు. అమిత్ షా వంటి అగ్రనాయకులతో జరిపిన సంభాషణల్ని సైతం ఆయన బయట పెట్టారు. అప్పుడు కూడా బీజేపీ అధిష్ఠానం ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేయలేదు.

ముఖ్యమంత్రి పదవి విషయంలో కూడా పవన్ కాలానికో మాట మాట్లాడుతుంటారు. నేను సీఎం కావాలనుకోవట్లేదు అంటారు.. మళ్లీ నేను సీఎం అవ్వడానికి సిద్ధంగా ఉన్నాను అంటారు. ఆ మాట అభిమానుల కోసం అన్నానే తప్ప నిజం కాదు అని దాన్ని మార్చేస్తారు. ఇలా మాటల్లో స్పష్టత, చేతల్లో నిలకడ లేని రాజకీయాల కారణంగానే ఆయన ఇన్నేళ్లయినా జనసేనను ముందుకు తీసుకెళ్లలేక పోతున్నారు.

ఇకనైనా పవన్ కల్యాణ్ తన గెలుపుకోసం కాకుండా తనను నమ్ముకున్న వారిని ఎంతో కాలం ఓడించకుండా గెలిపించడానికి నడుం బిగించాలి.

వ్యాసకర్త బీజేపీ సీనియర్ నాయకులు

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం, **తిథి:** బ.చవితి ఉ.8.10 వరకు, తదుపరి పంచమి, **నక్షత్రం:** ధనిష్ఠ ఉ.5.09 వరకు, తదుపరి శతభిషం తె.4.02 వరకు (తెల్లవారితే శనివారం), **వర్జ్యం:** ప.12.20 నుండి 1.52 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.11 నుండి 9.03 వరకు, తదుపరి ప. 12.31 నుండి 1.23 వరకు, **అమృతఘడియలు:** రా.9.17 నుండి 10.45 వరకు; **రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు, **సూర్యోదయం:** 5.34, **సూర్యాస్తమయం:** 6.35.

క్లుప్తంగా...

ఉప్పాడ హార్బర్ నిర్మాణాన్ని అడ్డుకుంటాం

- మాజీ ఎమ్మెల్యే వర్మ, మాజీ మంత్రి కొల్లు రవీంద్ర

కొత్తపల్లి: ఉప్పాడ హార్బర్ నిర్మాణ పనులను అడ్డుకుంటామని మాజీ ఎమ్మెల్యే వర్మ, మాజీ మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు. దీనిపై హైకోర్టుకు వెళ్లి పనులను నిలుపుదల చేస్తామన్నారు. భవిష్యత్తుకు గ్యారంటీ బస్సు యాత్ర కార్యక్రమంలో భాగంగా గురువారం కాకినాడ జిల్లా అమినాబాదు తీరప్రాంతంలో మేజర్ హార్బర్‌ను, కోతకు గురవుతున్న ఉప్పాడ తీరప్రాంతాన్ని వీరు పరిశీలించారు. రవీంద్ర మాట్లాడుతూ హార్బర్, జట్టీల నిర్మాణాలన్నీ అధికశాతం కేంద్ర ప్రభుత్వ నిధులతోనే జరుగుతున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం నిధులని ప్రభుత్వం గొప్పలు చెబుతుందన్నారు. కాంట్రాక్టర్‌తో పిఠాపురం ఎమ్మెల్యే దొరబాబు, ఎంపీ గీత కుమ్మక్కై హార్బర్‌ను నాసిరకంగా నిర్మిస్తున్నారని ఆరోపించారు. అందుకే పనులను అడ్డుకుంటామని హెచ్చరించారు. టీడీపీ నేతలు యనమల కృష్ణుడు, మండల పార్టీ అధ్యక్షుడు అనిశెట్టి సత్యానందరెడ్డి, పలువురు మత్స్యకార నాయకులు పాల్గొన్నారు.

'డయల్ యువర్ టీటీడీ ఈవో' వాయిదా

తిరుమల: తిరుమల శ్రీవారి భక్తుల సమస్యలపై 7న (శుక్రవారం) నిర్వహించాల్సిన డయల్ యువర్ ఈవో కార్యక్రమాన్ని పరిపాలన కారణాల వల్ల వాయిదా వేసినట్లు టీటీడీ అధికారులు తెలిపారు. తదుపరి తేదీని తిరిగి తెలియజేస్తామని పేర్కొన్నారు.

ట్రిపుల్ ఐటీలో రెండో రోజూ సర్టిఫికెట్ల పరిశీలన

నూజివీడు: రాష్ట్రంలోని నాలుగు ట్రిపుల్ ఐటీల్లో 2023–24 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ల ప్రక్రియలో భాగంగా ప్రత్యేక కేటగిరీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన రెండో రోజు గురువారం కూడా కొనసాగింది. ఉదయం 9 నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు నిర్వహించిన ఈ ప్రక్రియలో దివ్యాంగుల కోటాలో 204 మంది, స్పోర్ట్స్ కోటాలో 150 మంది, ఎన్‌సీసీ కేటగిరీలో 312 మంది, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కేటగిరీలో 165 మంది విద్యార్థులు సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరైనట్లు అడ్మిషన్ల కన్వీనర్ ఆచార్య గోపాలరాజు తెలిపారు. అందరి సర్టిఫికెట్లను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారని పేర్కొన్నారు. దివ్యాంగుల కోటాకు సంబంధించిన అభ్యర్థులను విజయవాడ ప్రభుత్వాస్పత్రి నుంచి వచ్చిన వైద్యులు కె.సుధాకర్, రత్నబాబు, ఈఎస్ఎస్‌మూర్తి, ఎస్ఎస్ అజయ్‌కుమార్ పరీక్షించారని తెలిపారు.

8న ఏయూలో వైఎస్సార్ కాంస్య విగ్రహావిష్కరణ


ఏయూలో ఏర్పాటు చేయనున్న వైఎస్సార్ కాంస్య విగ్రహం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయలో ఈనెల 8న దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి కాంస్య విగ్రహాన్ని టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ఆవిష్కరించనున్నారు. వైఎస్సార్ మరణం అనంతరం 2009 సెప్టెంబర్ 19న ఏయూలో ఫైబర్‌తో చేసిన విగ్రహాన్ని తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. వర్సిటీ ఉద్యోగులు, పరిశోధకులు, విద్యార్థుల విజ్ఞప్తి మేరకు దాతల సహాయంతో ఇప్పుడు వైఎస్సార్ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారు.

తెలంగాణ

ఐఏఎస్ అధికారి నవీన్ మిట్టల్‌కు రూ.10 వేల జరిమానా

- కోర్టు ధిక్కరణ కేసులో హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: కోర్టు ధిక్కరణ కేసులో సీనియర్ ఐఏఎస్ అధికారి నవీన్ మిట్టల్‌కు హైకోర్టు రూ.10 వేల జరిమానా విధించింది. గతంలో కళాశాల విద్యాకమిషనర్‌గా ఉన్న సమయంలో కోర్టు ఇచ్చిన ఆదేశాలను పాటించకపోవడంతో ఈ మేరకు ఆదేశించింది. కళాశాల విద్యా రీజినల్ జాయింట్ డైరెక్టర్ యాదగిరికి కూడా రూ.10 వేల జరిమానా విధించింది. జరిమానా చెల్లించకుంటే నెల రోజులు జైలుశిక్ష అనుభవించాల్సి ఉంటుందని వ్యాఖ్యానించింది. కల్వకుర్తి గవర్నమెంట్ మోడల్ డిగ్రీ కాలేజీలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్‌రావు కోవిడ్ సమయంలో ఉద్యోగానికి రాలేదని సర్వీసు నుంచి తొలగిస్తూ మిట్టల్ అప్పట్లో ఆదేశాలు జారీచేశారు. దీనిపై శ్రీనివాస్ కోర్టును ఆశ్రయించగా, ఆ ఆదేశాలను కొట్టేసింది. శ్రీనివాస్‌రావును సర్వీసులోకి తీసుకోవాలని, తర్వాత చట్టబద్ధంగా మళ్లీ నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. అయితే శ్రీనివాస్‌రావును సర్వీసులోకి తీసుకోకుండానే మళ్లీ అతడిని తొలగిస్తూ రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఆదేశాలు జారీచేశారు. దీంతో శ్రీనివాసరావు కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ మాధవీదేవి విచారణ చేపట్టారు. వాదనలు విన్న ధర్మాసనం అధికారులిద్దరికీ జరిమానా విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

పీఎం కిసాన్‌కు ఈ-కేవైసీ తప్పనిసరి

ఈ నెలాఖరులోగా పెండింగ్‌లో ఉన్న 6.47 లక్షల రికార్డులకు ఈ-కేవైసీ పూర్తిచేయండి

- 14వ విడత పీఎం కిసాన్‌కు ఈ-కేవైసీ తప్పనిసరి చేసిన కేంద్రం
- ఈ-కేవైసీ పూర్తిచేయడానికి మూడు పద్ధతులు
- ఆధార్ లింక్ అయిన మొబైల్ ఓటీపీ లేదా బయోమెట్రిక్
- వృద్ధుల కోసం మొబైల్ యాప్
- కలెక్టర్లకు సీఎస్ జవహర్‌రెడ్డి ఆదేశాలు



సాక్షి, అమరావతి: ప్రతి విడతకు ఈ-కేవైసీ ఉంటేనే పీఎం కిసాన్ పథకం కింద రైతులకు నిధులు జమచేస్తామని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేస్తోంది. 14వ విడత పీఎం కిసాన్ పథకానికి రైతుల బ్యాంకు ఖాతాలకు ఈ-కేవైసీ ప్రామాణీకరణ తప్పనిసరని రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ఈ నెలాఖరులోగా రైతుల బ్యాంకు ఖాతాలకు ఈ-కేవైసీ ప్రామాణీకరణను పూర్తిచేయాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) కె.ఎస్.జవహర్‌రెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. వివిధ పథకాలు, కార్యక్రమాల అమలు పురోగతిపై ఆయన గురువారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ-కేవైసీ ప్రామాణీకరణ ఉద్దేశం వారి వాస్తవికతను ధ్రువీకరించుకోవడమేనని కేంద్ర ప్రభుత్వం పేర్కొన్న నేపథ్యంలో అర్హులైన లబ్ధిదారుల ఈ-కేవైసీ ప్రామాణీకరణను ఈ నెలాఖరులోగా పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ-కేవైసీ పూర్తిచేయడానికి మూడు పద్ధతులకు కేంద్రం అనుమతించినట్లు తెలిపారు. ఆధార్ లింక్ అయిన మొబైల్ ఓటీపీ లేదా బయోమెట్రిక్ ద్వారా ఈ-కేవైసీ పూర్తిచేయాలని సూచించారు. వృద్ధుల కోసం ప్రత్యేకంగా ఫేస్ అథెంటికేషన్ మొబైల్ యాప్ ద్వారా ఈ-కేవైసీ పూర్తిచేయాలని చెప్పారు. ఇప్పటికే ఫేస్ అథెంటికేషన్ మొబైల్ యాప్ ద్వారా 45,636 మంది ఈ-కేవైసీ పూర్తిచేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 39,48,002 రికార్డులకు ఈ-కేవైసీ పూర్తిచేశారని, ఇంకా 6,47,068 రికార్డులు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. వాటన్నింటిని ఈ నెలాఖరులోగా పూర్తిచేయాలని ఆయన ఆదేశించారు.

జిల్లాల వారీగా ఈ-కేవైసీ పెండింగ్ రికార్డుల వివరాలు

జిల్లా	ఈ-కేవైసీ పెండింగ్ రికార్డుల సంఖ్య
శ్రీకాకుళం	54,833
శ్రీ సత్యసాయి	48,194
ప్రకాశం	44,707
విజయనగరం	42,877
అనంతపురం	38,119
అనకాపల్లి	33,918
ఎస్‌పీఎస్‌ఆర్ నెల్లూరు	30,527
పల్నాడు	28,208
డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ కోనసీమ	26,699
నంద్యాల	25,188
కర్నూలు	24,523
అల్లూరి సీతారామరాజు	23,340
ఏలూరు	22,686
అన్నమయ్య	21,745
కృష్ణా	21,448
పార్వతీపురం మన్యం	21,425
కాకినాడ	20,720
పశ్చిమగోదావరి	19,490
తూర్పుగోదావరి	15,803
ఎన్టీఆర్	15,373
బాపట్ల	14,231
వైఎస్సార్	12,817
గుంటూరు	12,718
తిరుపతి	12,099
చిత్తూరు	11,388
విశాఖపట్నం	3,983

కేంద్రీయ గిరిజన యూనివర్సిటీకి భూమి అప్పగింత

- వర్సిటీ ఏర్పాటుకు లైన్‌క్లియర్: వీసీ ప్రొఫెసర్ కట్టిమణి


భూమి అప్పగింత పత్రాన్ని అందుకుంటున్న యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ టీవీ కట్టిమణి

విజయనగరం అర్బన్: విజయనగరం జిల్లాలో కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం నిర్మాణానికి సేకరించిన 519 ఎకరాల భూమిని యూనివర్సిటీ అధికారులకు జిల్లా రెవెన్యూ యంత్రాంగం అప్పగించింది. వర్సిటీలో గురువారం జరిగిన కార్యక్రమంలో భూమి పత్రాలను జిల్లా ప్రత్యేక ఉపకలెక్టర్ బి.సుదర్శనదొర, మెంటాడ, దత్తిరాజేరు మండలాల తహసీల్దార్లు రామకృష్ణ, గురుమూర్తి వర్సిటీ వీసీ ప్రొఫెసర్ టీవీ కట్టిమణికి అందజేశారు. వీసీ మాట్లాడుతూ భూమి అప్పగింతతో యూనివర్సిటీ అభివృద్ధికి బీజం పడినట్లయిందన్నారు. ఉత్తరాంధ్ర ప్రజల కలలను సాకారం చేసేందుకు, గిరిజనుల విద్యాభివృద్ధి కోసం వర్సిటీ దోహదపడుతుందని ఆకాంక్షించారు. వర్సిటీకి సంబంధించిన తరగతులు 2019 నుంచి విజయనగరం జిల్లా కేంద్రంలోని తాత్కాలిక భవనాల్లో నిర్వహిస్తున్నామన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, కలెక్టర్ నాగమణి, రెవెన్యూ యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలిపారు.

మరణించి.. మరికొందరిలో మళ్లీ బతికాడు!

- రోడ్డు ప్రమాదంలో యువకుడి బ్రెయిన్‌డెడ్
- తమ బిడ్డ అవయవాలను దానం చేసిన తల్లిదండ్రులు
- అవయవాలను పలు ఆస్పత్రులకు తరలింపు


మాతా లక్ష్మీనారాయణ (ఫైల్)

కాకినాడ రూరల్: అవయవదానం ద్వారా ఆ యువకుడు సజీవంగా నిలిచాడు. రోడ్డు ప్రమాదంలో బ్రెయిన్‌డెడ్ కాగా, ఆస్పత్రిలో చికిత్సపొందుతూ ప్రాణాలతో పోరాడి చివరకు తనువు చాలించాడు. ఆ యువకుడి తల్లిదండ్రులు తమ బిడ్డ అవయవాలను దానం చేసేందుకు ముందుకొచ్చారు. కాకినాడ జిల్లా జగ్గంపేటకు చెందిన మాతా లక్ష్మీనారాయణ (19) శనివారం జగ్గంపేట–పెద్దాపురం రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే అంబులెన్స్‌లో కాకినాడ సర్పవరం జంక్షన్ వద్ద ట్రస్ట్ ఆస్పత్రిలో చేర్పగా.. బ్రెయిన్‌డెడ్ అయిన స్థితిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. తండ్రి వీరభద్రరావు లారీ డ్రైవర్. తల్లి వెంకటసత్యవతి గృహిణి. అందివచ్చిన కొడుకు ఇలా మృతి చెందడంతో అవయవాలు దానం చేసేందుకు సిద్ధమయ్యారు. వారి విజ్ఞప్తి మేరకు ట్రస్ట్ ఆస్పత్రి వైద్యులు గురువారం మధ్యాహ్నం యువకుడి కళ్లు, కిడ్నీ, లివర్, ఊపిరితిత్తులను సేకరించారు. వీటిలో ఊపిరితిత్తులను గ్రీన్ చానల్ ద్వారా సాయంత్రం 5 గంటలకు రాజమహేంద్రవరం మధురపూడి ఎయిర్‌పోర్టుకు తరలించారు. అక్కడి నుంచి సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రికి పంపారు. లివర్‌ను వైజాగ్ కిమ్స్ ఐకాన్‌కు, రెండు కిడ్నీలలో ఒకటి ట్రస్ట్ ఆస్పత్రిలోని రోగికి, మరోటి వైజాగ్ కేర్ ఆస్పత్రికి తరలించారు. రెండు కళ్లను స్థానికంగా ఉన్న ఐబ్యాంక్‌కు అందించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ కల్యాణ్‌కృష్ణ, డైరెక్టర్ రామకృష్ణలు మీడియాతో మాట్లాడారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ సహకారంతో గ్రీన్ చానల్ ద్వారా రాజమహేంద్రవరం మధురపూడి ఎయిర్‌పోర్టుకు, విశాఖపట్నానికి అవయవాలను తరలించినట్టు తెలిపారు. అవయవాలను దానం చేసిన యువకుడి తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలిపారు.

పెత్తందారుల కుట్రలను తిప్పికొట్టి.. ఇళ్లు నిర్మించుకుంటాం

- 1,012వ రోజు రిలే దీక్షలో బహుజన నేతలు


జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బహుజన నాయకులు

తాడికొండ: పెత్తందారుల కుట్రలను తిప్పికొట్టి రాజధానిలో ఇళ్ల నిర్మాణం చేసి తీరతామని బహుజన పరిరక్షణ సమితి నాయకులు ధీమా వ్యక్తం చేశారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,012వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో గురువారం పలువురు మాట్లాడారు. పెత్తందారుల కాళ్ల కింద చేరి బహుజనుల హక్కులను అడ్డుకుంటున్న దళిత దళారులు, బాబు వద్ద ప్యాకేజీలు తీసుకుని కులవాదులకు అనుకూలంగా చేస్తున్న తప్పుడు వ్యవహారాలకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిందే తడవు రాష్ట్రంలో 30 లక్షలకు పైగా ఇళ్ల స్థలాలు ఉచితంగా అందించి.. అందులో పక్కా ఇళ్లు నిర్మిస్తున్నారని తెలిపారు. సీబీడీ కేసుల్లో నిందితులుగా ఉండి విచారణకు హాజరు కాకుండా తిరుగుతున్న రామోజీ అండ్‌కోను విచారిస్తే దోషులెవరో తేలుతుందని చెప్పారు. బహుజనులకు సంక్షేమం, అభివృద్ధి అందకుండా పదే పదే తప్పుడు కేసులతో అడ్డుకుంటున్న బాబు అండ్ కో 2024 ఎన్నికల్లో భారీ మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతిని పురస్కరించుకుని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నాయకులు పులి దాసు, పల్లె బాబు, కారుమూరి పుష్పరాజ్, బొలిమేర శ్యామ్యూల్, మాదిగాని గురునాథం, ఈపూరి ఆదాం, బేతపూడి సాంబయ్య, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య సమాచారం అత్యంత కీలకం

- కేంద్ర ఆరోగ్య, కుటుంబ మంత్రిత్వ శాఖ డీడీజీ అంజలి రావత్


ప్రసంగిస్తున్న అంజలి రావత్

ఏయూక్యాంపస్: ప్రజారోగ్య సమాచారం వివిధ కేంద్ర మంత్రిత్వ శాఖలకు అత్యంత కీలకమని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ స్టాటస్టిక్స్ విభాగం డిప్యూటీ డైరెక్టర్ జనరల్ అంజలి రావత్ అన్నారు. ఆంధ్రా యూనివర్సిటీ జనాభా పరిశోధన కేంద్రం(పీఆర్‌సీ), కేంద్ర ఆరోగ్య, కుటుంబ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యాన ఏయూలో నిర్వహిస్తున్న సదస్సును గురువారం ఆమె ప్రారంభించారు. అంజలి రావత్ మాట్లాడుతూ సమాచార సేకరణ, నిర్వహణ పటిష్టంగా చేపట్టాల్సిన అవసరాన్ని వివరించారు. గ్రామస్థాయిలో ప్రజల సమగ్ర సమాచారం నేడు ఎంతో కీలకంగా మారిందన్నారు. విభిన్న మంత్రిత్వ శాఖలు హెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్‌లో సిస్టమ్స్‌లో పొందుపరిచిన సమాచారాన్ని ఉపయోగించుకుంటున్నాయని తెలిపారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ మాట్లాడుతూ ఆరోగ్య భారతావనితోనే సంపన్న భారత్ సాధ్యమవుతుందన్నారు. ఏయూ పీఆర్‌సీ సెంటర్ సంచాలకులు ఆచార్య బి.మునిస్వామి, కేంద్ర ఆరోగ్య, కుటుంబ మంత్రిత్వ శాఖ సంచాలకులు(స్టాటస్టిక్స్) కుమార్ సుందరం, సహాయ సంచాలకులు ప్రీతి తివారి, ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు ప్రసంగించారు. ఈ సదస్సులో పది రాష్ట్రాలకు చెందిన వైద్య, ఆరోగ్యశాఖ సమాచార నిర్వహణ అధికారులు, 18 పీఆర్‌సీ కేంద్రాల అధికారులు పాల్గొన్నారు.

పరిపాలనాదక్షుడు జగ్జీవన్‌రామ్

- అణగారినవర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి మార్గదర్శకం
- బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించిన వైఎస్సార్‌సీపీ నేతలు


మాట్లాడుతున్న ఎంపీ నందిగం సురేష్

సాక్షి, అమరావతి: అణగారినవర్గాల ప్రజల అభ్యున్నతికి మాజీ ఉపప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ చేసిన కృషి అందరికీ మార్గదర్శకమని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ నందిగం సురేష్ చెప్పారు. జగ్జీవన్‌రామ్ వర్ధంతి కార్యక్రమాన్ని గురువారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నందిగం సురేష్, ఎమ్మెల్సీలు జూపూడి ప్రభాకర్, డొక్కా మాణిక్యవరప్రసాద్, లేళ్ళ అప్పిరెడ్డి, మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకరావుమాదిగ, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎంపీ నందిగం సురేష్ మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ ఆశయాలు సాధించేదిశగా సీఎం వైఎస్ జగన్ పరిపాలన చేస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలతో పేదరిక నిర్మూలనకు కృషిచేస్తున్న సీఎం వైఎస్ జగన్.. విద్య, వైద్యరంగాల్లో విప్లవాత్మక సంస్కరణల ద్వారా పేదలకు దన్నుగా నిలుస్తున్నారని చెప్పారు. అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ ఆశయ సాధన కోసం పనిచేస్తున్న వైఎస్ జగన్‌ను మళ్లీ సీఎంగా చేయడానికి అందరూ అండగా నిలవాలని కోరారు. జూపూడి ప్రభాకర్ మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ తాను స్వీకరించిన పదవులకు వన్నెతెచ్చారని, మంచి పరిపాలనాదక్షుడిగా పేరుపొందారని చెప్పారు. డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని ఎందరికో స్ఫూర్తిని ఇచ్చిన బాబూ జగ్జీవన్‌రామ్.. హరితవిప్లవం తెచ్చిన స్వామినాథన్‌ను గుర్తించి ప్రోత్సహించారన్నారు. రాష్ట్ర మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ హైదరాబాద్‌లో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

డ్రగ్స్ బారి నుంచి యువత, మహిళలకు విముక్తి

నషా ముక్త్ భారత్ అభియాన్ కింద 3.12 కోట్ల మంది యువతకు విముక్తి

- అలాగే 2.06 కోట్ల మంది మహిళలకు కూడా..
- దేశంలో 372 జిల్లాల్లో కమ్యూనిటీ ఔట్‌రీచ్ నిర్వహణ
- యువత డ్రగ్స్ బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు
- డ్రగ్స్ అక్రమ రవాణా, వినియోగదారులపై కేసులు
- గత మూడేళ్లలో 1.30 లక్షల మంది అరెస్టు
- కేంద్ర హోం మంత్రిత్వ శాఖ వెల్లడి

సాక్షి, అమరావతి: దేశంలో మాదకద్రవ్యాల బారి నుంచి యువత, మహిళలను విముక్తి చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలను అమలు చేస్తున్నాయని కేంద్ర హోం శాఖ తాజాగా పేర్కొంది. జాతీయ స్థాయిలో నషా ముక్త్ భారత్ అభియాన్ కింద మాదకద్రవ్యాల వినియోగం నుంచి యువత, మహిళలను దూరం చేయడానికి తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయని వెల్లడించింది. నషా ముక్త్ భారత్ అభియాన్ కింద దేశంలో అత్యధికంగా మాదకద్రవ్యాలు వినియోగించే 372 జిల్లాల్లో 8 వేల మంది యువ వలంటీర్ల ద్వారా పెద్ద ఎత్తున కమ్యూనిటీ ఔట్‌రీచ్ కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపింది. తద్వారా 3.12 కోట్ల మంది యువతను మాదకద్రవ్యాల వినియోగం నుంచి దూరం చేసినట్లు వెల్లడించింది. అలాగే 2.06 కోట్ల మంది మహిళలకు కూడా విముక్తి కల్పించినట్టు పేర్కొంది. ఇందుకు కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తున్నట్లు తెలిపింది. మాదకద్రవ్యాలకు బానిసలైన వారి కోసం 340 సమీకృత పునరావాస కేంద్రాలను కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తోందని వివరించింది. చికిత్స అందించడమే కాకుండా కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు కేంద్ర హోం శాఖ వెల్లడించింది. డీటాక్సిఫికేషన్, డీఅడిక్షన్ తర్వాత సామాజిక ప్రధాన స్రవంతిలోకి తీసుకువస్తున్నట్లు పేర్కొంది.

డీఅడిక్షన్ కోసం హెల్ప్‌లైన్

మహిళలు, పిల్లల కోసం ప్రత్యేక డీఅడిక్షన్ కేంద్రాలకు కేంద్ర ప్రభుత్వం సహాయం అందిస్తోందని కేంద్ర హోం శాఖ వెల్లడించింది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో 46 డ్రగ్స్ చికిత్సలను అందిస్తున్నట్టు తెలిపింది. అలాగే ప్రాథమిక కౌన్సెలింగ్, తక్షణ సహాయం అందించడానికి డీఅడిక్షన్ కోసం టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ 14446 ఏర్పాటు చేసినట్టు పేర్కొంది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ డిఫెన్స్‌తో పాటు రాష్ట్ర విద్యా శిక్షణ, పరిశోధన సంస్థలు, కేంద్రీయ విద్యాలయాల ద్వారా క్రమం తప్పకుండా మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలు, హానిపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపింది. అలాగే విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు సెన్సిటైజేషన్ సెషన్‌లు నిర్వహిస్తున్నట్లు వెల్లడించింది. గత మూడేళ్లలో డ్రగ్స్ వినియోగిస్తున్న వారిపై 1,24,891 కేసులను నమోదు చేయడంతో పాటు 1,30,458 మందిని అరెస్టు చేసినట్లు కేంద్ర హోం శాఖ తెలిపింది. 18 ఏళ్లలోపు డ్రగ్స్ వినియోగిస్తూ అరెస్టు అయిన వారి గణాంకాలను పరిశీలిస్తే.. పురుషుల కన్నా మహిళలే ఎక్కువగా ఉన్నట్లు బాంబుపేల్చింది. గత మూడేళ్లలో 18 ఏళ్లలోపు డ్రగ్స్ వినియోగిస్తున్న 935 మంది పురుషులు అరెస్టు కాగా అదే సమయంలో 9,077 మంది మహిళలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని పేర్కొంది. 2018 సర్వే ప్రకారం .. దేశంలో 10 నుంచి 17 ఏళ్లలోపు 86 లక్షల మంది పిల్లలు మాదకద్రవ్యాలు వినియోగిస్తున్నట్లు తేలిందని వెల్లడించింది. అలాగే దేశంలో 10 నుంచి 75 ఏళ్ల వయసు ఉన్న 52.59 లక్షల మంది మహిళలు మాదకద్రవ్యాలు వినియోగిస్తున్నట్లు తేలిందని తెలిపింది.

వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల పనితీరు భేష్

- కేంద్ర, మహారాష్ట్ర అధికారుల బృందాల ప్రశంస


విన్నకోట వైఎస్సార్ హెల్త్ క్లినిక్ సిబ్బందితో కేంద్ర ప్రతినిధుల బృందం

గుడివాడరూరల్ (గుడ్లవల్లేరు)/లబ్బీపేట (విజయవాడ తూర్పు): గ్రామాల్లోని ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ల పనితీరు అద్భుతంగా ఉందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అధికారుల బృందం, మహారాష్ట్ర ప్రభుత్వ అధికారుల బృందం ప్రశంసించాయి. కృష్ణాజిల్లా గుడివాడ మండలంలోని విన్నకోట గ్రామంలోని వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ను కేంద్ర ప్రభుత్వ ప్రతినిధుల బృందం గురువారం సందర్శించింది. ఈ బృందం ప్రతినిధులు డాక్టర్ జి.గీతాబాయ్, డాక్టర్ సీహెచ్‌వో కృష్ణ, గురుచరణ్, సంతోష్‌కుమార్, రాజ్‌కిరణ్ విన్నకోటలోని వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లో అందిస్తున్న సేవల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులకు అందిస్తున్న సేవలను పరిశీలించారు. అనంతరం గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. పిల్లలతోపాటు గర్భిణులు, బాలింతలకు రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యవంతమైన పౌష్టికాహారాన్ని అందించడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలో ప్రతి గ్రామానికి విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా ఉచితంగా వైద్యం అందించడం హర్షణీయమన్నారు. ఇతర రాష్ట్రాలు ఈ కార్యక్రమాన్ని ఆదర్శంగా తీసుకుని నిర్వహించాలన్నారు.

గొల్లపూడి–2 హెల్త్ క్లినిక్‌ను పరిశీలించిన మహారాష్ట్ర బృందం

మహారాష్ట్ర ప్రభుత్వ అధికారుల బృందం గురువారం ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం గొల్లపూడి–2 వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ను పరిశీలించింది. హెల్త్ క్లినిక్‌లో అందిస్తున్న వైద్య సేవల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకుంది. అనంతరం హెచ్‌బీ కాలనీలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించింది. ఇక్కడి ఆస్పత్రుల్లో వైద్య సేవలు అందుతున్న తీరు చాలా బాగుందని సంతృప్తి వ్యక్తంచేసింది. ఆ బృందం వెంట జాతీయ ఆరోగ్య మిషన్ రాష్ట్ర అధికారి డాక్టర్ రమాదేవి, సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ నరసింహనాయక్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ఇందుమతి, 'ఫ్యామిలీ డాక్టర్' నోడల్ ఆఫీసర్ డాక్టర్ మోతీబాబు, డీపీఎంవో డాక్టర్ నవీన్, కేఎల్ లిడియా ఉన్నారు.

అమెజాన్‌లో ఏటికొప్పాక బొమ్మలు

- రంగులు అద్దడంలో మహిళలకు ప్రత్యేక శిక్షణ



యలమంచిలి (అనకాపల్లి జిల్లా): అమెజాన్‌లో ఏటికొప్పాక లక్కబొమ్మల అమ్మకాలు జరిగే విధంగా ప్రోత్సహిస్తున్నట్లు అనకాపల్లి జిల్లా జాయింట్ కలెక్టర్ (జేసీ) ఎం.జాహ్నవి చెప్పారు. గురువారం యలమంచిలి మండలం ఏటికొప్పాకలో ట్రెయినీ కలెక్టర్ ధాత్రిరెడ్డితో కలిసి ఆమె పర్యటించారు. లక్కబొమ్మల తయారీ విధానాన్ని పరిశీలించి వాటి మార్కెట్ వివరాలను తెలుసుకున్నారు. జేసీ మాట్లాడుతూ..ఏటికొప్పాక లక్కబొమ్మలకు ఆన్‌లైన్ ద్వారా అంతర్జాతీయ స్థాయిలో మార్కెట్ లభించేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని చెప్పారు. ఏటికొప్పాక లక్కబొమ్మలకు ఎంతో ప్రత్యేకత ఉందని, అంకుడుకర్రతో తయారు చేసి సహజసిద్ధ రంగులు అద్ది రసాయనాలు వాడకుండా బొమ్మలు తయారు చేయడం ఎంతో హర్షించతగిన విషయమన్నారు. అమెజాన్‌తో అనుసంధానం ద్వారా వివిధ రకాల బొమ్మలు ఆన్‌లైన్‌లో అమ్మకాలు జరిగేలా ఇక్కడ కళాకారులకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తుందన్నారు. బొమ్మలకు ఆకర్షణీయమైన రంగులు అద్దడంలో మహిళలకు ప్రత్యేక శిక్షణ కేంద్రం ఏర్పాటు చేసి మెళకువలు నేర్పిస్తామని, వారికి బొమ్మలకు రంగులు అద్దే రెండు మిషన్లను అందిస్తున్నామని చెప్పారు.

• తెలంగాణ

ఇటుకాలపల్లి ఇళ్ల దహనం కేసులో 11 మంది అరెస్ట్

కాజీపేట: ఇటుకాలపల్లిలో ఇళ్లకు నిప్పు పెట్టి దహనం చేసిన కేసులో గ్రామ సర్పంచ్ సహా 11 మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వరంగల్ ఈస్ట్ జోన్ డీసీపీ కరుణాకర్ తెలిపారు. గురువారం సాయంత్రం ఆయన విలేకరుల సమావేశంలో ఈ వివరాలను వెల్లడించారు. వరంగల్ జిల్లా నర్సంపేట మండలం ఇటుకాలపల్లి సర్పంచ్ మండల రవీందర్ కూతురు కావ్య, అదే గ్రామానికి చెందిన జాలిగం రంజిత్ అనే యువకుడు ఇటీవల ప్రేమ పెళ్లి చేసుకున్నారు. వీరికి కొందరు స్నేహితులు సహకరించారు. దీంతో ఆగ్రహించిన అమ్మాయి బంధువులు ప్రేమపెళ్లికి సహకరించిన ముగ్గురు మిత్రుల ఇళ్లతోపాటు రంజిత్ ఇంటిపై బుధవారం దాడికి పాల్పడి నిప్పు పెట్టిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. సర్పంచ్ మండల రవీందర్‌తోపాటు మొత్తం 11 మందిని అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి ఐదు ద్విచక్ర వాహనాలు, పది సెల్‌ఫోన్లు, రెండు గొడ్డళ్లు, మూడు వేటకొడవళ్లు, కర్రలు, డీజిల్ డబ్బాలను స్వాధీనం చేసుకున్నారు.

క్లుప్తంగా...

19న అఖిలపక్ష సమావేశం

న్యూఢిల్లీ: పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఈ నెల 20వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 19న అఖిలపక్ష సమావేశం నిర్వహించనున్నట్లు కేంద్ర ప్రభుత్వం గురువారం వెల్లడించింది. పార్లమెంట్ సమావేశాల ప్రారంభానికి ముందు అఖిలపక్ష భేటీ నిర్వహించడం సంప్రదాయంగా వస్తోంది. వర్షాకాల సమావేశాల కోసం అధికార, విపక్షాలు తమ వ్యూహాలు, అస్త్రాలతో సన్నద్ధమవుతున్నాయి.

మణిపూర్‌పై చర్చకు నిరాకరణ..

న్యూఢిల్లీ: మణిపూర్‌లో పరిస్థితులపై చర్చించాలన్న తమ డిమాండ్‌ను కమిటీ చీఫ్ నిరాకరించడంతో హోం వ్యవహారాల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశం నుంచి ప్రతిపక్ష సభ్యులు వాకౌట్ చేశారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడుల్లో జైళ్ల సంస్కరణల చర్చించేందుకు ఈ కమిటీ గురువారం భేటీ అయింది. మణిపూర్‌లో పరిస్థితులను నిర్లక్ష్యం చేయజాలమంటూ టీఎంసీ సభ్యుడు డెరెక్ ఒబ్రియాన్, కాంగ్రెస్‌కు చెందిన దిగ్విజయ్ సింగ్, ప్రదీప్ భట్టాచార్య కమిటీ చీఫ్ బ్రిజ్‌లాల్‌కు ఒక ఉమ్మడి లేఖ అందజేశారు.

దుండగుల కాల్పుల్లో మహిళ మృతి

ఇంఫాల్: మణిపూర్‌లో మరోసారి హింసాత్మక ఘటన చోటుచేసుకుంది. గురువారం గుర్తు తెలియని దుండగులు జరిపిన కాల్పుల్లో ఒక మహిళ ప్రాణాలు కోల్పోయింది. పశ్చిమ ఇంఫాల్ జిల్లా లంఫెల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని క్వాకీథెల్ మయయి కోయిబిలోని ఓ స్కూల్ వెలుపల ఈ ఘటన చోటుచేసుకుంది. మృతురాలు స్థానికంగా ఉండే మానసిక వికలాంగురాలని సమాచారం. ఈ ఘటనపై ఇండిజినస్ ట్రైబల్ లీడర్స్ ఫోరం(ఐటీఎల్ఎఫ్) స్పందించింది. రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేసింది. అదేవిధంగా, కంగ్‌పోక్పి జిల్లా ఫయిలెంగ్ గ్రామంలో తుపాకీ కాల్పులు చోటుచేసుకున్నాయి.


లీవు లేకుండా 74 ఏళ్లుగా ఉద్యోగం..!

వాషింగ్టన్: అమెరికాకు చెందిన ఓ మహిళ ఉద్యోగానికి ఒక్క రోజు కూడా సెలవు పెట్టకుండా ఏకంగా 74 ఏళ్లపాటు విధులకు హాజరయ్యారు. మెల్బా మెబానె 16 ఏళ్ల వయసులో 1949లో టైలర్ అనే స్టోర్‌లో ఉద్యోగంలో చేరారు. 1956లో ఆ సంస్థను డిలార్డ్ సొంతం చేసుకుంది. లిఫ్ట్ ఆపరేటర్‌గా జాయినయి దుస్తులు, కాస్మటిక్ విభాగంలో 74 ఏళ్లపాటు పనిచేశారు. 90 ఏళ్ల వయసులో ఇటీవలే రిటైరయ్యారు. ఇప్పుడిక మంచి ఆహారం తీసుకుంటూ, ప్రయాణాలు చేస్తూ విశ్రాంతి తీసుకోవాలనుకుంటున్నానని అన్నారు.

మన డేటా ఎంత భద్రం?

మనమున్న సైబర్ ప్రపంచంలో అడుగడుగునా ప్రమాదాలు పొంచి ఉన్నాయి. పౌరుల వ్యక్తిగత గోప్యత ప్రశ్నార్థకంగా మారింది. ఒక యాప్ డౌన్ లోడ్ చేసుకున్నా చాలు మన వ్యక్తిగత సమాచారం బజార్లో పడినట్టే. మెటా, ట్విట్టర్, గూగుల్ వంటి దిగ్గజ సంస్థలతో పాటు ఈ- కామర్స్ సైట్లు పౌరుల వ్యక్తిగత డేటాతో ఆటాడుకుంటున్నాయి. వీటి దూకుడుకు కళ్లెం వేయడానికే ఇప్పుడీ ముసాయిదా బిల్లును కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చింది.

"డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ బిల్లు-2022"ను (డీపీడీపీ) వచ్చే పార్లమెంటు సమావేశాల్లో ప్రవేశపెట్టనున్నారు. ఈ డిజిటల్ ప్రపంచంలో పౌరుల వ్యక్తిగత సమాచారం గోప్యతకు అత్యంత ప్రాధాన్యం ఏర్పడింది. గత ఆరేళ్లుగా మేధోమథనం సాగించిన కేంద్రం ప్రభుత్వం ఎట్టకేలకు ముసాయిదా బిల్లును రూపొందించింది. గతేడాది నవంబర్‌లో ప్రజలు, సామాజిక సంస్థల అభిప్రాయం కోసం వెలువరించిన ముసాయిదా బిల్లులో అంశాలే ఇంచుమించుగా ఇందులో ఉన్నాయి. అయితే విదేశీ సంస్థలు సమాచార సేకరణలో కొన్ని ఆంక్షల్ని విధించారు.



బిల్లులో ఏముందంటే ?

డీపీడీపీ బిల్లును ఇంకా పార్లమెంటులో ప్రవేశపెట్టాల్సి ఉండడంతో దీని వివరాలను కేంద్రం అత్యంత గోప్యంగా ఉంచింది. అయితే కొన్ని జాతీయ మీడియా కథనాల ప్రకారం నిపుణులు ఆందోళన వ్యక్తం చేసిన కొన్ని వివాదాస్పద అంశాలు అలాగే ఉన్నట్టు తెలుస్తోంది. కేంద్ర ప్రభుత్వం, దాని అనుబంధ సంస్థలకు విస్తృతమైన మినహాయింపులు ఇవ్వడం, డేటా ప్రొటెక్షన్ బోర్డు పాత్రను గణనీయంగా తగ్గించడం వంటివి ఉన్నట్టు ఆ కథనాలు పేర్కొన్నాయి. ఇక ప్రభుత్వాధికారులు, ఇతర నాయకులకు సంబంధించిన డేటా కూడా ఈ చట్టం కింద గోప్యంగా ఉంచడం వల్ల సమాచార హక్కు చట్టాన్ని నిర్వీర్యం చేస్తుందనే ఆందోళనలున్నాయి. ఇంకా బిల్లులో ఉన్న అంశాలివే..

- ఆన్‌లైన్ లేదంటే ఆఫ్‌లైన్ ద్వారా సమాచారం సేకరించి డిజిటలైజ్ చేసే పౌరుల వ్యక్తిగత సమాచారాన్ని పూర్తిగా వారి సమ్మతితో సేకరించాలి. దానిని భద్రంగా ఉంచాల్సిన బాధ్యత ఆ సంస్థలదే. తమ పని పూర్తి కాగానే ఆ సమాచారాన్ని తొలగించాలి.
- మన దేశంలో డిజిటల్ పర్సనల్ డేటాను సేకరించి ప్రాసెస్ చేయవచ్చు. అదే విదేశాల్లో వస్తు, సేవల వినియోగంలో మాత్రం డేటాను సేకరించే అవకాశం ఉంటుంది.
- వివిధ సామాజిక మాధ్యమాలు, ఈ కామర్స్ సంస్థలు, మొబైల్ యాప్స్ జవాబుదారీ తనం పెరిగేలా సేకరించిన సమాచారాన్ని ఎలా భద్రపరుస్తున్నారు, ఏ రకంగా సేకరిస్తున్నారు ? పౌరుల సమాచారాన్ని ఏ రకంగా ఉపయోగిస్తున్నారు ? వంటి ప్రశ్నలకు ఆయా సంస్థలు సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది
- ఏదైనా సమాచారం చుట్టూ వివాదం చెలరేగితే కేంద్రం ఏర్పాటు చేయనున్న డేటా ప్రొటెక్షన్ బోర్డు ఆఫ్ ఇండియా వాటిని పరిష్కరిస్తుంది. ఈ బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్‌ను కేంద్రమే నియమిస్తుంది.
- పౌరుల వ్యక్తిగత సమాచారం ఉల్లంఘన జరిగితే సదరు కంపెనీలకు అత్యధికంగా రూ.250 కోట్ల జరిమానా విధించవచ్చు.
- ప్రైవేటు, ప్రభుత్వ సంస్థలకు వేర్వేరు విధివిధానాలున్నాయి. జాతి భద్రతకు సంబంధించిన అంశాల్లో సమాచార సేకరణపై మినహాయింపులున్నాయి.
- పౌరులు తమ డేటాను వాడుకున్నారని భావిస్తే నష్టపరిహారం కోసం కోర్టుకి ఎక్కొచ్చు. చిన్నారుల వ్యక్తిగత డేటాను సేకరించాల్సి వచ్చినప్పుడు వారి లీగల్ గార్డియన్ అనుమతి తప్పనిసరిగా ఉంటుంది.
- ఈ బిల్లు చట్టరూపం దాలిస్తే యూరోపియన్ యూనియన్ వంటి దేశాలతో వాణిజ్య లావాదేవీల్లో అత్యంత కీలకం కానుంది.

వ్యక్తిగత డేటా పరిరక్షణకు ప్రపంచ దేశాలన్నీ కఠినమైన నిబంధనల్నీ విధిస్తూ ఉంటే మన ప్రభుత్వం 2018 నుంచి ఈ చట్టంపై కసరత్తు చేస్తోంది. వ్యక్తిగత డేటా పరిరక్షణ కోసం ఉద్దేశించిన శ్రీకృష్ణ కమిటీ 2018లో ఒక ముసాయిదా బిల్లు కేంద్రానికి సమర్పించింది. కానీ కేంద్రానికి, దిగ్గజ సామాజిక మాధ్యమ సంస్థలకి మధ్య ఒక అంగీకారం రాలేదు. చివరికి 2019లో ఒక ముసాయిదా బిల్లుని పార్లమెంటులో ప్రవేశపెట్టింది. అయితే ఈ బిల్లులో సమగ్రత లోపించిందని స్వయంగా జస్టిస్ శ్రీకృష్ణ పేర్కొనడం కలకలం రేపింది. డేటా పరిరక్షణ బిల్లు నిబంధనల్ని అతిక్రమించే వారి జాబితా నుంచి ప్రభుత్వం తనని తాను మినహాయించుకోవడంతో దీనిపై తీవ్ర వ్యతిరేకత ఎదురైంది. ఆ బిల్లులో 81 సవరణలు చేయాలంటూ పార్లమెంటరీ స్థాయీ సంఘం సూచించడంతో గత ఏడాది ఆగస్టులో కేంద్ర ప్రభుత్వం ఆ బిల్లును ఉపసంహరించుకుంది.

గతంలో ఏం జరిగింది?

విదేశాల్లో వ్యక్తిగత గోప్యతకు అత్యంత ప్రాధాన్యం

ప్రపంచంలోని 71% దేశాల్లో వ్యక్తిగత సమాచారం భద్రతపై కఠినమైన చట్టాలే ఉన్నాయి. వాణిజ్యం, అభివృద్ధిపై ఐక్యరాజ్య సమితి సదస్సులో తీసుకున్న నిర్ణయానికనుగుణంగా 194 దేశాల్లోని 137 దేశాలు డేటా పరిరక్షణ కోసం చట్టాలు రూపొందించాయి.

ఆఫ్రికా దేశాల్లో 54గాను 33 దేశాల్లో (61%) డేటా చట్టాలు అమల్లో ఉన్నాయి.

ఆసియా దేశాల్లో ఇది ఇంకా తక్కువగా 57% మాత్రమే ఉంది. 60 దేశాలకు గాను 34 దేశాలు చట్టాలను రూపొందించాయి. ఇక వెనుకబడిన దేశాలు 46కి గాను 22 దేశాల్లో మాత్రమే చట్టాలున్నాయి.



అంతర్జాతీయంగా ఈయూ మోడల్, యూఎస్ మోడల్ చట్టాలే అత్యధికంగా ప్రాచుర్యం పొందాయి. ఈయూ మోడల్‌లో వ్యక్తిగత సమాచార సేకరణ నిబంధనలు అత్యంత కఠినంగా ఉంటాయి. పౌరుల డేటా బయటకు వచ్చిందంటే ఆయా సంస్థలకు భారీగా జరిమానాలు విధిస్తాయి. అత్యధిక దేశాలు ఈ మోడల్‌నే అనుసరిస్తున్నాయి. ఇక అమెరికా మోడల్‌లో డేటా భద్రతని వ్యక్తుల స్వేచ్ఛ పరిరక్షణగా చూస్తారు. ప్రభుత్వాలు కూడా వ్యక్తుల పర్సనల్ స్పేస్‌లోకి వెళ్లవు. వ్యక్తుల డేటా అవసరమైన ప్రతీ సారి వారి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది.

సాక్షి, నేషనల్ డెస్క్

14న చంద్రయాన్-3 ప్రయోగం

- పూర్తయిన రాకెట్ అనుసంధానం
- వ్యాబ్ నుంచి ప్రయోగ వేదికకు తరలింపు



సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): కీలకమైన చంద్రయాన్-3 ప్రయోగాన్ని ఈ నెల 14న చేపట్టనున్నట్లు భారత అంతరిక్ష పరిశోధనాసంస్థ (ఇస్రో) గురువారం తెలిపింది. మొదటగా ఈ నెల 12న అని ప్రకటించింది. ఆ తర్వాత 13కు వాయిదా వేసింది. తాజాగా, 14న మధ్యాహ్నం 2.35 గంటలకు ప్రయోగం ఉంటుందని షార్ వర్గాలు ప్రకటించాయి. స్వల్ప సాంకేతిక లోపాలను సరి చేసుకోవడంతో పాటు చంద్రుడు భూమికి దగ్గరగా వచ్చే సమయంలోనే ప్రయోగిస్తారనే వాదన కూడా ఉంది. 2019లో చంద్రయాన్-2ను కూడా జులై 15న ప్రయోగించారు. షార్‌లోని రెండో వెహికల్ అసెంబ్లింగ్ బిల్డింగ్ (వ్యాబ్)లో రాకెట్ అనుసంధానం పూర్తి చేసి గురువారం ఉదయాన్నే వ్యాబ్ నుంచి ప్రయోగవేదికకు అనుసంధానించే ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారు. పీఎస్ఎల్వీ రాకెట్‌ను 4 దశల్లో ప్రయోగిస్తే అదే జీఎస్ఎల్వీ రాకెట్‌ను మాత్రం 3 దశల్లోనే ప్రయోగిస్తారు. పీఎస్ఎల్వీ కంటే జీఎస్ఎల్వీ-మార్క్-2 రాకెట్ కొంచెం బరువు ఎక్కువ, 2 వేల కిలోలు బరువున్న ఉపగ్రహాలు తీసుకెళుతుంది. అదే ఎల్వీఎం మార్క్-3 అత్యంత శక్తివంతమై రాకెట్. ఫ్రెంచి గయానా కౌరు అంతరిక్ష కేంద్రం రూపొందించి ఏరియన్-5 రాకెట్ తరహాలో వుంటుంది. మూడు వేలు కిలోల నుంచి 6 వేలు కిలోల బరువైన ఉపగ్రహాలను సునాయాసంగా రోదసీలోకి తీసుకెళ్లగలుగుతుంది. ఈ రాకెట్‌కు అత్యంత శక్తివంతమైన రెండు స్ట్రాపాన్ బూస్టర్లు వుంటాయి. ఒక్కో స్ట్రాపాన్ బూస్టర్‌లో 200 టన్నుల ఘన ఇంధనం వుంటుంది. మొదటిదశలో రెండు స్ట్రాపాన్ బూస్టర్లలో వున్న 400 టన్నుల ఘన ఇంధనంతో మొదటి దశను పూర్తి చేస్తారు. 110 టన్నుల ద్రవ ఇంధనంతో (ఎల్-110)తో రెండోదశను, 25 టన్నుల క్రయోజనిక్ ఇంధనం (సీ-25)తో మూడోదశతో ప్రయోగాన్ని పూర్తి చేసేలా ఈ రాకెట్‌ను రూపకల్పన చేశారు. ప్రయోగానికి ముందు తుది విడత మిషన్ సంసిద్ధతా సమావేశాన్ని 11న నిర్వహించనున్నారు. అనంతరం ప్రయోగ సమయాన్ని, కౌంట్‌డౌన్ సమయాన్ని అధికారికంగా ప్రకటిస్తారు. ప్రస్తుతానికి ఈనెల 14న ప్రయోగమని తెలిపారు. ఎల్వీఎం3-ఎం4 రాకెట్ ప్రయోగసమయంలో 640 టన్నులు బరువు కలిగి వుంటుంది. 3,900 కిలోలు బరువు కలిగిన చంద్రయాన్-3 ఉపగ్రహాన్ని నింగివైపు మోసుకెళ్లనుంది. చంద్రయాన్-3 ఉపగ్రహంలో 2,148 కిలోలు బరువు కలిగిన ప్రపోల్షన్ మాడ్యూల్, 1,752 కిలోలు బరువు కలిగిన ల్యాండర్, 26 కిలోలు బరువు కలిగిన రోవర్‌లను అమర్చి పంపుతున్నారు. ఈ ప్రయోగానికి సంబంధించి 60 శాతం పనుల వరకు దేశంలోని 120 ప్రయివేట్ పరిశ్రమల సహకారం తీసుకున్నారు.

ట్విట్టర్‌కు కొత్త సవాల్

- 'థ్రెడ్స్'ను తీసుకువచ్చిన ప్రత్యర్థి మెటా
- మొదటి 7 గంటల్లోనే కోటి మంది సబ్‌స్క్రైబర్లు



లండన్: మైక్రోబ్లాగింగ్ యాప్ ట్విట్టర్‌కు కొత్త సవాల్ ఎదురైంది. దాదాపు ట్విట్టర్ లాంటి ఫీచర్లతోనే ప్రత్యర్థి మెటా సంస్థ థ్రెడ్స్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. బుధవారం రాత్రి యాపిల్, గూగుల్ ఆండ్రాయిడ్ యాప్ స్టోర్స్‌లో థ్రెడ్స్ ఉంచారు. అమెరికా, యూకే, ఆస్ట్రేలియా, కెనడా, జపాన్ సహా 100 దేశాల వారికి ఇది అందుబాటులోకి వచ్చింది. ప్రారంభించిన మొదటి ఏడు గంటల్లోనే సుమారు కోటి మంది థ్రెడ్స్‌లో చేరారని మెటా సీఈవో జుకర్‌బర్గ్ ప్రకటించడం గమనార్హం. థ్రెడ్స్‌లో లైక్, రిప్లై వంటి వాటికి ప్రత్యేకంగా బటన్లున్నాయి. ఏ పోస్ట్‌కు ఎన్ని లైక్‌లు, రిప్లైలు వచ్చాయో యూజర్లు తెలుసుకోవచ్చు. ఒక పోస్ట్ 500 క్యారెక్టర్స్‌కు మించి ఉండరాదు. ఇదే ట్విట్టర్‌లో అయితే 280 క్యారెక్టర్లే. ఇన్‌స్టాగ్రామ్ యూజర్లు తమ అకౌంట్లు, అదే పేర్లతో కొత్త యాప్‌లోనూ కొనసాగవచ్చునని మెటా తెలిపింది. లేకుంటే ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌ను కొత్తగా ప్రారంభించాల్సి ఉంటుందని పేర్కొంది. కాంట్రాక్ట్స్, బ్రౌజింగ్ అండ్ సెర్చ్ హిస్టరీ వంటి సున్నితమైన వ్యక్తిగత సమాచారాన్ని థ్రెడ్స్ సేకరిస్తుందని యాప్‌స్టోర్‌లోని సమాచారం చెబుతోంది. థ్రెడ్స్ రాకపై ట్విట్టర్ సహ వ్యవస్థాపకుడు జాక్ డోర్సీ స్పందించారు. దాదాపు అన్ని ఫీచర్లు ట్విట్టర్‌ను కాపీ కొట్టినట్లుగానే ఉన్నాయని వ్యాఖ్యానించారు.

ఎన్సీపీ అధ్యక్షుడిని నేనే

- పార్టీ వ్యవస్థాపకుడు శరద్ పవార్ స్పష్టీకరణ
- నిజానిజాలు త్వరలో బయటపడతాయని వెల్లడి
- ఢిల్లీలో శరద్ పవార్ నేతృత్వంలో వర్కింగ్ కమిటీ సమావేశం



శరద్ పవార్, సుప్రియా సూలేతో మాట్లాడుతున్న రాహుల్‌గాంధీ

న్యూఢిల్లీ/ముంబై: నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ)పై ఆధిపత్యం కోసం శరద్ పవార్, అజిత్ పవార్ వర్గాల మధ్య పోరాటం సాగుతోంది. మెజార్టీ ఎమ్మెల్యేలు, నాయకులు తమతోనే ఉన్నారని, అసలైన పార్టీ తమదేనని ఇరు వర్గాలు తేల్చిచెబుతున్నాయి. ఈ నేపథ్యంలో గురువారం ఢిల్లీలో శరద్ పవార్ నేతృత్వంలో ఎన్సీపీ వర్కింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఎన్సీపీ అధ్యక్షుడిని తానేనని ఆ పార్టీ వ్యవస్థాపకుడు శరద్ తేల్చిచెప్పారు. ఎన్సీపీ వర్కింగ్ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఎన్సీపీ తనదేనని అజిత్ పవార్ చెప్పుకోవడంపై స్పందించారు. సీనియర్ నేత ప్రఫుల్ పటేల్, సునీల్ తత్కారే తోపాటు మరో 9 మందిని పార్టీ నుంచి బహిష్కరిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని ఈ సమావేశంలో ఆమోదించారు. వర్కింగ్ కమిటీ సమావేశంలో 8 తీర్మానాలు ఆమోదించామని ఎన్సీపీ సీనియర్ నాయకుడు పి.సి.చాకో చెప్పారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను, కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేయడాన్ని ఖండిస్తూ తీర్మానాలు ఆమోదించామన్నారు. శరద్ పవార్‌ను ఎన్సీపీ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నుకున్నామని తెలిపారు.

ఆ సమావేశానికి చట్టబద్ధత లేదు: అజిత్ పవార్ వర్గం

ఢిల్లీలో జరిగిన ఎన్సీపీ వర్కింగ్ కమిటీ సమావేశానికి ఎలాంటి చట్టబద్ధత లేదని అజిత్ వర్గం ఒక ప్రకటనలో వెల్లడించింది. జూన్ 30న ఎన్సీపీ జాతీయ అధ్యక్షుడిగా అజిత్ ఎన్నికయ్యారని గుర్తుచేసింది. పార్టీ ఎమ్మెల్యేలు, పార్టీ అనుబంధ విభాగాల ముఖ్యనేతలు, సభ్యులంతా ఆయనకు మద్దతు ఇస్తున్నారని తెలియజేసింది. అసలైన ఎన్సీపీ ఎవరిదన్నది తేల్చడం ఎన్నికల సంఘం పరిధిలో ఉందని, వివాదం తేలేదాకా వర్కింగ్ కమిటీ సమావేశం నిర్వహించే అధికారం ఎవరికీ లేదని స్పష్టంచేసింది.

శరద్ పవార్‌తో రాహుల్ గాంధీ భేటీ

నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపకుడు శరద్ పవార్, సుప్రియా సూలేతో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ గురువారం సమావేశమయ్యారు. ఢిల్లీలో పవార్ నివాసంలో ఈ భేటీ జరిగింది. మహారాష్ట్రలో చోటుచేసుకుంటున్న తాజా రాజకీయ పరిణామాలపై ఇరువురూ మాట్లాడుకున్నట్లు సమాచారం. శరద్ పవార్‌కు రాహుల్ మద్దతు ప్రకటించారు.

షిండే వర్గం ఎమ్మెల్యేలు మాతో టచ్‌లో ఉన్నారు

శివసేన(ఉద్ధవ్ ఠాక్రే) ఎంపీ

ప్రభుత్వంలో అజిత్ చేరడాన్ని చాలామంది శివసేన(షిండే) ఎమ్మెల్యేలు వ్యతిరేకిస్తున్నారని, వారు తమతో సంప్రదింపులు జరుపుతున్నారని శివసేన(ఉద్ధవ్ ఠాక్రే) ముఖ్యనేత, ఎంపీ వినాయక్ రౌత్ గురువారం చెప్పారు. ఎన్సీపీ తిరుగుబాటు ఎమ్మెల్యేలు మంత్రులు కావడం షిండే వర్గం శివసేన ఎమ్మెల్యేలకు ఎంతమాత్రం ఇష్టం లేదని తెలిపారు. అందుకే వారంతా షిండేపై తిరగబడుతున్నారని, తమ పార్టీతో టచ్‌లోకి వచ్చారని పేర్కొన్నారు. త్వరలో జరిగే మంత్రివర్గ విస్తరణలో మంత్రి పదవులు కోల్పోయే అవకాశం ఉన్న ఎమ్మెల్యేల తమ పార్టీలో చేరే అవకాశం ఉందన్నారు. వినాయక్ రౌత్ వ్యాఖ్యలను శివసేన(షిండే) వర్గం ఎమ్మెల్యేల, మంత్రి ఉదయ్ సామంత్ ఖండించారు.



కేరళలో వరద ప్రభావిత ప్రాంతం తిరువళ్లలో వృద్ధుడిని మోసుకొస్తున్న స్థానికులు. రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. వరద ముంపునకు గురైన వేలాది మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. రెండు జిల్లాల్లో 24 గంటల వ్యవధిలో 20 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కావడంతో రెడ్ అలెర్ట్ ప్రకటించారు.

బాధితుడి కాళ్లు కడిగిన మధ్యప్రదేశ్ సీఎం

భోపాల్: మధ్యప్రదేశ్‌లో గిరిజన యువకుడు దశ్మత్ రావత్‌పై రాజకీయ నేత మూత్ర విసర్జన చేసిన ఘటన చర్చనీయాంశంగా మారింది. బాధిత యువకుడికి మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్ చౌహాన్ క్షమాపణ చెప్పారు. గురువారం అతడిని రాజధాని భోపాల్‌లోని తన ఇంటికి పిలిపించి, కుర్చీలో కూర్చోబెట్టి కాళ్లు కడిగారు. అనంతరం ఆ నీటిని తన తలపై చల్లుకున్నారు. దశ్మత్ భార్యతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల కింద లబ్ధి చేకూరుస్తామని చెప్పారు. పేదల పట్ల అనుచితంగా ప్రవర్తించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దళిత యువకుడి కాళ్లను ముఖ్యమంత్రి కడగడాన్ని మధ్యప్రదేశ్ పీసీసీ అధ్యక్షుడు, మాజీ సీఎం కమల్‌నాథ్ ఒక డ్రామాగా కొట్టిపారేశారు.

వాటిల్లో కుల వివక్ష తీవ్రమైన అంశం

ఉన్నత విద్యాసంస్థల్లో కులవివక్ష నిర్మూలనకు ఏం చర్యలు తీసుకుంటున్నారో చెప్పాలని యూజీసీని ప్రశ్నించిన సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ: ఉన్నత విద్యా సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులపై కుల వివక్షను ప్రదర్శించడం అత్యంత సీరియస్‌గా తీసుకోవాల్సిన అంశమని సుప్రీం కోర్టు పేర్కొంది. కుల వివక్షను రూపుమాపడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో , ఏయే చర్యలు తీసుకోవాలని భావిస్తున్నారో తెలపాలని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ)ని ఆదేశించింది. కులపరమైన వివక్షను తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నారన్న ఆరోపణలు వచ్చిన హైదరాబాద్‌కు చెందిన రోహిత్ వేముల, ముంబైకు చెందిన పాయల్ తాడ్వీల తల్లులు దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ ఎ.ఎస్. బొపన్న, ఎంఎం. సుంద్రేశ్‌లతో కూడిన సుప్రీం డివిజన్ బెంచ్ గురువారం విచారించింది. ఉన్నత విద్యా సంస్థల్లో కుల వివక్షపై ఆగ్రహం వ్యక్తం చేసిన సుప్రీం కోర్టు ఈ వివక్షను పారద్రోలడానికి చేపట్టిన చర్యలేంటో వెల్లడించాలని యూజీసీకి ఆదేశాలు జారీ చేసింది. ''ఇది తీవ్రమైన అంశం. వారి ఆందోళల్ని మీరు ఎలా చూస్తున్నారు ? కులవివక్షకు వ్యతిరేకంగా ఎలాంటి చర్యలు చేపట్టారు ? ఈ సమస్య పరిష్కారానికి యూజీసీ నిర్దిష్టమైన చర్యలు చేపట్టాలి. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు వారి తల్లిదండ్రుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని చర్యలు తీసుకోవాలి. ఈ తరహా ఘటనలు భవిష్యత్తులో జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలి' కోర్టు యూజీసీ తరఫు లాయర్‌కు చెప్పింది. రోహిత్ వేముల, తాడ్వీ తల్లుల తరఫున వాదించిన సీనియర్ అడ్వకేట్ ఇందిర కొడుకు, కూతురిని పోగొట్టుకున్న వారి మనోవేదన తీర్చలేదని అన్నారు. వీరిద్దరే కాకుండా గత ఏడాది కాలంలో మరో ముగ్గురు విద్యార్థులు ఉన్నత విద్యా సంస్థల్లో కులవివక్షను తట్టుకోలేక నిండు ప్రాణాలను బలి తీసుకున్నారని సుప్రీం దృష్టికి తీసుకువెళ్లారు.

ఆస్ట్రేలియాలో భారతీయ విద్యార్థిని దారుణ హత్య



మెల్‌బోర్న్: 2021లో భారతీయ నర్సింగ్ విద్యార్థినిని మాజీ ప్రియుడి చేతుల్లో దారుణ హత్యకు గురైంది. ఈ కేసును విచారించిన ఆస్ట్రేలియా సుప్రీంకోర్టు ఇది అత్యంత క్రూరమైన నేరంగా పేర్కొంది. దోషికి జీవిత ఖైదు విధించే అవకాశం ఉంది. భారత్‌కు చెందిన జస్మీన్ కౌర్(21) ఆస్ట్రేలియాలోని అడిలైడ్‌లో ఉంటూ చదువుకునేది. ఆమెకు భారత్‌కు చెందిన తారిక్‌జోత్ సింగ్(22)తో స్నేహం ఏర్పడింది. కొన్ని రోజుల తర్వాత అతడి తీరు నచ్చక దూరం పెట్టడంతో తారిక్ ఆమెను వేధించసాగాడు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కక్షగట్టిన తారిక్ 2021 మార్చి 5న ఒంటరిగా ఉన్న సమయంలో ఆమె నోటికి ప్లాస్టర్ అంటించి, కళ్లకు గంతలు కట్టి, వైర్లతో కాళ్లు చేతులు కట్టేసి స్నేహితుడి కారులో అక్కడికి 400 మైళ్లదూరంలోని ఫ్లిండర్స్ రేంజికి తీసుకెళ్లాడు. ఆమె గొంతుకు గాట్లుపెట్టి గుంత తవ్వి, సజీవంగా ఉండగానే అందులో పాతిపెట్టాడు. ఈ కేసులో కోర్టు తారిక్‌జోత్ సింగ్‌ను దోషిగా నిర్ధారించింది. దర్యాప్తు సంస్థలు సుప్రీంకోర్టుకు బుధవారం అందజేసిన నివేదికలో హత్యకు సంబంధించిన దిగ్భ్రాంతికర విషయాలు వెల్లడయ్యాయి. దోషి తారిక్‌జోత్ సింగ్.. హత్య చేయడమే కాదు, కౌర్‌ను తీవ్ర వేదనను అనుభవించేలా చేశాడని పేర్కొంది. ఇది ప్రతీకారంతో పాల్పడిన అసాధారణ క్రూరమైన చర్య అని తెలిపింది.

ఏడు హైకోర్టులకు నూతన ప్రధాన న్యాయమూర్తులు

కేంద్రానికి సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఏడు హైకోర్టులకు ప్రధాన న్యాయమూర్తులను నియమించాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని కొలీజియం కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. ఏడుగురి పేర్లను సూచించింది. బాంబే, గుజరాత్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కేరళ, ఒడిశా, మణిపూర్ హైకోర్టుల్లో ప్రధాన న్యాయమూర్తుల నియామకం కోసం పేర్లను సిఫార్సు చేసింది. ప్రస్తుతం అలహాబాద్ హైకోర్టులో న్యాయమూర్తిగా పనిచేస్తున్న జస్టిస్ దేవేంద్ర ఉపాధ్యాయ్‌ను బాంబే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమించాలని పేర్కొంది. జస్టిస్ సునీతా అగర్వాల్‌ను గుజరాత్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా, ఒడిశా హైకోర్టు సీజేగా జస్టిస్ సుభాశిష్ తాళపత్రను, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ధీరజ్‌ను, తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ అరాధేను, కేరళ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ఆశిష్ దేశాయ్‌ని, మణిపూర్ హైకోర్టు సీజేగా జస్టిస్ సిద్ధార్థ్‌ను నియమించాలని కొలీజియం సిఫార్సు చేసింది.

ఎన్నికల్లో కలసికట్టుగా పోరాటం : సచిన్ పైలెట్



న్యూఢిల్లీ: రాజస్తాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోత్, అసంతృప్త నేత సచిన్ పైలెట్ మధ్య విభేదాలు రూపుమాపడానికి అధిష్టానం చేసిన ప్రయత్నాలు ఫలించినట్లే కనిపిస్తున్నాయి. ఈ ఏడాది చివర్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ విజయానికి కలసికట్టుగా పోరాటం చేస్తామని సచిన్ పైలెట్ చెప్పారు. రాజస్తాన్‌లో ఎన్నికల సన్నద్ధతపై గురువారం న్యూఢిల్లీలో ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాహుల్‌గాంధీ, ఖర్గే, సచిన్ పైలెట్ ఇతర సీనియర్ నాయకులు పాల్గొన్నారు. కాలికి ఫ్రాక్చర్ కావడంతో సీఎం అశోక్ గెహ్లోత్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ సమావేశానికి హాజరయ్యారు.

పన్నీర్ సెల్వం కుమారుడి ఎన్నిక చెల్లదు



సాక్షి, చెన్నై: తమిళనాడులోని తేని లోక్‌సభ నియోజకవర్గం ఎంపీ ఓపీఎస్ రవీంద్రనాథ్ ఎన్నిక చెల్లదని మద్రాస్ హైకోర్టు గురువారం తీర్పు వెలువరించింది. ఈ తీర్పును 30 రోజులు పెండింగ్‌లో పెడుతూ అప్పీలుకు అవకాశం కల్పించింది. అన్నాడీఎంకే సీనియర్ నేత, మాజీ సీఎం పన్నీర్ సెల్వం తనయుడు రవీంద్రనాథ్ 2019 ఎన్నికలలో తేని నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. ఎన్నికల సమయంలో తమిళనాడులో అధికారంలో అన్నాడీఎంకే ఉండటంతో తేని నియోజకవర్గంలో అధికార దుర్వినియోగం, నగదు పంపిణీపై ఆరోపణలొచ్చాయి. ఎన్నికలో ఓటమి పాలైన అభ్యర్థులు ఎవ్వరూ కోర్టును ఆశ్రయించలేదు. కానీ, నియోజకవర్గానికి చెందిన సాధారణ ఓటరు మిలానీ హైకోర్టును ఆశ్రయించారు. తన నియోజకవర్గం నుంచి గెలిచిన రవీంద్రనాథ్ నామినేషన్ దాఖలు మొదలు, ఫలితాల లెక్కింపు వరకు అక్రమాలకు పాల్పడినట్టు ఆధారాలను కోర్టు ముందుంచారు. ప్రమాణ పత్రంలో దాచిపెట్టిన అనేక అంశాలను కోర్టు దృష్టికి తెచ్చారు. ఏడాదిపాటు కేసు విచారణ సాగింది. గురువారం న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. ఆధారాల మేరకు రవీంద్రనాథ్ ఎన్నిక చెల్లదని తీర్పు ఇచ్చారు. దీంతో ఆయన పదవి కోల్పోయే పరిస్థితి నెలకొంది. చివరకు ఎంపీ తరపు న్యాయవాదులు గడువు కోరడంతో తీర్పు అమలును 30 రోజులకు వాయిదా వేశారు. ఆలోగా అప్పీలు పిటిషన్ వేసి, స్టే కోరే ప్రయత్నాల్లో రవీంద్రనాథ్ ఉన్నారు.

రష్యాలోనే వాగ్నర్ చీఫ్ ప్రిగోజిన్



మిన్స్క్: రష్యా అధినేత పుతిన్‌పై స్వల్పకాలం తిరుగుబాటు చేసి, పెను సంచలనం సృష్టించిన కిరాయి సైన్యం వాగ్నర్ గ్రూప్ చీఫ్ యెవ్గెనీ ప్రిగోజిన్ ప్రస్తుతం రష్యాలోనే ఉన్నారని బెలారస్ అధ్యక్షుడు అలెగ్జాండర్ లుకషెంకో గురువారం చెప్పారు. ప్రిగోజిన్ ప్రస్తుతం సెయింట్ పీటర్స్‌బర్గ్ నగరంలో ఆశ్రయం పొందుతున్నాడని తెలిపారు. ఉక్రెయిన్‌లో యుద్ధం కోసం రష్యా ప్రభుత్వం అందజేసిన నగదు, ఆయుధాలను వెనక్కిఇచ్చేసే ప్రయత్నంలో ప్రిగోజిన్ ఉన్నాడని వెల్లడించారు. వాగ్నర్ సైనిక దళాలు వారి క్యాంప్‌ల్లోనే ఉన్నాయని పేర్కొన్నారు. అయితే, ఆయా క్యాంప్‌లు ఎక్కడున్నాయనే విషయం లుకాషెంకో బయటపెట్టలేదు. బెలారస్‌లోని తమ మిలటరీ స్థావరాలను ఉపయోగించుకోవాలని వాగ్నర్ సభ్యులకు సూచించామని, వారు ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని పేర్కొన్నారు. సెయింట్ పీటర్స్‌బర్గ్ సిటీలో ప్రిగోజిన్ నివసిస్తున్నట్లు చెబుతున్న ఓ భవంతి ఫొటోలు, వీడియోలను రష్యా ఆన్‌లైన్ పత్రిక ఫోంటాకా బయటపెట్టింది. అయితే, ప్రిగోజిన్ ప్రస్తుతం రష్యాలోనే ఉన్నట్లు స్పష్టమైన ఆధారాలేవీ లభించలేదు. పుతిన్ క్షమాభిక్ష పెట్టిన తర్వాత ప్రిగోజిన్ బెలారస్‌కు వెళ్లినట్లు వార్తలు వచ్చాయి.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
శుక్రవారం । 7 । జూలై । 2023



గొప్ప గురుతు

బెంగళూరులో అసెంబ్లీ ప్రాంగణంలో గాంధీ విగ్రహం వద్ద ఫోటో దిగుతున్న బడి బాలలు. శాసనసభ సమావేశాలకు పెద్దసంఖ్యలో విద్యార్థులు తరలివచ్చారు

న్యూస్‌రీల్

నిత్యానంద శిష్యులపై వారంట్ జారీ

దొడ్డబళ్లాపురం: అత్యాచారం, అపహరణ తదితర కేసుల్లో నిందితుడై దేశం వదిలి పరారైన నిత్యానంద శిష్యులపై రామనగర జిల్లా సెషన్స్ కోర్టు నాన్ బెయిలబుల్ వారంట్ జారీ చేసింది. నిత్యానంద శిష్యులైన వల్లభనేని శివ, జమునా రాణిలపై వారంట్ జారీ అయ్యింది. ఒక భక్తురాలిపై నిత్యానంద అత్యాచారం చేశాడని నమోదైన కేసులో వీరు మూడో, ఆరో నిందితులుగా ఉన్నారు. కోర్టు విచారణకు హాజరవకుండా ఉండడంతో వారంట్ జారీ చేశారు. ఆగస్టు 5న జరిగే కేసు విచారణకు తప్పకుండా హాజరుకావాలని జడ్జి ఆదేశించారు. 2019లో నిత్యానందపై అత్యాచారం కేసు నమోదు కాగా, బెంగళూరు శివార్లలోని బిడదిలోని ఆశ్రమం నుంచి పరారయ్యాడు.

రైతు, ఆవుపై భల్లూకం దాడి

తుమకూరు: జిల్లాలోని కొరటగెరె తాలూకాలోని జెట్టి అగ్రహార గ్రామంలో గురువారం తెల్లవారుజామున ఎలుగుబంటి ఒకటి రైతు పైన దాడి చేసి గాయపరచింది, అలాగే ఆవుపైనా దాడికి పాల్పడింది. రైతు పొలానికి వెళ్తుండగా పొదల్లో దాగి ఉన్న భల్లూకం అతనిపై దాడి చేసి గాయపరచింది. బాధితుడు ఆర్తనాదాలు చేయడంతో ఎలుగు గ్రామంలోకి పరుగు తీసింది. అక్కడ మరో రైతుకు చెందిన ఆవు పైన దాడి చేసి గాయపరిచింది. గాయపడిన రైతును స్థానికులు కొరటగెరె ఆస్పత్రికి తరలించగా అక్కడ కోలుకుంటున్నాడు. ఎలుగును బంధించాలని అటవీ సిబ్బందిని ఎన్నిసార్లు కోరినా పట్టించుకోలేదని గ్రామస్తులు వాపోయారు.

బాలికపై అఘాయిత్యం

- కలబుర్గి జిల్లాలో ఘోరం

సాక్షి, బళ్లారి: కలబుర్గి జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. బుధవారం సాయంత్రం తొమ్మిదేళ్ల బాలికపై సామూహిక అత్యాచారం జరిగింది. బాలికను నలుగురు వ్యక్తులు తీసుకెళ్లి అత్యాచారం చేయడంతో తీవ్ర అస్వస్థతకు గురైంది. బాలికను స్థానికులు గుర్తించి ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటన కలబుర్గిలో కలకలం సృష్టించింది. ఈ ఘటనపై మహిళా పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కాగా, ఈ దుండగుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

కబినికి జోరుగా వరద



మైసూరు: ఆలస్యంగానైనా వర్షాలు కురవడంతో మైసూరు జిల్లాలో హెచ్.డి.కోటె తాలూకాలో బీచనహళ్లిలో ఉన్న కబిని డ్యాంలోకి నీరు చేరుతోంది. మూడు అడుగుల మేర నీరు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కబిని పై ప్రాంతంలో ఉన్న కేరళ, వైనాడు, పశ్చిమ కనుమల్లో కురుస్తున్న భారీ వర్షాల వల్ల కపిలా నది ప్రవాహం పెరిగింది. 3,431 క్యూసెక్కుల వరద నీరు డ్యాంలోకి చేరింది. గురువారం సాయంత్రానికి ఇన్‌ఫ్లో ఇంకా పెరిగింది.

పీడీఓ సస్పెండ్

తుమకూరు: విధుల పట్ల నిర్లక్ష్యం చేసిన ఆరోపణలపై జిల్లాలోని పావగడ తాలూకా తిరుమణి గ్రామ పంచాయతీ పీడీఓ ఆర్.నవీన్‌ను జెడ్పీ సీఈఓ జీ. ప్రభు సస్పెండ్ చేశారు. ఉపాధి హామీ పనులను సకాలంలో చేయలేక పోవడంతో పాటు విధుల్లో అలసత్వం వహించినందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. దీంతో జెడ్పీ సీఈఓ విచారణ జరిపి వాస్తవమని తేలడంతో సస్పెండ్ చేశారు.

నకిలీ బాంబ్ కాల్ కలకలం

బనశంకరి: శివాజీనగరలో పేరుపొందిన ఆజాంమసీదులో బాంబు పెట్టామని పోలీస్ కంట్రోల్ రూమ్ కు వచ్చిన బెదిరింపు ఫోన్ కాల్ కొద్దిసేపు కలకలం రేపింది. మసీదులో బాంబు పెట్టారనే ఫోన్‌కాల్ వచ్చిన తక్షణమే బాంబు స్క్వాడ్ శునకాలతో పోలీసులు మసీదు వద్దకు చేరుకుని సోదాలు చేయగా పేలుడు వస్తువులు లభించలేదు. కంట్రోల్ రూమ్‌కి బుధవారం రాత్రి 10 గంటలకు ఫోన్ కాల్ వచ్చింది. దీంతో విధానసౌధ, క్వీన్స్‌రోడ్డు, చిన్నస్వామి స్టేడియం, శివానంద సర్కిల్, మిల్లర్ రోడ్, ఎంజీరోడ్డు ప్రాంతాల్లో పోలీసులు తనిఖీలు తీవ్రం చేశారు. మసీదులో క్షుణ్ణంగా గాలించగా ఎలాంటి పేలుడు వస్తువులు దొరకలేదు. ఫోన్ చేసిన వ్యక్తి కోసం శివాజీనగర పోలీసులు గాలింపు చేపట్టారు. నగర శివారు ప్రాంతం నుంచి ఫోన్ చేసినట్లు తేలింది.

బోనులో చిక్కిన చిరుత

మైసూరు: గ్రామస్తుల కంటికి నిద్ర లేకుండా చేసిన చిరుతపులి బోనులో చిక్కడంతో జనం హమ్మయ్య అనుకున్నారు. టి. నరసిపుర తాలూకా బొమ్మనాయకనహళ్లి గ్రామం పరిసరాల్లో కొన్ని వారాలుగా చిరుత సంచరిస్తోంది. దీంతో ఒంటరిగా బయటకు వెళ్లడానికి భయపడ్డారు. అటవీ సిబ్బందికి ఫిర్యాదు చేయగా మూడు చోట్ల బోనులను పెట్టారు. బుధవారం రాత్రి రాజణ్ణ అనే రైతు పొలంలో పెట్టిన బోనులో చిక్కుకుంది. సుమారు 6 సంవత్సరాల మగ చిరుతగా గుర్తించారు. గురువారం ఉదయం గ్రామస్తులు చూసి అటవీ సిబ్బందికి తెలియజేయగా వారు వచ్చి దానిని బంధించి తరలించారు.

నేడు సిద్దు సర్కారు తొలి పద్దు!



బడ్జెట్‌తో సీఎం సిద్ధరామయ్య (ఫైల్)



ప్రధాన శాఖలకు భారీ కేటాయింపులు ఉంటాయని అంచనా

- కాంగ్రెస్ సర్కారు బడ్జెట్‌పై అందరి చూపు
- కొత్త పథకాలు, తాయిలాలపై అంచనాలు

శివాజీనగర: కొత్తగా కొలువైన కాంగ్రెస్ ప్రభుత్వం నేడు శుక్రవారం తొలి బడ్జెట్‌ను ప్రకటించబోతోంది. ఆర్థికశాఖను కూడా చూస్తున్న ముఖ్యమంత్రి సిద్దరామయ్య బడ్జెట్‌ను సమర్పిస్తారు. మేనిఫెస్టోలో ప్రకటించిన కాంగ్రెస్ 5 గ్యారంటీ పథకాలు కాకుండా కొత్తగా ఇతర సంక్షేమ పథకాలు ఏవైనా ఉంటాయా అనేది కుతూహలంగా మారింది. సిద్దు బడ్జెట్‌ను సమర్పించడం ఇది 14వ సారి కావడం రికార్డు కానుంది.

గ్యారంటీలు, నిరుద్యోగం, హామీలు

కొత్త బడ్జెట్‌పై భారీగానే ఆశలు ఉన్నాయి. కరోనా బెడద వదిలిపోవడంతో ఖజానా ఆర్థికంగా పుంజుకొంది. పన్నుల వసూళ్లు, జీఎస్టీ ఆదాయం బాగానే ఉంది. ఈసారి బడ్జెట్ మొత్తం రూ.3.25 లక్షల కోట్లు దాటవచ్చని అంచనా. గతంలో బసవరాజ బొమ్మై ప్రభుత్వం రూ.2.51 లక్షల కోట్లు ఉండింది. కరెంటు చార్జీలు, మద్యం రేట్లు పెంచి సిద్దరామయ్య సర్కారు విమర్శలను ఎదుర్కొంది. రానున్న లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని జనాకర్షక పథకాలను ప్రకటించవచ్చని భావిస్తున్నారు. అనేక జిల్లాల్లో కరువు నేపథ్యంలో అన్నదాతలను ఆదుకోవడానికి చర్యలను ప్రకటించాల్సి ఉంది. ఎన్నికల ప్రచారంలో నిరుద్యోగం గురించి కాంగ్రెస్ నేతలు ప్రచారం చేయడం వల్ల ఈ అంశం కూడా ప్రాధాన్యత సంతరించుకుంది. మేనిఫెస్టోలో ఇచ్చిన అనేక హామీలను నెరవేర్చేలా పథకాలు, నిధుల కేటాయింపులు కనిపించాల్సి ఉంది.

బెంగళూరుకు ఏమిస్తారు

ఇక అంతర్జాతీయ నగరంగా పేరుపొందిన బెంగళూరు నగరాభివృద్ధికి అధికంగా నిధులు కేటాయించవచ్చని అంచనాలున్నాయి. అలాగే నగరం ఎదుర్కొంటున్న ట్రాఫిక్ రద్దీ, ముంపు బెడద, నేరాల అడ్డుకట్టకు పథకాలను ప్రకటించవచ్చని తెలుస్తోంది. నగర ప్రధాన భాగాల్లో సొరంగ రోడ్డు నిర్మాణంపై ప్రతిపాదనలున్నాయి. ఐటీ, బీటీ రంగాలపై దృష్టి సారించాల్సి ఉంది.

మంత్రి చెలువరాయ తప్పుకోవాలి



గురువారం విధానసభలో చర్చ దృశ్యం



విధాన పరిషత్‌లో చర్చలు

- విధానసభలో ప్రతిపక్షాల డిమాండ్
- ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్యాయత్నంపై రగడ

శివాజీనగర: బదిలీకి నిరసనగా మండ్యలో బస్సు డ్రైవర్ ఒకరు ఆత్మహత్యాయత్నం చేయడం గురువారం విధానసభలో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య మాటల యుద్ధానికి కారణమైంది. జీరో అవర్‌లో బీజేపీ నేత బసవరాజ బొమ్మై డ్రైవర్ ఉదంతాన్ని ప్రస్తావించి, ఈ కేసుపై తనిఖీ చేపట్టాలి, ఇది సాధారణ కేసు కాదు. ఇందులో రాజకీయం ఉంది, తప్పు చేసినవారిని శిక్షించాలి అని కోరారు. డ్రైవర్ రాసిపెట్టిన డెత్ నోట్‌ను చదివి, ఇందులో మంత్రి చెలువరాయస్వామి కారణమని డ్రైవర్ చెప్పాడని ఆరోపించారు. అధికార పక్ష సభ్యులు దీనికి అభ్యంతరం చెబుతూ వాగ్వాదానికి దిగడంతో గందరగోళం నెలకొంది.

గతంలో రాజీనామా చేశారు: కుమార

మధ్యలో జేడీఎస్‌నేత కుమారస్వామి మాట్లాడుతూ, ఇందులో రాజకీయం ఉంది, ఆత్మహత్యకు యత్నించిన బస్సు డ్రైవర్ భార్య పంచాయితీ సభ్యురాలు కాగా, వారిపై కొందరి ఒత్తిడి ఉందని చెప్పారు. గతంలో కాంట్రాక్టర్ ఆత్మహత్య చేసుకొన్న కేసులో వాట్సాప్ మెసేజ్‌లో పేరున్న కారణాన ఈశ్వరప్ప రాజీనామా చేశారు, అదే మాదిరి మంత్రి చెలువరాయ కూడా రాజీనామా చేయాలన్నారు.

మంత్రి జార్జ్ దీనికి స్పందిస్తూ బదిలీల బాగోతమని పెన్ డ్రైవ్ చూపారు, దానిని విడుదల చేయాలని కుమారస్వామిని డిమాండ్ చేయడంతో ఇద్దరి మధ్య ఆరోపణలు నడిచాయి. ప్రతిపక్ష పార్టీ సభ్యులు కుమారస్వామికి మద్దతుగా నిలచి, అధికార పార్టీ సభ్యులతో వాగ్వివాదానికి దిగారు. అంతలోనే బసనగౌడ పాటిల్ యత్నాళ్, మంత్రి ఎం.బీ. పాటిల్ మధ్య వాగ్వివాదం మొదలైంది. సీఎం పదవిని పొందడానికి రూ.200 కోట్లు ఇచ్చారని గతంలో యత్నాళ్ ఆరోపించారు, దీనిపై విచారణ జరగాలని పాటిల్ కోరారు. సీబీఐతో విచారణకైనా సిద్ధమని యత్నాళ్ సవాల్ చేశారు. గందరగోళం పతాకస్థాయికి చేరడంతో స్పీకర్ యూ.టీ.ఖాదర్ కష్టమ్మీద అందరినీ శాంతపరిచారు.

బెస్కాం ఇంజినీరు ఆత్మహత్య



మంజునాథ్ (ఫైల్)

తుమకూరు: ప్రేమ వైఫల్యమో, కుటుంబ సమస్యలో, లేక పని ఒత్తిడో తెలియదు కానీ.. విద్యుత్ అధికారి జీవితం అర్ధాంతరంగా కడతేరింది. పావగడ తాలూకాలోని వైఎస్ హొసకోట గ్రామానికి చెందిన మంజునాథ్ (23) అనే బెస్కాం అసిస్టెంట్ జూనియర్ ఇంజినీర్ పట్టణంలోని ఓ ప్రైవేట్ హాస్టల్‌లో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న దుర్ఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. తెల్లవారినా గది తలుపులు తెరవక పోవడంతో హాస్టల్ సిబ్బంది గది తలుపులు పగులగొట్టి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ ఆయన శవం కనిపించింది మృతదేహాన్ని కిందకు దించి స్థానిక పోలీసులకు సమాచారం అందించడంతో చేరుకుని పరిశీలించారు. మంజునాథ్ బెంగళూరులో బెళందూరులోని బెస్కాంలో ఏజేఈ గా విధులు నిర్వహించేవాడు. పెళ్లి విషయంలో గొడవ జరుగుతోందని, అదే కారణమై ఉంటుందని కుటుంబ సభ్యులు పోలీసులకు తెలిపారు. మంజునాథ్ ఆత్మహత్య కు ముందు ఫేస్‌బుక్, ఇన్‌స్టా పోస్టులు పెట్టినట్లు తెలుస్తోంది. ఎంతో భవిష్యత్తు ఉన్న కుమారుని మరణంతో తల్లిదండ్రులు శోకతప్తులయ్యారు.

పెన్‌డ్రైవ్ బయటికొస్తే సీఎం రాజీనామా: కుమార

మైసూరు: రాష్ట్రంలో అధికారుల బదిలీల దందా మొత్తం ముఖ్యమంత్రి సిద్దరామయ్య కనుసన్నల్లో జరుగుతోందని, తన పెన్ డ్రైవ్‌లో ఉన్న రహస్యం బయటకు వస్తే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాల్సి వస్తుందని జేడీఎస్ నేత హెచ్‌డీ కుమారస్వామి అన్నారు. గురువారం మైసూరులో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వంలో బదిలీలు తప్పనిసరి, కానీ ఏ కొలమానం ప్రకారం బదిలీలు చేయాలో ఆ ప్రకారంగా చేయాలి తప్ప ఇష్టం వచ్చినట్లు డబ్బుల కోసం బదిలీలు చేస్తున్నారు, ఇదంతా ముఖ్యమంత్రి ఆదేశాలతో నడుస్తోందని దుయ్యబట్టారు.

కుమారపై సీఎం భగ్గు

శివాజీనగర: జేడీఎస్ నేత హెచ్‌డీ కుమారస్వామి నిరాశతో తమ సర్కారుపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని

సీఎం సిద్దరామయ్య అన్నారు. విధానసౌధ ముందున్న బాబూ జగ్జీవన్‌రాం విగ్రహానికి పుష్పాంజలి ఘటించిన తరువాత మీడియాతో మాట్లాడారు. బదిలీల దందా సాగుతోందని ఆరోపించడం సబబు కాదన్నారు. వారి కాలంలోను బదిలీలు జరిగాయి. ఆయన లంచం పుచ్చుకొన్నాడా? అని ప్రశ్నించారు. సాధారణ బదిలీలు జరుగుతున్నాయన్నారు. హిట్ అండ్ రన్ ఆరోపణలు చేయడం సరికాదన్నారు. బదిలీలకు- తన కుమారుడు యతీంద్ర పేరును అంటగట్టడం తగదన్నారు.

మైషుగర్‌లో చెరుకు క్రషింగ్

- ఘనంగా ప్రారంభం



మండ్య: మండ్య జిల్లా ఆర్థిక జీవనాడి అయిన మైషుగర్ చక్కెర కర్మాగారంలో గురువారం చెరుకు కటింగ్ పనులు ప్రారంభమయ్యాయి. చక్కెర శాఖ మంత్రి శివానంద ఎస్. పాటిల్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సుమారు నాలుగు సంవత్సరాల పాటు పనులు నిలిచి పోయిన మైషుగర్ ఫ్యాక్టరీని గత ఏడాది పునరుద్ధరించడం తెలిసిందే. గణపతి పూజలు చేసి చెరుకు క్రషింగ్‌కు నాంది పలికారు. జిల్లా మంత్రి ఎన్. చలువరాయ స్వామి, ఎంపీ సుమలత, కలెక్టర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. మంత్రి పాటిల్ మాట్లాడుతూ ఫ్యాక్టరీని రూ. 50 కోట్లతో ఆధునీకరిస్తామన్నారు. ఫ్యాక్టరీలో రోజూ 3 వేల టన్నుల చెరుకును క్రషింగ్ చేయడమే లక్ష్యమన్నారు. ఇకముందు ఫ్యాక్టరీని బంద్‌చేసే ప్రసక్తి లేదని, లాభాల్లోకి తీసుకుని వెళతామని చెప్పారు.

మెడికల్ కాలేజీపై రగడ

- డిప్యూటీ సీఎం వర్సెస్ ఎమ్మెల్యే

శివాజీనగర: విధానసభలో డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, బీజేపీ ఎమ్మెల్యే సీ.ఎస్.అశ్వత్థనారాయణ మధ్య గురువారం వాగ్వాదం చోటుచేసుకుంది. వీరిద్దరి మధ్య ముందునుంచి వైరం ఉండడం తెలిసిందే. కాంగ్రెస్ ఎమ్మెల్యే టీ.బీ.జయచంద్ర మాట్లాడుతూ చిక్కబళ్లాపురలో సత్యసాయి సంస్థ మెడికల్ కాలేజీని ఆరంభించింది. ప్రధానమంత్రే ఈ కాలేజీ భవనాన్ని ప్రారంభించారు. మరో 10 రోజుల్లో ప్రవేశాలు ఆరంభమవుతున్నాయి. కానీ ఈ కాలేజీలో అడ్మిషన్లకు ప్రభుత్వం అనుమతివ్వలేదు, తక్షణమే అనుమతి జారీ చేయాలని కోరారు. సీ.ఎస్.అశ్వత్థనారాయణ కూడా ఇందుకు మద్దతు పలికారు. డీకేశి స్పందిస్తూ మీరు అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు అనుమతి కల్పించలేదు. నేడు మాట్లాడుతున్నారు అని ప్రశ్నించారు. మీరు ఈ విధంగా మాట్లాడటం సరికాదు. మేము ఇవ్వలేదు సరే, మీరు ఇవ్వడానికి అభ్యంతరమేమిటి అని అశ్వత్ నారాయణ అన్నారు. ప్రజలు మిమ్మల్ని చూసి ఓటు వేయలేదని, మీ గ్యారంటీలని చూసి ఓటు వేశారని ఆరోపించారు. దీంతో ఇద్దరు ఆరోపణలు గుప్పించుకోవడంతో పరిస్థితి వేడెక్కింది. కాగా, వైద్య విద్యా మంత్రి శరణప్రకాశ్ పాటిల్ జోక్యం చేసుకుని ఆ కాలేజీ ఫైళ్లు తన వద్ద లేవని, తనకు పంపాలని కోరారు.

వేతన సిఫార్సులు అమలు చేస్తాం: సీఎం

- రాష్ట్రంలో 2.55 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీ



జీతాల పెంపుపై ఉద్యోగుల ఆశలు

శివాజీనగర: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు వేతన సవరణ కోసం నియమించిన ఏడవ వేతన కమిషన్ తుది నివేదికను సమర్పించేందుకు ఆరు నెలల గడువు కోరింది, తుది నివేదికను పరిశీలించి, రాష్ట్ర ఆర్థిక స్థితిగతులను గమనించి వేతనం పెంపునకు చర్యలు తీసుకొంటామని ముఖ్యమంత్రి సిద్దరామయ్య చెప్పారు. గురువారం విధాన పరిషత్‌లో బీజేపీ సభ్యులు అడిగిన ప్రశ్నకు సీఎం సమాధానమిచ్చారు. కమిషన్ తుది నివేదిక వచ్చిన తరువాత దానిని పరిశీలించి సిఫార్సులను అమలు చేస్తామన్నారు. ఉద్యోగులకు ఇప్పటికే మధ్యంతర పరిహారం జారీచేసినట్లు తెలిపారు.

ఉద్యోగాల భర్తీపై..

రాష్ట్ర ప్రభుత్వంలో 43 శాఖలలో 33 శాతం ఉద్యోగాలు ఖాళీగా ఉండగా, దశలవారీగా భర్తీ చేస్తామని సీఎం తెలిపారు. రాష్ట్రంలో అన్ని శాఖల్లో 7,72,025 ఉద్యోగాలు ఉండగా, వాటిలో 5,16,105 పోస్టులు భర్తీగా ఉన్నాయి, 2,55,920 ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. సీ, డీ గ్రూపు ఉద్యోగాలను ఔట్ సోర్సింగ్‌కు ఇస్తున్నాము, ఏ, బీలో అరుదుగా ఔట్ సోర్స్ చేయనున్నాం. ఉద్యోగాల భర్తీకి చర్యలు తీసుకొంటామని తెలిపారు.

కరువుతీరా కుండపోత



గురువారం మంగళూరు దగ్గర హళెయంగడిలో ఇంటి చుట్టూ నీరు



మంగళూరులో బప్పనాడు దుర్గా పరమేశ్వరి ఆలయంలో చేరిన వాననీరు



ధార్వాడ వద్ద వర్షానికి తడవకుండా తలకు కవర్ కప్పుకొన్న బైకిస్టు

- రాష్ట్రంలో కోస్తా జిల్లాల్లో భారీ వర్షాలు
- కావేరి, ఉప నదులకు ప్రవాహం
- ఉత్తర కర్ణాటకలోనూ వానలు

యశవంతపుర: రాష్ట్రంలో కోస్తా, ఉత్తర కర్ణాటక జిల్లాల్లో కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. ఈ నెల 10 వరకు రాష్ట్ర వ్యాప్తంగా భారీ వానలు పడే అవకాశం ఉన్నట్లు బెంగళూరు వాతావరణశాఖ అధికారులు తెలిపారు. దక్షిణ కన్నడ, ఉత్తర కన్నడ, ఉడుపి తీర జిల్లాల్లో రెడ్ అలర్ట్‌ను ప్రకటించారు. ఇప్పటికైనా వర్షాలు ఊపందుకోవడంతో అన్నదాతల్లో ఆనందం కలుగుతోంది. గురువారం ఉదయం బెంగళూరులో జడివాన కురిసింది. తగ్గు ప్రాంతాలు జలావృతం కావటంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. దక్షిణ కన్నడ జిల్లాలో వానలతో ఒకరు మృతి చెందారు. ఉత్తర కన్నడ జిల్లాలో ఉరుములు-మెరుపులతో కూడినవానలు పడే అవకాశం ఉంది. వచ్చే 24 గంటల్లో బెళగావి, ధారవాడ, గదగ, హావేరి, కలబురగి, రాయచూరు, చిక్కమగళూరు, దావణగెరె, కొడగు, శివమొగ్గ, విజయనగర జిల్లాల పరిధిలో భారీ వానలు పడే అవకాశం ఉంది. మైసూరు, రామనగర, బెంగళూరునగర, గ్రామాంతర, కోలారులో ఓ మోస్తరు వానలు పడే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

నదుల్లోకి చేరుతున్న నీరు

వానలు పడక ఎండిపోయిన ఆనకట్టలు, జలాశయంలోకి నిదానంగా నీరు చేరుతోంది. మండ్య జిల్లాలో కేఆర్‌ఎస్‌లో నీటిమట్టం 10.17 టీఎంసీలకు చేరింది. గత ఏడాది ఇదే సమయంలో 34 టీఎంసీలు ఉండేవి. లింగనమక్కి డ్యాంలో- 9,237 క్యూసెక్కులు, కబినిలో-3,431, భద్రాలో-2,397, హారంగి-1,518, సూపా-1,736 క్యూసెక్కుల చొప్పున వరదనీరు చేరింది.

కావేరి నది పరుగులు

కొడగు జిల్లావ్యాప్తంగా భారీ వానలు కురుస్తున్నాయి. కావేరి నది మూలమైన భాగమండలంలో కావేరి, ఉపనదులు జోరుగా ప్రవహిస్తున్నాయి. పలుచోట్ల విద్యుత్ కుప్పకూలి కరెంటు సరఫరా నిలిచిపోయింది. మూడు రోజుల్లో హారంగి, కేఆర్‌ఎస్‌లు డ్యాం నిండిపోవచ్చని అంచనా.

దక్షిణ కన్నడ, ఉడుపిలో కుండపోత

దక్షిణ కన్నడ, ఉడుపి జిల్లాల్లో సోమవారం నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలతో జనజీవనం స్తంభించింది. అధికారులు గురువారం ఆరెంజ్ అలర్ట్‌ను ప్రకటించి పాఠశాల, కాలేజీలకు సెలవు ఇచ్చారు. మంగళూరు నగరంలోని కొట్టారలో ఇళ్లలోకి వాననీరు చేరింది. ఆక్రోశానికి గురైన స్థానికులు కార్పొరేటర్‌పై మండిపడ్డారు. దక్షిణ కన్నడ జిల్లా వ్యాప్తంగా వానలతో 30 ఇళ్లకుపైగా హాని జరిగిన్నట్లు కలెక్టర్ ముల్లైముగిలన్ తెలిపారు. 2 వందల విద్యుత్ స్తంభాలు కూలాయి, అనేక చెట్లు విరిగాయి. బప్పనాడు దుర్గా పరమేశ్వరి ఆలయంలోకి నీరు చేరింది. సముద్ర తీరం వెంబడి అలలు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి. ఉళ్లాల సమీపంలోని ఉచ్చిల, బట్టెంపాడి ప్రాంతాలలో కొబ్బరి చెట్లు కూలిపోయాయి, సముద్రం వెంబడి ఉన్న బీచ్ రెస్టారెంట్లు అలలకు కొట్టుకుపోయాయి. ఒక ప్రైవేటు స్కూల్‌పై వేసిన రేకులు గాలికి లేచిపోగా సెలవు కావడంతో ఎవరూ లేకపోవడంతో ముప్పు తప్పింది.



ఉడుపి నగరంలో జోరు వాన

క్లుప్తంగా

బాధ్యతల స్వీకారం

హుబ్లీ: జెడ్పీ ప్లానింగ్ డైరెక్టర్‌గా ఉన్న ఎస్.బస లింగయ్య మూగనూరుమఠ గురువారం జెడ్పీ ఉపకార్యదర్శిగా అధికార బాధ్యతలను చేపట్టారు. గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖలో 27 ఏళ్లుగా సేవలందిస్తున్న ఈయన ఇంతకు ముందు ఉన్న ఉపకార్యదర్శి రేఖా డొళ్లిన నుంచి బాధ్యతలను తీసుకొన్నారు. ఈసందర్భంగా జెడ్పీ సీఈఓ పీకే.స్వరూపతో పాటు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భర్త చేతిలో భార్య హతం

- బెళగావి జిల్లాలో ఘటన

రాయచూరు రూరల్: పుట్టింటి నుంచి మరింత కట్నం తెచ్చేందుకు నిరాకరించిన భార్యను ఓ భర్త గొడ్డలితో నరికి హత్య చేసిన ఘటన బెళగావి జిల్లాలో జరిగింది. నిందితుడిని పరసప్పగా పోలీసులు గుర్తించారు. అదనపు కట్నం తేవాలని నిత్యం హింసించినా ఆమె నిరాకరించడంతో బుధవారం రాత్రి కోపోద్రేకంలో ఇంటిలోని గొడ్డలితో దాడి చేసి భార్య రేఖను(24) ఆమె భర్త పరసప్ప హత్య చేసి పరారయ్యాడని పోలీసులు తెలిపారు.

ఆకట్టుకున్న బయలాట


బయలాట ప్రదర్శనలో ఓ సన్నివేశం

బళ్లారిఅర్బన్: తాలూకాలోని బొబ్బకుంట గ్రామంలో బండిహట్టి సప్తస్వర సాంస్కృతిక బయలాట కళా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కృష్ణలీల బయలాట ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈసందర్భంగా ప్రదర్శన వ్యవస్థాపకులు రామదాసు, మాజీ జీపీ సభ్యుడు శివరామ్, కళాకారులు గీతా, ఉమా, వైట్ సుమ, హార్మోనియం మాస్టర్ హెచ్ఎం.హనుమావధూత, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

బీదర్ ఎస్పీగా ఆనంద్ కుమార్



రాయచూరు రూరల్: బీదర్ జిల్లా నూతన ఎస్పీగా హెచ్‌డీ ఆనంద్ కుమార్ నియమితులయ్యారు. గురువారం ఆయన బీదర్ జిల్లా ఎస్పీ కార్యాలయంలో అధికార బాధ్యతలు చేపట్టారు. మహారాష్ట్ర, తెలంగాణలకు సరిహద్దుగా ఉన్న జిల్లాలో మద్యం, ఇసుక అక్రమ రవాణా, జూదం తదితర అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేస్తామన్నారు. ప్రజలు పోలీసులతో సహకరించాలన్నారు.

కారకులపై చర్యలకు డిమాండ్


వినతిపత్రం సమర్పిస్తున్న కార్యకర్తలు

రాయచూరు రూరల్: తాలూకాలోని అప్పనదొడ్డిలోని పాఠశాలలో మధ్యాహ్న భోజనం తిని పిల్లలు అస్వస్థతకు గురైన ఘటనలో బాధ్యులపై చర్యలు చేపట్టాలని మూల నివాసి అంబేడ్కర్ సంఘం డిమాండ్ చేసింది. గురువారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళననుద్దేశించి అధ్యక్షుడు భరత్ కుమార్ మాట్లాడారు. మధ్యాహ్న భోజనం తిని అస్వస్థతకు గురైన పిల్లలపై అజాగ్రత్తగా వ్యవహరించిన అధికారులు, ఉపాధ్యాయులు, వంట చేసే కార్మికులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

టీచర్‌పై చర్యకు వినతి

రాయచూరు రూరల్: విధులకు గైర్హాజరవుతున్న ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. గురువారం సిరవార తహసీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళనను ఉద్దేశించి అధ్యక్షుడు శివరాజ్ మాట్లాడుతూ సిరవార తాలూకా బాగలవాడ ఫిర్కా నడుగడ్డ క్యాంప్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు, ఇన్‌చార్జ్ హెడ్‌మాస్టర్ శివరాజ్‌ను సస్పెండ్ చేయాలని స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

బాధ్యులపై చర్యలు చేపట్టండి


ధర్నా చేస్తున్న నాయకులు, కార్యకర్తలు

రాయచూరు రూరల్: జిల్లాలో వ్యవసాయ శాఖాధికారులపై చర్యలు చేపట్టాలని కర్ణాటక ప్రాంత రైతు సంఘం అధ్యక్షుడు చామరస మాలిపాటిల్ డిమాండ్ చేశారు. గురువారం టిప్పుసుల్తాన్ పార్క్‌లో చేపట్టిన ధర్నాలో ఆయన మాట్లాడారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకంలో రూ.2 కోట్ల మేర బీమా నిధుల గోల్‌మాల్ జరిగిందన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ధర్నాలో బూదయ్య స్వామి, బ్రహ్మయ్య, మల్లన్న, ప్రభాకర్ పాటిల్‌లున్నారు.

నిర్లక్ష్య ఉపాధ్యాయులపై చర్యలేవీ?

రాయచూరు రూరల్: ప్రైవేట్ పాఠశాలల్లో పాఠాలు బోధించని ఉపాధ్యాయులు, సంస్థలపై చర్యలు చేపట్టాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. గురువారం లింగసూగూరు తాలూకా కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళనలో అధ్యక్షుడు రమేష్ మాట్లాడారు. హట్టి సంత అన్నమ్మ పాఠశాలలో జూన్ నుంచి ఇంతవరకు విద్యార్థులకు గణితం బోధించలేదని, ఆ సంస్థ గుర్తింపును రద్దు చేయాలని తాలూకా విద్యా శాఖాధికారి వెంకటేష్ గుడదనాళకు వినతిపత్రం సమర్పించారు.

తుంగా డ్యాం గేట్ల ఎత్తివేత


డ్యాం నుంచి విడుదలవుతున్న నీరు


జలాశయంలో నిండుగా నీరు

- పూర్తిగా నిండిన జలాశయం

శివమొగ్గ: శివమొగ్గ తాలూకాలోని గాజనూరు గ్రామంలో ఉన్న తుంగా జలాశయంలో నీటిమట్టం గరిష్ట స్థాయికి చేరుకోవడంతో బుధవారం రాత్రి నుంచి గేట్లను ఎత్తి నీటిని విడుదల చేశారు. డ్యాం పూర్తి సామర్థ్యం 588.24 అడుగులు కాగా, ఆ స్థాయికి నీరు చేరింది. దీంతో రెండు గేట్లను ఎత్తి సుమారు 7 వేల క్యూసెక్కుల వరద నీటిని నదిలోకి వదిలారు. గురువారం ఉదయం అధికారులు తెలిపిన ప్రకారం తుంగా జలాశయంలోకి సుమారు 12,082 క్యూసెక్కుల వరద నీరు చేరుగా 7,545 క్యూసెక్కుల నీటిని నదిలోకి వదిలిపెట్టారు. డ్యాంలోకి వస్తున్న నీటి పరిమాణం పెరిగింది.

ఈసారి నెల ఆలస్యం

గత ఏడాది కుండపోత వర్షాలు కురవడంతో జూన్ నెల మొదటి వారంలోనే తుంగా జలాశయం గరిష్ట నీటి మట్టానికి చేరుకుంది. ఈ దఫా వానలు ముఖం చాటేయడంతో డ్యాం నిండడం సుమారు నెల రోజులు ఆలస్యమైంది. కానీ గడిచిన కొన్ని రోజులుగా జలాశయం పరిధిలో భారీ వర్షాలు పడడంతో నీరు చేరుతోంది. రాబోయే రోజుల్లో మరిన్ని గేట్లను ఎత్తే అవకాశముంది.

భారీ వాహనాలకు ప్రవేశం వద్దు

సాక్షి బళ్లారి: భారీ వాహనాలు నగరంలో గుండా సంచరించకుండా గట్టి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం ఆయన జిల్లా ఎస్పీకి లేఖ రాశారు. నగరంలో ఇటీవల భారీ వాహనాల సంచారంతో పలు ప్రమాదాలు సంభవిస్తున్నాయని తెలిపారు. ప్రజల భద్రత దృష్ట్యా నగరంలోకి ఎట్టి పరిస్థితిలోను భారీ వాహనాలను అనుమతించకూడదని కోరారు. ముఖ్యంగా బెంగళూరు రోడ్డు నుంచి రింగ్ రోడ్డు గుండానే భారీ వాహనాలను అనుమతించాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ వైపు నుంచి మోకా రోడ్డు గుండా వచ్చే భారీ వాహనాలను అనంతపురం రోడ్డులో బైపాస్ ద్వారా హొసపేటె వైపు సంచరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. బెంగళూరు, అనంతపురం, కర్నూలు వైపు నుంచి హొసపేటెకు వెళ్లే వాహనాలు కూడా నగరంలో గుండా సంచరించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రాత్రి 10 గంటల తర్వాతే అవసరమైన వాహనాలను నగరంలోని మోతీ సర్కిల్, అంబేడ్కర్ వృత్తం, ఫ్లై ఓవర్, రేడియో పార్క్‌ల ద్వారా హొసపేటె రోడ్డు వైపునకు వెళ్లేలా సూచించాలని కోరారు.

ముక్తిధామ రథం సిద్ధం


రథం ప్రారంభించిన సంఘం పదాధికారులు

కంప్లి: తాలూకా ప్రజల సౌకర్యార్థం సర్వధర్మ ప్రజల అంత్యక్రియల కోసం ముక్తిధామ రథం, ఏసీ ఫ్రీజర్‌బాక్స్‌ను సిద్ధం చేసినట్లు జనపర సేవా సంఘం అధ్యక్షులు గద్గి విరుపాక్షి తెలిపారు. గురువారం పట్టణంలోని పంపాపతి దేవస్థానం ఎదురుగా సంఘం పరంగా ముక్తిధామ రథం, ఏసీ ఫ్రీజర్ బాక్స్ సేవలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. దాతలు, సంఘం కార్యవర్గం సహకారంతో ఈ సేవలను అందుబాటులోకి తెచ్చామన్నారు. ఈసందర్భంగా సంఘం ఉపాధ్యక్షులు జీరు గాదిలింగ, కార్యదర్శి నాగరాజు, ఉపకార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి మల్లికార్జున, సభ్యులు సంగమేష్, జవుకు సతీష్, వీరేష్, రాఘవేంద్ర పాల్గొన్నారు.

దళిత సంక్షేమ సారథి బాబూ జగ్జీవన్‌రామ్

హొసపేటె: హరిత విప్లవ సారథి బాబూ జగ్జీవన్ రామ్ 37వ వర్ధంతిని గురువారం ఘనంగా జరిపారు. నగరంలోని చిత్తవాడిగి రోడ్డు వద్ద ఉన్న బాబూజీ చిత్రపటానికి జిల్లా కలెక్టర్ వెంకటేష్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దీన, దళిత వర్గాల సంక్షేమం కోసం బాబూజీ నిరంతరంగా కృషి చేశారన్నారు. జెడ్పీ సీఈఓ సదాశివ ప్రభు, జిల్లా ఎస్పీ శ్రీహరి బాబు, తహసీల్దార్ విశ్వజిత్ మెహత తదితరులు పాల్గొన్నారు.


వర్ధంతిని ఆచరిస్తున్న అధికారులు, సిబ్బంది

బాబూజీకి ఘననివాళి

రాయచూరు రూరల్: ప్రతి ఒక్కరూ బాబూజీ ఆశయాలను అలవర్చుకోవాలని జిల్లాధికారి చంద్రశేఖర్ అన్నారు. ఆయన గురువారం నగరంలోని బాబూజీ సర్కిల్ వద్ద బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా బాబూజీ ప్రతిమకు పూలమాల వేసి మాట్లాడారు. దేశంలో ఆహార ధాన్యాల కొరత నివారణకు హరిత విప్లవాన్ని సృష్టించిన మహా మేధావి బాబూజీ అన్నారు. కార్యక్రమంలో ఎస్పీ నిఖిల్, జెడ్పీ సీఈఓ శశిధర్, నగరసభ కమిషనర్ గురులింగప్పలున్నారు.

సిటీ కార్పొరేషన్ కమిషనర్‌గా భరత్

హుబ్లీ: హుబ్లీ ధార్వాడ సిటీ కార్పొరేషన్‌కు కమిషనర్‌గా వాయువ్య ఆర్టీసీ ఎండీ ఎస్.భరత్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. గత వారం రోజులుగా ఖాళీగా ఉన్న ఈ పోస్టుపై స్థానికుల నుంచి విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో స్పందించిన ప్రభుత్వం ఆర్టీసీ ఎండీ భరత్‌ను ఆ పదవితో పాటు ఈ పదవిని కూడా ఏకకాలంలో నిర్వహించాలని ఆదేశించింది. గత ఏడాది నుంచి ఎండీగా విధులు నిర్వహిస్తున్న భరత్ గతంలో హావేరి జిల్లాధికారిగా పని చేశారు. కాగా గతంలో కమిషనర్‌గా ఉన్న డాక్టర్ గోపాలకృష్ణ చిక్కమగళూరు జెడ్పీ సీఈఓగా బదిలీ కావడంతో ఈ పోస్టు ఖాళీ పడింది.

బకాయి వేతనాలు చెల్లించాలి

రాయచూరు రూరల్: జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్న అతిథి ఉపాధ్యాయులకు బకాయి వేతనాలు చెల్లించాలని అతిథి ఉపాధ్యాయుల సంఘం డిమాండ్ చేసింది. గురువారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళననుద్దేశించి సంఘం అధ్యక్షుడు నాగరాజ్ మాట్లాడారు. గత ప్రభుత్వం జారీ చేసిన నియమాలను కొనసాగించాలని, బకాయి వేతనాలను చెల్లించాలని, సీనియారిటీ ఆధారంగా బదిలీలు చేయాలని కోరుతూ స్థానికాధికారికి వినతి పత్రం సమర్పించారు.

గౌరవధనం పెంచాలని వేడుకోలు

కంప్లి: ఈసారి బడ్జెట్‌లో అతిథి ఉపాధ్యాయుల గౌరవధనం పెంచేందుకు చర్యలు తీసుకోవాలని అతిథి ఉపాధ్యాయ బళగ పదాధికారులు ఒత్తిడి చేశారు. ఎమ్మిగనూరు తపాలా కార్యాలయం వద్ద అతిథి ఉపాధ్యాయులు విద్యా శాఖా మంత్రి మధు బంగారప్పకు రాసిన లేఖలో విన్నవించారు. బళగ జిల్లా కోశాధ్యక్షుడు రాము మాట్లాడుతూ గత 12 ఏళ్లుగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రూ.10 వేలు మాత్రమే నెలవారీ వేతనం పొందుతున్నామని తెలిపారు. ఇటీవల నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటుతున్నందున కుటుంబ పోషణ కష్టకరమైనందున గౌరవ ధనం రూ.20 వేలకు పెంచాలని కోరారు. ఈసందర్భంగా అతిథి ఉపాధ్యాయులు లలిత, లావణ్య, మీనాక్షి, వీరేష్, మల్లికార్జున పాల్గొన్నారు.

జీపీ ఉపఎన్నికల నోటిఫికేషన్ వెల్లడి

బళ్లారిఅర్బన్: జిల్లాలోని వివిధ తాలూకాల్లో ఖాళీగా ఉన్న జీపీ ఉప ఎన్నికల నోటిఫికేషన్‌ను జిల్లాధికారి పవన్‌కుమార్ ప్రకటించారు. గురువారం తన కార్యాలయంలో ఆయా పంచాయతీల అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జూలై 12న నామినేషన్ల సమర్పణకు చివరి తేదీగా ప్రకటించారు. 13న నామినేషన్ పత్రాల పరిశీలన, 15న ఉపసంహరణ, 23న ఎన్నికలు జరుగుతున్నట్లు తెలిపారు. ఖాళీగా ఉన్న గ్రామ పంచాయతీలు తాలూకాలోని చానాళ్ జీపీలో ఒక స్థానం జనరల్, సిరుగుప్ప తాలూకా బీఎం సూగూరు పంచాయతీలో రెండు స్థానాలు సామాన్య, సామాన్య మహిళ, దేశనూరు జీపీలో ఒక స్థానం జనరల్, కుడుదరహాళ జీపీలో ఒక స్థానం సాధారణ మహిళకు, కంప్లి తాలూకాలోని 10 ముద్దాపుర జీపీలో రెండు స్థానాలు జనరల్‌కు రిజర్వ్ చేసినట్లు ఆయన తెలిపారు.

అత్తింటి ఆరళ్లపై ఫిర్యాదు

హుబ్లీ: అత్తింటి ఆరళ్లపై కోడలు ఫిర్యాదు చేసిన ఘటన ధార్వాడ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ధార్వాడ తాలూకా శివరగట్టి నివాసి లక్ష్మి అనే మహిళ గురువారం తన భర్త రాఘవేంద్రపై వరకట్న వేధింపుల ఆరోపణలపై ఫిర్యాదు చేసింది. మూడేళ్ల క్రితం పెళ్లైన తమకు ముగ్గురు పిల్లలున్నారు. పుట్టింటి నుంచి రూ.5 లక్షలు కట్నం తేవాలని భర్త రాఘవేంద్ర మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నట్లు తెలిపింది. అత్తమామలతో పాటు మరిది కూడా తన భర్తకు మద్దతు ఇస్తున్నారని ఆమె ఫిర్యాదులో వివరించింది.

జరిమానా చెల్లింపునకు రాయితీ

హుబ్లీ: పోలీసు శాఖలో దాఖలైన ఇ-చలాన కేసుల జరిమానా బకాయి మొత్తం చెల్లింపులో 50 శాతం రాయితీ ఇవ్వనున్నారు. ఆమేరకు సెప్టెంబర్ 9 వరకు ఈ అవకాశం ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు వాహన యజమానులు జరిమానాను కర్ణాటక-1 కేంద్రాలలో పాటు హుబ్లీ ధార్వాడ జంట నగరాల్లోని అన్ని పోలీస్ స్టేషన్లలో చెల్లించవచ్చని పోలీసు శాఖ ఓ ప్రకటనలో తెలిపింది.

హంతక భర్తకు జీవితఖైదు

మైసూరు: భార్యను హత్య చేసిన కేసులో భర్తకు మైసూరు 5వ జిల్లా సెషన్స్ కోర్టు జీవితఖైదుని విధించింది. మైసూరు తాలూకాలోని నగర్తహళ్ళి గ్రామానికి చెందిన రమేష్ నాయక్, 12 ఏళ్ల క్రితం కుమారి అనే మహిళను పెళ్ళి చేసుకోగా వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. సైకిల్ పైన పూలు అమ్మే రమేష్‌నాయక్ మద్యానికి బానిసై సంపాదించిన డబ్బంతా మద్యానికి ఖర్చుచేసేవాడు. భార్య కూలీ పనులు చేసి తెచ్చిన డబ్బును కూడా లాక్కుపోయేవాడు. 2021 ఫిబ్రవరి 25వ తేదిన ఉదయం మద్యానికి డబ్బులు ఇవ్వలేదని భార్య తలపై రాడ్‌తో కొట్టడంతో తీవ్ర గాయాలై చనిపోయింది. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. బుధవారం జడ్జి గురురాజు ఈ మేరకు తీర్పు చెప్పారు.

జల్సాల కోసం వాహనాల చోరీ

- ఇద్దరు అంతర్ జిల్లా నిందితుల అరెస్ట్


అరెస్ట్ అయిన నిందితులు వీరే

రాయచూరు రూరల్: అమ్మాయిలతో జల్సాల కోసం వాహనాల చోరీకి పాల్పడిన ఇద్దరు అంతర్ జిల్లా నిందితులు పట్టుబడినట్లు యాదగిరి జిల్లా ఎస్పీ వేదమూర్తి తెలిపారు. గురువారం తన కార్యాలయంలో ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. కెంబావి పోలీసులు అనుమానాస్పద రీతిలో సంచరిస్తున్న యువకులను అదుపులోకి తీసుకుని విచారించగా అసలు విషయాలు బయట పడ్డాయన్నారు. హుణసిగి తాలూకా కనగండనహళ్లి తాండాకు చెందిన దేవరాజ్(22), సురపుర తాలూకా పీరనాయక తాండాకు చెందిన శశికుమార్(22) అనే ఇద్దరు 20కి పైగా ద్విచక్రవాహనాలను చోరీ చేశారని తెలిపారు. మధ్యలో చదువు మానేసిన వీరు అమ్మాయిలను వెంటేసుకోని తిరగడానికి, వారి జల్సాల కోసం జిల్లాలో వివిధ ప్రాంతాల్లో ద్విచక్రవాహనాలను చోరీ చేసి వాటిని విక్రయించి మజా చేసేవారన్నారు. రాయచూరు, విజయపుర, యాదగిరి జిల్లాల్లో రాయల్ ఎన్‌ఫీల్డ్ వాహనాలను, మారుతీ జెన్ కారును దొంగిలించారన్నారు. వీరి వద్ద నుంచి రూ.28 లక్షల విలువ చేసే వాహనాలు, కారును స్వాధీనం చేసుకొన్నట్లు తెలిపారు.

నగరసభపై కాషాయ జెండా


అధ్యక్ష, ఉపాధ్యక్షులను అభినందిస్తున్న ఎన్నికల అధికారి సిద్ధరామేశ్వర, కౌన్సిలర్లు

హొసపేటె: నగరసభ నూతన అధ్యక్ష, ఉపాధ్యక్ష స్థానాలను తిరిగి బీజేపీ దక్కించుకొంది. గురువారం నగరసభ అధ్యక్ష, ఉపాధ్యక్ష స్థానాలకు జరిగిన ఎన్నికల్లో మరోసారి బీజేపీ వార్డు సభ్యులు ఎన్నికయ్యారు. 30వ వార్డు సభ్యురాలు ఏ.లతా అధ్యక్ష పదవిని, 5వ వార్డు సభ్యుడు రూపేష్‌కుమార్ ఉపాధ్యక్ష పదవిని దక్కించుకొన్నారు. స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందిన ఏ.లతా అనంతరం బీజేపీలో చేరారు. ఎన్నికల అధికారి సిద్ధరామేశ్వర ఆధ్వర్యంలో అధ్యక్ష, ఉపాధ్యక్ష స్థానాలకు ఎన్నికలు నిర్వహించారు. నగరసభలో మొత్తం 35 మంది సభ్యులుండగా, బీజేపీ సభ్యులదే పైచేయిగా ఉన్నందున రెండు స్థానాలను బీజేపీనే సులువుగా దక్కించుకొంది. అధ్యక్ష స్థానానికి 30వ వార్డు సభ్యురాలు ఏ.లతాతో పాటు 7వ వార్డు కాంగ్రెస్ సభ్యురాలు వి.కనకమ్మ నామినేషన్లు వేశారు. ఉపాధ్యక్ష స్థానానికి 5వ వార్డు సభ్యుడు రూపేష్‌కుమార్ ఒక్కరే నామినేషన్ అందించారు. మిగతా సభ్యులు ఉపాధ్యక్ష స్థానానికి నామినేషన్ వేయక పోవడంతో రూపేష్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. ఇక అధ్యక్ష స్థానానికి ఇద్దరు బరిలో నిలవగా ఏ.లతాకు 22 ఓట్లు, కనకమ్మకు 7 ఓట్లు లభించాయి. నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులను సభ్యులు అభినందించారు. ఈ సందర్భంగా నగరసభ అధికారి మనోహర్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చెరువులో చేపల మృత్యువాత

- సుమారు రూ.7 లక్షల మేర నష్టం
- ఎవరో విషం కలిపారని అనుమానం


చెరువులో మృతి చెందిన చేపలు

కంప్లి: తాలూకాలోని హెచ్.వీరాపుర వద్ద 12 ఎకరాల్లో చల్లా భాస్కర్‌నాయుడు అనే రైతు చెరువును ఏర్పాటు చేసుకుని చేపలను పెంచుతున్నారు. అయితే ఎవరో గుర్తు తెలియని దుండగులు చెరువులో విషం కలపడంతో సుమారు 7 టన్నుల మేర చేపలు మృత్యువాత పడ్డాయి. బుధవారం ఉదయం చేపలు పట్టేందుకు వచ్చినవారు చెరువులో తేలిన చేపలను చూసి వెంటనే రైతుకు సమాచారం అందించారు. చెరువు వద్దకు చేరుకొన్న భాస్కర్‌నాయుడు మరణించిన చేపలను చూసి దిగ్భ్రాంతికి గురయ్యారు. సుమారు రూ.7 లక్షల మేర నష్టం వాటిల్లిందని వాపోయారు. సంబంధిత అధికారులు పరిహారం అందించాలని, చెరువులో విషం కలిపిన వారిని పట్టుకొని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. గత 15 ఏళ్లుగా చేపల పెంపకం చేస్తున్నానని, ప్రస్తుతం అమ్మకానికి సిద్ధంగా ఉన్న సమయంలో దుండగులు చెరువులో విషం కలిపి చేపలను చంపడంతో పాటు చెరువుపై ఆధారపడ్డ కుటుంబాలను వీధిన పడేలా చేశారన్నారు. ఈ విషయంపై కురుగోడు పోలీసులకు ఫిర్యాదు చేస్తానని బాధిత రైతు భాస్కర్‌నాయుడు తెలిపారు.

నేటి బడ్జెట్‌పై జిల్లావాసుల కోటి ఆశలు

సాక్షి,బళ్లారి: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ సీఎం సిద్దరామయ్య శుక్రవారం ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌పై జిల్లా వాసులు కోటి ఆశలు పెట్టుకొన్నారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్య తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో 14వ సారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుండగా జిల్లాలోని అన్ని ఐదు అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీని ప్రజలు గెలిపించిన నేపథ్యంలో బడ్జెట్‌లో జిల్లాకు అగ్రస్థానం లభిస్తుందని ఎదురు చూస్తున్నారు. ముఖ్యంగా రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్రలో భాగంగా నగరానికి వచ్చినప్పుడు స్వయంగా ఆయన నగరంలోని జీన్స్ పరిశ్రమలను సందర్శించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మోతీ సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో బళ్లారిలో జీన్స్ పరిశ్రమలో వేలాది మంది జీవనం సాగిస్తున్నందున నగరంలోని అపారెల్ పార్కుకు తమ పార్టీ అధికారంలోకి వస్తే తొలి బడ్జెట్‌లోనే రూ.5 వేల కోట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం వెనుక జిల్లా వాసుల సహకారం కూడా ఎంతో ఉంది. ఈనేపథ్యంలో తొలి బడ్జెట్‌లోనే ముఖ్యమంత్రి సిద్దరామయ్య అపారెల్ పార్కుకు నిధులు ప్రకటిస్తారని ఆశిస్తున్నారు. దీంతో పాటు జిల్లాలో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో తీవ్రంగా ఉన్న మంచినీటి సమస్య, అస్తవ్యస్త పాఠశాలలు, రోడ్ల మరమ్మతులకు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బీ.నాగేంద్ర ప్రత్యేక నిధులు తెస్తారని భావిస్తున్నారు.

విజయపురలో మళ్లీ భూకంపం

- పలు గ్రామాల్లో జనం భయాందోళన

సాక్షి,బళ్లారి: విజయపుర జిల్లాలో పదే పదే భూకంపాలు ఏర్పడుతుండటంతో జనం భయాందోళన చెందుతున్నారు. బుధవారం అర్ధరాత్రి జిల్లాలోని ఐనాపుర, చుట్టుపక్కల గ్రామాల్లో భూమి కంపించడంతో స్థానికులు ఇళ్లు వదిలి పరుగులు తీశారు. రిక్టర్ స్కేల్‌లో 3.4 తీవ్రతతో భూమి కంపించినట్లు అధికారులు గుర్తించారు. అయితే ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకొన్నారు. జిల్లాలో పలు గ్రామాల్లో తరచు భూమి కంపిస్తుండటంతో నిపుణుల బృందం పరిశీలనకు విచ్చేశారు. జిల్లాలో భూకంపం రావడం సర్వసాధారణమైందని, భూమి నైసర్గిక స్వరూపం వల్ల ఇలాంటి పరిణామాలు చోటు చేసుకుంటున్నాయని అధికారులు గుర్తించారు. గత నాలుగేళ్లుగా భారీ వర్ష ప్రభావం వల్ల కూడా భూమి కంపించడానికి కారణమై ఉండొచ్చని తెలుస్తోంది. అయితే జనం ఎలాంటి భయాందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు.

కోలారు వార్తలు...

మాలూరులో వ్యాపారి కిడ్నాప్


కిడ్నాప్‌కు గురైన వ్యాపారి బాబు


కన్నీరు పెడుతున్న భార్య వరలక్ష్మి


బాబు నిర్వహిస్తున్న దుకాణం

- పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు

మాలూరు: రియల్ ఎస్టేట్ వ్యాపారం, ఫర్నీచర్ దుకాణం, సిమెంట్ డీలర్, ఇటుకల ఫ్యాక్టరీ నిర్వహిస్తున్న వ్యక్తిని గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్ చేసి రూ.5 కోట్లను డిమాండ్ చేసిన ఘటన బుధవారం రాత్రి పట్టణంలో జరిగింది. వివరాలు.. పట్టణంలోని మారుతి కాలనీకి చెందిన టింబర్ బాబు(56) కిడ్నాప్‌కు గురైన వ్యక్తి. టింబర్ బాబు పట్టణంలోని టీకల్ రోడ్డు తదితర ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారాలు, ఫర్నీచర్ దుకాణం, సిమెంట్ డీలర్ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. బాబు తాలూకాలోని హెడగినబెలె సమీపంలో ఉన్న ఇటుకల ఫ్యాక్టరీలో ఉండగా బుధవారం రాత్రి ఇటుకలను ఖరీదు చేసే నెపంతో వచ్చిన దుండగులు మాట్లాడుతూనే బాబును తమ కారులో అపహరించుకుని వెళ్లారు.

రూ.5 కోట్లివ్వాలని డిమాండ్

అనంతరం అదే రాత్రి టింబర్ బాబు మొబైల్ ఫోన్ నుంచే కుమారుడు మంజునాథ్‌కు ఫోన్ చేసి రూ.5 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మూడో వ్యక్తికి చెబితే మీ తండ్రిని చంపేస్తామని బెదిరించారు. దీంతో టింబర్ బాబు కుమారుడు మంజునాథ్, భార్య వరలక్ష్మిలు వెంటనే మాలూరు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న మాలూరు పోలీసులు జిల్లా ఎస్పీ నారాయణ నేతృత్వంలో 3 బృందాలుగా ఏర్పడి తనిఖీ ప్రారంభించారు. టింబర్ బాబు వ్యవహారాల విషయంలో పలువురితో వైషమ్యాలు కలిగి ఉండేవాడని తెలిసింది. టింబర్‌బాబు ఆరోగ్యం సరిగా లేక పార్శ్వవాయువు నుంచి కోలుకుంటుండగా, ప్రస్తుతం కిడ్నాప్ కావడంపై భార్య, కుమారుడు కన్నీరు మున్నీరవుతున్నారు. తమ ఆస్తులు అమ్మి అయినా డబ్బులు ఇస్తామని, తన భర్తను ప్రాణాలతో వదిలి పెట్టాలని భార్య వరలక్ష్మి ప్రాధేయపడుతోంది.

అద్దె ఆఫీసులను తరలించండి

కోలారు: నగరంలో ప్రైవేటు అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న ప్రభుత్వ కార్యాలయాలను ప్రభుత్వ భవనాల్లోకి తరలించాలని కోరుతూ కన్నడ సేన కార్యకర్తలు గురువారం జిల్లాధికారి అక్రం పాషాకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సేన జిల్లా అధ్యక్షుడు వెంకటప్ప మాట్లాడుతూ జిల్లాలో పలు శాఖల కార్యాలయాలను ప్రైవేటు భవనాల్లో వేలకు వేలు బాడుగ చెల్లించి నిర్వహిస్తున్నారన్నారు. నూతనంగా నిర్మించిన కలెక్టరేట్‌లో ఖాళీగా ఉన్న పలు కార్యాలయాల్లో వీటిని వెంటనే మార్చి ప్రభుత్వ సొమ్మును ఆదా చేయాలని కోరారు. ప్రభుత్వ కార్యాలయాలు అన్నీ ఒకే చోట ఉంటే ప్రజలకు కూడా ఎంతో అనుకూలమవుతుందన్నారు. సేన నగరాధ్యక్షుడు నాగేష్, కార్యదర్శి శ్రీధర్, నగర ప్రధాన కార్యదర్శి అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

వీధికుక్కల దాడిలో బాలుడికి గాయాలు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు

కోలారు: నగరంలోని కుశాల్ నగర్‌లో బుధవారం రాత్రి ఓ తొమ్మిదేళ్ల బాలుడిపై వీధి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. వెంటనే తల్లిదండ్రులు బాలుడిని నగరంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. తన మనుమడు సాహిల్‌పై జరిగిన వీధికుక్కల దాడిపై స్పందించిన మాజీ నగర సభ సభ్యుడు జాఫర్ సాబ్ నగరంలో వీధి కుక్కల బెడదను నివారించాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో జడ్జి తనిఖీ

శ్రీనివాసపురం: ముళబాగిలు ప్రభుత్వ ఆస్పత్రిని సీనియర్ సివిల్ జడ్జి సునీల్ ఎస్.హొసమని ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఆస్పత్రిలోని వార్డులు, మందుల గది తదితరాలను తనిఖీ చేశారు. మందుల గదిలో అవధి మీరిన మందులు ఉంచరాదని సిబ్బందికి సూచించారు. వైద్యులు, నర్సుల హాజరు పుస్తకాన్ని పరిశీలించారు. విధులకు గైర్హాజరైన సిబ్బంది వివరాలను తెలుసుకున్నారు. సమయానికి సరిగా విధులకు హాజరు కావాలని సిబ్బందిని ఆదేశించారు. వార్డులకు వెళ్లి పరిశీలించిన న్యాయమూర్తి వైద్యం ఎలా అందుతోందని రోగులను అడిగారు. ప్రభుత్వ ఆస్పత్రికి అధిక సంఖ్యలో వస్తున్న పేద రోగులకు సరైన చికిత్స అందించాలని సూచించారు. రోగులతో సౌజన్యంగా మెలగాలని తెలిపారు.

రోటరీ అధ్యక్షుడిగా రామచంద్రేగౌడ

కోలారు: కోలారు రోటరీ క్లబ్ నూతన అధ్యక్షుడిగా ఎంఎన్ రామచంద్రేగౌడ, కార్యదర్శిగా నాగానంద కెంపరాజ్ గురువారం రోటరీ భవనంలో బాధ్యతలను స్వీకరించారు. అనంతరం రామచంద్రేగౌడ మాట్లాడుతూ అందరి సహకారంతో సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామన్నారు. ఎల్‌సీసీ సుధాకర్, రోటరియన్ గోవిందరాజు, రాఘవేంద్ర, బి.శివకుమార్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ధర్మం, సంస్కృతి వేర్వేరు కాదు

కోలారు: ధర్మం, సంస్కృతి రెండూ వేర్వేరు కాదు, ఒక్కటేనని అఖిల భారతీయ సాహిత్య పరిషత్ జిల్లా అధ్యక్షురాలు మాయా బాలచంద్ర అన్నారు. గురువారం కల్లూరు గ్రామంలోని ఆదర్శ విద్యాలయంలో నిర్వహించిన వ్యాస జయంతిని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఆషాఢ మాసంలో జన్మించిన వ్యాస మహర్షి ఆది గురువుగా పేరొందారన్నారు. సమాజంలో గురువుకు ఉన్నత స్థానం ఉందన్నారు. సరైన గురువు లభిస్తే జీవితం సన్మార్గంలో నడుస్తుందన్నారు. అన్ని కాలాల్లోను గురువుకు అధిక ప్రాధాన్యత ఉందన్నారు. మనం సంస్కృతి, పరంపరకు వారసులుగా మానవీయ విలువలను అలవర్చుకోవాలన్నారు. తాలూకా కసాప అధ్యక్షురాలు మంజుల మాట్లాడుతూ నేటి యుగంలో ప్రాచీన కావ్యాలు, సామాజిక విలువలు కలిగిన గ్రంథాలు మూలన పడుతుండడం విచారకరమన్నారు. మహాభారతం వంటి మహాకావ్యాన్ని రచించిన వ్యాస మహర్షి నిత్యస్మరణీయుడన్నారు. తన కావ్యం ద్వారా సమాజానికి సరైన మార్గదర్శనం చేశారన్నారు. ప్రధానోపాధ్యాయురాలు రాణి, ఆనందకుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

అన్ని దానాల్లోకి రక్తదానం గొప్పది


రక్తదానం చేస్తున్న విద్యార్థులు

బొమ్మనహళ్లి : రక్తదానం చాలా గొప్పదని, ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారిని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని జగద్గురు రేణుకాచార్య న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ జయశ్రీ ఆర్ సాలిమట్ పిలుపునిచ్చారు. జాతీయ సేవా పథకం, రెడ్‌క్రాస సంస్థ ఆధ్వర్యంలో గురువారం కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన శిబిరంలో పిన్సిపాల్ పాల్గొని మాట్లాడారు. అత్యవసర సమయాల్లో రక్తం లభించక చాలా మంది మృతి చెందుతున్నారన్నారు. అలాంటివారిని కాపాడేందుకు యువత రక్తదానం చేయాలన్నారు. అనంతరం న్యాయ విద్యార్థులు రక్తదానం చేశారు.

బదిలీ ఆదేశాలు నిలుపుదల

మండ్య : కేఎస్ఆర్‌టీసీ బస్సు డ్రైవర్ జగదీష్ బదిలీ ఆదేశాలను రద్దు చేయాలని అధికారులను ఆదేశించినట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ఎన్.చెలువరాయ స్వామి తెలిపారు. బదిలీని నిరసిస్తూ డ్రైవర్ ఆత్మహత్యకు యత్నించగా ఆస్పత్రికి తరలించారు. ఈ విషయంపై మంత్రి మండ్యలో విలేకరులతో మాట్లాడారు. డ్రైవర్ రమేష్ ఆవేశంలో ఆత్మహత్యకు యత్నించాడన్నారు. ఈ విషయాన్ని జేడీఎస్ రాజకీయం చేస్తోందని మండిపడ్డారు.

కళాశాల విద్యార్థి ఆత్మహత్య


చార్లెస్(ఫైల్)

కృష్ణరాజపురం: విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన నగరంలోని బయ్యప్పనహళ్లి సమీపంలో ఉన్న కృష్ణయ్యన పాళ్యలో చోటు చేసుకుంది. చార్లెస్(18) అనే విద్యార్థి ప్రథమ పీయూసీ ఫెయిల్ అయ్యాడు. సప్లిమెంటరీ పరీక్షల్లో కూడా ఉత్తీర్ణత సాధించలేకపోయాడు. దీంతో తల్లిదండ్రులు మరో కళాశాలలో చేర్పించారు. రెండు పర్యాయాలు ఫెయిల్ అయిన తాను కొత్త కళాశాలలోచదివి ఎలా పాస్ అవుతాననే బెంగ పెట్టుకున్నాడు. ఈక్రమంలో బుధవారం రాత్రి ఇంటిలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. బయ్యప్పన హళ్లి పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

నైపుణ్యాలు వృద్ధి చేసుకోండి

గౌరిబిదనూరు : డిగ్రీ చివరి సంవత్సరం విద్యార్థులు చదువు ముగించి ఉద్యోగాల్లో చేరేనాటికి కౌశల్యం ఉంటే మంచి భవిష్యత్ ఉంటుందని సంపన్మూల వ్యక్తి సౌజన్య అన్నారు. ఉన్నతి ఫౌండేషన్ సహకారంతో పట్టణంలోని ప్రభుత్వ ఫస్ట్ గ్రేడ్ కళాశాలలో యునిక్స్ సంస్థ ఏర్పాటు చేసిన 30 రోజుల కౌశల్య శిక్షణా శిబిరాన్ని బుధవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఈ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని నైపుణ్యాలు వృద్ధి చేసుకోవాలన్నారు.

కొరియర్‌లో డ్రగ్స్

యశవంతపుర: రాజస్థాన్ నుంచి కొరియర్‌లో డ్రగ్స్ తెప్పిస్తున్న నిందితుడిని వీవీపురం పోలీసులు అరెస్ట్ చేశారు. అతనివద్దనుంచి రూ.60 లక్షలు విలువైన మత్తుపదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. రాజస్థాన్ నుంచి తెప్పించిన డ్రగ్స్‌ను బెంగళూరులోని కాలేజీ విద్యార్థులకు, ఐటీ సంస్థ ఉద్యోగులకు విక్రయిస్తున్నట్లు విచారణలో తేలిందని పోలీసులు తెలిపారు.

ఆర్కావతి నదిలో రసాయన వ్యర్థాలు


నది వద్ద రసాయనాలు కలిసిన ప్రదేశం

దొడ్డబళ్లాపురం : ఆర్కావతి నదిలో రసాయన వ్యర్థాలు కలిసిన కారణంగా రామనగర పట్టణంలో 11 వార్డులకు తాగునీటి సరఫరా నిలిపివేశారు. పాల్టిఫారం నుంచి నదిలోకి భారీగా రసాయన వ్యర్థాలు విడుదల చేయగా నీరు కలుషితమైనట్లు అధికారులు గుర్తించారు. ఇదే నీటిని సరఫరా చేస్తే ప్రజల ఆరోగ్యాలు దెబ్బతింటాయని భావించిన నీటి బోర్డు అధికారులు తాగునీటి సరఫరా నిలిపివేశారు.నీటిని కలుషితం చేస్తున్న పౌల్ట్రిఫారంపై చట్టపరమైన చర్యలకు అధికారులు సిఫార్సు చేశారు.

వైద్య సిబ్బందిని నియమిస్తాం

శివాజీనగర: తాలూకా ఆసుపత్రుల్లో వైద్యులు, నిపుణుల కొరత ఉందని, దీని పరిష్కారానికి ప్రయత్నిస్తానని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రి దినేష్ గుండూరావు చెప్పారు. విధానసభలో ఆయన మాట్లాడుతూ పలు చోట్లలో సముదాయ ఆరోగ్య కేంద్రాల భవనాలు ఉన్నాయి, కానీ వైద్యులు, ఇతర సిబ్బంది లేదు. అక్కడ నియామకానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఏడు పాత తాలూకాల్లో ఉన్న ఆసుపత్రులను వంద పడకల సామర్థ్యానికి పెంచాల్సి ఉందన్నారు. తమ నియోజకవర్గాల్లో డయాలసిస్ వసతిని కల్పించాలని పలువురు ఎమ్మెల్యేలు డిమాండ్‌చేశారు. మంత్రి జవాబిస్తూ మరో ఒకటిన్నర నెలలో దీనికి టెండర్ ప్రక్రియ ఖరారవుతుంది, అలాగే ఎయిడ్స్ రోగులకు ప్రత్యేక దయాలసిస్ వసతి కల్పించాలని డిమాండ్లు ఉన్నాయన్నారు.

హైరానా పెడుతున్న హెచ్ఐవీ

క్షయ, క్యాన్సర్ తదితర జబ్బులు సోకితే నిర్ణీత కాలం చికిత్స తీసుకుంటే నయమై మామూలు మనిషి కావచ్చు. కానీ ఒక్కసారి హెచ్ఐవీ వైరస్ సోకితే నయం కాదు, అది ముదిరిపోకుండా చూసుకుంటూ జీవించాల్సి ఉంటుంది. ఇంత భయంకరమైన హెచ్ఐవీపై అనేక వర్గాల్లో అవగాహన కరువై ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. సులభంగా హెచ్ఐవీ/ ఎయిడ్స్‌కు గురై జీవితాన్ని నరక ప్రాయం చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది.

- రాష్ట్రంలో ఏటేటా విస్తరిస్తున్న కేసులు
- నియంత్రణకు ఎయిడ్స్ సొసైటీ చర్యలు



హెచ్ఐవీ/ ఎయిడ్స్‌పై బెంగళూరులో జాగృతి ర్యాలీ (ఫైల్)


ఏఆర్‌టీ సెంటర్లలో రోగులకు ఉచితంగా ఔషధాలు ఇస్తారు

సాక్షి, బెంగళూరు: రాష్ట్రంలో హెచ్ఐవీ బాధితుల సంఖ్య క్రమంగా విస్తరిస్తున్న దాఖలాలున్నాయి. ప్రతిఏటా రెండు వేల కేసులు పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. రాష్ట్ర ఎయిడ్స్ ప్రివెన్షన్ సొసైటీ హెచ్ఐవీ పరీక్షలను పెంచడం ద్వారా బాధితులను గుర్తింపునకు ప్రయత్నిస్తోంది. హెచ్ఐవీ/ ఎయిడ్స్ మహమ్మారిని అరికట్టేందుకు పలు కార్యక్రమాలు చేపట్టినప్పటికీ కేసుల సంఖ్య అదుపులోకి రావడం లేదు. హెచ్ఐవీ బాధితుల్లో దేశంలో కర్ణాటక 17వ స్థానంలో ఉండడం కొంచెం మంచి విషయమే. కాగా, గతేడాది ఏకంగా రాష్ట్రవ్యాప్తంగా 13,338 మంది హెచ్ఐవీ బారిన పడ్డారు. 2020–21లో మొత్తం 10,095 మందికి, 2021–22లో 11,178 మందికి హెచ్ఐవీ సోకింది. కాగా, అసురక్షిత శృంగారం వల్లే హెచ్ఐవీ కేసులు ఎక్కువగా ప్రబలుతున్నట్లు ప్రభుత్వ సర్వేలో తేలింది.

లక్షిత వర్గాలకు టెస్టులు

ఈ నేపథ్యంలో ఎయిడ్స్ ప్రివెన్షన్ సొసైటీ హెచ్ఐవీ గురించి ముందస్తు జాగ్రత్తగా కొత్త కార్యక్రమాన్ని చేపట్టింది. హెచ్ఐవీ కేసులను తగ్గించేందుకు సొసైటీ కొత్త కార్యక్రమాన్ని రూపొందించింది. ఈ కార్యక్రమంలో భాగంగా లైంగిక కార్యకర్తలు (సెక్స్ వర్కర్స్), ట్రక్ డ్రైవర్లు, డ్రగ్స్ వాడేవారు, హిజ్రాలు, రోజువారీ కూలీలు ఎక్కువగా అసురక్షిత శృంగారంలో పాల్గొంటున్నారని సమీక్షలో సొసైటీ గుర్తించింది. వీరినే లక్షిత వర్గాలు అని పిలుస్తారు. వారి జాబితాను తయారు చేసి అందరికీ హెచ్ఐవీ టెస్టులను చేస్తోంది. వీరిలో పాజిటివ్ వచ్చిన వారికి వైద్య సేవలను, ఉచిత ఔషధాలను అందిస్తోంది. ఇప్పటికే 86 శాతం మేర ఈ కార్యక్రమం కార్యరూపం దాల్చింది.

ఏఆర్‌టీ కేంద్రాల్లో ఔషధాలు

రాష్ట్రంలో మొత్తం 71 ఏఆర్‌టీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో హెచ్ఐవీ బాధితులకు ఉచితంగా చికిత్స అందిస్తున్నారు. అయితే ఈ కేంద్రాల్లో అపరిశుభ్రత, నర్సులు, మందుల కొరత ఎక్కువగా వేధిస్తోంది. దీంతో బాధితులు ఇక్కడికి రావాలంటే భయపడాల్సి వస్తోంది. రాజీవ్‌గాంధీ వసతి యోజన కింద వసతి, చికిత్స, ఉచిత ప్రయాణానికి డబ్బులు చెల్లిస్తున్నారు. హెచ్ఐవీ బాధిత విద్యార్థులకు ఉచిత కాలేజీ విద్య, ఉపకార వేతనాలు, ధనశ్రీ యోజన కింద రూ. 40 వేల రుణం, ఉచిత రైల్వే ప్రయాణం, ఉచిత రక్తసేవలు వంటి అనేక సౌకర్యాలను ప్రభుత్వాలు బాధితులకు కల్పిస్తున్నాయి. అయితే ఇందులో 40 శాతం హెచ్ఐవీ బాధితులకు ఈ సౌలభ్యాలు చేరడం లేదు. 30 శాతం మందికి ఈ పథకాల సమాచారమే తెలియకపోవడం గమనార్హం.



దీర్ఘకాలం అనారోగ్య సమస్యలు పీడిస్తే హెచ్ఐవీ టెస్టు చేయించుకోవాలి

అజిత్ రై అక్రమాలపై దర్యాప్తు చేయించాలి

కృష్ణరాజపురం: ఆదాయానికి మంచి ఆస్తులు కూడబెట్టినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న తహసీల్దార్ అజిత్ రై అక్రమాలపై ఉన్నత స్థాయిలో దర్యాప్తు చేయించాలని జనతా రైతు సంఘం కార్యకర్తలు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం నగరంలోని బెంగళూరు ఉత్తర తాలూకా కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఈరేగౌడ మాట్లాడుతూ బెంగళూరు ఉత్తర తాలూకా తహసీల్దార్‌గా పనిచేసిన సమయంలో అజిత్ రై పెద్ద ఎత్తున అక్రమంగా ఆస్తులు సంపాదించారని, ఆయన్ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.


వినతిపత్రం అందజేస్తున్న కార్యకర్తలు

ఇంటినుంచే సంపాదన అంటూ వంచన

మైసూరు : ఇంటివద్దనుంచే పనిచేసి డబ్బు సంపాదించవచ్చంటూ నమ్మించిన దుండగులు ఇద్దరు మహిళలనుంచి నగదును తమ ఖాతాలకు బదిలీ చేయించుకున్నారు. మైసూరులోని శక్తి నగరకు చెందిన వై.సి. సుధారాణి సెల్‌ఫోన్‌కు వర్క్‌ఫ్రం హోం అనే మెసెజ్ ఒకటి వచ్చింది. అందులో ఉన్న నంబర్‌కు ఫోన్ చేయగా యూ ట్యూబ్ చానల్‌కు చందాదారులైతే సులభంగా డబ్బు సంపాదించవచ్చని అవతలి వ్యక్తి తెలిపాడు. దీంతో సుధారాణి వారు చెప్పిన ఖాతాకు రూ.50వేలు జమ చేయగా వంచకులు మరికొంత నగదు జతచేసి ఆమె ఖాతాకు బదిలీ చేశారు. దీంతో వారిని పూర్తిగా నమ్మిన సుధారాణి మరోమారు రూ. 95 వేలు నగదు జమ చేసింది. ఆ తర్వాత ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. మోసపోయినట్లు గుర్తించిన బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇదే తరహాలో వరుణ సమీపంలోని చాయా లేఔట్‌లో నివాసం ఉంటున్న శీలా గణపతి భట్ అనే మహిళ రూ. 1.5లక్షలు మోసపోయింది.

కారును లారీ ఢీకొని ఒకరి మృతి

మైసూరు: లారీ కారును ఢీకొని ఒకరు మృతి చెందారు. ఈ ఘటన పిరియా పట్టణ తాలూకా బైలకుప్పె సమీపంలోని బీఎం రోడ్డులో జరిగింది. బైలకుప్ప గ్రామానికి చెందిన నాగన్న కుమరుడు అభిలాష్(26) తన కారులో వెళ్తుండగా బైలుకుప్పె నుంచి పిరియా పట్టణం వెళుతున్న లారీ ఢీకొంది. ప్రమాదంలో అభిలాష్ అక్కడికక్కడే మృతి చెందగా కారు డ్రైవర్ సందీప్ గాయపడ్డాడు. అతన్ని కుశాలనగర ఆస్పత్రికి తరలించినట్లు బైలుకుప్పె పోలీసులు తెలిపారు.

డోర్ లేని బస్సు నుంచి పడి గాయాలు


గాయపడిన శివరాము

దొడ్డబళ్లాపురం : డోర్ లేని బస్సునుంచి కింద పడి ప్రయాణీకుడు తీవ్రంగా గాయపడ్డ సంఘటన కనకపుర తాలూకాలో జరిగింది. ముళ్లహళ్లి గ్రామ నివాసి శివరాము హారోహళ్లి డిపోకు చెందిన డోర్ లేని కేఏ 42 ఎఫ్ 2156 ఎక్స్‌ప్రెస్ బస్సులో బెంగళూరు నుంచి కనకపురకు బయల్దేరాడు. శివరాము డోరు వద్ద సీట్లో కూర్చుని ఉండగా మలుపురావడంతో బస్సు వంపు తిరిగినప్పుడు విసిరేసినట్లుగా కిందపడి గాయపడ్డాడు. డ్రైవర్ బస్సు నిలిపివేసి క్షతగాత్రుడితోపాటు ప్రయాణీకులను వేరే బస్సులో పంపించాడు. కగ్గలీపుర పోలీసులు బస్సును పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదుచేశారు.

రూ.18 లక్షల చోరీ సొత్తు స్వాధీనం

యశవంతపుర: విలావంతమైన జీవనం కోసం బైకులు, సెల్‌ఫోన్లు చోరీ చేస్తున్న ఇద్దరు తమిళనాడు వాసులను వీవీ పురం పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రూ.18 లక్షలు విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు.

ఆటో బోల్తా ఒకరి మృతి

యశవంతపుర: అదుపు తప్పి ఆటో ఓమ్ని వ్యాన్‌ను ఢీకొని బోల్తా పడిన ప్రమాదంలో డ్రైవర్ మృతి చెందాడు. ఈ ఘటన రాజాజీనగర ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలో బుధవారం అర్ధరాత్రి జరిగింది. చంద్రాలేఔట్ మారుతీనగరకు చెందిన రంగనాథ్(46) ఆటోలో రాజ్‌కుమార్ రోడ్డులో వెళ్తూ యశస్విని సిగ్నల్ వద్ద అదుపుతప్పి వ్యాన్‌ను ఢీకొన్నాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రంగనాథ్ అక్కడికక్కడే మృతి చెందాడు.

8న క్రిస్టియన్ మైనార్టీ కౌన్సిల్ బోర్డు ప్రారంభోత్సవం

శివాజీనగర: రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన కర్ణాటక క్రిస్టియన్ మైనార్టీ కౌన్సిల్ బోర్డు(కేసీఎంసీబీ) సంస్థను ప్రముఖ క్రైస్తవ నాయకులు ఈ నెల 8న ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు గురువారం తెలిపారు. నగరంలోని శేషాద్రిపురం వరదాచారి కళాక్షేత్రంలో జరిగే ఈ కార్యక్రమంలో సీసీఈఐ దయాసిస్ జాతీయ అధ్యక్షుడు బిషప్ డాక్టర్ రాజమని పాపయ్య, ఉపాధ్యక్షుడు, ప్రముఖ న్యాయవాది డాక్టర్ సగిలీ రమేశ్‌కుమార్, హుబ్లీ మెస్సయ్య, మినిస్ట్రీస్ నిర్వాహకులు పాస్టర్ కే.ఓబుల్ రావు పాల్గొని కేసీఎంసీబీ గురించి విశదీకరిస్తారని తెలిపారు.

ప్రాణం తీసిన మద్యం మత్తు


నంజుండస్వామి మృతదేహం

కృష్ణరాజపురం: మద్యం మత్తులో ఆటో నడుపుతూ డివైడర్‌ను ఢీకొని ఆటో డ్రైవర్ మృతి చెందాడు. ఈఘటన లగ్గేరి వద్ద ఉన్న రింగ్ రోడ్డులో జరిగింది. నంజుండస్వామి(29) అనే వ్యక్తి ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు.ఇతను బుధవారం రాత్రి మరో ఇద్దరితో కలిసి మందు పార్టీ చేసుకున్నారు. అర్ధరాత్రి దాటిన తర్వాత ముగ్గురూ ఆటోలో బయల్దేరారు. మత్తులో ఉన్న నంజుండ స్వామి ఆటోను అదుపు చేయలేకపోవడంతో డివైడర్‌ను ఢీకొంది. ప్రమాదంలో నంజుండస్వామి మృతి చెందగా మిగతా ఇద్దరు గాయపడ్డారు. రాజాజీనగర పోలీసులు క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

రైతు కొంపముంచిన నాసిరకం విత్తనాలు


కంకులు సరిగా కాయని పంటను చూపుతున్న రైతు వాసు

దొడ్డబళ్లాపురం : నాసిరకం విత్తనాలతో రైతు నష్టపోయిన ఘటన దేవనహళ్లి తాలూకా తురువనహళ్లి గ్రామంలో జరిగింది. వాసు అనే రైతు మూడు నెలల క్రితం తూబుగెరెలోని విత్తనాల విక్రయ దుకాణంలో ఓ కంపెనీకి చెందిన మొక్కజొన్న విత్తనాలు ఖరీదుచేసి మూడు ఎకరాల్లో సాగు చేశాడు. లక్ష రూపాయల మేర పెట్టుబడి పెట్టాడు. అవసరమైన ఎరువులు, మందులు వినియోగించాడు. పంట ఏపుగా పెరిగినా కంకులు మాత్రం అంతగా కనబడడం లేదు. ఇదేమని ప్రశ్నిస్తే కోర్టుకు వెళ్లమని విత్తనాల విక్రేతలు చెబుతున్నారని రైతు వాపోతున్నాడు. కాగా వ్యవసాయశాఖ అధికారులు పంటను పరిశీలించారు.

ఆదుకుంటానని మేనత్త కొడుకు వంచన

యశవంతపుర: భర్త నుంచి దూరమైన ఓ మహిళను ఆదుకుంటానని చెప్పిన మేనత్తకుమారుడు పెళ్లి చేసుకుంటానని నమ్మించి సహజీవనం చేసి చివరకు చేతులు ఎత్తేశాడు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. పీణ్యా పోలీసుస్టేషన్ పరిధిలో నివాసం ఉంటున్న బాధితురాలు భర్తతో విభేదించి దూరంగా ఉంటోంది. మేనత్త కుమారుడు కిరణ్‌కుమార్ తాను పెళ్లి చేసుకుంటానని నమ్మబలకడంతో ఆరేళ్లుగా అతనితో సహజీవనం చేస్తోంది. కిరణ్‌కుమార్ పనికి వెళ్లకపోయినా ఆమే కష్టించి పనిచేసి పోషించేది. ఆమె ఇటీవల గర్భం దాల్చింది. పెళ్లి చేసుకోవాలని కోరగా పెద్దలు ఒప్పుకోలేదని చేతులెత్తేశాడు. 15 రోజుల క్రితం రూ.ఐదు వేలు డబ్బు తీసుకొని వెళ్లి తిరిగి రాలేదు. అత్త ఇంటికి వెళ్లి తమకు పెళ్లి చేయాలని బాధితురాలు కోరగా అత్త లక్ష్మమ్మ, మురళి, నిందితుడు కిరణ్‌కుమార్ బెదిరింపులకు పాల్పడ్డారు. ఇంటివద్దకు వస్తే కాళ్లు చేతులు నరుకుతామంటూ బెదిరించినట్లు బాధితురాలు పీణ్యా పోలీసులకు ఫిర్యాదు చేసింది.

పెళ్లి చేసుకుంటానని వంచన

పెళ్లి చేసుకుంటానని నమ్మించి యువతిని వంచించిన ఘటన యలహంక ఉపనగరలో జరిగింది. ఏపీకి చెందిన యశ్వంత్, 22 సంవత్సరాల వయసున్న యువతి ఒకే సంస్థలో పనిచేస్తున్నారు. ఇద్దరి మధ్య పరిచయం ప్రేమకు దారితీసింది. ఇద్దరు కలిసి ఒకే గదిలో ఉండేవారు. అయితే చెప్పాపెట్టకుండా యశ్వంత్ ఉడాయించాడు. దీంతో బాధితురాలు యలహంక ఉపనగర పోలీసులకు ఫిర్యాదు చేసింది.

హోసూరు వార్తలు..

టమాట రైతుల్లో సంతోషం


హోసూరు ప్రాంతంలో రైతులు పండిస్తున్న టమాట


హోసూరు: టమాట ధరలు రోజురోజుకూ పెరిగిపోతుండడంతో పంట సాగు చేస్తున్న రైతులు హర్షం చేస్తుండగా, వినియోగదారుల్లో బేజారు ఏర్పడింది. జిల్లాలోని సూళగిరి, హోసూరు, అంచెట్టి, డెంకణీకోట తాలూకాల్లో వాణిజ్య పంటలకు అనుకూలమైన శీతోష్ణస్థితి ఉండడంతో పెద్దఎత్తున కూరగాయల పంటలను సాగు చేస్తున్నారు. ఈసారి ఎక్కువ విస్తీర్ణంలో టమాట పంటను సాగు చేశారు. పంటకు తగ్గ దిగుబడి రాకపోవడంతో డిమాండు పెరిగిందని, హోసూరు, రాయకోట మార్కెట్‌లలో కిలో ధర రూ.130 వరకు ఉందని రైతులు తెలిపారు. ఇవే ధరలు కొన్నిరోజులు కొనసాగితే లాభాలను గడిస్తామని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

పొలాల్లోనే దోపిడీలు

టమాటా ధరలు ఆకాశాన్నంటడంతో కొంత మంది దొంగలు తోటలు, పొలాల్లో టమాటాలను చోరీ చేస్తున్నారు. దీంతో రైతులు రాత్రి పూట కూడా పొలాల వద్ద కాపలా ఉంటున్నారు.

బనశంకరీదేవికి విశేష పూజలు

బనశంకరి: సంకష్టహరచతుర్థి సందర్భంగా బనశంకరీదేవికి విశేషపూజలు నిర్వహించారు. గురువారం వేకువజామున సుప్రభాతసేవ అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు సత్యనారాయణశాస్త్రి, చంద్రమోహన్ ఆధ్వర్యంలో అమ్మవారి మూలవిరాట్‌ను పూలతో అలంకరణ చేపట్టి విశేషపూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి నిమ్మకాయల ప్రమిదలతో దీపారాధన చేసి మొక్కుబడులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంచి పెట్టారు.


విశేష అలంకరణలో అమ్మవారి మూలవిరాట్

దేవునిపై భారం వేసి విత్తనం

చింతామణి: ఖరీఫ్ ప్రారంభమై నెల గడిచినా వర్షాలు పుంజుకోవడం లేదు. రైతులు నిత్యం ఆకాశం వైపు చూస్తూ వరుణుడి కరుణ కోసం ఎదురు చూస్తున్నారు. ఈక్రమంలో ఇటీవల తాలూకాలో కురిసిన కొద్దిపాటి వర్షాలకు భూములు అరకొరగా పదునయ్యాయి. దీంతో రైతులు విత్తనం వేస్తున్నారు. నారాయణపల్లి గ్రామానికి చెందిన రైతు మాట్లాడుతూ వరుణదేవున్ని నమ్ముకొని విత్తనాలు వేస్తున్నామన్నారు.


వేరుశనగ విత్తనం వేస్తున్న దృశ్యం

ప్రతి జిల్లాలో మెడికల్ కళాశాల

శివాజీనగర: రాష్ట్రంలో ప్రతి జిల్లాలో మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేయాలనేది తమ ప్రభుత్వ విధానమని వైద్యవిద్యా శాఖ మంత్రి డాక్టర్ శరణప్రకాశ్ పాటిల్ తెలిపారు. గురువారం విధానసభలో ప్రశ్నోత్తరాల సమయంలో బీజేపీ సభ్యుడు దినకర్ శెట్టి, యశపాల్ ఏ.సువర్ణ అడిగిన ప్రశ్నలకు మంత్రి పైవిధంగా సమాధానం ఇచ్చారు. కొత్త మెడికల్ కళాశాలల ఏర్పాటుకు రూ.610 కోట్లు ఖర్చు అవుతుందన్నారు. నిధుల లభ్యతను దృష్టిలో పెట్టుకొని కళాశాలలు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రస్తుత సంవత్సరంలో ఉడుపి జిల్లాలో మెడికల్ కళాశాల ఏర్పాటుకు అవకాశం లేదన్నారు. ఉత్తర కన్నడ జిల్లా కుమటా తాలూకాలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటు చేయాలనే ఆలోచన ఉందన్నారు.

స్టేడియం పరిశీలన


నిపుణుడితో చర్చిస్తున్న దృశ్యం

చింతామణి: ఝాన్సీస్టేడియాన్ని యుఎస్ఏ నిపుణుడు అనిల్‌కుమార్ గురువారం పరిశీలించారు. స్టేడియాన్ని క్రీడలకు అనువుగా ఎలా తయారు చేయాలి, క్రీడాకారులకు ఎలాంటి సదుపాయాలు కల్పించాలనే అంశాలపై మంత్రి సుధాకర్ అన్న బాలాజీ, ప్రజాపనుల శాఖ అధికారి సుబ్బారెడ్డి చర్చించారు.

పచ్చదనం పెంపొందించాలి

బనశంకరి: పరిసరాల సంరక్షణ అందరి బాధ్యత అని గోకుల శిక్షణా ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు, మాజీ మంత్రి ఎంఆర్.సీతారాం అన్నారు. ఎంఎస్.రామయ్య జన్మ శతమానోత్సవం సందర్భంగా ఎంఎస్.రామయ్య ఆర్ఐటీ కాలేజీ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు డాలర్స్‌కాలనీలోని బులేవార్డుపార్కులో గురువారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంఆర్.సీతారాం పాల్గొని మాట్లాడారు. ప్రతి 5 మంది విద్యార్థులు ఒక మొక్కను దత్తత తీసుకొని పరిరక్షించాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్వీఆర్ నాయుడు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రదీప్‌కుమార్‌దీక్షిత్, ఎన్ఎస్ఎస్ డైరెక్టర్ పుట్టబోరేగౌడ పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న ఎంఆర్.సీతారాం, విద్యార్థులు

'మంత్రిని తొలగించాలి'

మైసూరు : మండ్య జిల్లా నాగమంగలలో కేఎస్ఆర్‌టీసీ బస్సు డ్రైవర్ ఆత్మహత్యా యత్నం చేసిన ఘటనకు సంబంధించి మండ్య జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ఎన్. చెలువరాయ స్వామిని పదవినుంచి తొలగించాలని మాజీ సీఎం కుమార స్వామి డిమాండ్ చేశారు. మైసూరులోని మణిపాల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బస్సు డ్రైవర్ జగదీష్‌ను గురువారం కుమారస్వామి పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో బదిలీల దందా జరుగుతోందని, డబ్బు ఉంటేనే బదిలీలు చేస్తున్నారని ఆరోపించారు.

అదనపు ఎస్పీ నగర పర్యటన


సూచనలు ఇస్తున్న అదనపు ఎస్పీ మరియప్ప

తుమకూరు : తుమకూరు నగరంలో ట్రాఫిక్ సమస్య తీవ్రతరం కావడంతో అదనపు ఎస్పీ మరియప్ప రంగంలోకి దిగారు. గురువారం ఆయన స్వయంగా ప్రధాన మార్గాల్లో పర్యటించారు. ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద నిలబడి వాహన సంచారాన్ని క్రమబద్ధీకరించారు. ట్రాఫిక్ పోలీసులకు సూచనలు, సలహాలు ఇచ్చారు.

అన్నదాత ఆత్మహత్య

పావగడ: అప్పుల బాధ తాళలేక అన్నదాత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని కిలార్లహళ్లిలో గురువారం జరిగింది. గ్రామానికి చెందిన భీమప్ప(62) అనే రైతు పంటల సాగుకు పెట్టుబడుల కోసం బ్యాంకులో, ప్రైవేటు వ్యక్తుల వద్ద అప్పులు చేశాడు. పంటలు సరిగా పండక, చేసిన అప్పులు తీర్చలేకపోయాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గురునాథ్ తెలిపారు.

ఓటింగ్ యంత్రాల తనిఖీ

హోసూరు: క్రిష్ణగిరి కలెక్టరేట్‌లో నిలువ ఉంచిన ఓటింగ్ యంత్రాల మరమ్మత్తు పనులను గురువారం కేంద్ర ఎన్నికల సంఘం జిల్లా పర్యవేక్షకులు రాకేశ్‌కుమార్ పరిశీలించారు. రాబోయే 2024లో జరిగే పార్లమెంట్ ఎన్నికలకు ఈవీఎంలను సిద్ధం చేయాలని, అవసరమైతే మరమ్మతులు చేయాలని ఈసీ ఆదేశించింది. ఇక్కడ రోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు ఓటింగ్ యంత్రాల మరమ్మతు పనులు వేగవంతంగా సాగుతున్నాయి. ఈ పనులను జిల్లా కలెక్టర్ శరయు నేతృత్వంలో పర్యవేక్షణాధికార్లు రాకేష్‌కుమార్, రితీష్‌కుమార్, అఖిల పక్ష పార్టీల నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అధికార్లు భవంతి, వేడియప్పన్, జయశంకర్, అఖిల పక్ష పార్టీల నాయకులు ఉన్నారు.

యల్లమ్మదేవి ఆలయంలో చోరీ

క్రిష్ణగిరి: సూళగిరి సమీపంలోని సారకాయలపల్లిలో కొలువైన గ్రామదేవత యల్లమ్మదేవి ఆలయంలో చోరీ జరిగింది. బుధవారం రాత్రి దుండగులు ఆలయం తాళాలు పగులగొట్టి లోనికి చొరబడి అమ్మవారి మెడపై ఉన్న రూ.5 పొన్ల బంగారు నగలు, హుండీలో ఉన్న కానుకలు, డబ్బును దోచుకెళ్లారు. స్థానికుల ఫిర్యాదు మేరకు సూళగిరి పోలీసులు ఆలయానికి వెళ్లి పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసుకొని దుండగుల కోసం గాలిస్తున్నారు.

ప్రజా సమస్యలపై ఆరా

కెలమంగలం: తళి యూనియన్‌లోని మరుదాండపల్లి పంచాయతీలో చైర్మన్ శ్రీనివాసరెడ్డి పర్యటించి సమస్యలను తెలుసుకొన్నారు. తళి సమితిలోని మరుదాండపల్లి పంచాయతీ ఒన్నుంపల్లి గ్రామంలో తాగునీరు, రోడ్ల వసతులు కల్పించాలని స్థానిక ప్రజలు చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన గురువారం వెళ్లి పరిశీలించారు. అధికార్ల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని స్థానిక ప్రజలకు హామీ ఇచ్చారు.

బైక్ ప్రమాదంలో యువకుడు మృతి

హోసూరు: క్రిష్ణగిరి సమీపంలో ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొన్న ప్రమాదంలో ఒక యువకుడు చనిపోగా మరో యువకుడు గాయపడ్డాడు. వివరాల మేరకు తిరుపత్తూరుజిల్లా జొన్నరామ్‌పల్లి గ్రామానికి చెందిన తిరుకుమరన్ (20) అదే ప్రాంతంలోని ప్రైవేట్ కళాశాలలో ఇంజినీరింగ్ చదువుతున్నాడు. బుధవారం రాత్రి మిత్రుడు సుభాష్ (20)తో కలిసి బైక్ మీద సింగారపేట వద్ద వెళుతుండగా లారీ ఢీకొనింది. సుభాష్ ఒక ప్రైవేటు కంపెనీలో పనిచేసేవాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలేర్పడిన సుభాష్ ఘటనా స్థలంలోనే మృతి చెందగా తిరుకుమరన్ తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు అతన్ని ఆస్పత్రికి తరలించి సింగారపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని విచారణ జరుపుతున్నారు.

అడవులను పరిరక్షించుకోవాలి

క్రిష్ణగిరి: అడవులను పరిరక్షించుకోవడం మనందరి బాధ్యత అని, వన్య ప్రాణులను వేటాడరాదని ప్రజల్లో చైతన్యం కల్పిస్తూ గురువారం తాలూకా కేంద్రం సూళగిరిలో అటవీశాఖ ద్వారా చైతన్య కార్యక్రమాన్ని చేపట్టారు. జిల్లా అటవీశాఖాధికారిణి కార్తికేయిని ఆదేశాల మేరకు అటవీశాఖాధికార్లు పార్థిభన్, పన్నీర్‌సెల్వం తదితరుల బృందంచే వీధి నాటక ప్రదర్శనద్వారా ప్రజలకు చైతన్యం కల్పించారు. సూళగిరి తాలూకాలో ప్రధానంగా సూళగిరి, పేరండపల్లి, శానమావు, తీర్థం, బేరికె తదితర ప్రాంతాల్లో దట్టమైన అడవులున్నాయని తెలిపారు. అటవీ ప్రాంత గ్రామాల రైతులు పొలాల వద్ద విద్యుత్ కంచెలు ఏర్పాటు చేసి, కొందరు వేటకు పాల్పడి వన్య ప్రాణులను చంపుతున్నారని, ఇది తగదని తెలిపారు. వన్య ప్రాణులపై దాడులు చేయరాదని, మొక్కలు నాటి పచ్చదనం పెంచాలని విజ్ఞప్తి చేశారు.


ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం

క్లుప్తంగా...

ఎన్నికలు ఎప్పుడొచ్చినా వైఎస్సార్‌సీపీదే గెలుపు

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



సాక్షి, న్యూఢిల్లీ: ఏపీలో ఎన్నికలు ఎప్పుడొచ్చినా సీఎం వైఎస్ జగన్ నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీదే విజయమని పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. ఆయన గురువారం ఢిల్లీలోని ఏపీ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. ముందస్తు ఎన్నికలకు వెళ్లాల్సిన అవసరం వైఎస్సార్‌సీపీకి లేదన్నారు. పార్టీలన్నీ ఏకమై వచ్చినా ఒంటరిగా ఎదుర్కొని గెలుస్తామన్నారు. చంద్రబాబు హయాంలో పౌరసరఫరాల శాఖ దివాలా తీసిందని చెప్పారు. రూ.20 వేల కోట్ల అప్పు చేసి పసుపు–కుంకుమ పథకానికి మళ్లించారని ఆరోపించారు. వైఎస్ జగన్ ప్రభుత్వం వచ్చిన తర్వాత.. ఆ అప్పులన్నీ తీర్చి మళ్లీ శాఖను గాడిలో పెట్టామన్నారు. కాగా.. ఏపీ భవన్ ప్రాంగణంలో నాణ్యతలేని బియ్యం అమ్ముతున్నారన్న ఫిర్యాదులపై మంత్రి స్పందించారు. ఆ దుకాణాన్ని సందర్శించి.. నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దుకాణాన్ని మూసివేయాలని ఆదేశించారు. ఏపీ భవన్ సిబ్బంది ఆధ్వర్యంలో నాణ్యమైన బియ్యం తక్కువ ధరకే అందజేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

నాపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు

జేపీ నడ్డాతో పురందేశ్వరి భేటీ



సాక్షి, న్యూఢిల్లీ : బీజేపీ ఏపీ అధ్యక్షురాలిగా నియమిస్తూ తనపై ఉంచిన నమ్మకానికి పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాకు దగ్గుబాటి పురందేశ్వరి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ రాష్ట్ర చీఫ్‌గా నియామకం జరిగిన తర్వాత అమర్‌నాథ్ యాత్ర ముగించుకుని ఢిల్లీ వచ్చిన పురందేశ్వరి గురువారం బీజేపీ కేంద్ర కార్యాలయంలో అధ్యక్షుడు జేపీ నడ్డాతో భేటీ అయ్యారు. రాష్ట్ర అధ్యక్షురాలిగా అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ భేటీలో ఏపీలోని తాజా రాజకీయ పరిస్థితులపై వారు చర్చించారు. కాగా తనకు అప్పగించిన బాధ్యత పట్ల తన నిబద్ధత గురించి జేపీ నడ్డాకు హామీ ఇచ్చానని భేటీ అనంతరం పురందేశ్వరి ట్వీట్ చేశారు. ఏపీలో బీజేపీని బలోపేతం చేసేందుకు కృషిచేయడంతో పాటు ఏపీ, ఆంధ్రుల ప్రయోజనాలను కాపాడేందుకు కూడా కృషిచేస్తానని ఆమె పేర్కొన్నారు.

రాష్ట్రంలో జియో భారత్ ఫోన్లు విడుదల

కాంప్లిమెంటరీ కింద 400 మందికి ఉచితంగా అందజేత

సాక్షి,అమరావతి: అతి చౌక ధర కలిగిన జియో భారత్ స్మార్ట్‌ఫోన్లు రిలయన్స్ రాష్ట్ర మార్కెట్లోకి విడుదల చేసింది. కేవలం రూ.999కే ఇంటర్నెట్ ఎనేబుల్డ్ ఫోన్‌ను జియో భారత్ పేరిట రిలయన్స్ ప్రవేశపెట్టింది. రాష్ట్ర మార్కెట్లోకి ప్రవేశపెడుతోన్న సందర్భంగా పలు కార్యక్రమాల ద్వారా ఎంపిక చేసిన 400 మందికి కాంప్లిమెంటరీ కింద ఫోన్లను ఉచితంగా అందచేసింది. ఈ ఫోన్ ద్వారా యూపీఐ సేవలను వినియోగించుకోవచ్చని జియో సంస్థ తెలిపింది. జూలై 7 నుంచి ఈ ఫోన్లు దేశవ్యాప్తంగా అందుబాటులోకి వస్తాయని పేర్కొంది.

9 నుంచి రెండో దశ వారాహి యాత్ర

సాక్షి, అమరావతి: జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ వారాహి విజయ యాత్ర రెండో దశను ఈ నెల 9వ తేదీన ఏలూరులో ప్రారంభిస్తారని ఆయనకు రాజకీయ కార్యదర్శిగా వ్యవహరిస్తున్న పి.హరిప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 9న సాయంత్రం 5 గంటలకు ఏలూరులో పవన్ బహిరంగ సభ నిర్వహిస్తారని ఆయన పేర్కొన్నారు.

తెలంగాణ

తల్లి వదిలేస్తే.. తండ్రే సంరక్షకుడు: తెలంగాణ హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: జన్మనిచ్చిన తల్లి పిల్లలను వదిలేస్తే.. తండ్రే సంరక్షకుడు అవుతాడని తెలంగాణ హైకోర్టు పేర్కొంది. ఆయనకు పిల్లలపై హక్కులుంటాయని వ్యాఖ్యానించింది. పంజాబ్‌లోని మొహాలీకి చెందిన సచిన్‌కుమార్ యాదవ్, హైదరాబాద్‌కు చెందిన ముస్లిం మహిళ సైదా సరన్ ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. సైదా తల్లిదండ్రులు ఆమెను హైదరాబాద్‌కు తీసుకొచ్చి తిరిగి పంపలేదు. దీంతో తన భార్యను అప్పగించాలని సచిన్ సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. అయితే భార్య తరఫు వారు ఆమెను పంపేందుకు అంగీకరించలేదు. దీంతో దంపతులు విడాకులు తీసుకున్నారు. ఇదిలా ఉండగా, తాను కుమారుడిని పెంచలేనని సైదా సరన్.. హైదరాబాద్ అమీర్‌పేటలోని జిల్లా చైల్డ్ వెల్ఫేర్ అధికారికి బాబును అప్పగించారు. ఇది తెలిసిన సచిన్ తన కుమారుడిని తనకు అప్పగించేలా ఆ అధికారికి ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ కె.లక్ష్మణ్, జస్టిస్ శ్రీసుధ ధర్మాసనం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం.. తల్లి పూర్తిగా వదిలేసినప్పుడు సహజ సంరక్షకుడైన తండ్రికే బాలుడిని అప్పగించాలని అధికారులను ఆదేశించింది.

అతడొక ‘దుష్ట గురువు’

రామోజీపై మండిపడ్డ కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి

- చంద్రబాబు, రామోజీ నిష్క్రమణతోనే రాష్ట్రానికి విముక్తి
- వాస్తవాలు చెబుతున్నాననే నాపై విషపు రాతలు
- నీకంత నిబద్ధత ఉంటే సీఐడీ విచారణకు హాజరు కావేం?
- ఊరు, పేరు లేకుండా భయం భయంగా దొంగ రాతలా?
- ధైర్యముంటే నాపై ఆరోపణలను నిరూపించు
- నీ ఈనాడు టీమ్ లేదా మీ కుల టీమ్‌ను పంపించుకో
- రెడ్డి సామాజిక వర్గమే లక్ష్యంగా పదేపదే తప్పుడు కథనాలు



రామోజీ దిష్టిబొమ్మను, ఈనాడు ప్రతులను దహనం చేస్తున్న దృశ్యం

సాక్షి ప్రతినిధి, కాకినాడ: రాజకీయాల నుంచి చంద్రబాబు, ఈ భూమ్మీద నుంచి రామోజీరావు నిష్క్రమించినప్పుడే రాష్ట్రంలో కుల రాజకీయాలకు విముక్తి లభిస్తుందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి వ్యాఖ్యానించారు. ‘రామోజీకి ధైర్యం ఉంటే, ఆరోపణలకు ఆధారాలుంటే నా పేరు పెట్టి వార్త ప్రచురించాలి. భయం భయంగా ఊరు, పేరు లేకుండా దొంగరాతలు రాయడం కాదు. ఈనాడు టీమ్ లేదా మీ కుల టీమ్‌ను పంపించి నాపై ఆరోపణలను నిరూపిస్తే రాజకీయ సన్యాసం తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నా’ అని ద్వారంపూడి సవాల్ చేశారు. రామోజీ తప్పుడు రాతలను ప్రజాక్షేత్రంలో ఉన్నందున ఖండించాల్సి వస్తోందన్నారు. తమ సామాజిక వర్గం మాత్రమే రాజకీయాలను శాసించాలనే కులపిచ్చితో రామోజీ, చంద్రబాబు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ‘అతడొక అరాచకం’ శీర్షికన గురువారం ఈనాడు ప్రచురించిన కథనంపై ఎమ్మెల్యే ద్వారంపూడి కాకినాడలో మీడియాతో మాట్లాడారు. వాస్తవాలు చెబుతున్నందువల్లే ఉక్రోషంతో రామోజీ తనపై అభూత కల్పనలతో కథనాలను ప్రచురించారని ధ్వజమెత్తారు. రామోజీకి నిజాయితీ, నిబద్ధత ఉంటే మార్గదర్శి చిట్‌ఫండ్స్ కుంభకోణంలో సీఐడీ విచారణకు హాజరు కాకుండా ఎందుకు ముఖం చాటేస్తున్నారని సూటిగా ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ద్వారంపూడి ఏమన్నారంటే..

▲ ఇటీవల రెడ్డి సామాజిక వర్గానికి చెందిన మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని లక్ష్యంగా చేసుకున్నారు. ఇప్పుడు నాపై నిరాధార ఆరోపణలతో తప్పుడు కథనాలను వెలువరిస్తున్నారు. కులమతాలకు అతీతంగా పదిమందికి సాయపడే గుణం కలిగిన రెడ్డి సామాజికవర్గాన్ని అన్ని వర్గాలు ఆదరిస్తుండటంతో తెలుగురాష్ట్రాల్లో పలుచోట్ల ప్రజాప్రతినిధులుగా గెలుపొందుతున్నారు.

▲ ఎప్పుడూ మీ సామాజిక వర్గమే అధికారంలో ఉండాలా రామోజీ? ఎన్టీఆర్ మరణానంతరం చంద్రబాబుతో కలిసి దుష్ట గురువులా రాజకీయాల్లో కులచిచ్చు రేపారు. మార్గదర్శి కుంభకోణాన్ని వెలికి తీయడంతో రామోజీ పతనం మొదలైంది. ఆయన అక్రమ సామ్రాజ్యం పేకమేడలా కూలిపోవడం ఖాయం. రామోజీకి వయసు అయిపోయింది. ఇప్పటితరం నీ ఆటలను సాగనివ్వదు.

▲ టీడీపీ పాలనలో గ్రావెల్ అక్రమ తవ్వకాలు ప్రారంభించి కోట్లు దిగమింగారు. 30 వేల మంది పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకే నేను గ్రావెల్ తవ్వించా. అన్ని అనుమతులు తీసుకుని ప్రభుత్వానికి పన్నులు చెల్లించి 650 ఎకరాలను మెరక చేయించా. కోవిడ్ సమయంలో దగ్గరుండి పనులు చేయించా. పేదల ఇళ్ల స్థలాల కోసం దుమ్ములపేట, పర్లోపేట ప్రాంతాల్లో భూములను నా సొంత నిధులతో మెరక చేయిస్తే కబ్జా చేస్తున్నట్లు రామోజీ చిత్రీకరించారు.

▲ మా తాతల కాలం నుంచి 50 ఏళ్లుగా బియ్యం వ్యాపారంలో ఉన్నాం. రామోజీ సామాజిక వర్గానికి చెందిన సైరస్ కంపెనీ ప్రతినిధి వేల్పూరి శ్రీనివాస్ కూడా ఇదే వ్యాపారంలో ఉన్నారు.

▲ కోవిడ్ సమయంలో అధిక చార్జీలు వసూలు చేసిన ప్రైవేట్ ఆస్పత్రులపై జరిమానా విధించేలా నేను కృషి చేస్తే కమీషన్లు వసూలు చేశానంటూ రామోజీ తప్పుడు కథనం ప్రచురించారు. నా విజ్ఞప్తి మేరకు ఒక స్నేహితుడు ఉచితంగా మంచాలు అందచేశారు. రోగుల అవసరాలను తీర్చగా నిరుపయోగంగా ఉన్న మంచాలను సింహాచలం పాదయాత్రలో నా వెంట ఉన్నవారి కోసం వినియోగించడంలో తప్పు ఎక్కడుంది?

▲ కాకినాడలో గంజాయి జాడ లేకుండా ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుంటే నాకు అక్రమ రవాణా అంటగడతారా?

‘ఈనాడు’ ప్రతులు దగ్ధం...

ఎమ్మెల్యే ద్వారంపూడిపై తప్పుడు కథనాన్ని నిరసిస్తూ కాకినాడ రెవెన్యూ కాలనీ డంపింగ్ యార్డు వద్ద ‘ఈనాడు’ ప్రతులను దగ్ధం చేశారు. రామోజీ డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. రామోజీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, సిటీ అధ్యక్షురాలు శివప్రసన్న, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ తదితరుల ఆధ్వర్యంలో కాకినాడ నుంచి భారీ ర్యాలీగా తరలివచ్చారు.

ఏపీయే స్ఫూర్తి

విద్యుత్ కొనుగోలు ఒప్పందాలపై కేంద్రం మార్గదర్శకాలు

సాక్షి, అమరావతి : ఏ దేశమైనా, రాష్ట్రమైనా ఆర్థికాభివృద్ధిని సాధించిందని చెప్పడానికి ఉపయోగపడే ప్రధాన సూచికల్లో విద్యుత్ వినియోగం ఒకటి. అందుకే విద్యుత్ వినియోగం ఎంత ఎక్కువగా ఉంటే అక్కడ పారిశ్రామిక, వాణిజ్య రంగాలు, జీవన ప్రమాణాలు అభివృద్ధి పథంలో ఉన్నాయని లెక్కిస్తుంటారు. అలాంటి విద్యుత్ సరఫరాకు దీర్ఘకాలంగా ఆటంకం ఏర్పడితే ఆర్థిక వ్యవస్థ మందగించే ప్రమాదం ఉంది. దీనిని దృష్టిలో ఉంచుకుని ఆయా ప్రభుత్వాలు భవిష్యత్ విద్యుత్ సరఫరాకు ముందుగానే ప్రణాళికలు వేస్తుంటాయి. ఈ విషయంలో మన రాష్ట్ర ప్రభుత్వం దేశానికి మరోసారి ఆదర్శంగా నిలిచింది. ఏపీ చర్యలను స్ఫూర్తిగా తీసుకుని అన్ని రాష్ట్రాలూ పదేళ్ల విద్యుత్ వినియోగానికి ముందుగానే ప్రణాళికలు వేసుకోవాలని కేంద్ర ప్రభుత్వం సూచించింది. ప్రజలకు నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు తొమ్మిదేళ్ల ముందుగానే విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లు విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు కుదుర్చుకోవాలని నిర్దేశించింది. జల విద్యుత్ కొనాలంటే తొమ్మిదేళ్ల ముందు, థర్మల్‌కు ఏడేళ్ల ముందు, పంప్డ్ స్టోరేజీ ప్లాంట్లకు ఐదేళ్లు, పవన విద్యుత్‌కు మూడేళ్లు, సౌర విద్యుత్‌కు రెండేళ్ల ముందు ఒప్పందాలు కుదుర్చుకోవాలని కేంద్రం వెల్లడించింది.

2031 నాటికి రెట్టింపు వినియోగం..

రాష్ట్రంలో రోజువారీ విద్యుత్ డిమాండ్ ఆధారంగా రానున్న పదేళ్లలో వినియోగం ఎంత ఉంటుందో అంచనా వేయాలని కేంద్రం కోరింది. దీంతో.. 2031 నాటికి ఏపీలో ఇంధన వినియోగం రెట్టింపు అవుతుందని సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ (సీఈఏ) తన 20వ ఎలక్ట్రిక్ పవర్ సర్వే (ఈపీఎస్) నివేదికలో ఇప్పటికే వెల్లడించగా, ఇటీవల జాతీయ విద్యుత్ ప్రణాళిక కమిటీ దానిని ధృవీకరించింది. ఇక రాష్ట్రంలో 2021–22 ఏడాదిలో విద్యుత్ వినియోగం 60,495 మిలియన్ యూనిట్లు ఉండగా, 2031–32 నాటికి 1,21,798 మిలియన్ యూనిట్లకు చేరుతుందని అధ్యయనాలు పేర్కొన్నాయి. దానికి తగ్గట్లుగా రాష్ట్రంలో విద్యుత్



ఉత్పత్తి సామర్థ్యం కూడా మరో 13,510 మెగావాట్లు పెరగనుంది. ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా.. థర్మల్ విద్యుత్ సామర్థ్యాన్ని పెంచేందుకు ఇప్పటికే కృష్ణపట్నంలోని శ్రీ దామోదరం సంజీవయ్య థర్మల్ విద్యుత్కేంద్రంలో 800 మెగావాట్లను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జాతికి అంకితమిచ్చారు. అలాగే, ఈ నెలలోనే డాక్టర్ నార్ల తాతారావు థర్మల్ పవర్ స్టేషన్‌లో మరో 800 మెగావాట్ల యూనిట్ వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభించేందుకు ఇంధన శాఖ, ఏపీ జెన్‌కో సన్నాహాలు చేస్తున్నాయి.

పునరుత్పాదక విద్యుత్‌కు పెద్దపీట..

ఇక 2030 నాటికి వినియోగించే విద్యుత్‌లో 50 శాతం పునరుత్పాదక విద్యుత్ ఉండాలని కేంద్రం స్పష్టంచేసింది. ఈ విషయంలోనూ రాష్ట్రం ముందంజలోనే ఉంది. వ్యవసాయానికి ఏకంగా ముప్పై ఏళ్ల పాటు పగటివేళలోనే 9 గంటల పాటు నిరంతర విద్యుత్ సరఫరాను అందించేందుకు సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెకీ)తో రాష్ట్ర ప్రభుత్వం, డిస్కంలు ఇప్పటికే యూనిట్‌కు రూ.2.49 పైసల చొప్పున ఒప్పందం చేసుకున్నాయి. సెకీ నుంచి తీసుకుంటున్న 7 వేల మెగావాట్ల విద్యుత్ సౌర విద్యుత్ కావడం విశేషం. దీంతోపాటు 44,250 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టుల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. విశాఖలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో రూ.9.47 లక్షల కోట్ల విలువైన పునరుత్పాదక ప్రాజెక్టుల స్థాపనకు ఒప్పందాలు కూడా చేసుకుంది.

నీ తాత ఆస్తి ఎంత? నేడు నీకున్నదెంత?

- నేను అక్రమంగా ఆస్తులు సంపాదించానంటున్నావ్
- నేడు వెంకటేశ్వరపురం ఆలయంలో ప్రమాణం చేస్తున్నా..
- దమ్ముంటే రా.. నా సవాల్ స్వీకరించు..
- లోకేశ్‌కు ఎమ్మెల్యే అనిల్‌కుమార్ సవాల్



నెల్లూరు (దర్గామిట్ట): ‘లోకేశ్.. నీ తాత ఖర్జూరనాయుడుకు రెండెకరాల ఆస్తి ఉండేది. తరువాత నీ తండ్రి రాజకీయాల్లోకి వచ్చి కోట్లు సంపాదించారు. నీకూ కోట్ల ఆస్తి ఉంది. అదంతా నిజాయితీగా సంపాదించినదేనా? నీకు దమ్ముంటే రా.. లేక నీ ప్రతినిధులనైనా పంపు. వెంకటేశ్వరస్వామి దేవాలయంలో ప్రమాణాలు చేద్దాం..’ అంటూ నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్ టీడీపీ నేత లోకేశ్‌కు సవాల్ విసిరారు. నెల్లూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తాను వెయ్యికోట్ల ఆస్తులు అక్రమంగా సంపాదించినట్లు లోకేశ్ ఆరోపిస్తున్నాడని, అవన్నీ నిరాధారమైనవని చెప్పారు. తనకు జిల్లాలో మినహా ఎక్కడా కూడా సెంటు భూమి లేదని, ఒక్క హైదరాబాద్‌లో తన మామ ఇచ్చిన ఎనిమిది సెంట్లు మాత్రమే ఉందని తెలిపారు. తాను రాజకీయాల్లోకి వచ్చాక దాదాపు వందకోట్ల రూపాయల ఆస్తిని అమ్ముకోవాల్సి వచ్చిందన్నారు. నగరంలోని బృందావనంలో నాలుగెకరాలు ఉన్నట్లు లోకేశ్ నిరాధారమైన ఆరోపణలు చేశారన్నారు. ఇస్కాన్ సిటీలో తనకు కేవలం 3.98 ఎకరాలు ఉందని, అది తన తండ్రి ద్వారా వచ్చిన ఆస్తి అని చెప్పారు. కానీ లోకేశ్ 87 ఎకరాలున్నట్లు చెప్పారని, మిగిలిన పొలం ఎక్కడుందో చెబితే తానే రాసిస్తానని పేర్కొన్నారు. అల్లీపురంలో తన సోదరుడి పేరుతో ఆస్తులుంటే అవి తనకెలా చెందుతాయని ప్రశ్నించారు. దొంతాలిలో తనకు 50 ఎకరాలు ఉందన్నది నిజం కాదని, 26 ఎకరాలు మాత్రమే ఉందని చెప్పారు. లోకేశ్ ఆరోపణలు నిజంకాదంటూ శుక్రవారం నగరంలోని వెంకటేశ్వరపురం ఆలయంలో ప్రమాణం చేస్తున్నానని ప్రకటించారు. దమ్ముంటే లోకేశ్ కూడా ప్రమాణానికి రావాలని, లేదా ప్రతినిధులనైనా పంపించాలని సవాలు చేశారు.

వచ్చేనెల 10న అమరావతి అసైన్డ్ భూముల తుది విచారణ

- తేదీని ఖరారుచేసిన హైకోర్టు
- మరో వాయిదా ఇచ్చే ప్రశ్నేలేదని స్పష్టీకరణ
- బాబు, నారాయణ వ్యాజ్యాల విచారణ ఈనెల 12కు వాయిదా

సాక్షి, అమరావతి: అమరావతి రాజధాని ముసుగులో దళిత, బలహీన వర్గాల రైతులకు చెందిన 1,100 ఎకరాల అసైన్డ్, లంక భూములను కాజేసిన వ్యవహారంలో సీఐడీ అధికారులు 2020లో నమోదు చేసిన కేసులో తమకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ మాజీమంత్రి పొంగూరు నారాయణ, ఆయన సమీప బంధువులు, బినామీలు దాఖలు చేసిన వ్యాజ్యాలపై హైకోర్టు ఎట్టకేలకు తుది విచారణ తేదీని ఖరారుచేసింది. వీటిపై ఆగస్టు 10న తుది విచారణ జరుపుతామని హైకోర్టు స్పష్టంచేసింది. మరోసారి వాయిదావేసే ప్రసక్తేలేదని తేల్చిచెప్పింది. అప్పటివరకు.. నారాయణ మధ్యంతర ముందస్తు బెయిల్‌ను పొడిగించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కంచిరెడ్డి సురేశ్‌రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీచేశారు.

వాయిదాల మీద వాయిదాలు..

అసైన్డ్ భూముల వ్యవహారంలో సీఐడీ 2020లో నమోదు చేసిన కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ నారాయణ 2022 హైకోర్టులో పిటిషన్ దాఖలుచేశారు. నారాయణ సమీప బంధువులు, బినామీలు కూడా తమపై సీఐడీ కేసును కొట్టేయాలంటూ పిటిషన్లు వేశారు. నారాయణ కూడా తనపై నమోదు చేసిన కేసును కొట్టేయాలంటూ 2023లో పిటిషన్లు వేశారు. ఈ నేపథ్యంలో.. 2022లో ముందస్తు బెయిల్ కోసం నారాయణ పిటిషన్‌ను అప్పట్లో విచారించిన హైకోర్టు.. అనారోగ్యం, క్యాన్సర్ శస్త్రచికిత్సకు విదేశాలకు వెళ్లేందుకు వీలుగా ఆయనకు మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరుచేసింది. తరువాత ఈ వ్యాజ్యాల్లో విచారణ పలుమార్లు వాయిదా పడింది. ఇలా నారాయణ తదితరులు ఏదో ఒక కారణం చూపుతూ వాయిదాలు పొందుతూ వచ్చారు.

మళ్లీ సుదీర్ఘ వాయిదాకు యత్నం..

ఈ వ్యాజ్యాలు గురువారం మరోసారి విచారణకు వచ్చాయి. వీటిపై జస్టిస్ సురేశ్‌రెడ్డి విచారణ జరిపారు. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూత్రా అందుబాటులో లేరంటూ నారాయణ న్యాయవాదులు మరోసారి వాయిదా వేసేందుకు ప్రయత్నించారు. దీనిని సీఐడీ తరఫున హాజరవుతున్న అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వ్యతిరేకించారు. నారాయణ తరఫున సీనియర్ న్యాయవాది దమ్మాలపాటి శ్రీనివాస్ స్పందిస్తూ, ఇరుపక్షాలు కూడా సమానంగానే వాయిదాలు కోరాయన్నారు. దీనిని సుధాకర్‌రెడ్డి ఖండించారు. ఈ సమయంలో న్యాయమూర్తి స్పందిస్తూ, సుదీర్ఘ వాయిదాకు అంగీకరించేది లేదన్నారు. ఆగస్టు చివరికి వాయిదా వేయడం సాధ్యంకాదన్నారు. సమీపంలో ఉన్న తేదీని ఎంపిక చేసుకోవాలని దమ్మాలపాటికి స్పష్టంచేయగా.. చివరికి ఆగస్టు 10కి వాయిదా వేస్తున్నట్లు తెలిపారు.

బాబు, నారాయణల పిటిషన్లు 12కి వాయిదా..

మరోవైపు.. అమరావతి పేదలకు చెందిన అసైన్డ్ భూములను చట్టవిరుద్ధంగా నామమాత్రపు ధరకు కొని, వాటిని భూసమీకరణ కింద ప్రభుత్వానికి ఇచ్చి ప్రతిగా ఖరీదైన నివాస, వాణిజ్య ప్లాట్లు పొందిన వ్యవహారంపై సీఐడీ నమోదుచేసిన కేసును కొట్టేయాలంటూ చంద్రబాబు, నారాయణ దాఖలు చేసిన వ్యాజ్యాలపై విచారణ ఈనెల 12కి వాయిదా పడింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వక్కలగడ్డ రాధాకృష్ణ కృపాసాగర్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు.

అభాగ్యులకు అండగా..

జగనన్న సురక్షలో ఇబ్బందుల్లేకుండా సర్టిఫికెట్లు



సాక్షి, నెట్‌వర్క్: ఇంటి నుంచి బయటకు వెళ్లలేని వృద్ధాప్యంలో ఉన్నవారికి, కావాల్సిన ధ్రువపత్రాలు ఎలా తెచ్చుకోవాలో తెలియని వారికి జగనన్న సురక్ష కార్యక్రమం అండగా నిలుస్తోంది. గురువారం రాష్ట్ర వ్యాప్తంగా ఈ శిబిరాలు ఉత్సాహంగా జరిగాయి. ప్రభుత్వ పథకాలకు, ఇతర అవసరాలకు ధ్రువపత్రాలు కావాల్సిన వారు ఈ కార్యక్రమం ద్వారా సులువుగా వాటిని అందుకున్నారు. ఏళ్ల తరబడి ఉన్న సమస్యలు వెంటనే పరిష్కారం అవుతుండటం పట్ల లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రెండేళ్ల సమస్యకు పరిష్కారం



ఈ చిత్రంలోని వృద్ధురాలి పేరు బి.కేశమ్మ. అనంతపురం జిల్లా గుంతకల్లు బీటీ పక్కీరప్ప కాలనీలో నివాసం ఉంటోంది. కేశమ్మ భర్త నాగన్న 30 ఏళ్ల క్రితం చనిపోయాడు. వైఎస్సార్ హయాం నుంచీ ఆమెకు వితంతు పింఛన్ అందేది. కానీ రెండేళ్ల క్రితం కేశమ్మ రేషన్‌కార్డుకు కర్నూలులోని ఓ ఆర్టీసీ ఉద్యోగి ఆధార్ నంబర్ లింక్ అయ్యింది. దీంతో ఆమె పింఛన్ ఆగిపోయింది. ‘జగనన్న సురక్ష’ సర్వేలో భాగంగా వారం రోజుల క్రితం తన ఇంటికి వచ్చిన వార్డు కౌన్సిలర్ మెహరున్నీసా, వలంటీర్‌లకు కేశమ్మ సమస్య చెప్పింది. ఆమె రేషన్‌కార్డుకు మరొకరి ఆధార్ లింక్ అయి ఉందని గుర్తించారు. ఆ తర్వాత రేషన్‌కార్డుకు అనుసంధానమైన తప్పుడు ఆధార్ నంబర్‌ను తొలగించారు. ఆ వెంటనే పింఛన్ కోసం దరఖాస్తు స్వీకరించి మంజూరు చేయగా, వలంటీర్ ఈ నెల 1వ తేదీనే వైఎస్సార్ పింఛన్ కానుక మొత్తం కేశమ్మకు అందజేశారు. దీంతో ఆమె ఆనందోత్సాహంలో మునిగిపోయింది. అధికారులను తన ఇంటివద్దకే పంపి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్న సీఎంకు కేశమ్మ కృతజ్ఞతలు తెలిపారు.

నిరక్షరాస్యులకు ఎంతో మేలు



ఈవిడ పేరు గడ్డం మార్తమ్మ. బాపట్ల జిల్లా కొల్లూరు మండలం ఆవులవారిపాలెం గ్రామం. చదువు లేని కారణంగా ప్రభుత్వ కార్యాలయాలలో అవసరమైన పనులు చేయించుకోవాలంటే ఏమి తెలియని పరిస్థితి. గత ప్రభుత్వాల హయాంలో ఏ సర్టిఫికెట్ కావాలన్నా ఎవరో ఒకరి సాయంతో ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ రోజుల తరబడి తిరగాల్సి వచ్చేది. ప్రస్తుతం జగనన్న సురక్ష పథకం ద్వారా వలంటీర్లు, సచివాలయ సిబ్బందే ఇంటికి వచ్చి ఆమెకు ఎటువంటి ఇబ్బందిలేకుండా కుల ధ్రువీకరణ పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ‘‘మాలాంటి నిరక్షరాస్యులకు ఈ ప్రభుత్వం ఎంతో మేలు చేస్తోంది. సర్టిఫికెట్ ఇంటికే తెచ్చి ఇవ్వడం గతంలో ఎప్పుడూ లేదు. జగనన్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు’’ అని సంతోషం వ్యక్తం చేసింది.

ఒక్కరోజులోనే కుటుంబ విభజన సర్టిఫికెట్



ఇతని పేరు శర్మాస్ వలి. అనంతపురం జిల్లా కూడేరు గ్రామం. ఏడాది క్రితం వివాహమైంది. దీంతో తన భార్య ఆధార్, తన ఆధార్‌లతో నూతన రేషన్ కార్డు కోసం ఆరు నెలల క్రితం దరఖాస్తు చేసుకున్నారు. అయితే కుటుంబ విభజన ప్రక్రియ చేయడానికి ఆప్షన్ లేక కొత్తగా రేషన్ కార్డు పొందలేకపోయాడు. జగనన్న సురక్షలో భాగంగా వలంటీర్ ఇంటికి వచ్చినపుడు శర్మాస్ వలి తన సమస్య చెప్పాడు. అవసరమైన ధ్రువీకరణ పత్రాలు సేకరించిన వలంటీర్.. సచివాలయంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేశారు. అధికారులు వెంటనే అనుమతి ఇవ్వగా, ఆ మరుసటిరోజే వలంటీర్ కుటుంబ విభజన సర్టిఫికెట్ తీసుకువచ్చి అందించారు. దీని ఆధారంగా శర్మాస్ వలి నూతన రేషన్ కార్డుకు దరఖాస్తు చేశారు.

దరఖాస్తు చేసిన రోజే కౌలురైతు గుర్తింపుకార్డు



నేను రెండు ఎకరాలు భూమిని కౌలుకు తీసుకుని సాగుచేస్తున్నాను. గతంలో కౌలు గుర్తింపు కార్డు కావాలంటే దరఖాస్తు చేసిన 10 రోజులకు ఇచ్చేవారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో దరఖాస్తు చేసిన రోజే కౌలు గుర్తింపు కార్డు (సీసీఆర్‌సీ) అందజేయడం ఆనందంగా ఉంది. ఇంటింటికీ వచ్చి ప్రజలకు ఏమి కావాలో అడిగి మరీ సర్టిఫికెట్‌లు ఇచ్చే పరిస్థితిని గతంలో ఎన్నడూ చూడలేదు.

– సుంకరి గురువులు, కౌలు రైతు, గంట్యాడ, విజయనగరం జిల్లా

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు నష్టపోకుండా పదోన్నతులు

సూపర్ న్యూమరరీ పోస్టుల సృష్టి

- కాన్సిక్వెన్షియల్ సీనియారిటీ రద్దు చేయాలన్న కోర్టు తీర్పుతో మార్పులు
- ఏ ఒక్క ఉద్యోగికీ నష్టం జరగకుండా ఏర్పాట్లు
- తెలంగాణ అనుసరించిన మార్గంలో కసరత్తు

సాక్షి, అమరావతి : ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల పదోన్నతుల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేయడంతోపాటు, ఇప్పటికే వారికి కేటాయించిన సంఖ్య కంటే ఎక్కువ సంఖ్యలో పదోన్నతులు పొందిన వారికి నష్టం కలగకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. అధిక సంఖ్యలో పదోన్నతులు పొందిన వారికి డిమోషన్ ఇవ్వకుండా, సూపర్ న్యూమరరీ పోస్టులు సృష్టించి.. అదే స్థానాల్లో కొనసాగించే దిశగా కసరత్తు చేస్తోంది. పదోన్నతులపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుల నేపథ్యంలో ఉద్యోగులు ఎవరికీ నష్టంలేకుండా అత్యంత బాధ్యతతో వ్యవహరిస్తోంది. అందుకు అనుగుణంగా సలహా మండలిని ఏర్పాటు చేసింది. వాస్తవ లెక్కలు తేల్చడం ద్వారా ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు నష్టపోకుండా చర్యలు చేపట్టనుంది.

▲ ప్రమోషన్లలో ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 6 శాతం రిజర్వేషన్ అమలుపై ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు అన్ని విభాగాల్లోని అన్ని కేటగిరీల పోస్టులకు తగిన ప్రాతినిధ్యం ఉండేలా పదోన్నతిలో రిజర్వేషన్లు అమలు చేయాలని సాంఘిక సంక్షేమ శాఖ 2003 ఫిబ్రవరి 14న జీవో నంబర్ 5 జారీ చేసింది.

▲ రిజర్వేషన్ ఉపయోగించుకొని ప్రమోషన్ పొందిన తర్వాత నుంచి ప్రమోషన్ పోస్టు సీనియారిటీ గణించి తదుపరి ప్రమోషన్ ఇవ్వడానికి అవకాశం కల్పించే ‘కాన్సిక్వెన్షియల్ సీనియారిటీ’ని అమలు చేస్తూ 2009 ఫిబ్రవరి 20న సాంఘిక సంక్షేమ శాఖ జీవో నంబర్–26 జారీ చేసింది.

▲ కాన్సిక్వెన్సియల్ సీనియారిటీ వల్ల ఎస్సీ, ఎస్టీలకు న్యాయంగా దక్కాల్సిన ప్రాతినిధ్యం (ఎస్సీ–15 శాతం, ఎస్టీ–6శాతం) కంటే ఎక్కువ



మంది ప్రమోషన్లు పొందారని, ఫలితంగా మిగతా ఉద్యోగులు నష్టపోతున్నారని సుప్రీంకోర్టు, హైకోర్టుల్లో వేసిన కేసుల్లో వారికి అనుకూలంగా తీర్పులు వచ్చాయి. జీవో–26ను రద్దు చేసి, వాస్తవంగా ఎస్సీ, ఎస్టీలు కేటాయించిన పోస్టులకు మించి ప్రమోషన్లు పొందిన వారి సంఖ్యను గణించి, మిగతా వారికీ న్యాయం చేయాలని తీర్పులు చెప్పాయి. ఈ నేపథ్యంలో సలహా కమిటీ సిఫార్సుల మేరకు అడుగులు ముందుకు వేయనుంది.

పోస్టులెన్ని? ఎంత మంది ఉన్నారు?

తెలంగాణ రాష్ట్రం కూడా సలహా కమిటీని ఏర్పాటు చేయడం ద్వారా ప్యానెల్‌లను సమీక్షించడానికి కసరత్తు చేపట్టింది. ఆ కమిటీ సిఫార్సుల ఆధారంగా.. ఎస్సీ, ఎస్టీలు కేటాయించిన పోస్టుల కంటే ఎక్కువగా ఉన్న వారి కోసం సూపర్ న్యూమరీ పోస్టులు సృష్టించాలని నిర్ణయించింది. ఫలితంగా వారిని ఉన్న ఉద్యోగాల్లోనే తెలంగాణ ప్రభుత్వం కొనసాగించింది. అడిషనల్ సెక్రటరీ, డిప్యూటీ సెక్రటరీ, అసిస్టెంట్ సెక్రటరీ కేటగిరీలుగా ఐదు సూపర్ న్యూమరీ పోస్టులు, 30 నోషనల్ ప్రమోషన్‌లను అనుమతించింది. ఏపీ ప్రభుత్వం కూడా ఇదే విధంగా కసరత్తు చేస్తోంది. ఈ నేపథ్యంలో ఎస్సీ, ఎస్టీలకు దక్కాల్సిన పోస్టుల కంటే అధిక సంఖ్యలో ప్రమోషన్లు పొందిన పోస్టుల వివరాలు తీసుకొని నివేదిక సమర్పించడానికి ఓ కమిటీని ఏర్పాటు చేసింది. రాష్ట్ర విభజన తర్వాత ఏపీ సచివాలయంలోని అన్ని ప్యానెల్‌లు, ప్రమోషన్‌లను అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ నుండి ప్రభుత్వ అదనపు కార్యదర్శి వరకు అమలు చేయడానికి కసరత్తు చేస్తోంది.

ఫ్యాషన్



చిటపట చినుకులను ఆనందించాలి
తడవకుండా మెరిసిపోవాలి
కొత్తగా ఉండాలి
స్టయిల్‌గా కనిపించాలి
మబ్బు పట్టిన సమయమైనా
ముసురు పట్టిన రోజులైనా
డ్రెస్‌కు అడ్రస్‌గా ఉంటూ
టెన్షన్ ఫ్రీగా గడిపేయాలనుకునేవారికి
డిజైనర్ వాటర్ ప్రూఫ్ పాంచోస్
రెడీ టూ వేర్ గా ఆకట్టుకుంటున్నాయి.

వానకు పాంచో



వానల్లో తడవకుండా ఉండటానికి గొడుగు లేదా లాంగ్ జాకెట్స్ మనకు వెంటనే గుర్తుకువస్తాయి. అంతకు మించి వానకాలంలో స్టైయిల్‌గా కనిపించాలను కుంటే ఇంకేమీ లేవా అనుకునేవారికి వాటర్ ప్రూఫ్ పాంచోస్ మేమున్నామని గుర్తు చేస్తున్నాయి.

సహజంగా వేసవి కాలాన్ని సౌకర్యంగా మురిపించిన సిల్క్ అండ్ కాటన్ పాంచోస్ ఇప్పుడు వాన కాలాన్ని వాటర్‌ప్రూఫ్‌తో ముస్తాబు చేసుకొని వచ్చాయి. పోల్కా డాట్స్, త్రీ డీ ప్రింట్స్, లైన్స్, ఫ్లోరల్స్, యానిమల్ ప్రింట్స్‌తో ఆకట్టుకునే ఈ పాంచోస్ ఒక్కోరోజును ఒక్కో రంగుతో ఎంపిక చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లోనూ, ఆఫ్‌లైన్ లోనూ అందుబాటులో ఉన్న ఈ పాంచోని డ్రెస్ కలర్‌ని బట్టి కూడా సెలక్ట్ చేసుకోవచ్చు.

ఇంటిప్స్

- కొత్తిమీర ఎక్కువ రోజులు తాజాగా ఉండాలంటే... పలుచటి వస్త్రంలో చుట్టి ఫ్రిజ్‌లో పెట్టాలి.
- ఉల్లిపాయలు తరగడానికి పది నిమిషాల ముందు నీటిలో వేసి ఉంచితే తరిగేటప్పుడు కళ్లు మండడం, నీరు కారడం ఉండదు.
- పండ్లు, కూరగాయలను న్యూస్‌పేపర్‌లో చుట్టి ఫ్రిజ్‌పెడితే ఎక్కువ రోజులు తాజాగా ఉంటాయి.
- యాపిల్ తరిగిన తర్వాత ప్లేట్‌లో పెట్టి సర్వ్‌చేసే లోపే ముక్కలు రంగుమారుతుంటాయి. తరిగిన వెంటనే నిమ్మరసం రాస్తే రంగుమారవు. చాకుకు నిమ్మరసం రాసి తరగడం కూడా మంచి ఫలితాన్నిస్తుంది.
- పచ్చిమిరపకాయలు ఎక్కువ రోజులు నిల్వ ఉండాలంటే ఫ్రిజ్‌లో పెట్టే ముందు తొడిమలు తీసేయాలి.

పర్యావరణహితం

ఈ బ్యాగు... బాగు బాగు!

దేవాలయానికి వెళ్తే... వచ్చిన భక్తులందరి చేతిలో కొబ్బరికాయ, పూజసామగ్రి కవర్‌లో నుంచి తొంగి చూస్తుంటాయి. కాలనీలో పెట్టిన చిన్న ఎగ్జిబిషన్‌కు వెళ్తే అక్కడ జుట్టుకు పెట్టుకునే పిన్నుల నుంచి వంటగదిలో ఉపయోగించే జాడీలు, స్పూన్‌లు, బీటర్‌లు, గ్రేటర్‌లు వంటివెన్నో ఉంటాయి. వాటిని చూసిన తర్వాత మనకు అవసరమైనవన్నీ గుర్తుకు వస్తాయి. కొన్న వెంటనే స్టాల్ వాళ్లు వాటిని ఒక పాలిథిన్ కవర్‌లో వేసిస్తారు. ఓ బర్త్‌డే ఫంక్షన్‌కు వెళ్తాం. వెళ్లిన వాళ్లందరికీ రిటర్న్ గిఫ్ట్‌లు ఓ చిన్న క్యారీ బ్యాగ్‌లో వేసిస్తారు. పర్యావరణం పట్ల చైతన్యం కలిగిన వాళ్లు పాలిథిన్ స్థానంలో పేపర్‌బ్యాగ్‌లను వాడుతున్నారు. అది మట్టిలో కలిసిపోతుంది. కానీ పేపర్ తయారీకి పెద్ద మొత్తంలో నీరు కావాలి. పేపర్ బ్యాగ్ సహజవనరుల వృథాను అరికట్టేది మాత్రం కాదు. వైశెట్టి సునీతా రాణికి వీటన్నింటికీ ప్రత్యామ్నాయం కేరళలో కనిపించింది.



- సునీతా రాణి

కేరళ ఇచ్చిన ఆలోచన!

''కేరళ వాళ్ల జీవనశైలి ఎకో ఫ్రెండ్లీగా ఉంటుంది. భూమాతకు హాని కలిగించని జీవన విధానం వారిది. కొబ్బరిపీచు నుంచి తాటాకు, జ్యూట్ వరకు అన్నింటినీ ఉపయోగిస్తారు. అప్పటికి మన తెలుగు రాష్ట్రాల్లో జ్యూట్ వాడకం పెరగలేదు. దుస్తులు కొన్నప్పుడు కొంతమంది వస్త్రాల దుకాణదారులు కర్రల హ్యాండిల్స్ ఉన్న జ్యూట్ బ్యాగులను ఇచ్చేవారు. అంతే తప్ప బయో డీగ్రేడబుల్ ప్రోడక్ట్స్ దైనందిన జీవనంలోకి పెద్దగా రాలేదు. వచ్చిన అతికొద్ది ఉత్పత్తులు కూడా కోల్‌కతా మోడల్ సింగిల్ వీవింగ్ జ్యూట్ బ్యాగ్‌లే. వాటికి లోపల వైపు ల్యామినేషన్ ఉంటుంది. పైకి మాత్రం ఎకో ఫ్రెండ్లీ అనే ముసుగు వేసి లోపల కెమికల్ ల్యామినేషన్ వాడితే మనం ఏం సాధించినట్లు? పైగా మన దగ్గర ఏలూరులో డబుల్ వీవింగ్ జనపనార అందుబాటులో ఉండగా బయటి నుంచి ల్యామినేషన్ అతికిన జ్యూట్ వాడాల్సిన పనేంటి? ఇంతగా అధ్యయనం చేసిన తర్వాత నేషనల్ జ్యూట్ బోర్డు సహకారంతో నేను బయోడీగ్రేడబుల్ బ్యాగ్‌ల తయారీ మొదలుపెట్టాను'' అంటూ తాను సోషల్‌ప్రెన్యూర్‌గా మారిన వైనాన్ని వివరించారు సునీతారాణి.

గ్రీన్ లీఫ్ పుట్టింది!

''మాది విజయవాడ. బాల్యం, చదువు అంతా అక్కడే. ఎమ్మెస్సీ మైక్రోబయాలజీ పూర్తి కాగానే పెళ్లయింది. హైదరాబాద్‌కి వచ్చాను. షాదాన్, అరోరా కాలేజీల్లో లెక్చరర్‌గా ఉద్యోగం చేశాను. పెద్ద పాప పుట్టిన తర్వాత ఫుల్‌టైమ్ జాబ్ వీలు కాకపోవడంతో కొంతకాలం మెడికల్ ట్రాన్స్‌స్క్రిప్టర్‌గా చేశాను. మా వారు యూఎస్ వెళ్లాలనే ఆలోచన చేశారు. అనుకున్నట్లుగా వెళ్లారు కానీ అక్కడ కొనసాగలేదు. ఇండియా వచ్చిన తర్వాత ప్రింటింగ్‌లో భవిష్యత్తును వెతుక్కున్నాం. ఇంట్లోనే ఒక గదిలో 2002లో ఒక్క మెషీన్‌తో ప్రింటింగ్ మొదలుపెట్టాం. నేను ఇంట్లో పిల్లలను, ప్రింటింగ్ పనులను చూసుకుంటూ ఉంటే మా వారు మార్కెటింగ్ చూసేవారు. ఆ ప్రయత్నం విజయవంతమైంది. జీవితం సౌకర్యవంతంగా సాగుతోంది. మా చిన్న పాప చెస్ ఆడుతుంది. తనకు తోడుగా టోర్నమెంట్‌లకు నేనే వెళ్లేదాన్ని. అనేక ప్రదేశాలను, వారి జీవనశైలిని చూశాను. ఓ సారి మా ఫ్యామిలీ మొత్తం కేరళ టూర్ వెళ్లాం. అప్పుడు వచ్చిన ఆలోచనే 'జస్ట్ గ్రీన్ లీఫ్' రూపంలో హైదరాబాద్‌లో ఆవిష్కృతమైంది.

ముగ్గు పరిచయం!

చిన్న జీయర్ స్వామిగారు ధనుర్మాస దీక్ష కోసం లడ్డు ప్రసాదం, పసుపు కుంకుమలు వేసివ్వడానికి పెద్ద మొత్తంలో ఆర్డర్ ఇచ్చారు. వాటిని చూసిన సింగపూర్ టీటీడీ వాళ్లు ప్రత్యేకంగా చేయించుకున్నారు. ఇక బ్యాగ్ మీద ముగ్గు ముద్రించడం వెనుక ఉద్దేశం... ఈ తరం పిల్లలకు మన ముగ్గులను పరిచయం చేయడం. ముగ్గు వేయడం నేర్చుకోమంటే ఎవరు శ్రద్ధ పెడతారు? ఇలా కనిపిస్తూ ఉంటే సరదాగా కాగితం మీద అయినా ఓ ప్రయత్నం చేస్తారని నా ఆశ. పర్యావరణహితమైన జీవనశైలితో పాటు తెలుగుదనాన్ని కూడా అలవాటు చేస్తున్నాను. ఇలాంటి ప్రయత్నాలకే నాకు గో గ్రీన్ పురస్కారం లభించింది'' అన్నారు వైశెట్టి సునీతారాణి.

– వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి
ఫొటోలు :
నోముల రాజేశ్ రెడ్డి

పిల్లలకు అలవాటు చేయాలి!



నా యూనిట్ ఉద్దేశం... జ్యూట్ బ్యాగ్ తయారు చేయడం, ఖర్చులతోపాటు లాభం చూసుకుని అమ్మడం కాదు. మన అవసరాన్ని తీర్చిన తర్వాత ఆ మెటీరియల్ భూమిలో కలిసిపోవాలి. ప్లాస్టిక్‌లాగ పల్లపు ప్రదేశాలకు కొట్టుకువచ్చి వరదలకు కారణం కాకూడదు. ఇక ప్లాస్టిక్ వినియోగం ఎక్కడ ఎక్కువగా ఉంటోందో గమనించి అక్కడి అవసరాలకు సరిపోయే విధంగా బ్యాగ్‌లను డిజైన్ చేశాను. మార్కెట్‌కి వెళ్లేటప్పుడు తమ వెంట బ్యాగ్ తీసుకెళ్లడం పిల్లలకు అలవాటు చేయాలనేది నా లక్ష్యం. అందుకోసం చేసిన ప్రయోగమే స్క్రీన్ ప్రింటింగ్‌లో జ్యూట్ మీద పిల్లల పేర్లను ముద్రించడం. రిటర్న్ గిఫ్ట్‌గా తమ పేరున్న బ్యాగ్‌ను అందుకున్నప్పుడు వారి సంతోషం వర్ణనాతీతం. ఆ పేరును స్నేహితులకు చూపించుకోవడానికి ఆ బ్యాగ్‌ను ఇష్టంగా వాడడం మొదలుపెడతారు. ఈ ప్రయోగం విజయవంతం అయింది. ఇక నా సక్సెస్ సీక్రెట్ ఏమిటంటే... ఆన్‌లైన్‌లో రకరకాల ఉత్పత్తులను అప్‌లోడ్ చేస్తాం. అందులో త్వరగా అమ్ముడైన మోడల్ ఏమిటో గమనించి ఆ డిజైన్‌లో ఎక్కువ పీస్‌లు తయారు చేయడం అన్నమాట.



గెలుపు పాఠం



'జీరో' నుంచి
ప్రయాణం ప్రారంభించి
ఒక్కో పాఠం నేర్చుకుంటూ
తమ కంపెనీ 'వెల్‌స్పన్'ను
ప్రపంచంలోని అతి పెద్ద
టెక్స్‌టైల్ కంపెనీల పక్కన నిలబెట్టింది
దీపాలీ గోయెంకా...

అన్‌స్టాపబుల్

రాజస్థాన్‌లోని జైపుర్‌కు చెందిన దీపాలీకి పద్దెనిమిది సంవత్సరాల వయసులోనే వివాహం జరిగింది. ఇంటికే పరిమితం కాకుండా, ఏదైనా చేయాలనిపించేది. ముప్పైసంవత్సరాల వయసులో భర్త చేసే టెక్స్‌టైల్ వ్యాపారంలోకి అడుగు పెట్టింది.

'నా భార్యగా ఇక్కడ నీకు ప్రత్యేక గుర్తింపు, గౌరవం అంటూ ఏవీ ఉండవు' అని చెప్పాడు ఆమె భర్త 'వెల్‌స్పన్' ఛైర్మన్ బీకే గోయెంకా.

తొలిరోజుల్లో 'బాస్ భార్య'గానే గుర్తింపు పొందిన దీపాలీ ఆ తరువాత కాలంలో తనదైన గుర్తింపు తెచ్చుకుంది. నిరుపమానమైన నాయకత్వానికి ప్రతీకగా ప్రత్యేక ప్రశంసలు అందుకుంది. సైకాలజీ చదువుకున్న దీపాలీకి వ్యాపార వ్యవహారాలలో ఎలాంటి అనుభవం లేదు. ఏమీ తెలియని శూన్యం నుంచి అన్ని తెలుసుకోవాలనే తపన వరకు ఆమె ప్రయాణం కొనసాగింది. నష్టాలు ఎక్కడా జరుగుతున్నాయి? వాటిని నివారించడం ఎలా? ఇలా ఎన్నో విషయాలను త్వరగా తెలుసుకుంది. ఆఫీసుకు వెళ్లామా, వచ్చామా...అనే తీరులో కాకుండా ప్రతి అంశంపై స్పష్టమైన అవగాహన పెంచుకుంది. ఒకానొక కాలంలో విదేశీ ఒప్పందాలు రద్దు అయిపోయి కంపెనీ సంక్షోభపు టంచుల్లోకి వెళ్లింది. ఇలాంటి పరిస్థితులలో దీపాలీ ట్రబుల్ షూటర్‌గా మారి కంపెనీని మళ్లీ విజయ పథంలోకి తీసుకువచ్చింది.

ఇంతలోనే కోవిడ్ రూపంలో మరో సంక్షోభం ఎదురైంది. దాన్ని కూడా తన నాయకత్వ లక్షణాలతో విజయవంతంగా అధిగమించింది.

'ఏ సంక్షోభాన్నీ వృథాగా పోనివ్వకూడదు. దానినుంచి నేర్చుకునే విలువైన పాఠాలు ఎన్నో ఉంటాయి. మనల్ని మనం పునఃపరిశీలన చేసుకోవడానికి, మెరుగు పెట్టుకోవడానికి సంక్షోభాలు ఉపయోగపడతాయి' అంటుంది దీపాలీ. ప్రస్తుతం కంపెనీకి సంబంధించిన ఉత్పత్తుల్లో 94 శాతం బయటి దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. ఇంటర్నేషనల్ మార్కెట్‌తో పాటు ఇండియన్ మార్కెట్‌పై కూడా దీపాలీ దృష్టి సారించింది.

'వ్యాపారవేత్త నిలువ నీరులా ఒకచోట ఉండిపోకూడదు. ప్రవాహమైపోవాలి. ప్రతి అడుగులో కొత్త విషయాలు తెలుసుకోవాలి. కొత్తగా ఆలోచించడం అనేది వ్యాపారానికి ప్రాణవాయువులాంటిది' అనేది తాను నమ్మిన సిద్ధాంతం.

ఇప్పుడు కంపెనీ చేతిలో సరికొత్త ఆవిష్కరణలకు సంబంధించి 35 పేటెంట్స్ ఉన్నాయి.

'అందరికీ అన్నీ తెలియాలి అని ఏమీ లేదు. తెలుసుకోవడానికి మన దగ్గర ఉన్న శక్తి... ప్రశ్న. ఒక్క ప్రశ్నతో ఎన్నో విషయాలు తెలుసుకోవచ్చు. మన అజ్ఞానం బయటపడుతుందేమో అని సంశయిస్తే అక్కడే ఉండిపోతాం. నాకు ఈ విషయం గురించి పెద్దగా తెలియదు. దయచేసి చెబుతారా? అని అడిగేదాన్ని. మనం తెలివి ఉన్న వ్యక్తి అయినంత మాత్రాన సరిపోదు. ఆ తెలివితో కంపెనీ ఎంత ముందుకు వెళ్లిందనేది ముఖ్యం. నేర్చుకోవడం అనే ప్రక్రియకు కాల పరిధి లేదు. అది నిత్యం జరుగుతూనే ఉండాలి' అంటుంది దీపాలీ.

ఈఎస్‌జీ-ఎన్విరాన్‌మెంటల్, సోషల్ అండ్ గవర్నెన్స్ తమ వ్యాపారానికి కీలకం అనేది దీపాలీ చెప్పే మాట. కంపెనీ ప్రాడక్ట్స్‌కు సంబంధించి తయారీ ప్రక్రియలో రీసైకిల్ వాటర్‌ను ఉపయోగించడం కూడా ఇందులో భాగమే. మరోవైపు రైతులతో కలిసి పర్యావరణానికి సంబంధించిన విషయాలపై పనిచేస్తోంది.

దీపాలీ 'వెల్‌స్పన్'లోకి అడుగు పెట్టినప్పుడు కేవలం ఏడు శాతం మంది మహిళలే ఉండేవారు. ఇప్పుడు వారి ప్రాతినిధ్యం ముప్పై శాతానికి పెరిగింది.

ఈతరం వ్యాపారవేత్తలకు దీపాలీ ఇచ్చే సలహా ఇది...

'వ్యాపారికి తన వ్యాపారం మాత్రమే ప్రపంచం కాకూడదు. తన మానసిక ఆరోగ్యం, తినే తిండి, వ్యాయామాలపై కూడా దృష్టి పెట్టాలి. మనం మానసికంగా చురుగ్గా ఉంటేనే ఉత్తమమైన ఆలోచనలు వస్తాయి'

సక్సెస్‌ఫుల్ ఎంటర్‌ప్రెన్యూర్‌గా నిరూపించుకున్న దీపాలీ గోయెంకాలో మరో కోణం దాతృత్వం.

వంటిల్లు



మిక్స్‌డ్ వెజ్ కుర్మా

కావలసినవి : ఉల్లిపాయ ప్యూరీ – కప్పు; అల్లం వెల్లుల్లి పేస్టు – టేబుల్ స్పూను ; క్యారట్, బీన్స్, పచ్చిబఠాణి, క్యాలీఫ్లవర్, బంగాళ దుంప ముక్కలు – అన్నీ కలిపి రెండు కప్పులు ; కారం – టీస్పూను ; ధనియాల పొడి – టీస్పూను ; జీలకర్ర పొడి – అరటీస్పూను ; గరం మసాలా – చిటికెడు ; నిమ్మరసం – టీస్పూను ; ఉప్పు – రుచికి తగినంత; నూనె – రెండు టేబుల్ స్పూన్లు, లవంగాలు – రెండు, దాల్చిన చెక్క – అర అంగుళం ముక్క ; యాలకులు – రెండు ; ఎండు కొబ్బరి తురుము – మూడు టేబుల్ స్పూన్లు ; గసగసాలు – టీస్పూను.

తయారీ : ● కూరగాయ ముక్కలన్నింటిని శుభ్రంగా కడిగి, కొద్దిగా ఉప్పువేసి ఉడకించి పక్కన పెట్టుకోవాలి. ● గసగసాలు, కొబ్బరిని దోరగా వేయించి పేస్టుచేసుకోవాలి. ● బాణలిలో నూనె వేసి వేడెక్కనివ్వాలి. కాగిన నూనెలో లవంగాలు, చెక్క, యాలకులు వేసి నిమిషం పాటు వేయించాలి. తరువాత ఉల్లిపాయ ప్యూరీని వేసి కలపాలి. ● ప్యూరీ వేగాక అల్లం వెల్లుల్లి పేస్టు, మసాలా పొడి, వేసి కలిపి రెండు నిమిషాలు పెద్దమంటమీద వేయించాలి. ● ఇప్పుడు మంట తగ్గించి కొబ్బరి మసాలా, ఉడికించిన కూరగాయ ముక్కలు వేసి కలియబెట్టాలి. ● కూరగాయ ముక్కలు ఉడికించిన నీళ్లు, గరం మసాలా, రుచికి సరిపడా ఉప్పు వేసి పదినిమిషాలు మగ్గనివ్వాలి. చివరిగా కొత్తిమీర, నిమ్మరసం వేసి దించేయాలి. చపాతీలలోకి, అన్నంలోకి బావుంటుంది.



టొమాటో లేకపోతేనేం!

చాలామందికి టొమాటో కలపనిదే కూర చేయబుద్ధి కాదు. అయితే ఇటీవల కొద్దికాలం నుంచి సెంచరీ కొట్టినా .. కిందకి దిగనంటోంది టొమాటో. అయినా ఏం ఫర్వాలేదు, టొమాటో లేకపోయినా కూరలను రుచిగా వండొచ్చని చేసి చూపిస్తోంది ఈ వారం వంటిల్లు....



కరైవారి చికెన్

కావలసినవి : చికెన్ – కేజీ ; పచ్చికొబ్బరి తురుము – రెండు కప్పులు ; ఉల్లిపాయలు పెద్దవి – రెండు (ముక్కలు తరగాలి) ; సోంపు – టీస్పూను ; గసగసాలు – టేబుల్ స్పూను ; మిరియాలు – పది ; లవంగాలు – పది ; బిర్యానీ ఆకులు – రెండు ; దాల్చిన చెక్క – అంగుళం ముక్క ; జాజికాయ – చిన్న ముక్క ; ఎండు మిరపకాయలు – పదిహేను ; ధనియాలు – రెండు టేబుల్ స్పూన్లు ; వెల్లుల్లి రెబ్బలు – పది ; నూనె – మూడు టేబుల్ స్పూన్లు ; ఉప్పు – రుచికి సరిపడా.

తయారీ : ● ఎండు మిరపకాయలు, ధనియాలు, వెల్లుల్లి రెబ్బలను దోరగా వేయించి, చల్లారాక పేస్టు చేసి పక్కపెట్టుకోవాలి. ● శుభ్రంగా కడిగిపెట్టుకున్న చికెన్ ముక్కలకు ఈ పేస్టుని పట్టించి అరగంటపాటు పక్కన పెట్టుకోవాలి. ● బాణలిలో కొద్దిగా నూనెవేసి, కాగాక సగం ఉల్లిపాయ ముక్కలు, పచ్చికొబ్బరి తురుము, చెక్క, లవంగాలు, సోంపు, గసగసాలు, మిరియాలు వేసి దోరగా వేయించి పేస్టుచేసి పెట్టుకోవాలి. ● బాణలిలో మిగతా నూనె వేసి కాగనివ్వాలి. కాగిన నూనెలో బిర్యానీ ఆకు, మిగిలిన ఉల్లిపాయ ముక్కలు వేసి రంగు మారేంత వరకు వేయించాలి. ● ఉల్లిపాయ వేగాక నానబెట్టుకున్న చికెన్ వేసి ఐదు నిమిషాలు ఫ్రై చేయాలి. ● ఇప్పుడు కొబ్బరి పేస్టు, మిరపకాయ మసాలా పేస్టు వేసి కలుపుకోవాలి. ● గ్రేవీకి సరిపడా నీళ్లు, రుచికి సరిపడా ఉప్పు వేసి సన్నని మంట మీద చికెన్ ముక్కలు మెత్తబడి, నూనె పైకి తేలంతవరకు మగ్గనించి దించేయాలి. అన్నం, రోటీ, పుల్కాల్లోకి మంచి సైడ్ డిష్.



పొటాటో క్యాబేజీ ఇగురు

కావలసినవి : క్యాబేజీ తురుము – అరకేజీ; బంగాళ దుంపలు – రెండు ; పచ్చిమిర్చి – రెండు; పచ్చిబఠాణీ – అరకప్పు; పచ్చికొబ్బరి తురుము – పావు కప్పు; ఉల్లిపాయ తరుగు – అరకప్పు ; అల్లం తురుము – టేబుల్ స్పూను ; కరివేపాకు – రెండు రెమ్మలు ; నూనె – రెండు టేబుల్ స్పూన్లు ; ఆవాలు – టీస్పూను ; పసుపు – అరటీస్పూను ; కారం – అరటీస్పూను ; ఉప్పు – రుచికి సరిపడా ; ధనియాల పొడి – టీస్పూను.

తయారీ : ● బాణలిలో నూనెవేసి వేడెక్కనివ్వాలి. ● కాగిన నూనెలో ఆవాలు, అల్లం, నిలువుగా చీల్చిన పచ్చిమిర్చిని వేయాలి. ● ఇవన్నీ వేగాక కరివేపాకు, ఉల్లిపాయలు వేసి ఐదు నిమిషాలు వేయించాలి. ● ఇప్పుడు క్యాబేజీ తురుము, బంగాళ దుంపలను తొక్కతీసి సన్నగా తరిగి వేయాలి. ● రెండు నిమిషాల తరువాత పసుపు, కారం, ధనియాల పొడి రుచికి సరిపడా ఉప్పు వేసి కలుపుకోవాలి. ● ఈ మిశ్రమాన్ని మూతపెట్టి సన్నని మంట మీద పదిహేను నిమిషాలు మగ్గనివ్వాలి. ● ఇప్పుడు పచ్చిబఠాణీవేసి మరో పదినిమిషాలు ఉడికించాలి. ● బంగాళ దుంప ముక్కలు మెత్తబడి నూనె పైకి తేలినప్పుడు కొబ్బరి తురుము వేసి ఐదునిమిషాల తరువాత దించేయాలి. చపాతీ, రోటీ, అన్నంలోకి ఈ ఇగురు మంచి కాంబినేషన్.



బైగన్ కా బార్తా

కావలసినవి : మీడియం సైజు వంకాయలు – రెండు ; వెల్లుల్లి రెబ్బలు – నాలుగు ; నూనె – ఒకటిన్నర టేబుల్ స్పూన్లు ; వెల్లుల్లి తరుగు – రెండు టీస్పూన్లు ; అల్లం – అంగుళం ముక్క (సన్నగా తురుముకోవాలి) ; పచ్చిమిర్చి తరుగు – రెండు టీస్పూన్లు ; ఉల్లిపాయ తరుగు – అరకప్పు ; కారం – ఒకటిన్నర టేబుల్ స్పూన్లు, ధనియాల పొడి – టీస్పూను ; ఉప్పు – రుచికి తగినంత; కొత్తిమీర తరుగు – రెండు టేబుల్ స్పూన్లు.

తయారీ : ● వంకాయలను శుభ్రంగా కడిగి తడిలేకుండా తుడుచుకోవాలి. ● ఇప్పుడు వంకాయలకు కొద్దిగా నూనె రాసి మూడు వైపులా మూడుగాట్లు పెట్టాలి. ఈ చీలిక మధ్యలో వెల్లుల్లి రెబ్బలను లోపలికి పోయేలా పెట్టాలి. ● ఇప్పుడు వంకాయను మంటమీద నేరుగా పెట్టి చక్కగా కాల్చుకోవాలి. ● వంకాయ కాలిన తరువాత చల్లారనిచ్చి, వెల్లుల్లి రెబ్బలను బయటకు తీసి సన్నగా తరగాలి. వంకాయను మెత్తగా చిదుముకోవాలి. ● బాణలిలో నూనె వేసి, కాగిన తరువాత వెల్లుల్లి, అల్లం, పచ్చిమిర్చి తరుగు వేసి రెండు నిమిషాలు వేయించాలి. ● ఇప్పుడు చిదుముకున్న వంకాయ గుజ్జు, ఉడికించి తరిగిన వెల్లుల్లిని వేసి ఐదు నిమిషాలు మగ్గనివ్వాలి. ● కారం, ధనియాల పొడి రుచికి సరిపడా ఉప్పువేసి కలపాలి. నూనె పైకి తేలేంత వరకు మగ్గనిచ్చి కొత్తిమీర తరుగు చల్లుకుని దించేస్తే బైగాన్ బార్తా రెడీ. రోటీల్లోకి మంచి సైడ్ డిష్.

● సక్సెస్ స్టోరీ

ప్రయాణంలో, తీరిక వేళల్లో ఎఫ్ఎంలో పాటలు వినడం సహజమే.
'ఎప్పుడూ అవే పాటలు, అవే మాటలేనా' అనుకుంటారు కొద్దిమంది.
వారిలో రోహన్ నాయక్ ఒకరు. ఈ యువ ఇంజనీర్ తన స్నేహితులతో కలిసి బెంగళూరు కేంద్రంగా ప్రారంభించిన 'పాకెట్ ఎఫ్ఎం' వివిధ జానర్స్, వివిధ భాషలలో ఆకట్టుకునే ఆడియో సిరీస్‌లతో దూసుకుపోతుంది...


ప్రతీక్ దీక్షిత్, రోహన్ నాయక్, నిశాంత్

లాంగ్ ఫార్మట్ ఆడియో ఎంటర్టైన్‌మెంట్ సిరీస్ ద్వారా ఒటీటీ స్పేస్‌ను పునర్నిర్వచించే ప్రయత్నం చేస్తున్న 'పాకెట్ ఎఫ్ఎం' యాడ్-టెక్ ప్లాట్‌ఫామ్ 'రియల్ టైమ్ యాడ్స్'ను తీసుకువచ్చింది.
'పాకెట్ ఎఫ్ఎం విజయవంతం కావడంలో ఎఐ, ఎంఎల్

పాకెట్ ప్రపంచంలోకి...

కొన్నిసార్లు ఐడియాల కోసం వెదుక్కుంటూ వెళ్లనక్కర్లేకుండానే... అవే మనల్ని వెదుక్కుంటూ వస్తాయి. రోహన్ నాయక్ విషయంలోనూ అలాగే జరిగింది.

ఇంటి నుంచి ఆఫీసుకు చేరుకోవడానికి చాలా టైమ్ పట్టేది. టైమ్‌పాస్ కోసం ఎఫ్ఎంలలో మ్యూజిక్ వినేవాడు. అయితే ఆ మ్యూజిక్ అదేపనిగా రిపీట్ కావడంతో బోర్‌గా ఉండేది.

'భారతీయ భాషల్లో ఆడియో స్టోరీ టెల్లింగ్ ప్లాట్‌ఫామ్ ఉంటే బాగుండేది' అనుకునేవాడు.

'మనం కావాలనుకుంటున్నది కాలమే మన చేత చేయిస్తుంది' అన్నట్లుగా ఆ ప్రయత్నానికి తానే శ్రీకారం చుట్టాడు రోహన్ నాయక్.

ఐఐటీ-ఖరగ్‌పూర్ ఫ్రెండ్స్ ప్రతీక్ దీక్షిత్, నిశాంత్ కేఎస్‌లతో కలిసి 'పాకెట్ ఎఫ్.ఎం'కు శ్రీకారం చుట్టాడు.

మ్యూజిక్ కాకుండా 'ఆడియో ఎంటర్‌టైన్‌మెంట్' లక్ష్యంగా మొదలైన ఈ ఆడియో సిరీస్ ప్లాట్‌ఫామ్ అన్యూవలైజ్‌డ్ రెవెన్యూ రన్‌రేట్(ఏఆర్ఆర్)తో దూసుకుపోవడానికి ఎంతో కాలం పట్టలేదు.

'ప్రస్తుతం శ్రోతలు సగటున రోజుకు వంద నిమిషాల సమయాన్ని వినడానికి వెచ్చిస్తున్నారు. మా యాప్ టోటల్ మంత్లీ ఆడియో స్ట్రీమింగ్‌లో ఎప్పటికప్పుడు వృద్ధి కనిపిస్తోంది' అంటున్నాడు పాకెట్ ఎఫ్.ఎం. ఫౌండర్‌లలో ఒకరైన నిశాంత్.

రొమాన్స్, హారర్, థ్రిల్లర్, ఫిక్షన్, సైన్స్ ఫిక్షన్...అనేవి పాకెట్ ఎఫ్.ఎం.లో టాప్ జానర్‌లుగా ఉన్నాయి. ఎపిసోడ్‌లు 10-15 నుంచి 25-30 నిమిషాల వరకు ఉంటాయి.

'పాకెట్ ఎఫ్.ఎం' ఆడియో సెగ్మెంట్ సిరీస్‌లో కొన్ని హిట్ టైటిల్స్...

యే రిష్తా కైసా హై(400 మిలియన్), లవ్ కాంట్రాక్ట్(200 మిలియన్), యక్షిణీ (195 మిలియన్), షూర్‌వీర్(129 మిలియన్)...మొదలైనవి.

'పాకెట్‌ఎఫ్ఎం'లో 733 ఆడియో సిరీస్‌లతో పాటు ఆడియో బుక్స్ కూడా ఉన్నాయి. గత అక్టోబర్‌లో ఆన్‌లైన్ రీడింగ్ ప్లాట్‌ఫామ్ 'పాకెట్ నావెల్'కు శ్రీకారం చుట్టారు. ఇక శ్రోతల విషయానికి వస్తే 15 నుంచి 35 ఏళ్ల లోపు ఉన్నవారు ఎక్కువగా ఉన్నారు. బెంగళూరు, ముంబై, ఢిల్లీ, పుణె, హైదరాబాద్‌లు టాప్ 5 సిటీస్‌గా ఉన్నాయి. మరోవైపు చిన్న పట్టణాలలో కూడా 'పాకెట్‌ఎఫ్ఎం' పాపులర్ అవుతుంది.

> పాకెట్ ఎఫ్.ఎం. విజయవంతం కావడంలో ఎఐ, ఎంఎల్ సాంకేతికత కీలక పాత్ర పోషించింది. శ్రోతల నాడి పసిగట్టడం, సంక్లిష్టమైన విషయాలను సరళం చేయడం, ఖర్చులు తగ్గించుకోవడం... ఇలా ఎన్నో విషయాల్లో సాంకేతికత ఉపయోగపడింది.
> – ప్రతీక్ దీక్షిత్

సాంకేతికత కీలక పాత్ర పోషించింది. శ్రోతల నాడి పసిగట్టడం, సంక్లిష్టమైన విషయాలను సరళం చేయడం, ఖర్చులు తగ్గించుకోవడం... ఇలా ఎన్నో విషయాల్లో సాంకేతికత ఉపయోగపడింది' అంటున్నాడు కంపెనీ సీటీవో ప్రతీక్ దీక్షిత్. కంపెనీకి లైట్‌స్పీడ్, టెన్‌సెంట్, టైమ్స్ ఇంటర్నెట్‌లాంటి కీ ఇన్వెస్టర్‌లు ఉన్నారు. ఇప్పుడు పాకెట్ ఎఫ్.ఎం. యూఎస్ మార్కెట్‌లోకి కూడా విస్తరించే ప్రయత్నం చేస్తోంది.

'టీమ్ మెంబర్స్‌కు అద్భుతమైన శక్తి,సామర్థ్యాలు, అంకితభావం ఉన్నాయి' అంటున్నాడు టాంగ్లిన్ వెంచర్ పార్ట్‌నర్స్‌కు చెందిన సంకల్ప్ గుప్తా.

పాకెట్ ఎఫ్.ఎం.ను 'నెట్‌ఫ్లిక్స్ ఆఫ్ ఆడియో వోటీటీ ప్లాట్‌ఫామ్స్'గా తీర్చిదిద్దాలనేది ముగ్గురు విజేతల లక్ష్యం.



● టెక్.. టాక్

వివో ఎక్స్ ఫోల్డ్ 2



డిస్‌ప్లే: 8.03 అంగుళాలు
వోఎస్: ఆండ్రాయిడ్ 13
కనెక్టివిటీ: 5జీ
బరువు: 279 గ్రా.
మెమొరీ: 256జీ 12జీబి ర్యామ్
512 జీబి 12జీబి
ఫ్రంట్ కెమెరా: వైడ్(మెయిన్) 16 ఎంపీ
బ్యాటరీ: 4800 ఎంఏహెచ్

యాపిల్ మ్యాక్ బుక్ ఎయిర్ 15



హైట్: 1.13 సీఎం
విడ్త్: 30.41 సీయం
డెప్త్: 21.5 సీఎం
స్టోరేజ్: 256 జీబి 512జీబి
ఆడియో: 4-స్పీకర్ సౌండ్ సిస్టమ్
వైడ్ స్టీరియో సౌండ్
బరువు: 1.24 కేజీ
ఫీచర్స్: వాయిస్ కంట్రోల్, వాయిస్ వోవర్... మొదలైనవి.

వాట్సాప్‌లో ఆటో-డౌన్‌లోడ్

(ఫొటోలు, వీడియోలు) టర్న్ ఆఫ్ చేయడానికి...

వాట్సాప్‌లోకి వచ్చిన మీడియా ఫైల్ ఫోన్ గ్యాలరీలో సేవ్ అవుతుంది. మీడియా విజిబిలిటీ ఆప్షన్ 'టర్న్‌డ్ ఆన్'లో ఉండడమే దీనికి కారణం. టర్న్ ఆఫ్ చేయడానికి



- వాట్సాప్ ఓపెన్ చేసి ఆటో-డౌన్‌లోడ్ డిసైబుల్ చేయాలనుకుంటున్న 'చాట్'పై ట్యాప్ చేయాలి.
- 'నేమ్ ఆఫ్ ది చాట్' ట్యాప్ చేసి ప్రొఫైల్ సెక్షన్‌లోకి వెళ్లాలి
- మీడియా విజిబిలిటీ-ట్యాప్
- ట్యాప్-నో
- ఒకవేళ ఫీచర్‌ని ఎనైబుల్ చేయాలనుకుంటే ఇదే విధానంలో 'యస్' ట్యాప్ చేయాలి.

● కళ

ది ఆర్ట్ ఆఫ్ కామెడీ

ఇంజనీరింగ్ రెండో సంవత్సరంలో ఉన్నప్పుడు 'ఇంజినీరింగ్ తప్ప ఏదైనా చేయాలి' అని గట్టిగా అనుకుంది నిహారిక! పేరెంట్స్ ససేమిరా అన్నారు. దీంతో చదువు తప్పలేదు. ఒకవైపు చదువుకుంటూనే మరోవైపు కంటెంట్ క్రియేటర్‌గా ప్రయాణం మొదలుపెట్టింది. సోషల్ లైఫ్ పెద్దగా లేని నిహారిక తన స్టడీ రూమ్‌లో ఇంజనీరింగ్ పుస్తకాలు చదువుకుంటూనే, మరోవైపు కామెడీ స్కెచ్‌లు రాసేది.

'మొదట్లో నన్ను ఎవరూ సీరియస్‌గా తీసుకునేవారు కాదు. నన్ను అనుకరిస్తూ కామెంట్స్ పెట్టేవారు. అయితే వాటికి నేనెప్పుడు బాధ పడలేదు. స్వభావరీత్యా నేను చాలా సెన్సిటివ్ పర్సన్‌ని. అయితే కాలేజీలోకి అడుగుపెట్టిన తరువాత మరీ ఇంత సున్నితంగా ఉంటే బాగుండదు అనిపించింది. ఒక్కొక్కరికీ ఒక్కో అభిప్రాయం ఉంటుంది. ప్రతి దానికి బాధ పడాల్సిన అవసరం లేదు. మానసికంగా దృఢంగా ఉండడం అనేది కంటెంట్ క్రియేటర్‌గా ప్రయాణం మొదలుపెట్టినప్పుడు బాగా ఉపయోగపడింది. మొదట్లో వెక్కిరించిన వారే ఆ తరువాత మెచ్చుకునేవారు' అంటుంది నిహారిక.

చవకబారు విమర్శల మాట ఎలా ఉన్నా నిర్మాణాత్మక విమర్శను ఇష్టపడుతుంది. 'కొత్త విషయాలు నేర్చుకోవడానికి, మనల్ని మనం మెరుగు పెట్టుకోవడానికి నిర్మాణాత్మకమైన విమర్శ తోడ్పడుతుంది' అంటుంది నిహారిక. ఇన్‌స్టాగ్రామ్ 'రీల్స్' ద్వారా నిహారిక పేరు ఎక్కడికో వెళ్లిపోయింది.

నిహారిక కంటెంట్‌కు తొలి ప్రేక్షకురాలు నిహారికనే! ప్రేక్షక స్థానంలో కూర్చున్నప్పుడు తాను ఆ కంటెంట్ ఎంజాయ్ చేయగలిగితేనే ప్రేక్షకుల్లోకి తీసుకువెళుతుంది. 2022లో తన తొలి షార్ట్-ఫార్మట్ కంటెంట్‌ను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది. ఇక అప్పటి నుంచి వెనక్కి తిరిగిచూసుకోలేదు. తన ఫస్ట్ వైరల్ వీడియో 'లివింగ్ ఎలోన్ 101' పదమూడు రోజుల వ్యవధిలోనే 11 మిలియన్‌ల వ్యూస్‌ను దాటేసింది.

'ప్రేక్షకుల పెదాల మీద నవ్వులు పూయించే ఔషధం ఇంట్లో దొరకదు. జనాల్లోకి వెళ్లాలి. చిన్న ఎక్స్‌ప్రెషన్ నుంచి విలువైన మాట వరకు ఎన్నెన్నో బయటి ప్రపంచంలోనే దొరుకుతాయి' అంటుంది నిహారిక ఎన్ఎం.

'నాకు ఏదైనా సరే త్వరగా బోర్ కొడుతుంది. దీని వల్ల నాకు జరిగిన మేలు ఏమిటంటే నా కంటెంట్‌ను ఇతరులు బోర్‌గా ఫీల్ కావడానికి ముందుగానే కొత్త కంటెంట్ కోసం ప్రయత్నిస్తాను' అంటుంది నిహారిక ఎన్ఎం.

> బెంగళూరుకు చెందిన నిహారిక ఇంజినీరింగ్, ఎంబీఏ చేసింది. అయితే తనలోని క్రియేటివిటీ ఆమెను వేరే మార్గం వైపు నడిపించింది. డిజిటల్ కంటెంట్ క్రియేటర్‌గా అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకుంటున్న నిహారికకు 'డోన్ట్ జస్ట్ ఫాలో ట్రెండ్స్. సెట్ దెమ్' అనే మాట అంటే చాలా ఇష్టం...



నిహారిక

అవును... ఇది నిజమే!

- నమీబియాలోని 'డెడ్ వ్లయ్'లో 900 ఏళ్ల వయసు ఉన్న చెట్లు ఉన్నాయి. అయితే అవి పేరుకు మాత్రమే చెట్లు. పచ్చదనం లేకుండా ఎండిపోయిన చెట్లు! అందుకే దీన్ని 'చెట్ల ఎడారి' 'చెట్ల సమాధులు' అని పిలుస్తారు
- చిలకలలో 'డ్రాకూన్ చిలకలు వేరయా' అని చెప్పుకోవచ్చు. పపువా న్యూ గినియాలోని రెయిన్ ఫారెస్ట్‌లో కనిపించే డ్రాకూల ప్యారట్స్ నలుపు, చార్‌కోల్ గ్రే రంగుల్లో ఉండి కుంచెం భయపెట్టేలా ఉంటాయి
- నార్వేలో 'హెల్' పేరుతో ఒక విలేజ్ ఉంది. టూరిస్ట్ ఎట్రాక్షన్‌లో భాగంగా ఆ పేరు పెట్టారు!

● ఇంగ్లిష్ ఇడియమ్స్

కీప్ అప్ విత్ ది జోన్‌సిస్



మన స్థాయికి తగినట్లు ఖర్చు పెట్టడం అనేది సరియైన పద్ధతి. కొందరు మాత్రం దీన్ని పాటించరు. తమ ఆర్థికస్థాయితో సంబంధం లేకుండా ఇతరులను అనుకరిస్తూ ఖర్చు చేస్తారు. ఇరుగుపొరుగువారు, బంధువుల కంటే తాము ఏ రకంగా తక్కువ కాదు అని ఆడంబరం ప్రదర్శించడానికి పరిమితికి మించి ఖర్చు చేస్తుంటారు. ఇలాంటి సందర్భంలో ఉపయోగించే ఇడియమ్...కీప్ అప్ విత్ ది జోన్‌సిస్.

ఈ ఇడియమ్‌కు మూలం...అమెరికన్ కామిక్ స్ట్రిప్: కీప్ అప్ విత్ ది జోన్‌సిస్. కార్టూనిస్ట్ అర్థర్ మోమండ్ ఈ కార్టూన్ స్ట్రిప్‌ను 1913లో క్రియేట్ చేశాడు.

సినిమా


చిరంజీవి

మార్క్ చేసుకోండి...

'భోళా శంకర్' సినిమాలోని తన పాత్ర డబ్బింగ్‌ని పూర్తి చేశారు హీరో చిరంజీవి. ఈ విషయాన్ని ఆయన ట్విట్టర్ వేదికగా ప్రకటించారు. మెహర్ రమేష్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో తమన్నా హీరోయిన్. రామబ్రహ్మం సుంకర నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 11న విడుదల కానుంది. ''భోళా శంకర్' రూపుదిద్దుకున్న తీరు చాలా ఆనందంగా ఉంది. ఈ ఫైర్ మాస్ ఎంటర్‌టైనర్ కచ్చితంగా ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. మీ క్యాలెండర్‌లను మార్క్ చేసుకోండి. థియేటర్స్‌లో కలుద్దాం.. భోళా శంకర్ ఆగస్టు 11'' అంటూ డబ్బింగ్ చెబుతున్న ఓ ఫొటోని షేర్ చేశారు చిరంజీవి. మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటోంది. కీర్తీ సురేష్, సుశాంత్ కీలక పాత్రలు చేసిన ఈ చిత్రానికి సంగీతం: మహతి స్వరసాగర్, కెమెరా: డడ్లీ.

వివాదాల నుంచి పబ్లిసిటీ కోరుకోను – ఎస్‌కేఎన్

''ఇండస్ట్రీలో జర్నలిస్ట్‌గా మొదలై, పీఆర్‌వో అయ్యాను. ఆ తర్వాత నిర్మాతగా మారాను. కెరీర్ చాలా సంతృప్తిగా ఉంది'' అన్నారు ఎస్‌కేఎన్. ఆనంద్ దేవరకొండ, విరాజ్ అశ్విన్, వైష్ణవి చైతన్య ప్రధాన పాత్రల్లో సాయి రాజేష్ దర్శకత్వంలో ఎస్‌కేఎన్ నిర్మించిన చిత్రం 'బేబీ'. ఈ నెల 14న ఈ చిత్రం రిలీజ్ కానుంది. నేడు (శుక్రవారం) ఎస్‌కేఎన్ బర్త్ డే. ఈ సందర్భంగా గురువారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఎస్‌కేఎన్ మాట్లాడుతూ– ''ఆనంద్, విరాజ్, వైష్ణవిల మధ్య సాగే ఎమోషనల్ లవ్‌స్టోరీ 'బేబీ'. కథ, కథనం, సన్నివేశాలు కొత్తగా ఉంటాయి. ఇంట్రవెల్‌కు ముందు పెద్ద షాక్ ఉంటుంది. మ్యూజిక్ పరంగా ఈ మధ్య వచ్చిన ప్రేమకథా చిత్రాల్లో 'బేబీ' ఓ మంచి చిత్రంగా నిలిచిపోతుందనే నమ్మకం ఉంది. విజయ్ బుల్గానిన్ మంచి సంగీతం అందించాడు. ఇక సోలో నిర్మాతగా నేను తొలిసారి విజయ్ దేవరకొండతో 'టాక్సీవాలా' నిర్మించాను. అప్పుడు సాయి రాజేష్ నాకు 'బేబీ' కథ చెప్పాడు. కథ విన్నాక నిర్మాతగా నా తర్వాతి చిత్రం ఇదే చేయాలనుకున్నాను. ఈ సినిమా నుంచి విడుదలైన ఓ పోస్టర్ వివాదాస్పదమైంది. ఆ పోస్టర్‌ను అలాగే ఉంచితే మూవీకి ప్రమోషన్ వస్తుందని కొందరు అన్నారు. కానీ కంటెంట్ బాగుంటే పబ్లిసిటీ అదే వస్తుంది.. కాంట్రవర్సీల నుంచి కాదని నమ్మే వ్యక్తిని. ఇక మార్కెట్ అంటే.. 'అర్జున్ రెడ్డి' రిలీజ్ కాకముందే విజయ్ స్టార్ అవుతాడని నమ్మి 'టాక్సీవాలా' తీశా. అలా 'బేబీ' ఆనంద్ కెరీర్‌లో ఓ మైలురాయిలా నిలుస్తుందని నమ్ముతున్నాను. ఏడాదికి రెండు సినిమాలు, వెబ్ ఫిల్మ్ నిర్మించాలనుకుంటున్నాను. సందీప్ రాజ్, సాయి రాజేష్, రాహుల్ సంకృత్యాన్, వీఐ ఆనంద్‌లతో సినిమాలు ఉన్నాయి'' అన్నారు.



నువ్వు కావాలయ్యా...

కొంచెం ఆట కావాలా? కొంచెం పాట కావాలా? అంటూ ఊర మాస్ స్టెప్పులతో తమన్నా అదరగొట్టారు. రజనీకాంత్ హీరోగా నటించిన 'జైలర్'లోని 'నువ్వు కావాలయ్యా..' అంటూ సాగే పాట ఇది. నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని సన్ పిక్చర్స్ నిర్మించింది. 'జైలర్' చిత్రం ఆగస్టు 10న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ఈ చిత్రంలోని 'రా.. నువ్వు కావాలయ్యా.. నువ్వు కావాలి' అంటూ సాగే పాట లిరికల్ వీడియోను గురువారం విడుదల చేశారు. రజనీకాంత్, తమన్నా మధ్య ఈ పాట సాగుతుంది. అనిరుధ్ రవిచంద్రన్ స్వరపరచిన ఈ పాటకు అరుణ్ రాజా కామరాజ్ సాహిత్యం అందించగా శిల్పా రావు, అనిరుధ్ పాడారు. జానీ మాస్టర్ ఈ పాటకు నృత్య రీతులు సమకూర్చారు. 'జైలర్'లో శివ రాజ్‌కుమార్, మోహన్‌లాల్, జాకీ ష్రాఫ్, సునీల్, రమ్యకృష్ణ, మిర్నా మీనన్ కీలక పాత్రలు పోషించారు.


తమన్నా, రజనీకాంత్


నయనతార

మరో గ్రీన్ సిగ్నల్

కథ నచ్చితే కొత్త దర్శకులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేస్తుంటారు హీరోయిన్ నయనతార. కోలీవుడ్ దర్శకుడు అశ్విన్ శరవణన్ వంటి వారికి తొలి అవకాశం ఇచ్చింది నయనతారనే. కాగా ఈ బ్యూటీ ఎక్కువగా ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్స్ చేస్తున్న విషయం తెలిసిందే. కథ బాగా నచ్చడంతో తాజాగా మరో లేడీ ఓరియంటెడ్ మూవీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ సినిమాతో విక్కీ ద్యూడ్ అనే ఓ యూట్యూబర్ దర్శకుడిగా పరిచయం కానున్నారని టాక్. ఈ సినిమా షూటింగ్‌ను ఈ నెలలో ఆరంభించనున్నారట. ఈ చిత్రం కాకుండా మరో నాలుగు చిత్రాలతో నయనతార ఫుల్ బిజీగా ఉన్నారు. వీటిలో షారుక్ ఖాన్ సరసన నటిస్తున్న హిందీ చిత్రం 'జవాన్' ఒకటి.


రెజీనా

నేనేనా రెడీ

రెజీనా లీడ్ రోల్‌లో నటించిన తాజా చిత్రం 'నేనేనా' (తమిళంలో 'సూర్పణగై'). కార్తీక్ రాజు దర్శకత్వం వహించిన ఈ సినిమాలో అక్షరా గౌడ, అలీ ఖాన్, జై ప్రకాష్ కీలక పాత్రలు చేశారు. 'జాంబీ రెడ్డి' సినిమాతో హిట్ అందుకున్న ఆపిల్ ట్రీ స్టూడియోస్ ప్రొడక్షన్స్‌పై రూపొందిన ఈ సినిమా ఈ నెలాఖరులో విడుదలకి సిద్ధమవుతోంది. ఈ చిత్రానికి శ్యామ్ సీఎస్ సంగీతం అందించారు.


ఆ పార్కులో సలార్ ఉన్నాడు

'లయన్, చీతా, టైగర్, ఎలిఫెంట్.. వెరీ డేంజరస్.. బట్ నాట్ ఇన్ జురాసిక్ పార్క్, బికాజ్ ఇన్ దట్ పార్క్..' (సింహం.. చిరుత.. పులి.. ఏనుగు.. చాలా ప్రమాదం.. కానీ, జురాసిక్ పార్క్‌లో కాదు.. ఎందుకంటే ఆ పార్కులో...) అంటూ నటుడు టీనూ ఆనంద్ చెప్పిన డైలాగ్ పూర్తి కాకముందే ప్రభాస్ స్క్రీన్ మీద ప్రత్యక్షమవుతారు (ఆ పార్కులో ఉన్నది సలార్ అనేది అర్థం). ప్రభాస్ టైటిల్ రోల్‌లో నటిస్తున్న చిత్రం 'సలార్ పార్ట్ 1: సీజ్ ఫైర్' టీజర్ ఇది. 'కేజీఎఫ్' ఫేమ్ ప్రశాంత్ నీల్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో శ్రుతీహాసన్ హీరోయిన్.. ''కేజీఎఫ్, కాంతారా' వంటి హిట్ చిత్రాలు నిర్మించిన హోంబలే ఫిలింస్‌పై విజయ్ కిరగందూర్ 'సలార్' నిర్మిస్తున్నారు. ఈ చిత్రం టీజర్‌ను గురువారం రిలీజ్ చేశారు. 'సలార్' రెండు భాగాలుగా రిలీజ్ కానుంది. తొలి భాగం 'సలార్ పార్ట్ 1: సీజ్ ఫైర్' సెప్టెంబరు 28న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో రిలీజ్ కానుంది.


ప్రభాస్

యాక్షన్.. థ్రిల్

జగన్మోహన్, శ్వేతా వర్మ, శివన్నారాయణ, రూపాలక్ష్మి, దయానంద్ రెడ్డి, దేవీ ప్రసాద్ ప్రధాన పాత్రల్లో నటించిన యాక్షన్ థ్రిల్లర్ 'ఎస్ 99'. టెంపుల్ మీడియా పతాకంపై యతీష్, నందిని నిర్మిస్తున్నారు. ఈ సినిమా టీజర్‌ను విడుదల చేసిన దర్శకుడు కె. రాఘవేంద్ర రావు మాట్లాడుతూ– ''టీజర్ బాగుంది. తెలుగు, హిందీ భాషల్లో రిలీజ్ అవుతున్న ఈ సినిమా అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నాను'' అన్నారు. ''వచ్చే నెల మొదటివారంలో ఈ సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం'' అన్నారు జగన్మోహన్.


రాఘవేంద్ర రావు, జగన్మోహన్


అజయ్, రసమయి బాలకిషన్, జగపతిబాబు

రుద్రంగి నా థర్డ్ ఇన్నింగ్స్ – జగపతిబాబు

''మూడేళ్లు సినిమాలు లేకుండా ఇంట్లో కూర్చున్నప్పుడు 'లెజెండ్' సినిమా అవకాశం వచ్చింది. అది నా సెకండ్ ఇన్నింగ్స్ అని అందరూ పేరు పెట్టారు. 'రుద్రంగి'కి నా థర్డ్ ఇన్నింగ్స్ అని పేరు పెట్టుకుంటున్నాను. ఇందులోని నా పాత్రలో దమ్ము ఉంటుంది'' అని నటుడు జగపతిబాబు అన్నారు. అజయ్ సామ్రాట్ దర్శకత్వంలో జగపతిబాబు, ఆశిష్ గాంధీ, మమతా మోహన్ దాస్, విమలా రామన్, గానవి లక్ష్మణ్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'రుద్రంగి'. ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో జగపతిబాబు మాట్లాడుతూ– ''చిన్న సినిమా.. పెద్ద సినిమా.. పెద్ద బడ్జెట్ అనే పాయింట్ ఇవాళ దాటిపోయింది. డబ్బులు పెడితే సూపర్ హిట్ అనేది కాదు. రీసెంట్‌గా విడుదలైన 'సామజ వరగమన' మంచి హిట్ అయింది. 'రుద్రంగి' కథ కూడా కొత్తగా ఉంటుంది'' అన్నారు. రసమయి బాలకిషన్ మాట్లాడుతూ– ''జగతిబాబుగారి ప్రోత్సాహమే మమ్మల్ని ముందుకు నడిపించింది. ప్రేమకు, వాంఛకు మధ్య జరిగిన వాస్తవ కథే 'రుద్రంగి'. నేను ఎమ్మెల్యే కాకముందు కూడా సినిమా తీశా.. ఇప్పుడు 'రుద్రంగి' తీశా. అంతేగానీ ఎమ్మెల్యే అని ఈ సినిమా తీయలేదు. మా సినిమాని ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు.

నాయకుడుతో...

ఉదయనిధి స్టాలిన్, వడివేలు, ఫాహద్ ఫాజిల్, కీర్తి సురేష్ లీడ్ రోల్స్‌లో నటించిన తమిళ చిత్రం 'మామన్నన్'. 'పరియేరుమ్ పెరుమాళ్, కర్ణన్' లాంటి విజయవంతమైన చిత్రాలకు దర్శకత్వం వహించిన మారి సెల్వరాజ్ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఈ చిత్రం తెలుగులో 'నాయకుడు'గా ఏషియన్ మల్టీప్లెక్స్- సురేష్ ప్రొడక్షన్స్ ద్వారా ఈ నెల 14న రిలీజ్ కానుంది. ''పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రమిది'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: ఏఆర్ రెహమాన్.


కీర్తి సురేష్

కోలీవుడ్‌లో కొత్త సినిమా

'ఎఫ్ 3' (2022) తర్వాత మెహరీన్ తెలుగులో సినిమాలు కమిట్ కాలేదు. తాజాగా తమిళంలో ఓ కొత్త చిత్రంలో హీరోయిన్‌గా నటించడానికి అంగీకరించారు. శబరీష్ నంద దర్శకత్వం వహించనున్న ఈ చిత్రంలో వసంత్ రవి హీరో. ఈ చిత్రం పూజా కార్యక్రమాలు చెన్నైలో జరిగాయి. ఇందులో సునీల్ ఓ కీలక పాత్ర చేయనున్నారు. 'విశ్వాసం'లో హీరో అజిత్ కూతురి పాత్రలో కనిపించిన అనిఖా సురేంద్రన్ ఈ సినిమాలో ఓ కీలక పాత్ర చేయనుంది. ఈ చిత్రం షూటింగ్ త్వరలో ఆరంభం కానుంది.


మెహరీన్, అనిఖా సురేంద్రన్

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲ 340	నిఫ్టీ ▲ 99
65,786	19,497

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (గురువారం రాత్రి 11.30 ముగింపు)

సూచీ	ముగింపు		మార్పు
నాస్‌డాక్	13,664	▼	128
డోజోన్స్	33,197	▼	372
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,281	▼	162
డాక్స్	15,529	▼	409
షాంఘై	3,205	▼	17
నికాయ్	32,773	▼	566

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	58,644	▲	13
బంగారం (99.5 స్వచ్ఛత)	58,409	▲	13
వెండి (కేజీ)	70,815	▲	1116

ఆడి క్యూ8 ఈ-ట్రాన్ వస్తోంది



న్యూఢిల్లీ: లగ్జరీ కార్ల తయారీలో ఉన్న జర్మనీ కంపెనీ ఆడి భారత మార్కెట్లో క్యూ8 ఈ-ట్రాన్ ఎలక్ట్రిక్ ఎస్‌యూవీని 2023 ఆగస్ట్‌లో ఆవిష్కరిస్తోంది. ఎస్‌యూవీ, స్పోర్ట్‌బ్యాక్ రకాల్లో విడుదల చేయనుంది. 114 కిలోవాట్ బ్యాటరీ పొందుపరిచారు. పూర్తిగా తయారైన కారును భారత్‌కు దిగుమతి చేసుకుంటారు. ఎలక్ట్రిక్ వాహన విభాగంలో ఇప్పటికే కంపెనీ దేశీయంగా ఈ-ట్రాన్ 50, ఈ-ట్రాన్ 55, ఈ-ట్రాన్ స్పోర్ట్‌బ్యాక్ 55, ఈ-ట్రాన్ జీటీ, ఆర్‌ఎస్ ఈ-ట్రాన్ జీటీ మోడళ్లను విక్రయిస్తోంది. అంతర్జాతీయంగా అందుబాటులో ఉన్న మోడళ్లను ఇక్కడి మార్కెట్‌కు తీసుకువస్తామని ఆడి ఇండియా హెడ్ బల్బీర్ సింగ్ థిల్లాన్ తెలిపారు. '2033 నాటికి పూర్తి ఎలక్ట్రిక్ కంపెనీగా మారాలన్నదే సంస్థ లక్ష్యం. మరిన్ని ఈవీలు ప్రవేశపెడతాం. భారత్‌లో ఈ కార్లు రూ.1.5 కోట్ల సగటు ధరకు అమ్ముడవుతున్నప్పటికీ లగ్జరీ సెగ్మెంట్‌లో ఆడి ఈవీలు ఆదరణ పొందుతున్నాయి' అని వివరించారు. అన్ని విభాగాల్లో కలిపి ఆడి ఇండియా 2023 జనవరి-జూన్‌లో 3,474 యూనిట్ల అమ్మకాలను సాధించింది. అంతక్రితం ఏడాదితో పోలిస్తే ఇది 97% ఎక్కువ.

టయోటా కార్ల ధర పెరిగింది



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ సంస్థ టయోటా కిర్లోస్కర్ మోటార్ తాజాగా ధరలను సవరించింది. అన్ని మోడళ్ల ధర సుమారు 1% పెంచినట్టు కంపెనీ గురువారం ప్రకటించింది. కొత్త ధరలు జూలై 5 నుంచి అమల్లోకి వచ్చాయని టయోటా వెల్లడించింది. ముడి సరుకు వ్యయాలు పెరిగినందునే ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపింది.

తనిష్క్ నుంచి 'టేల్స్ ఆఫ్ మిస్టిక్' కలెక్షన్



హైదరాబాద్: టాటా గ్రూప్ జ్యువెలరీ రిటైల్ సంస్థ తనిష్క్ 'టేల్స్ ఆఫ్ మిస్టిక్' పేరుతో కొత్త కలెక్షన్ ఆవిష్కరించింది. రాజస్తాన్ రాజ భవనాలు, నగర నిర్మాణాల కళాత్మక సౌందర్యం నుంచి ప్రేరణ పొంది ఈ వజ్రాభరణాలను తీర్చిదిద్దినట్లు కంపెనీ తెలిపింది. ఈ కలెక్షన్ విడుదలతో ప్రముఖ భారత డిజైనర్ రాహుల్ మిశ్రా భాగస్వామ్యంతో పారిస్ కౌట్ కొటూర్ వీక్, ఫాల్-వింటర్ 2023-24లో తాము అరంగేట్రం చేశామని వెల్లడించింది.

కార్డు నెట్‌వర్క్‌ను ఎంచుకునేందుకు కస్టమర్‌కు ఆప్షన్

ఆర్‌బీఐ ప్రతిపాదన



న్యూఢిల్లీ: బ్యాంకులు, బ్యాంక్‌యేతర సంస్థలు జారీ చేసే కార్డులకు సంబంధించి అధీకృత నెట్‌వర్క్‌లను ఎంచుకునే వెసులుబాటును కస్టమర్‌కు ఇవ్వాలని రిజర్వ్ బ్యాంక్ ప్రతిపాదించింది. ప్రస్తుతం కార్డ్ నెట్‌వర్క్‌లు, కార్డ్‌లు జారీ చేసే సంస్థల (బ్యాంకులు, నాన్-బ్యాంకులు) మధ్య ఉన్న ఒప్పందాలు.. కస్టమర్లకు తగినన్ని ఆప్షన్లను అందుబాటులో ఉంచేలా లేవని సర్క్యులర్ ముసాయిదాలో అభిప్రాయపడింది. కార్డును జారీ చేసేటప్పుడు గానీ లేదా ఆ తర్వాత గానీ అర్హత కలిగిన కస్టమర్లు.. బహుళ కార్డు నెట్‌వర్క్‌ల నుంచి ఏదో ఒకదాన్ని ఎంచుకునేందుకు అవకాశం కల్పించాలని పేర్కొంది. కార్డు ఇష్యూయర్లు ఒకటికి మించి నెట్‌వర్క్‌లతో కార్డులను జారీ చేయాలని తెలిపింది. సంబంధిత వర్గాలు ఆగస్టు 4 వరకు ఈ ముసాయిదా సర్క్యులర్‌పై ఆర్‌బీఐకి తమ అభిప్రాయాలు తెలియజేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం వీసా, రూపే, మాస్టర్‌కార్డ్ మొదలైన కార్డ్ నెట్‌వర్క్‌లు భారత్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. వీటితో భాగస్వామ్యం ద్వారా బ్యాంకులు, నాన్-బ్యాంకులు తమ డెబిట్, క్రెడిట్, ప్రీపెయిడ్ కార్డులు మొదలైన వాటిని జారీ చేస్తున్నాయి.

ఇక జియో ఫైనాన్షియల్ లిస్టింగ్!

రిలయన్స్‌కు ఎన్‌సీఎల్‌టీ గ్రీన్‌సిగ్నల్



న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్(ఆర్‌ఐఎల్) నుంచి ఫైనాన్షియల్ సర్వీసుల యూనిట్ విడదీతకు జాతీయ కంపెనీ చట్ట ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రిలయన్స్ స్ట్రాటజిక్ ఇన్వెస్ట్‌మెంట్స్ లిమిటెడ్‌ను విడదీసేందుకు ఇప్పటికే ఆర్‌ఐఎల్ ప్రణాళికలు ప్రకటించింది. ఈ విభాగాన్ని జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ (జేఎఫ్‌ఎస్‌ఎల్) పేరుతో స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్ట్ చేయనున్నట్లు వెల్లడించింది. గత నెలాఖరున ఎన్‌సీఎల్‌టీ ముంబై బెంచ్ ఇందుకు అనుమతించినట్లు ఆర్‌ఐఎల్ తాజాగా ఎక్స్ఛేంజీలకు సమాచారమిచ్చింది.

మార్కెట్లో మళ్లీ కొత్త రికార్డులు

- ర్యాలీకి ఎఫ్‌ఐఐల కొనుగోళ్ల అండ
- ఇంట్రాడే, ముగింపులో కొత్త గరిష్టానికి
- 19,500 స్థాయికి చేరువలో నిఫ్టీ
- సెన్సెక్స్ లాభం 340 పాయింట్లు



ముంబై: ఒకరోజు విరామం తర్వాత స్టాక్ మార్కెట్లో మళ్లీ కొత్త రికార్డులు నమోదయ్యాయి. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలోని బలహీనతలను విస్మరిస్తూ.., ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు మొగ్గుచూపడంతో గురువారం ఇంట్రాడే, ముగింపులోనూ సూచీలు సరికొత్త రికార్డులను లిఖించాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి బలహీన సంకేతాలు అందుకున్న మార్కెట్ ఉదయం నష్టంతో మొదలైంది. సెన్సెక్స్ 54 పాయింట్లు పతనమై 65,392 వద్ద, నిఫ్టీ 13 పాయింట్లు నష్టపోయి 19,386 వద్ద ట్రేడింగ్ ప్రారంభించాయి. యుటిలిటీ, రియల్టీ, ఇంధన, విద్యుత్, ఆయిల్‌అండ్‌గ్యాస్, ఆటో, హెల్త్‌కేర్ షేర్లకు డిమాండ్ లభించింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 387 పాయింట్లు లాభపడి 65,833 వద్ద, నిఫ్టీ 113 పాయింట్లు బలపడి 19,512 వద్ద జీవితకాల గరిష్టాలను నమోదు చేశాయి. చివరికి సెన్సెక్స్ 340 పాయింట్లు పెరిగి 65,786 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 99 పాయింట్లు లాభపడి 19,497 వద్ద ముగిసింది. ఐటీ, ఎఫ్‌ఎంసీజీ, వినిమయ షేర్లలో లాభాల స్వీకరణ కొనసాగింది. డాలర్ మారకంలో రూపాయి విలువ 22 పైసలు క్షీణించి 82.47 స్థాయి వద్ద స్థిరపడింది. సూచీల రికార్డు ర్యాలీ తిరిగి మొదలవడంతో గురువారం ఒక్కరోజే రూ.1.80 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. బీఎస్‌ఈ కంపెనీల మొత్తం విలువ రికార్డు స్థాయి రూ.301.70 లక్షల కోట్లకు చేరింది.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- టైర్ల కంపెనీ సియట్ షేరు 19% పెరిగి రూ.2498 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 20% ర్యాలీ చేసి రూ.2,511 వద్ద జీవితకాల గరిష్టాన్ని అందుకుంది. ఈ క్రమంలో కంపెనీ మార్కెట్ క్యాప్ తొలిసారి రూ.10,000 కోట్లకు చేరింది.
- బైబ్యాక్ ప్రతిపాదనకు బోర్డు ఆమోదం తెలపడంతో బీఎస్‌ఈ షేరు నాలుగు శాతం లాభపడి రూ.706 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో ఐదు శాతం పెరిగి రూ.711 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది.
- టాటా ఏఎంసీ వాటాను పెంచుకునేందుకు ఆర్‌బీఐ ఆమోదం తెలపడంతో డీసీబీ బ్యాంకు ఆరుశాతం పెరిగి రూ.129 వద్ద స్థిరపడింది.

సెన్‌కో గోల్డ్ ఐపీవో సక్సెస్

73 రెట్లు అధిక సబ్‌స్క్రిప్షన్

జ్యువెలరీ రిటైల్ రంగ కంపెనీ సెన్‌కో గోల్డ్ పబ్లిక్ ఇష్యూ విజయవంతమైంది. ఇష్యూ చివరి రోజు గురువారాని(6)కల్లా 73 రెట్లు అధికంగా సబ్‌స్క్రిప్షన్ నమోదైంది. కంపెనీ 94.18 లక్షల షేర్లు విక్రయానికి ఉంచగా.. 69.08 కోట్లకుపైగా షేర్ల కోసం బిడ్స్ దాఖలయ్యాయి. షేరుకి రూ. 301-317 ధరల శ్రేణిలో చేపట్టిన ఇష్యూ ద్వారా రూ. 405 కోట్లు సమీకరించింది. ప్రధానంగా అర్హతగల సంస్థాగత కొనుగోలుదారుల(క్విబ్) విభాగంలో 181 రెట్లు అధికంగా బిడ్స్ దాఖలయ్యాయి. రిటైలర్ల నుంచి 15.5 రెట్లు అధికంగా దరఖాస్తులు వచ్చాయి.

పారదర్శకంగా ఎన్‌పీఏల గుర్తింపు

- రిస్క్ నిర్వహణ బలంగా ఉండాలి
- పీఎస్‌బీలను కోరిన ఆర్థిక మంత్రి
- బ్యాంకింగ్ పనితీరుపై సీఈఓలతో సమీక్ష



న్యూఢిల్లీ: వసూలు కాని రుణాన్ని నిరర్థక ఆస్తిగా (ఎన్‌పీఏలు) గుర్తించే విషయంలో పారదర్శకంగా వ్యవహరించాలని ప్రభుత్వరంగ బ్యాంక్‌లను (పీఎస్‌బీలు) కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కోరారు. అలాగే, బలమైన రిస్క్ నిర్వహణ విధానాలను అనుసరించాలని సూచించారు. వృద్ధి, లాభదాయకత విషయంలో ఇక ముందూ మంచి పనితీరు చూపించాలని కోరారు. ఆర్థిక మంత్రి అన్ని పీఎస్‌బీల సీఈవోలతో ఢిల్లీలో గురువారం సమావేశమయ్యారు. పీఎం స్ట్రీట్ వెండర్స్ ఆత్మ నిర్భర్ నిధి, స్టాండప్ ఇండియా, ప్రధానమంత్రి ముద్రా యోజన, అటల్ పెన్షన్ యోజన, అత్యవసర రుణ వితరణ పథకం తదితర కేంద్ర ప్రభుత్వ పథకాల పరిధిలో నిర్దేశించిన లక్ష్యాలను ప్రభుత్వరంగ బ్యాంక్‌లు ఏ మేరకు చేరాయన్నది మంత్రి పరిశీలించినట్టు అధికార వర్గాలు వెల్లడించాయి. రుణ వితరణలో వృద్ధి, ఆస్తుల నాణ్యత, తదుపరి ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బ్యాంక్‌ల నిధుల అవసరాలను సమీక్షించినట్టు తెలిపాయి. రుణాల పంపిణీ, లాభదాయకత, ఆస్తుల నాణ్యత, క్యాపిటల అడెక్వసీ తదితర గణాంకాలన్నీ పీఎస్‌బీల పనితీరు ఎంతో మెరుగుపడినట్టు తెలియజేస్తుండడాన్ని మంత్రి పరిగణనలోకి తీసుకున్నట్టు పేర్కొన్నాయి.

త్వరలో గ్రామీణ బ్యాంక్‌ల వంతు..

ప్రాంతీయ గ్రామీణ బ్యాంక్‌ల పనితీరును కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి త్వరలోనే సమీక్షించనున్నారు. ఇందుకోసం గ్రామీణ బ్యాంక్‌ల అధినేతలతో ఆమె భేటీ కానున్నట్టు అధికార వర్గాలు తెలిపాయి. ప్రాంతీయ గ్రామీణ బ్యాంక్‌లు అందరికీ ఆర్థిక సేవలను చేరువ చేయడం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ రుణ అవసరాలను తీర్చడంలో కీలక పాత్ర పోషిస్తుండడం తెలిసిందే. సాగు రంగం, దాని అనుబంధ విభాగాలకు కిసాన్ క్రెడిట్ కార్డ్ (కేసీసీ)ల జారీని ఆర్థిక మంత్రి సమీక్షించనున్నట్టు ఆ వర్గాలు చెప్పాయి. వీలైనంత ఎక్కువ సంఖ్యలో రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డ్ రుణాలు అందేలా చూడాలన్నది కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ లక్ష్యంగా ఉంది. బలహీనంగా ఉన్న ప్రాంతీయ గ్రామీణ బ్యాంక్‌లకు నిధుల అవసరాలను కూడా మంత్రి పరిశీలించనున్నారు. టెక్నాలజీ పెంపు, ఎన్‌పీఏల తగ్గింపు విధానాలు కూడా సమావేశంలో చర్చకు వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది.

అదానీ గ్రీన్ నిధుల సమీకరణకు సై

షేర్ల విక్రయంతో రూ. 12,300 కోట్లు



న్యూఢిల్లీ: పునరుత్పాదక ఇంధన రంగ కంపెనీ అదానీ గ్రీన్ ఎనర్జీ నిధుల సమీకరణ ప్రణాళికలు ప్రకటించింది. షేర్ల విక్రయం ద్వారా రూ. 12,300 కోట్లు సమీకరించే ప్రతిపాదనకు బోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు గౌతమ్ అదానీ గ్రూప్ కంపెనీ తాజాగా వెల్లడించింది. అర్హతగల సంస్థాగత ఇన్వెస్టర్లకు షేర్ల విక్రయం(క్విప్) మార్గంలో నిధులను సమకూర్చుకోనున్నట్లు తెలియజేసింది. కంపెనీ విస్తరణ ప్రణాళికలకు అవసరమయ్యే పెట్టుబడుల కోసం ఈ నిధులను వినియోగించనున్నట్లు తెలియజేసింది. కాగా.. ఇటీవల గ్రూప్‌లోని మరో రెండు కంపెనీలు సైతం నిధుల సమీకరణ ప్రణాళికలు ప్రకటించిన సంగతి తెలిసిందే. క్విప్ ద్వారా అదానీ ఎంటర్‌ప్రైజెస్ రూ. 12,500 కోట్లు, అదానీ ట్రాన్స్‌మిషన్ రూ. 8,500 కోట్లు చొప్పున సమకూర్చుకోనున్నట్లు ఇప్పటికే తెలియజేశాయి. ప్రధానంగా యూరప్, మధ్యప్రాచ్యం నుంచి ఇన్వెస్టర్లు అదానీ గ్రూప్ షేర్ల కొనుగోలుకి ఆసక్తి చూపుతున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. యూఎస్ షార్ట్‌సెల్లర్ హిండెన్‌బర్గ్ ఆరోపణల నివేదిక వెలువడిన తదుపరి అదానీ గ్రూప్ కంపెనీలు పెట్టుబడుల సమీకరణ, కొత్త ప్రాజెక్టులతో విస్తరణకు తెరతీశాయి. హిండెన్‌బర్గ్ ఆరోపణలను తోసిపుచ్చిన గ్రూప్ ఇన్వెస్టర్లలో విశ్వాసాన్ని మరింత పెంచేందుకు వీలుగా ముందస్తు రుణ చెల్లింపులకు ప్రాధాన్యమిస్తున్న విషయం విదితమే.

సాక్షి స్పోర్ట్స్



డి లీడె

'ఆరెంజ్' ఓ రేంజ్‌లో...



వన్డే వరల్డ్ కప్‌కు అర్హత సాధించేందుకు నెదర్లాండ్స్ తమ చివరి మ్యాచ్‌లో స్కాట్లాండ్‌పై తప్పనిసరిగా గెలవాలి. లక్ష్యం 278 పరుగులు... అదీ 44 ఓవర్లలో సాధిస్తేనే బెర్త్ దక్కుతుంది. అంతకంటే ఒక్క బంతి ఎక్కువ తీసుకొని మ్యాచ్ గెలిచినా లాభం లేదు. స్కాట్లాండ్ కట్టుదిట్టమైన బౌలింగ్‌కు తక్కువ వ్యవధిలో ఒక్కో వికెట్ కోల్పోతూ వచ్చిన జట్టు ఒక దశలో 163/5 వద్ద నిలిచింది. 79 బంతుల్లోనే మరో 115 పరుగులు కావాలి. ఇలాంటి స్థితిలో బాస్ డి లీడె ఒక్కసారిగా చెలరేగిపోయాడు. తర్వాతి 40 బంతుల్లోనే 76 పరుగులు సాధించి జట్టుకు సంచలన విజయం అందించాడు. డి లీడె శతకానికి తోడు జుల్ఫికర్ అండగా నిలవడంతో నెదర్లాండ్స్ మరో 7 బంతులు మిగిలి ఉండగానే లక్ష్యాన్ని చేరి ఈ ఏడాది అక్టోబర్-నవంబర్‌లలో భారత్‌లో జరిగే వరల్డ్ కప్‌కు అర్హత సాధించింది. 'సూపర్ సిక్స్' దశలో జింబాబ్వేను ఓడించి ఆ జట్టును వరల్డ్ కప్‌కు దూరం చేసి తమ అవకాశాలు మెరుగుపర్చుకున్న స్కాట్లాండ్ అనూహ్య ఓటమితో నిష్క్రమించింది. వరల్డ్ కప్‌కు నెదర్లాండ్స్ అర్హత సాధించడం ఇది ఐదోసారి. 2011 తర్వాత మళ్లీ భారత్‌లోనే ఆ జట్టు బరిలోకి దిగుతోంది.

వన్డే వరల్డ్ కప్‌కు నెదర్లాండ్స్ అర్హత

- చివరి పోరులో 4 వికెట్లతో స్కాట్లాండ్‌పై విజయం
- సెంచరీతో గెలిపించిన డి లీడె

బులవాయో: వన్డే వరల్డ్‌కప్ క్వాలిఫయింగ్ టోర్నీలో మరో రెండు మ్యాచ్‌లు మిగిలి ఉండగానే భారత్‌కు వచ్చే రెండు జట్లేవో తేలిపోయింది. మాజీ చాంపియన్ శ్రీలంక ఇంతకుముందే అర్హత సాధించగా, ఇప్పుడు నెదర్లాండ్స్ తమ చోటును ఖాయం చేసుకుంది. గురువారం తప్పనిసరిగా నెగ్గాల్సిన 'సూపర్ సిక్స్' మ్యాచ్‌లో నెదర్లాండ్స్ 4 వికెట్లతో స్కాట్లాండ్‌పై నెగ్గింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన స్కాట్లాండ్ 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 277 పరుగులు చేసింది. బ్రెండన్ మెక్‌ములన్ (106; 11 ఫోర్లు, 3 సిక్స్‌లు) సెంచరీ సాధించగా, కెప్టెన్ రిచీ బెరింగ్టన్ (64; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించాడు. బాస్ డి లీడె (5/52) ఐదు వికెట్లతో ప్రత్యర్థిని దెబ్బ తీశాడు. అనంతరం వరల్డ్‌కప్‌కు క్వాలిఫై కావాలంటే 44 ఓవర్లలోనే లక్ష్యం సాధించాల్సిన స్థితిలో నెదర్లాండ్స్ బరిలోకి దిగింది. ఆ జట్టు 42.5 ఓవర్లలో 6 వికెట్లకు 278 పరుగులు సాధించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' బాస్ డి లీడె (92 బంతుల్లో 123; 7 ఫోర్లు, 5 సిక్స్‌లు) శతకంతో చెలరేగగా... విక్రమ్‌జిత్ సింగ్ (40), సాఖిబ్ జుల్ఫికర్ (33 నాటౌట్) రాణించారు. 36 ఓవర్లు ముగిసేవరకు కూడా మ్యాచ్ స్కాట్లాండ్ నియంత్రణలోనే ఉంది. 8 ఓవర్లలో నెదర్లాండ్స్ 85 పరుగులు చేయాల్సి ఉంది. తర్వాతి 4 ఓవర్లలో 40 పరుగులు వచ్చాయి. దాంతో సమీకరణం 4 ఓవర్లలో 45కు మారింది. ఈ సమయంలో డి లీడె ఒక్క సారిగా టి20 తరహా ఆటను చూపించాడు. వాట్ వేసిన ఓవర్లో 2 సిక్స్‌లు, మెక్‌ములెన్ వేసిన తర్వాతి ఓవర్లో 2 సిక్స్‌లు బాదడంతో మొత్తం 42 పరుగులు వచ్చేశాయి. 84 బంతుల్లో అతని సెంచరీ పూర్తయింది. డి లీడె రనౌటైనా, వాన్ బీక్ సింగిల్ తీయడంతో డచ్ శిబిరంలో సంబరాలు షురూ అయ్యాయి.

సరిగ్గా ఇరవై ఏళ్ల క్రితం 2003 వన్డే వరల్డ్ కప్... పార్ల్‌లో భారత్‌తో జరిగిన మ్యాచ్‌లో నెదర్లాండ్స్ 68 పరుగుల తేడాతో ఓడింది. అయితే సచిన్ టెండూల్కర్ సహా 4 వికెట్లు తీసిన టిమ్ డి లీడె 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. అతని కొడుకే ఈ బాస్ డి లీడె. టోర్నీ ఆసాంతం నిలకడైన ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అతను జట్టును ముందుకు నడపడంలో కీలకపాత్ర పోషించాడు. 285 పరుగులు చేయడంతో పాటు డి లీడె 15 వికెట్లు పడగొట్టడం విశేషం. కౌంటీల్లో ఒప్పందాల కారణంగా పలువురు ప్రధాన ఆటగాళ్లు ఈ టోర్నీ నుంచి తప్పుకున్నా... డి లీడె మాత్రం రెండిటిలో వరల్డ్ కప్ క్వాలిఫయర్స్‌నే ఎంచుకున్నాడు. సీనియర్లు లేకపోయినా స్ఫూర్తిదాయక ఆటతో డచ్ బృందం సత్తా చాటింది. గ్రూప్ దశలో జింబాబ్వే చేతిలో ఓడినా అమెరికా, నేపాల్‌పై సునాయాస విజయాలు సాధించింది. విండీస్‌తో మ్యాచ్ ఆ జట్టు స్థాయిని చూపించింది.

సమష్టి ప్రదర్శనతో...

374 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదిస్తూ తడబడకుండా స్కోరు సమం చేయగలిగింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన తేజ నిడమనూరు అద్భుత సెంచరీతో చెలరేగగా, కీలకమైన సూపర్ ఓవర్‌లో వాన్ బీక్ 30 పరుగులు కొట్టి జట్టును గెలిపించాడు. 'సూపర్ సిక్స్' దశలో ఒమన్‌పై భారీ విజయం జట్టుకు మేలు చేయగా, ఇప్పుడు స్కాట్లాండ్‌పై గెలుపు ఆ జట్టును ప్రధాన టోర్నీకి చేర్చింది. 4 అర్ధ సెంచరీలు చేసిన స్కాట్ ఎడ్వర్డ్స్, మరో సెంచరీ చేసిన విక్రమ్‌జిత్ సింగ్‌తో పాటు బౌలింగ్‌లో వాన్ బీక్, ర్యాన్ క్లీన్ కీలక పాత్ర పోషించారు. 'భారత గడ్డపై అంతర్జాతీయ మ్యాచ్ ఆడాలనేది నా కల' అని తేజ కొన్నాళ్ల క్రితం 'సాక్షి'తో ఇంటర్వ్యూలో చెప్పాడు. ఇప్పుడు అతను భారత్‌పైనే వరల్డ్ కప్ మ్యాచ్ ఆడబోతుండటం విశేషం. నవంబర్ 11న బెంగళూరులో భారత్‌తో తలపడే నెదర్లాండ్స్... అక్టోబర్ 6న తమ తొలి మ్యాచ్‌లో పాకిస్తాన్‌తో హైదరాబాద్‌లో ఆడుతుంది.



తేజ

4 వన్డేల్లో సెంచరీ సాధించడంతో పాటు ఐదు వికెట్లు తీసిన నాలుగో ఆటగాడు డి లీడె. గతంలో వివియన్ రిచర్డ్స్ (విండీస్), కాలింగ్‌వుడ్ (ఇంగ్లండ్), రోహన్ ముస్తఫా (యూఏఈ) మాత్రమే ఈ ఘనత సాధించారు.

ప్రిక్వార్టర్స్‌లో సింధు



కాల్గరీ: కెనడా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత స్టార్ పీవీ సింధు శుభారంభం చేసింది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో నాలుగో సీడ్ సింధు 21-16, 21-9తో తాలియా ఎన్‌జీ (కెనడా)పై విజయం సాధించింది. మరో తొలి రౌండ్ మ్యాచ్‌లో హైదరాబాద్ అమ్మాయి గద్దె రుత్విక శివాని 12-21, 3-21తో సుపనిద కటిథోంగ్ (థాయ్‌లాండ్) చేతిలో ఓడిపోయింది. పురుషుల సింగిల్స్‌లో భారత క్రీడాకారులకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. లక్ష్య సేన్ 21-18, 21-15తో రెండో సీడ్ వితిద్‌సర్న్ (థాయ్‌లాండ్)ను బోల్తా కొట్టించగా... సాయిప్రణీత్ 12-21, 17-21తో వైగోర్ కొల్హో (బ్రెజిల్) చేతిలో ఓడిపోయాడు.

మనిక ముందంజ



లుబ్లియానా (స్లొవేనియా): ప్రపంచ టేబుల్ టెన్నిస్ స్టార్ కంటెండర్ లుబ్లియానా టోర్నీలో భారత నంబర్ వన్ మనిక బత్రా ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. రెండో రౌండ్ మ్యాచ్‌లో మనిక 11-4, 11-9, 11-7తో ప్రపంచ 15వ ర్యాంకర్ చెంగ్ ఐ చింగ్ (చైనీస్ తైపీ)పై సంచలన విజయం సాధించింది. తెలంగాణ అమ్మాయి ఆకుల శ్రీజ మెయిన్ 'డ్రా'కు అర్హత పొందలేకపోయింది. క్వాలిఫయింగ్ రెండో రౌండ్ మ్యాచ్‌లో శ్రీజ 9-11, 8-11, 11-9, 9-11తో భారత సంతతికి చెందిన ఫ్రాన్స్ క్రీడాకారిణి ప్రీతిక చేతిలో ఓడిపోయింది.

ఆదుకున్న మయాంక్, తిలక్



మయాంక్

బెంగళూరు: కష్టాల్లో ఎదురీదుతున్న సౌత్‌జోన్ జట్టును హైదరాబాద్ రైజింగ్ స్టార్ ఠాకూర్ తిలక్ వర్మ (46; 5 ఫోర్లు, 1 సిక్స్), సీనియర్ ఓపెనర్ మయాంక్ అగర్వాల్ (76; 10 ఫోర్లు)తో కలిసి గట్టెక్కించాడు. దీంతో దులీప్ ట్రోఫీ సెమీఫైనల్లో సౌత్‌జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 195 పరుగులకు ఆలౌటైంది. నార్త్‌జోన్ 3 పరుగుల ఆధిక్యంతోనే సరిపెట్టుకుంది. ఓవర్‌నైట్ స్కోరు 63/4తో రెండో రోజు ఆట కొనసాగించిన సౌత్‌జోన్‌ను మయాంక్, తిలక్ నడిపించారు. ఐదో వికెట్‌కు ఇద్దరు 110 పరుగులు జోడించారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన నార్త్‌జోన్ ఆట నిలిచే సమయానికి 11 ఓవర్లలో 2 వికెట్లకు 51 పరుగులు చేసింది.

నాలుగో సీడ్ రూడ్‌కు చుక్కెదురు



రూడ్

లండన్: వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీ పురుషుల సింగిల్స్ విభాగం రెండో రౌండ్‌లో సంచలనం చోటు చేసుకుంది. బ్రిటన్ ప్లేయర్, ప్రపంచ 142వ ర్యాంకర్ లియామ్ బ్రాడీ 3 గంటల 27 నిమిషాల పోరులో 6-4, 3-6, 4-6, 6-3, 6-0తో ప్రపంచ నాలుగో ర్యాంకర్, నాలుగో సీడ్ కాస్పర్ రూడ్ (నార్వే)ను బోల్తా కొట్టించాడు. గత ఏడాది ఫ్రెంచ్ ఓపెన్, యూఎస్ ఓపెన్‌లలో, ఈ సంవత్సరం ఫ్రెంచ్ ఓపెన్‌లో రన్నరప్‌గా నిలిచిన రూడ్ వింబుల్డన్ టోర్నీలో నాలుగో ప్రయత్నంలోనూ రెండో రౌండ్‌ను దాటలేకపోవడం గమనార్హం. ఇతర రెండో రౌండ్ మ్యాచ్‌ల్లో ఏడో సీడ్ రుబ్లెవ్ (రష్యా) 6-7 (4/7), 6-3, 6-4, 7-5తో కరాత్సెవ్ (రష్యా)పై, వావ్రింకా (స్విట్జర్లాండ్) 6-3, 4-6, 6-4, 6-2తో ఎచెవెరి (అర్జెంటీనా)పై గెలిచారు. మహిళల సింగిల్స్ రెండో రౌండ్ మ్యాచ్‌లో ఐదో సీడ్ గార్సియా (ఫ్రాన్స్) 3-6, 6-4, 7-6 (10/6)తో లేలా ఫెర్నాండెజ్ (కెనడా) పై నెగ్గింది. తొలి రౌండ్ మ్యాచ్‌లో ఈ ఏడాది ఫ్రెంచ్ ఓపెన్ రన్నరప్ ముకోవా (చెక్ రిపబ్లిక్) 4-6, 7-5, 1-6తో జూలీ నిమియెర్ (జర్మనీ) చేతిలో ఓడింది.

క్రికెట్‌కు తమీమ్ గుడ్‌బై



చిట్టోగ్రామ్: వన్డే ప్రపంచకప్‌కు మూడు నెలల ముందు బంగ్లాదేశ్ జట్టు సీనియర్ ప్లేయర్, కెప్టెన్ తమీమ్ ఇక్బాల్ సంచలన ప్రకటన చేశాడు. తాను అంతర్జాతీయ క్రికెట్ నుంచి వెంటనే తప్పుకుంటున్నట్లు భావోద్వేగంతో ప్రకటించాడు. బుధవారం అఫ్గానిస్తాన్‌తో జరిగిన తొలి వన్డేలో బంగ్లాదేశ్ ఓడగా ...తర్వాతి రోజే ఈ ప్రకటన వచ్చింది. 16 ఏళ్ల కెరీర్ లో 34 ఏళ్ల తమీమ్ ఇక్బాల్... 241 వన్డేల్లో 14 సెంచరీలు, 56 అర్ధ సెంచరీలతో 8313 పరుగులు... 70 టెస్టుల్లో 10 సెంచరీలతో 5134 పరుగులు... 78 టి20 మ్యాచ్‌ల్లో ఒక సెంచరీ, ఏడు అర్ధ సెంచరీలతో కలిపి 1758 పరుగులు సాధించాడు.

తొలి రోజే హోరాహోరీ

- ఆస్ట్రేలియా 263, ఇంగ్లండ్ 68/3
- మార్ష్ సెంచరీ, వుడ్‌కు 5 వికెట్లు



మార్ష్

లీడ్స్: 'యాషెస్' సిరీస్ మూడో టెస్టు అనేక మలుపులతో ఆసక్తికరంగా మొదలైంది. మొదటి రోజే ఇంగ్లండ్, ఆస్ట్రేలియా హోరాహోరీగా పోటీ పడ్డాయి. ముందుగా టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా తమ తొలి ఇన్నింగ్స్‌లో 60.4 ఓవర్లలో 263 పరుగులకే ఆలౌటైంది. మార్క్ వుడ్ (5/34) ప్రత్యర్థిని పడగొట్టాడు. వార్నర్ (4), ఖ్వాజా (13), లబుషేన్ (21), స్మిత్ (22) విఫలం కావడంతో ఒక దశలో ఆసీస్ 85/4 వద్ద నిలిచింది. అయితే ఆరో స్థానంలో బరిలోకి దిగిన మిచెల్ మార్ష్ (118 బంతుల్లో 118; 17 ఫోర్లు, 4 సిక్స్‌లు) ఒక్కసారిగా పరిస్థితిని మార్చేశాడు. నాలుగేళ్ల తర్వాత టెస్టు మ్యాచ్ ఆడిన అతను మెరుపు బ్యాటింగ్‌తో చెలరేగాడు. మార్ష్, హెడ్ (39) ఐదో వికెట్‌కు 28 ఓవర్లలోనే 155 పరుగులు జోడించారు. అయితే ఆ తర్వాత ఇంగ్లండ్ బౌలర్లు మళ్లీ పైచేయి సాధించారు. ఫలితంగా 23 పరుగులకే ఆసీస్ చివరి 6 వికెట్లు కోల్పోయింది. అనంతరం ఇంగ్లండ్ బ్యాటింగ్ కూడా తడబడింది. గురువారం ఆట ముగిసే సమయానికి ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 3 వికెట్లు కోల్పోయి 68 పరుగులు చేసింది. ఇంగ్లండ్ మరో 195 పరుగులు వెనుకబడి ఉంది.

డబుల్ ధమాకా!



సాధారణంగా ఒక అరటి చెట్టుకు ఒక గెల మాత్రమే కాస్తుంది. ఇందుకు భిన్నంగా ఒకే చెట్టుకు రెండు అరటి గెలలు కాశాయి. అల్లూరి సీతారామ రాజు జిల్లా హుకుంపేట మండలం భీమవరం పంచాయతీ మద్దిపుట్టులో ఓ గిరిజనుడి ఇంటి వద్ద ఈ అద్భుతాన్ని పలువురు ఆసక్తిగా తిలకిస్తున్నారు.
– హుకుంపేట

వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శిగా మంజుల

సాక్షి, అమరావతి: రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శిగా డాక్టర్ మంజుల డి.హోస్మజిని ప్రభుత్వం నియమించింది. వైద్య శాఖలో నియామకాలు, ఉద్యోగుల బదిలీలు, ఇతర సర్వీస్ సంబంధిత అంశాల పర్యవేక్షణ బాధ్యతలను మంజులకు అప్పగించింది. వైద్య శాఖలోని అన్ని విభాగాల్లో పోస్టులు ఖాళీలుగా ఉండకుండా ఈమె చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.

పోర్టులో భారీగా బాక్సైట్ దిగుమతి



బాక్సైట్ లోడుతో ఎంవీ ట్రాన్స్‌వరల్డ్ నేవిగేటర్ కార్గో షిప్

సాక్షి, విశాఖపట్నం: కోవిడ్ తర్వాత విశాఖపట్నం పోర్టు అథారిటీ (వీపీఏ)లో భారీగా బాక్సైట్ దిగుమతి జరిగింది. పశ్చిమ ఆఫ్రికాలోని కంసర్ట్ పోర్టు నుంచి పెద్ద మొత్తంలో బాక్సైట్‌తో కార్గో షిప్ వైజాగ్ పోర్టుకు గురువారం చేరుకుంది. ఎంవీ ట్రాన్స్‌వరల్డ్ నావిగేటర్ కార్గో షిప్ 1,65,498 మెట్రిక్ టన్నుల మెటలర్జికల్ గ్రేడ్ బాక్సైట్‌తో వేదాంత జనరల్ కార్గో బెర్త్ వద్ద లంగరు వేసినట్లు పోర్టు అధికారులు తెలిపారు. చాలా ఏళ్ల తర్వాత భారీ మొత్తంలో బాక్సైట్ దిగుమతి కావడం ఇదే ప్రథమమని పోర్టు వర్గాలు తెలిపాయి.

విదేశాలకు వెళ్లేందుకు ఏబీకి హైకోర్టు అనుమతి

సాక్షి, అమరావతి: ఆర్జిత సెలవులపై విదేశాలకు వెళ్లేందుకు సస్పెన్షన్‌లో ఉన్న ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావుకు హైకోర్టు అనుమతి ఇచ్చింది. ఏబీ వెంకటేశ్వరరావు విదేశీ పర్యటనకు అనుమతిని నిరాకరిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఇచ్చిన ఉత్తర్వులను సస్పెండ్ చేసింది. తిరిగి వస్తానని కోర్టుకు లిఖితపూర్వక హామీ ఇవ్వాలని, తిరిగి వచ్చిన తరువాత వచ్చిన విషయాన్ని అఫిడవిట్ రూపంలో కోర్టుకు తెలియచేయాలని ఏబీని ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ గురువారం తీర్పు వెలువరించారు. ఆర్జిత సెలవులపై అమెరికా, యూకే వెళ్లేందుకు తనకు అనుమతి ఇవ్వాలని ఏబీ వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం అనుమతిని నిరాకరించింది. దీంతో ఆయన హైకోర్టును ఆశ్రయించారు.

రూ.8.26 కోట్ల జరిమానా చెల్లించాల్సిందే: ఎన్జీటీ

సాక్షి, న్యూఢిల్లీ: విశాఖపట్నంలోని జాతీయ థర్మల్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్టీపీసీ) పర్యావరణ ఉల్లంఘనలకు గానూ సంయుక్త కమిటీ సిఫార్సు చేసిన రూ.8.26 కోట్ల జరిమానా చెల్లించాల్సిందేనని చెన్నైలోని జాతీయ హరితట్రిబ్యునల్ (ఎన్జీటీ) ఉత్తర్వులు జారీ చేసింది. బట్టు సతీష్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్ విచారించిన జస్టిస్ పుష్ప సత్యనారాయణ, విషయ నిపుణుడు సత్యగోపాల్‌తో కూడిన ధర్మాసనం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. జరిమానాను వెంటనే వసూలు చేయాలని ఏపీ కాలుష్య నియంత్రణ మండలిని ఎన్జీటీ ఆదేశించింది. ఎన్టీపీసీకి ఐదు కిలోమీటర్ల పరిధిలో గాలి, భూమిపై కాలుష్య ప్రభావాన్ని అధ్యయనం చేయాలని దీన్ని కాలుష్య నియంత్రణ మండలి పర్యవేక్షించాలని ఆదేశాల్లో స్పష్టం చేసింది.

'ప్రతిదినం ప్రజాహితం' వికాస వార్షిక-4 విడుదల

సాక్షి, న్యూఢిల్లీ: ఏపీ అభివృద్ధికి, రాష్ట్ర ప్రజల శ్రేయస్సుకు సీఎం శ్రమిస్తోన్న తీరును డైరీ రూపంలో తెలియజేసే ప్రక్రియ మంచి పరిణామమని ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్ ఆదిత్యనాథ్ దాస్ అన్నారు. ఏపీ రాష్ట్ర జాతీయ మీడియా, అంతర్రాష్ట్ర వ్యవహారాల సలహాదారు కార్యాలయం ప్రచురించిన సీఎం దినచర్య డైరీ 'ప్రతిదినం ప్రజాహితం' వికాస వార్షిక-4ను గురువారం ఢిల్లీలోని ఏపీ భవన్‌లో ఆదిత్యనాథ్ దాస్ విడుదల చేశారు. ఈ డైరీ ముద్రణకు సహకరించిన మంత్రి చెల్లుబోయిన, కమిషనర్ తుమ్మా విజయ్ కుమార్ రెడ్డి, జాతీయ మీడియా సలహాదారు దేవులపల్లి అమర్‌కు ధన్యవాదాలు తెలిపారు. పుస్తక రచయిత పాలెపు రాజశేఖర్‌ను ఆదిత్యనాథ్ దాస్ అభినందించారు.

శివశ్రుతి.. విద్యార్థులకు స్ఫూర్తి!

'నా విద్యా జీవితం ముగిసింది. నేను ఇక చదువుకు దూరమైనట్లే. నాకు చదువుకునే యోగం, అదృష్టం లేదు' అని వేదనకు గురైన పదేళ్ల చిన్నారికి కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం(కేజీబీవీ) కొత్త జీవితాన్ని ప్రసాదించింది. నాడు అక్కడ పడిన విద్యాబీజం ఇంతింతై మహా వృక్షమై నేడు అదే పాఠశాలకు ప్రిన్సిపాల్‌గా పనిచేసే భాగ్యాన్ని కల్పించింది. నేటితరం విద్యార్థులకు స్ఫూర్తిగా నిలిచిన శివశ్రుతి విజయగాథపై ప్రత్యేక కథనం..



విధుల్లో భాగంగా కేజీబీవీలోని స్టోర్‌రూములో సరుకులను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ శివశ్రుతి

ఆర్థిక ఇబ్బందులతో అర్ధంతంగా ఆగిన చదువు

- వెన్నుతట్టి విద్యా వెలుగులు ప్రసాదించిన కేజీబీవీ
- అంచెలంచెలుగా ఎదిగి నేడు అదే పాఠశాలకు ప్రిన్సిపాల్‌గా ఎంపికైన శివశ్రుతి

కడప ఎడ్యుకేషన్

శివశ్రుతి తండ్రి శ్రీనివాసులు కారు డ్రైవర్, తల్లి రాజేశ్వరి గృహిణి. ఒకటి నుంచి 5వ తరగతి వరకు ఆమె తమ సొంత ఊరు ఖాజీపేటలోని ఓ ప్రైవేటు పాఠశాలలో చదివింది. ఆ సమయంలో తండ్రి జీవనోపాధి కోసం కువైట్‌కు వెళ్లాడు. అక్కడ ప్రతికూల పరిస్థితుల కారణంగా పెద్దగా సంపాదన లేక తిరిగి సొంత ఊరికి వచ్చాడు. ఇక్కడా ఉండలేక కుటుంబంతో సహా తిరుపతికి వలస వెళ్లాడు. అక్కడ కారు డ్రైవర్‌గా ఉంటూ పిల్లలిద్దరిని ఓ ప్రైవేటు పాఠశాలలో చేర్పించాడు. చివరకు పిల్లలకు స్కూల్ ఫీజులు కూడా కట్టలేని స్థితిలో చేసేది లేక పిల్లల చదువులను అర్ధంతరంగా మాన్పించి తమ అత్త గారి ఊరైన చక్రాయపేటకు సంసారాన్ని మార్చాడు. దీంతో 6వ తరగతి చదువుతున్న శివశ్రుతి చదువు ఆగిపోయింది. ఏడాదంతా ఆమె ఇంట్లోనే ఉండిపోయింది. తరువాత సంవత్సరం డ్రాపౌట్ కింద పక్కింటి ఉపాధ్యాయులు ఇచ్చిన సలహాతో చక్రాయపేటలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 7వ తరగతిలో చేరింది. ఇక వెనుతిరిగి చూడకుండా పీజీ వరకు తన చదువును నిర్విఘ్నంగా కొనసాగించింది. ఏ పాఠశాల అయితే తన జీవితానికి ఓ వెలుగుదారి చూపిందో అదే పాఠశాలకు నేడు శ్రుతి ప్రిన్సిపాల్‌గా ఎంపికై పలువురికి స్ఫూర్తిదాయకంగా నిలిచింది.

2021లో ఉద్యోగంలోకి ..

పీజీ పూర్తి చేసిన శివశ్రుతి 2021లో ఓబులవారిపల్లె కేజీబీవీలో కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్(సీఆర్‌టీ)గా చేరింది. అక్కడ ఆరు నెలలు పనిచేశాక టెట్ క్వాలిఫై కావాలనడంతో ఉద్యోగాన్ని మాని టెట్ పరీక్ష రాసి క్వాలిఫై అయింది.

విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాలకే..

ఏ పాఠశాలలో అయితే తన హైస్కూలు విద్యను ఉచితంగా పూర్తి చేసిందో అదే కేజీబీవీ పాఠశాలకు శివశ్రుతి నేడు ప్రిన్సిపాల్‌గా వెళ్లింది. ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన కేజీబీవీ పోస్టులకు ఆమె దరఖాస్తు చేసుకున్నారు. మెరిట్ ఆధారంగా ఆమెను కేజీబీవీ ప్రిన్సిపాల్‌గా ఎంపిక చేశారు. సుండుపల్లి కేజీబీవీ పాఠశాలలో ప్రిన్సిపాల్‌గా మూడు రోజుల క్రితం విధుల్లో చేరారు.

కేజీబీవీ నుంచి పీజీ వరకు...

ఒకటి నుంచి 5వ తరగతి వరకు ప్రైవేటు పాఠశాలలో చదివిన శివశ్రుతి 7వ తరగతి తరువాత తన చదువంతా కేజీబీవీలోనే ఉచితంగా కొనసాగించింది. పదవ తరగతిలో మంచి మార్కులు సాధించింది. దీంతో కడప రత్నాల కింద ఎంపికై కడపలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ విద్యను ఉచితంగా చదువుకుంది. ఇంటర్‌లో 75 శాతం మార్కులను సాధించడంతో కడపలోని కోటిరెడ్డి మహిళా కళాశాలలో సీటు సంపాదించుకుని స్కాలర్‌షిప్‌తో డిగ్రీ చదివింది. తరువాత పీజీని కడపలోని ఎస్వీ డిగ్రీ కళాశాలలో పూర్తి చేసింది. అనంతరం బీఈడీ కూడా పూర్తి చేసింది.

కుటుంబానికి ఆసరాగా..

కారు డ్రైవర్‌గా పనిచేస్తున్న శివశ్రుతి తండ్రి శ్రీనివాసులుకు పక్షవాతం సోకి మంచానికే పరిమితమయ్యారు. ఈ పరిస్థితిలో కుమారుడు శశికృష్ణ తన డిగ్రీ చదువును మానేసి తండ్రి బాటలోనే మరో కారుకు డ్రైవర్‌గా వెళ్తూ కుటుంబాన్ని పోషిస్తూ వస్తున్నాడు. ఈ పరిస్థితుల్లో శివశ్రుతికి ప్రిన్సిపాల్‌గా ఉద్యోగం రావడంతో ఆమె ఆ కుటుంబానికి ఆసరాగా నిలుస్తోంది.

చాలా సంతోషంగా ఉంది..



నాకు కేజీబీవీలో ప్రిన్సిపాల్‌గా ఉద్యోగం రావడం చాలా సంతోషంగా ఉంది. ఎందుకుంటే అర్ధంతరంగా ఆగిన నా చదువుకు మళ్లీ జీవం పోసింది కేజీబీవీనే. ప్రస్తుతం అదే పాఠశాలకు ప్రిన్సిపాల్ కావడం అదృష్టం. విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వారి విద్యాభివృద్ధికి కృషి చేస్తా.
– శివశ్రుతి, కేజీబీవీ ప్రిన్సిపాల్, సుండుపల్లి

తెలంగాణ

అవగాహనే అస్త్రంగా..!

- పాఠశాలల విద్యార్థులకు మహిళా భద్రత అంశాలపై అవగాహన శిబిరాలు
- షీటీమ్స్ పనితీరు, సైబర్‌నేరాల నియంత్రణపై చైతన్య కార్యక్రమాలు
- షీటీమ్స్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు

సాక్షి, హైదరాబాద్: 'లైంగిక వేధింపులు అంటే ఏమిటి..? ఎవరైనా అలాంటి చర్యలకు పాల్పడితే వారి నుంచి ఎలా రక్షణ పొందాలి. ఎవరికి ఫిర్యాదు చేయాలి. ఎవరైనా దాడికి దిగితే ఎలా కాపాడుకోవాలి' తదితర అంశాలపై పిల్లలకు విద్యార్థి దశ నుంచే అవగాహన కల్పించేందుకు రాష్ట్ర మహిళా భద్రత విభాగం వినూత్న కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా షీటీమ్ బృందాలతో స్థానిక పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. 'షీటీమ్స్ విధులు ఏమిటి, అవి మనకు ఏ విధంగా అండగా ఉంటాయి. షీటీమ్స్ వాట్సాప్ నంబర్ ఏమిటి'.. అనే ప్రాథమిక అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. అదేవిధంగా సైబర్ నేరగాళ్ల మోసాలకు గురికాకుండా ఉండేందుకు ఎలా అప్రమత్తంగా ఉండాలి, వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్ ఇతర సోషల్ మీడియా ఖాతాల్లో ప్రైవసీ, సైబర్ నేరగాళ్లకు మన బ్యాంకు ఖాతా వివరాలు, ఆధార్, పాన్ కార్డు నంబర్లు, మన ఫోన్‌కు వచ్చే ఓటీపీలు చెప్పవద్దని, డెబిట్, క్రెడిట్ కార్డుల పాస్‌వర్డ్‌లు ఇతరులకు చెప్పకుండా ఉండడం, అపరిచిత వ్యక్తులతో ఆన్‌లైన్‌లో స్నేహాలకు దూరంగా ఉండడం.. వంటి అనేక అంశాలపై విద్యార్థులకు అవగాహన పెంచేలా ఈ అవగాహన తరగతులలో పోస్టర్లను ప్రదర్శిస్తున్నారు. విద్యార్థులకు ఏ విషయం చెప్పినా వెంటనే అర్థం చేసుకోవడంతోపాటు వాటిని పాటిస్తారని, వారి తల్లిదండ్రులు, బంధువులు, చుట్టుపక్కల వారికిసైతం విద్యార్థుల ద్వారా అవగాహన కల్పించే ఏర్పాటు చేస్తున్నామని అధికారులు తెలిపారు.



ప్రభుత్వం ఇచ్చిన పరిహారం సొమ్ముతో కొనుగోలు చేసిన బోటుతో నక్కా అప్పన్న

వలస బతుకుల్లో సర్కారీ వెలుగులు

మూడు దశాబ్దాలుగా చేపల వేటకు గుజరాత్ పయనం

ఉత్తరాంధ్ర నుంచి 20 వేల మంది మత్స్యకారుల వలస	పొరపాటున పాకిస్తాన్ జలాల్లోకి వెళ్లడంతో అరెస్టులు	ఏళ్ల తరబడి జైళ్లలోనే మగ్గాల్సిన దుస్థితి	ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చొరవతో విడుదల	ప్రభుత్వ నిర్ణయాలతో వలసలకు స్వస్తి	కొత్త హార్బర్లు ఏర్పాటయ్యాక ఏపీలోనే ఉంటామంటున్న జాలర్లు

(బొల్లం కోటేశ్వరరావు, సాక్షి, విశాఖపట్నం)

ఇన్నాళ్లూ ఆ మత్స్యకారులు పొట్టకూటి కోసం రాష్ట్రాలు దాటి వలసలు పోయేవారు. భార్యాపిల్లలను ఇంటి వద్దే వదిలేసి.. ఊహ తెలిసిన కొడుకుల్ని వెంటబెట్టుకుని ఊళ్లొదిలి వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న గుజరాత్‌కు వలస బాట పట్టేవారు. అక్కడ వారికిచ్చే అరకొర జీతంతోనే బతుకులీడ్చేవారు. ఏడాదిలో 8 నెలలు (ఆగస్టు నుంచి మార్చి వరకు) అక్కడే గడిపేవారు. సముద్రంలో సరిహద్దులు తెలియక చేపల వేట సాగిస్తే పొరుగు దేశంలోని పాకిస్తాన్ జైళ్ల పాలయ్యేవారు. ఏళ్ల తరబడి ఆ జైళ్లలోనే మగ్గేవారు. ఇదంతా ఒకప్పటి మాట. ఇప్పుడు మునుపటిలా గుజరాత్ వెళ్లే ఆలోచన విరమించుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో వీరి బతుక్కి భరోసానిచ్చే ముఖ్యమంత్రి వచ్చారు. రాష్ట్రంలో కొత్తగా హార్బర్లు, పోర్టుల నిర్మాణాన్ని చేపట్టారు. మత్స్యకారులకు ఉపాధి లభించే మార్గాలను సుగమం చేస్తున్నారు. ఏటా రూ.10 వేల చొప్పున మత్స్యకార భరోసా సొమ్ము కూడా ఇస్తున్నారు. ఇకపై ఎక్కడెక్కడికో వలస పోవాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే వేట సాగించే అవకాశాలు కల్పిస్తున్నారు.

ఉత్తరాంధ్ర నుంచి వేలల్లో వలసలు

ఒకప్పుడు చేపల వేట సాగించేందుకు తగిన వనరుల్లేక ఉత్తరాంధ్ర మత్స్యకారులు వేల సంఖ్యలో గుజరాత్‌కు వలస పోయేవారు. ఆ రాష్ట్రంలోని వనక్‌బరా, వీరావల్, పోర్‌బందర్, ఓఖా, మాంగ్‌రోల్ తదితర ఫిషింగ్ హార్బర్ల నుంచి అరేబియా సముద్రంలో వేట సాగించేవారు. అక్కడ వేటకు మత్స్యకారుల కొరత, వారికంటే తక్కువ వేతనానికే మన జాలర్ల లభ్యతతో ఆ ప్రాంత బోటు యజమానులు వీరిని తీసుకెళ్లేవారు. ఒక్కొక్కరికి ఏడాదికి రూ.50 వేల నుంచి రూ.60 వేల అడ్వాన్స్, నెలకు రూ.8 వేల నుంచి రూ.10 వేల జీతం చెల్లించేలా ఒప్పందం చేసుకుంటారు. అడ్వాన్స్ పోగా మిగతా సొమ్మును 8 నెలల అనంతరం ఇంటికొచ్చే సమయంలో ఇస్తారు. ఇన్నాళ్లూ మన తీరంలో తగినన్ని హార్బర్లు, పోర్టులు లేక గుజరాత్‌లో ఇచ్చే చాలీచాలని జీతానికే ఆశపడి మైనర్ కొడుకులను సైతం వెంటబెట్టుకుని వలస వెళ్లేవారు. వేటకెళ్లిన వారు సముద్రంలో తమకు సరిహద్దులు తెలియక తరచూ పాకిస్తాన్ అధికారులకు చిక్కడం, వారు విడుదలయ్యే మార్గం లేక ఏళ్లకు ఏళ్లు జైళ్లలోనే మగ్గడం పరిపాటైపోయింది. ఒక బోటులో 8 మంది వేట సాగిస్తారు. ఆ ఇరుకు బోటులోనే కాలకృత్యాలు, భోజనం, నిద్ర చేస్తారు. నెలలో రెండుసార్లే ఒడ్డుకు వస్తారు. అనారోగ్యం పాలైనా, చనిపోయినా అంతే సంగతులు. స్వస్థలానికి శవాన్ని తీసుకొచ్చే ఆర్థిక పరిస్థితి లేక అక్కడే అంతిమ సంస్కారాలు పూర్తిచేసి బూడిదను మాత్రమే కుటుంబీకులకు తెస్తారు.

సీఎం నిర్ణయంతో..

ఇలా గుజరాత్‌కు వలస పోతున్న తమకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశాకిరణంలా మారారని మత్స్యకారులు సంబరపడుతున్నారు. ఇప్పటికే గుజరాత్‌కు వలసలు మానుకున్న ఉత్తరాంధ్ర మత్స్యకారులు కొందరు స్థానికంగానే చేపల వేట సాగిస్తున్నారు. సీఎం వైఎస్ జగన్ మత్స్యకారులకు ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో బుడగట్లపాలెం (శ్రీకాకుళం), పూడిమడక (అనకాపల్లి), ఉప్పాడ (కాకినాడ), మచిలీపట్నం (కృష్ణా), జువ్వలదిన్నె (నెల్లూరు) సహా 8 చోట్ల ఫిషింగ్ హార్బర్లు, మరో 7 చోట్ల ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇవి అందుబాటులోకి వస్తే ఉత్తరాంధ్ర సహా రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల నుంచి గుజరాత్, దక్షిణాది రాష్ట్రాల్లోని హార్బర్లకు వలస వెళ్లే అవసరం, పాక్‌లో జైళ్ల పాలయ్యే పరిస్థితి రాదని ఈ మత్స్యకారులు చెబుతున్నారు.

ఆ మత్స్యకారులందరికీ విముక్తి

2018 నవంబర్‌లో పాక్ అధికారులకు చిక్కి జైళ్ల పాలైన 20 మందితో పాటు అంతకుముందు కొన్నేళ్ల నుంచి అక్కడి జైలులో మరో ముగ్గురు జాలర్లు మగ్గుతున్నారు. అప్పటి ప్రభుత్వం వీరి విడుదలకు ప్రయత్నించలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రత్యేక చొరవ తీసుకుని పాక్ జైళ్ల నుంచి వీరికి విముక్తి కల్పించారు. దీంతో ఇప్పుడు పాకిస్తాన్ జైళ్లలో ఒక్క ఆంధ్ర మత్స్యకారుడు కూడా లేకుండా చేశారు.

హార్బర్లలో మూలుగుతున్న బోట్లు

రాష్ట్రం నుంచి గుజరాత్‌కు వలస వెళ్లే మత్స్యకారుల సంఖ్య గణనీయంగా తగ్గిపోవడంతో ఆ రాష్ట్రంలోని ప్రధాన హార్బర్లలో బోట్లు మూలుగుతున్నాయి. ఇన్నాళ్లూ కళాసీలుగా పిలిచి ఈ మత్స్యకారులతోనే అక్కడ వ్యాపారులు బోట్లను నడిపేవారు. ఇప్పుడు వీరి కొరతతో వ్యాపారులు/బోటు యజమానులు హార్బర్లలోనే బోట్లను కట్టేశారని, గతంకంటే ఎక్కువ సొమ్ము ఇస్తామని ఆశ చూపినా వెళ్లడం లేదని మత్స్యకారులు చెబుతున్నారు.

బోటు కొనుక్కున్నా.. ఇక ఇక్కడే ఉంటా



విజయనగరం జిల్లా తిప్పలవలసకు చెందిన నక్కా అప్పన్న. వయసు 55 ఏళ్లు. 2014 నుంచి గుజరాత్‌లోని వీరావల్ హార్బర్‌లో నెలకు రూ.8 వేల జీతానికి చేపల వేట చేస్తున్నాడు. 2018 నవంబర్ 27న వీరి బోట్లు పొరపాటున పాకిస్తాన్ సముద్ర జలాల్లోకి ప్రవేశించాయి. అప్పన్నతో పాటు ఉత్తరాంధ్రకు చెందిన 20 మంది జాలర్లను పాకిస్తాన్ అధికారులు అరెస్ట్ చేసి జైల్లో పెట్టారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో 2020 జనవరి 1న వీరంతా విడుదలయ్యారు. సీఎం ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున పరిహారాన్ని ప్రకటించారు. ఇకపై గుజరాత్‌కు వలస వెళ్లవద్దని, హార్బర్లు కట్టిస్తానని, ఇక్కడే ఉండి వేట చేసుకోవాలని సూచించారు. ఆ ప్రకారమే హార్బర్ల నిర్మాణం జరుగుతోంది. గుజరాత్‌కు వెళ్లకుండా ప్రభుత్వం ఇచ్చిన రూ.5 లక్షలతో బోటు కొనుగోలు చేసి స్వగ్రామం తిప్పలవలసలోనే ఉంటూ కొడుకుతో కలిసి సొంతంగా వేట సాగిస్తున్నామని నెలకు రూ.25 వేల నుంచి రూ.30 వేలు సంపాదిస్తున్నామని అప్పన్న ఆనందంతో చెప్పాడు.

పాతికేళ్లు దూరమయ్యా.. ఇక వలస వెళ్లను



విజయనగరం జిల్లా తిప్పలవలసకే చెందిన 66 ఏళ్ల బర్రి బవిరీడు 25 ఏళ్లుగా గుజరాత్‌లోని వీరావల్ వెళ్తున్నాడు. 2018లో పాకిస్తాన్ అధికారులకు చిక్కిన జాలర్లలో ఈయన కూడా ఉన్నాడు. జైలు నుంచి విడుదలయ్యాక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిహారం కింద ఇచ్చిన రూ.5 లక్షల్లో రూ.2 లక్షలు అప్పులు తీర్చి.. మిగిలిన డబ్బుతో సొంతంగా పచ్చి, ఎండు చేపల వ్యాపారం మొదలు పెట్టాడు. ఇప్పుడు నెలకు రూ.15 వేల వరకు ఆర్జిస్తున్నాడు. గుజరాత్ వలసకు స్వస్తి పలికాడు. పాతికేళ్ల కుటుంబానికి దూరంగా ఉన్న తానిప్పుడు ఇంటిపట్టునే ఉంటూ భార్యాపిల్లలతో ఆనందంగా గడుపుతున్నానని, సీఎం జగన్‌కు రుణపడి ఉంటానని సంతోషం వ్యక్తం చేస్తున్నాడు. అప్పన్న, బవిరీడులే కాదు.. ఉత్తరాంధ్రకు చెందిన పలువురు మత్స్యకారులు గుజరాత్ వలసలకు రామ్‌రామ్ చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం హార్బర్లు, పోర్టుల నిర్మాణం వంటి సానుకూల నిర్ణయాలు తీసుకోవడంతో స్థానికంగా ఉంటూ వేట సాగిస్తున్నారు. ఉపాధి పొందుతున్నారు.

14 ఏళ్లకే జైలుకెళ్లా



ఇంట్లో పూట గడవక నాన్నతో చేపల వేటకి వీరావల్ వెళ్లా. అప్పుడు నాకు 14 ఏళ్లు. అక్కడకెళ్లిన నాలుగు ఏళ్లకే (2018 నవంబర్‌లో) పాకిస్తాన్ వాళ్లు నాన్నని, నన్ను, మరికొంత మందిని జైల్లో పెట్టారు. 14 నెలలు జైల్లో ఉన్నాక మన సీఎం జగన్ సార్ విడిపించారు. మాకు ప్రభుత్వం నుంచి రూ.5 లక్షలు ఇచ్చారు. ఆ డబ్బుతో ఓ బోటు కొనుక్కున్నాం. కొంత డబ్బు అప్పుచేసి ఇల్లు కూడా కట్టుకున్నాం. అప్పటినుంచి గుజరాత్ వెళ్లకుండా ఇక్కడి నుంచే చేపల వేటకు వెళ్తున్నాం.
– నక్కా ధనరాజు, మత్స్యకారుడు, తిప్పలవలస, విజయనగరం జిల్లా

మాటిచ్చారు.. నిలబెట్టుకున్నారు



ఎన్నో ఏళ్లుగా రాష్ట్రం నుంచి ముఖ్యంగా ఉత్తరాంధ్ర నుంచి గుజరాత్‌కు మత్స్యకారులు పెద్దఎత్తున వలస వెళ్తున్నారు. అక్కడ వారికిచ్చే జీతం తక్కువే అయినా స్థానికంగా ఉపాధి లేక వలస పోవాల్సిన పరిస్థితి. వీరి వలసలకు అడ్డుకట్ట వేయడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎక్కడికక్కడ హార్బర్లు కడతానని హామీ ఇచ్చారు. మాట ప్రకారం రూ.3,500 కోట్లతో 8 ఫిషింగ్ హార్బర్లు, 7 ఫిష్ ల్యాండింగ్ సెంటర్ల నిర్మాణాన్ని చేపట్టారు. పైగా పాక్ జైళ్లలో ఉన్న ఆంధ్ర మత్స్యకార్లు విడుదల చేయించారు. దీంతో ఈ ప్రాంతం నుంచి గుజరాత్‌కు వలస వెళ్లే వారి సంఖ్య బాగా తగ్గిపోయింది. సీఎంపై నమ్మకంతో అనేకమంది స్థానికంగా అందుబాటులో ఉన్న చోట నుంచి వేట సాగిస్తున్నారు. ఏపీ మత్స్యకారుల తరపున సీఎం జగన్‌కు కృతజ్ఞతలు.
– వాసుపల్లి జానకిరామ్, అధ్యక్షుడు, మర పడవల సంఘం, విశాఖపట్నం

హార్బర్లొస్తే ఇక్కడి నుంచే వేటకు వెళ్తా



నేను 23 ఏళ్ల నుంచి పోరుబందరులో వేటకెళ్తాన్నా. ఐదేళ్ల కిందట నన్ను పాకిస్తాన్ జైల్లో పెట్టారు. ఆ జైల్లో నరకాన్ని చూపించారు. జబ్బొచ్చినా పట్టించుకోలేదు. సీఎం జగన్ సార్ మమ్మల్ని విడిపించి పుణ్యం కట్టుకున్నారు. ప్రస్తుతం మల్వీలోని హార్బర్‌కు వెళ్తున్నా. మా ప్రాంతంలో హార్బర్లు వచ్చే వరకు అక్కడికెళ్తాను. ఆ తర్వాత ఇక్కడి నుంచే వేటకెళ్లాను.
– మైలపల్లి భాస్కరరావు, కొయ్యాం, శ్రీకాకుళం జిల్లా

జగన్ సార్‌కి రుణపడి ఉంటాం



నాకు అక్క, చెల్లి ఉన్నారు. వారికి పెళ్లిళ్లు చేయడం నాన్న ఒక్కడి వల్లా కాదు. అందుకే ఏడో తరగతి చదువు మానేసి 14 ఏళ్లకే వీరావల్ హార్బర్‌కు వేటకి వెళ్లా. 5 నెలలకే పాకిస్తాన్ అధికారులకు చిక్కిపోడంతో జైల్లో పెట్టారు. రోజూ ఏడ్చేవాణ్ణి. 14 నెలల తర్వాత సీఎం జగన్ సార్ దయతో విడుదలయ్యాం. ప్రభుత్వం ఇచ్చిన రూ.5 లక్షలలో రూ.4 లక్షలు పెట్టి బోటు కొన్నాం. గుజరాత్‌కు వెళ్లకుండా మా ఊరి నుంచే వేటకెళ్తున్నాం. నెలకి రూ.25 వేల నుంచి రూ.30 వేల ఆదాయం వస్తోంది. అమ్మానాన్న దగ్గరే ఉంటున్నాం. మమ్మల్ని ఆదుకున్న సీఎం గారికి రుణపడి ఉంటాం.
– నక్కా నర్సింగ్, తిప్పలవలస, విజయనగరం జిల్లా

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act)
RNI No:TNTEL/2008/25943